





## SREEMATH ANDHRA VALMIKI

# RAMAYANAMU



ANCHRA VALMIKI
VASUDASA SWAMY

A LITERAL METRICAL TRANSLATION OF VALMIKI'S SANSKRIT RAMAYANAM

*by*


**VAVILICOLANU SUBBA ROW**

alias **VASUDASA SWAMY**

*late Telugu Pandit, Presidency College, Madras.*


AND THE AUTHOR OF

Sree Kumarabhyudayam, Sree Kausalya Parinayam.
Bhagavad Gita (Dwipada), Sree Krishna Leelamrithamu,
Krishnavatara Thathwamu, Subhadra Vijaya Natakamu,
&c., &c., &c.,

WITH AUTHOR'S OWN COMMENTARY,

CALLED

## MANDARAM


PUBLISHED BY

**Sree Kodanda Rama Sevaka Dharma Samajam,**

ANGALAKUDURU - TENALI.



(ALL RIGHTS RESERVED)


## AYODHYA KANDAMU

**PART - I**

శ్రీ రామ



# శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము మందరసమేతము

## అయోధ్యాకాండము - విషయసూచిక


| | పుటలు |
|---|---|
| 1. మందరము, వ్యాఖ్యానారంభము | ౧ |
| 2. భరతుఁడు శత్రుఘ్నునితోఁ దన మేనమామయింటికిఁ బోవుట | ౫ |
| భాగవత పారతంత్ర్యము | ౬ |
| 3. శ్రీరామచంద్ర కళ్యాణగుణ వర్ణనము | ౧౩ |
| స్వధర్మానుష్ఠాన మపరిత్యాజ్యమను విషయము | ౧౮ |
| దశరథుఁడు రామచంద్రు యువరాజుఁ జేయ యోజించుట | ౨౪ |
| 4. దశరథుఁడు శ్రీరాముని యువరాజుఁ జేయఁ బౌరులతో నాలోచించుట | ౩౧ |
| 5. దశరథు నుపన్యాసము | ౩౩ |
| పౌరులు శ్రీరాముఁడు యువరాజగుటకు సమ్మతించుట | ౩౪ |
| 6. పౌరులు శ్రీరాముని గుణములు వర్ణించుట | ౪౩ |
| 7. పట్టాభిషేక సంభారంబులు గూర్ప దశరథుఁ డాజ్ఞాపించుట | ౫౯ |
| 8. వసిష్ఠుఁడు మంత్రులతో వలసిన సంభారములఁ జెప్పుట | ౬౦ |
| 9. దశరథుఁడు శ్రీరాములను సభకుఁ బిలిపించుట | ౬౪ |
| 10. దశరథుఁడు శ్రీరామునకుఁ దనయభిప్రాయంబుఁ దెలుపుట | ౭౧ |
| వినయగుణ వివేచనము | ౭౫ |
| స్త్రీధన చర్చ | ౭౪ |

| | పుటలు |
|---|---|
| 11. దశరథుఁడు శ్రీరామునిఁ దననగరునకుఁ బిల్పించుట | ౭౯ |
| 12. దశరథుఁడు శ్రీరాముని యువరాజుఁ జేయుటకుఁ గారణము | |
| లాయనతోఁ జెప్పుట | ౮౧ |
| ఋణత్రయ వివరణము | ౮౨ |
| మరణకాల సూచనలు | ౮౬ |
| స్త్రీలకు దేవపూజాదులు చేయు నధికారము గలదా అను | |
| విషయమును గుఱించి | ౯౧ |
| 13. కౌసల్య శ్రీరాముని దీవించుట | ౯౭ |
| 14. దశరథుపంపున వసిష్ఠుఁడు శ్రీసీతారాముల నుపవాసముంచుట | ౯౯ |
| గురువులను శిష్యులెట్లు పరిచరింపవలెను ? | ౧౦౦ |
| 15. శ్రీరామ పట్టాభిషేకమునకై జనులు గుంపులు గూడుట | ౧౦౧ |
| 16. శ్రీరాముఁడు నారాయణార్చనము చేయుట | ౧౦౪ |
| హవిస్సు భుజించుటవలన నుపవాసవ్రత భంగమగునా | ౧౦౭ |
| గృహాలంకరణమును స్త్రీలు సూర్యోదయమునకే ముందే | |
| చేయవలయునను విషయము | ౧౦౮ |
| సంధ్య | ౧౦౯ |
| స్నాన వివరణము | ౧౧౨ |
| 17. శ్రీరామ పట్టాభిషేకమునకై యయోధ్య యలంకరింపఁ బడుట | ౧౧౩ |
| 18. పట్టాభిషేకవిషయ జన సంభాషణము | ౧౧౫ |
| 19. మంథర యయోధ్యాలంకారముఁ జూచుట | ౧౧౮ |
| అవతార ప్రయోజనారంభము | |
| 20. మంథర కైకేయికి శ్రీరామ పట్టాభిషేకవార్తఁ దెలిపి దుఃఖించుట | ౧౨౨ |
| 21. పట్టాభిషేకవార్తఁ జెప్పిన మంథరకుఁ గైక పారితోషిక మిచ్చుట | ౧౨౭ |
| 22. మంథర కైకను దూషించుట | ౧౨౯ |
| 23. మంథరకుఁ గైక శ్రీరాముని గుణములు వర్ణించి చెప్పుట | ౧౩౩ |
| 24. మంథర కైకకు దుర్బోధము సేయుట | ౧౩౫ |
| 25. కైక మంథరను శ్రీరామ పట్టాభిషేకము విఘ్నము సేయ | |
| నుపాయ మడుగుట | ౧౩౯ |
| 26. మంథర కైకకు శ్రీరామ పట్టాభిషేకము విఘ్నము సేయ | |
| నుపాయంబుఁ జెప్పుట | ౧౪౩ |

పుటలు

27. మంథర కైకకు రాజుపైఁ గోపము వచ్చినట్లు నటింప బోధించుట ౧౪౫
28. కైక మంథరను మెచ్చుకొనుట ౧౫౦
29. కైక కోపగృహముఁ జొచ్చుట ౧౫౪
30. దశరథుఁడు పట్టాభిషేకవార్తఁ దెలుపఁ గైకగృహంబునకుఁ బోవుట ౧౬౦
31. దశరథుఁడు కైక దుఃఖించుటకుఁ గారణ మడుగుట ౧౬౬
32. కైకకోర్కి నెఱవేర్చెదనని దశరథుఁడు ప్రమాణము సేయుట ౧౬౭
33. కైక తనపూర్వవరముల వృత్తాంతము దశరథునకుఁ జెప్పుట ౧౭౨
34. కైక భరత పట్టాభిషేకము శ్రీరామ ప్రవాసము వరంబులుగఁ గోరుట ౧౭౩
స్త్రీల యనురాగము స్వాభావికమా యను విషయము ౧౭౫
35. కైకగోరిన వరముల విని దశరథుఁడు పరితపించుట ౧౭౬
36. దశరథుఁడు కైకను దూషించుట ౧౭౭
37. దశరథుఁడు శ్రీరాముని గుణముల వర్ణించుట ౧౮౩
38. దశరథుఁడు కైకను వేఁడుకొనుట ౧౮౭
39. కైక దశరథుని దూషించుట ౧౮౯
స్త్రీలకు పుత్రప్రేమకంటె సపత్నీమాత్సర్య మెక్కుడను విషయము ౧౯౨
40. కైక నిష్ఠురోక్తులకు దశరథుఁడు విహ్వలుఁ డగుట ౧౯౩
కైకకిచ్చిన వరముల నేల దశరథుఁడు కాదనరాదు ? ౧౯౫
41. దశరథుఁడు కైకేయితో న్యాయనిష్ఠురము లాడుట ౧౯౬
42. దశరథుఁడు కైకను ప్రార్థించుట ౨౨౧
43. దశరథునకు సత్యంబు కైక బోధించుట ౨౨౨
44. దశరథుఁడు కైకను విడనాడుట ౨౨౫
దశరథుఁడు కైకను శపించుట శాస్త్రీయమా ? ౨౨౬
దశరథుఁడు ధర్మపాశబద్ధుఁడగుట యథార్థమా ? ౨౩౪
వసిష్ఠ శబ్ద వ్యాఖ్య ౨౩౫
45. వసిష్ఠుఁడు పట్టాభిషేక సంభారములతోఁ జనుదెంచుట ౨౩౬
46. వసిష్ఠుఁడు దనరాక దశరథునకుఁ దెలుప సుమంత్రుఁబంపుట ౨౩౭
47. సుమంత్రుఁడు దశరథుని నిద్రమేలుకొలుపుట ౨౩౯
48. కైక సుమంత్రునితో శ్రీరాముని దోడితెమ్మని చెప్పుట ౨౪౨
49. సుమంత్రుఁడు సామంతరాజులతో సంభాషించుట ౨౪౬
50. దశరథుఁడు సుమంత్రునితో శ్రీరామునిఁ బిలుచుకొనిరమ్మని చెప్పుట ౨౪౮

పుటలు
51. సుమంత్రుఁడు శ్రీరామునితో దశరథుని వాక్యంబుఁ జెప్పుట ౨౫౩
52. శ్రీరాముఁడు సీతాదేవికి రాజాజ్ఞ నెఱింగించుట ౨౫౭
భార్యలు భర్తల నాశీర్వదింపవచ్చునా ? ౨౬౪
53. శ్రీరాముఁడు దశరథుఁ గృహంబునకుఁ బోవుట ౨౬౬
54. ప్రజలు శ్రీరాముని దీవించుట ౨౭౧
55. శ్రీరాముఁడు దశరథుని స్థితికి వగచుట ౨౭౬
56. శ్రీరాముఁడు కైకను దశరథు దుఃఖపాటునకుఁ గారణమడుగుట ౨౭౯
57. శ్రీరామునితోఁ గైక తన వరముల వృత్తాంతముఁ దెలుపుట ౨౮౪
58. అరణ్యమునకుఁబోవ శ్రీరాముఁ డంగీకరించుట ౨౮౭
59. శ్రీరాముఁడు కౌసల్యా గృహమునకుఁ బోవుట ౨౯౫
60. శ్రీరాముఁడు కౌసల్యను జూచుట ౩౦౦
61. శ్రీరాముఁడు తల్లితోఁ దానరణ్యమునకుఁ బోవువార్తఁ జెప్పుట ౩౦౩
నిరామిషశబ్ద విచారము ౩౦౫
62. శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుట విని కౌసల్య దుఃఖించుట ౩౦౬
63. లక్ష్మణుఁడు కౌసల్యతో శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోరాదని చెప్పుట ౩౧౩
64. లక్ష్మణుఁడు శ్రీరామునితో నరణ్యమునకుఁ బోవలదని చెప్పుట ౩౧౬
65. శ్రీరాముఁడు కౌసల్యాలక్ష్మణుల నూరార్చుట ౩౩౨
తల్లిదండ్రుల నిర్బంధింపరాదుకదా శ్రీరామచంద్రమూర్తి
తల్లిని నిర్బంధించుట సరియా ? ౩౨౯
66. శ్రీరాముఁడు లక్ష్మణునకు ధర్మోపదేశంబు చేయుట ౩౩౩
తప్పుత్రోవలఁబోవు గురువును దండింపవచ్చునని లక్ష్మణు మతము
దండింపరాదని శ్రీరాముని మతము-ఇందేది యనుసరణీయము? ౩౩౪
67. శ్రీరాముఁడు లక్ష్మణునితో మేలుగీళ్ళకు దైవము కారణమనిచెప్పుట ౩౪౨
68. లక్ష్మణుఁడు శ్రీరామునితో దైవముకంటెఁ బౌరుషమే
శ్రేష్ఠమని చెప్పుట ౩౪౮
దైవపౌరుష విచారము ౩౬౨
69. కౌసల్య శ్రీరాము నిశ్చయమెఱింగి పరితపించుట ౩౬౭
70. భార్యలు భర్తల విడిచిపోఁగూడదని శ్రీరాముఁడు కౌసల్యతో జెప్పుట ౩౭౦
71. శ్రీరాముని వనవాసంబునకుఁ గౌసల్య యీయకొనుట ౩౭౭

పుటలు

72. కౌసల్య శ్రీరాము నాశీర్వదించుట ౩౬౯

కౌసల్య శ్రీరామునకు మంగళాశాసన మొనర్చి రక్షగట్టుట ౩౭౫

వినతకథ ౩౭౮

73. శ్రీరాముఁడు సీతను జూడఁబోవుట ౩౯౦

మాతృ వియోగముకంటె భార్యావియోగము తీవ్రతరమా ? ౩౯౩

74. శ్రీరాముఁడు సీతతోఁ దానరణ్యమునకుఁ బోవువార్తఁదెలుపుట ౩౯౫

75. శ్రీరాముఁడు సీతకు నీతులు చెప్పుట ౩౯౭

76. సీత శ్రీరామునితో నరణ్యమునకుఁ దాను వచ్చెదనని చెప్పుట ౪౦౨

భార్యాభర్తల సంబంధమును గుఱించి ౪౦౪

ఎట్టి కష్టదశయందును భార్యభర్తను విడువరాదను విషయము ౪౦౬

77. శ్రీరాముఁడు సీత కరణ్యమునందలి కష్టములఁ జెప్పుట ౪౧౧

వానప్రస్థ ధర్మ వివరణము ౪౧౪

78. సీత శ్రీరామునితోఁ దానడవికి వచ్చుటకుఁ గారణములఁ జెప్పుట ౪౧౬

స్త్రీలకుఁ బతిపూజవలననే స్వర్గము కలదను విషయము ౪౨౧

79. సీత శ్రీరాము నిష్ఠురము లాడుట ౪౨౪

80. శ్రీరాముఁడు సీత వనంబునకు వచ్చుట కంగీకరించుట ౪౩౩

81. శ్రీరాముఁడు సీతతో నరునకుఁ బితృపూజ యవశ్య
కర్తవ్యమని చెప్పుట ౪౩౫

తల్లితండ్రి యాచార్యుల శుశ్రూషయే పరమతపము ౪౩౬

82. శ్రీరాముఁడు దానముసేయ సీతను నియోగించుట ౪౪౦

భార్యకుఁ బుత్రునకుఁ దాసునకు వేరు ధనములేదను న్యాయ
ముండగా శ్రీరాముఁడెట్లు దానము చేసెను ? ౪౪౧

83. లక్ష్మణుండు తాను వనమునకు వచ్చెదనని శ్రీరాముఁ బ్రార్థించుట ౪౪౨

తల్లిదండ్రి బ్రతికియుండఁగా వారినివిడిచి శ్రీరాముని గొలువ
లక్ష్మణుఁ డడవికిఁబోవుట ధర్మమా ? ౪౪౩

శరణాగతి వివరణము ౪౪౪

84. శ్రీరాముఁడు లక్ష్మణుని నయోధ్యయందుండుమని చెప్పుట ౪౪౮

85. లక్ష్మణుఁ డరణ్యమునకు వచ్చుటకు శ్రీరాముఁడు సమ్మతించుట ౪౫౨

86. శ్రీరాముఁడు తన పదార్థములను దానముచేయుట ౪౫౪

మితాహార నియమము బ్రహ్మచారులకు లేదను విషయము ౪౫౬

అధ్యా పుటలు

87. త్రిజటుఁడను బ్రాహ్మణుని వృత్తాంతము ౪౫౯
బ్రాహ్మణుఁడు దేహధారణ కుటుంబ రక్షణములకై చేయు యాచన దూష్యముకాదు ౪౬౧
88. సీతా రామ లక్ష్మణులు తండ్రియొద్దకుఁ బోవఁజూచి ప్రజలు దుఃఖించుట ౪౬౫
89. పౌరులు కైకేయీ దశరథుల నిందించుట ౪౬౭
90. శ్రీరాముఁడు తనరాకను దండ్రికిం జెప్పిపుచ్చుట ౪౭౨
91. దశరథుఁడు సీతారామ లక్ష్మణులఁ జూచుట ౪౭౬
92. శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతో వనమునకుఁబోవ ననుజ్ఞ వేఁడుట ౪౭౭
తనకు వశవర్తినియగు సీత విషయమై శ్రీరాముఁడు దశరథునకుఁ దెలుపుట విధియా ? ౪౭౮
93. శ్రీరాముఁ డరణ్యమునకుఁబోవ దశరథుఁడు సమ్మతించుట ౪౮౦
94. శ్రీరాముఁడు తన మనోనిశ్చయముఁ దండ్రికిం జెప్పుట ౪౮౩
95. సుమంత్రుఁడు కైకను దూషించుట ౪౮౯
96. దశరథుఁడు శ్రీరామునితోడ సైన్యాదులు పంప సుమంత్రునితోఁ జెప్పుట ౪౯౬
97. సిద్ధార్థుండు కైకకు బుద్ధిచెప్పుట ౫౦౦
98. కైక సీతారామలక్ష్మణులకు నారచీరలిచ్చుట ౫౦౩
సీతను దోడ్కొనిపోవలదని రాజకాంతలు శ్రీరామునిఁ బ్రార్థించుట ౫౦౬
99. సీత నారచీరలు కట్టఁగూడదని వసిష్ఠుఁడు నిషేధించుట ౫౦౭
భార్య భర్తకు ఆత్మయనుటకుఁ బ్రమాణములు ౫౦౮
100. సీతకు నారచీరల నిచ్చుటకు దశరథుఁడు కైకను నిందించుట ౫౧౨
భర్త నారచీరలు ధరింపఁ దాను పట్టుచీరలు సీతాదేవి ధరించెను గదా అది వ్రతభంగముగాదా ? ౫౧౪
101. శ్రీరాముఁడు తనతల్లిఁ గాపాడుమని తండ్రిని వేఁడుకొనుట ౫౧౬
102. మునివేషధరుండైన శ్రీరామునింజూచి దశరథుఁడు దుఃఖించుట ౫౧౮
103. కౌసల్య సీతకు ధర్మోపదేశములు చేయుట ౫౨౧
పతివ్రతా ధర్మములు ౫౨౪
104. శ్రీరాముఁడు కౌసల్యాది మాతలయొద్ద సెలవు తీసికొనుట ౫౨౮
సుమిత్ర లక్ష్మణునకు శ్రీరామువెంటఁబోవ ననుజ్ఞ యిచ్చుట ౫౨౯
"రాముఁడ యెఱుంగుమీ దశరథుఁడు నిజము" అను పద్య వ్యాఖ్యానము ౫౩౨

పుటలు

105. సీతారామలక్ష్మణులు తేరెక్కి వనములకై పోవుట ౫౩౮
106. శ్రీరాముని పోకకుఁ బ్రజలు దుఃఖించుట ౫౩౯
107. దశరథుఁడు శ్రీరామునిఁ జూడవచ్చుట ౫౪౧
శ్రీరామునకై యంతఃపుర స్త్రీలు దుఃఖించుట ౫౪౭
సోపాధిక బంధువులు త్యాజ్యులనియు నిరుపాధిక బంధువు
శ్రీరాముఁడే విశ్వసనీయుండనుటకుఁ గారణములు ౫౫౩
108. దశరథుఁడు మరలి తనగృహమునకుఁ బోవుట ౫౫౪
109. దశరథుఁడు కౌసల్యా గృహమునకుఁ బోవుట ౫౬౧
దశరథుని పంచేంద్రియములు శ్రీరామునకే యనన్యా
ర్హంబులయిన విషయము ౫౬౨
110. కౌసల్య శ్రీరామునిఁ దలఁచి దశరథునితోఁ జెప్పుకొని యేడ్చుట ౫౬౬
నీరుత్రావు గోవును పాలుత్రాగు లేఁగను నీవల కీడ్వరాదను విషయము ౫౭౦
111. సుమిత్ర కౌసల్యకు శోకోపశమనము చేయుట ౫౭౨
సుమిత్ర వాక్యములచే వాల్మీకి శ్రీరాముఁడు పరమాత్మయను
విషయమును జెప్పుట ౫౭౨
జీవునకు భగవత్కైంకర్యమే స్వరూప స్వభావములను విషయము ౫౭౪
112. శ్రీరాముఁడు పౌరులను మరలిపోవఁ బ్రార్థించుట ౫౮౩
113. పౌరవృద్ధులు శ్రీరామునిఁ బురికిరాఁ బ్రార్థించుట ౫౮౮
114. శ్రీరాముఁడు తమసా నదీతీరముఁ జేరుట ౫౯౪
115. శ్రీరాముఁడు పౌరుల మోసగించిపోవుట ౫౯౯
తనను నమ్మివచ్చిన పౌరులను శ్రీరాముఁడు మోసగించిపోవచ్చునా? ౬౦౧
116. పౌరులు శ్రీరామునిఁగానక దుఃఖించుట ౬౦౩
117. పౌరు లయోధ్య మరలఁ జేరుట ౬౦౬
118. పౌరు లయోధ్యకుఁబోవ స్త్రీలు వారిని నిందించుట ౬౦౮
119. పురస్త్రీలు శ్రీరాముఁ దలంచి దుఃఖించుట ౬౧౨
120. శ్రీరాముఁడు కోసలదేశంబు దాఁటిపోవుట ౬౧౯
శ్రీరాముఁడు క్షుద్రదేవతలకు నమస్కరింపవచ్చునా ? ౬౨౩

పుటలు

121. శ్రీరాముఁడు గంగానదిఁ గాంచుట ౬౨౩

122. గుహుఁడు శ్రీరాము దర్శించుట ౬౩౪

ఆత్మనిక్షేప వివరణము ౬౩౫

భగవంతుఁడు తనను బూజించువారికంటెఁ దనభక్తులఁ
బూజించువారి విషయమున విశేషముగ సంతోషించునను విషయము ౬౩౭



శ్రీః.

శ్రీసీతాలక్ష్మణ భరతశత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణేనమః

శ్రీమతే రామానుజాయ నమః.

శ్రీ హయగ్రీవ ప్రసన్న.

శ్రీ శారదాయై నమః.

# శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

మందరసమేతము.

## అయోధ్యాకాండము



మత్ సుగుణాభరణా!
ధీమత్స్మరణ ప్రసూన దీపితచరణా!
స్వామీ చిదచిద్విభవా!
శ్రీమహితా యొంటిమిట్ట సీతారమణా!

## మందరము

వ్యాఖ్యానారంభము.

శ్రీ రామచంద్ర ప్రభో పాహిపాహి.

సీ. తనపాద భక్తుల తనయునిగాఁజేసి, యనుకంప వీక్షించె జననమంద
ఆవలఁదాలక్ష్మణార్యుఁడై రక్షించి, రామాయణంబనుగ్రహముచేసె
స్వీయమంత్రంబును జెట్లూరి నరసింహ, దేశికుండయి యుపదేశమిచ్చె
ఏకశిలానగరౌకుఁడై గ్రహియించె, నాంధ్ర వాల్మీకి రామాయణంబు

వాసుదాసునిఁగావించి వాసుకిగను, మందరభరంబువహియించిమాధవుండు
శ్రీకృపాపాత్రులనుజేసి స్వీయులైన భక్తబుధులకు నమృతంబుఁ బంచిపెట్టు

కం॥ హృదయగతుండయి రాముఁడు।
సదయుండై తెలియరానిసద్విషయంబుల్।
విదితముగఁజేయు నుండఁగ।దదనుమతిన్ వ్యాఖ్యవాసుదాసుఁడువలుకున్

వ్యా ఖ్యా న ము

శ్రీమత్=శ్రీమంతములయిన, శోభావంతములయిన, లక్ష్మీప్రదములయిన సుగుణ=కల్యాణగుణములే. ఆభరణా=అలంకారములు గాఁగలవాఁడా, శ్రీమంతుఁడవైన సుగుణాభరణా యనియైనఁ జెప్పనగు, ధీమత్=బుద్ధిమంతులయొక్క స్మరణ=స్మరణమనెడి, ప్రసూన=పుష్పములచేత, దీపిత=ప్రకాశముగలవగు, చరణా=పాదములుగలవాఁడా, స్వామీ=చరాచర ప్రపంచమంతయు జీవకోటితోడ తనసొమ్ముగాఁగలవాఁడా: చిత్-అచిత్-ద్రవిణా=చేతనులు ప్రకృతి యీ రెంటికి వాసస్థానమైన వాఁడా, "ద్రవిణంగేహే విత్తేస్వర్గేపరాక్రమే" నానాఇది నారాయణ శబ్దార్థవివరణము శ్రీమహితా=లక్ష్మిచే నుత్కృష్టుఁడవైనవాఁడా, ఒంటిమిట్ట=ఏకశిలానగరమను నామాంతరముగల యొంటిమిట్టయందు వేంచేసియుండు, సీతారమణా=సీతయందు రమించువాఁడా రామచంద్రా వినుము అని అధ్యాహారము.

శ్రీమత్=ఇది ద్వయమందలి ప్రథమపదము. బాలకాండము మొదటి పద్యమున నీ గ్రంథమునఁ బ్రతిపాదింపఁబడిన భగవన్మూర్తి శ్రీరాముల ముఖ్యమంత్రము షడక్షరి సబీజముగఁ జెప్పఁబడెను. ఇక్కడనుండి ద్వయము ప్రారంభమగును.

ఈ గ్రంథమునందలి మంత్రములన్నియు నుత్తరకాండముతోఁ బూర్ణమగును గావున నందవి సమన్వయించి చెప్పఁబడును.

శ్రీమత్ అనుచోట మత్తునది ప్రత్యయము. దీనినే మతుప్ప్రత్యయ మందురు. "భూమ, నిందా, ప్రశంసాసు నిత్యయోగేతిశాయినే, సంసర్గేస్తి వివక్షయాం భవంతి మతుబాదయ" యని యీ ప్రత్యయము నానార్థములు బ్రయోగింపఁబడును. దీనికిఁ గలయని యర్థము. శ్రీమత్=శ్రీ కల యని యర్థము. ఏవిధముగాఁగల? యనఁగా నిత్యయోగముగఁగల యనియర్థము. కావున సర్వకాల సర్వావస్థలయందును నెడఁబాటులేని కలయిక చెప్పఁబడెను, కావున "శ్రీధర శ్శ్రీకర శ్శ్రేయ శ్శ్రీమాన్ లోకత్రయాశ్రయ' యని భగవన్నామములందు శ్రీమాన్ అనునదియు నుండుటచే శ్రీమంతుఁడైన యన్నప్పుడు శ్రీతో నిత్యసంయోగము గల వాఁడని యర్థము గ్రహింపవలెను.

"కృష్ణాజినేన సంవృణ్వన్ వధూం వక్షస్స్థలాలయా" మ్మన్నట్లు (వామనావతారమున బ్రహ్మచారి కావున లక్ష్మీదేవి వెలికిఁగావరాకుండఁ గృష్ణాజినముచేఁ

గప్పెనవియు, నామె మౌంజియుం దుండెననియుఁ జెప్పుదురు. అట్టిలే 'భాస్కరేణ ప్రభాయథా' యన్నట్లు సీతారాములకు, లోకమునకు గానవచ్చినను రాకున్నను, వియోగము లేమిని నిది సూచించును వనప్రయాణకాలమున సీతారామ సంభాషణము. 'నిన్నుఁబాసి ధరాతనూజయు నేను నొక్క ముహూర్తమే నిన్నిలం గలవారమే. (ప. ౧౧-౨౨) యను లక్ష్మణు వాక్యము చూచునది.

సుగుణాభరణా=ముఖ్యముగ నీ యయోధ్యాకాండమందు శ్రీరాముని వాత్సల్య-స్వామిత్వ-సౌశీల్య-సౌలభ్య - సర్వజ్ఞత్వ-సర్వశక్తిత్వ - సర్వసంకల్పత్వ-పరమకారుణికత్వ-కృతజ్ఞత్వ-స్థిరత్వ-పరిపూర్ణత్వ- పరమోదారత్వాదులు వర్ణింపఁబడినవి. ఈగుణముల లక్షణములు రామచంద్రమూర్తియం దెట్లన్వయించునది ముున్ముందు విస్తరింపఁబడును.

ఈవిధముగ శ్రీమత్సుగుణాభరణా యనుటచే నయోధ్యాకాండ మందలి ముఖ్యార్థము సూచితము. శ్రీరామచంద్రమూర్తియందు వాత్సల్యాది సుగుణము లుండుటయు సత్యమే. అవియును శ్రీమంతము లగుటయు(సంపత్కరములగుటయు) సత్యమే. అవి మనపై శ్రీరామచంద్రమూర్తి ప్రయోగించు నుపాయమెట్లు?

బుద్ధిమంతుల స్మరణప్రసూనములచే దీపించు పాదములు గలవాఁడా యనుటచే శ్రీరామచంద్రమూర్తి శ్రీపాదముల నాశ్రయించుట యనునది పూలఁచే బూజించుట యనియు,నాస్మరణమనునది ధీమంతమై యనఁగానిండు మనస్సుతో శ్రద్ధాభక్తులతోడ నుండవలయు ననియు, గ్రహింపవలెను. దీని వలన శ్రీరామనామస్మరణమే మనల శ్రీరామానుగ్రహమునకుఁ బాత్రులఁ జేయుననియు నదియే తరుణోపాయ మనియుఁ దెలియనగు.

ఆయనను మన మేల స్మరింపవలెననిన మనముస్వమ్ము (సొమ్ము), ఆయనస్వామి, (సొమ్ముగలవాఁడు) కావున మన మాయనవిషయమునఁ బ్రాతికూల్యము వర్జించి, యనుకూలురమై,యాయనయే రక్షకుఁడని దృఢవిశ్వాసము గలవారమై, యున్నయెడల నాయన మనల నెక్కువ ప్రీతితో రక్షించును. ఒకనికి నూఱుగోవులుండిన వానిలో నొకటి దుష్టపశువుండెనేని దానికిని మేపు నీళ్లు పెట్టి వాఁడు కాపాడినను సాధువైన గోవును దనయందుఁ బ్రీతివిశ్వాసములుగల గోవునాదరించినట్టు దానినాదరింపఁడు గదా. ఆయన స్వామియు మన మాయనసొమ్మై యాయన మనలను మన ప్రార్థనలేకయే సంరక్షించుచుండఁగా గృతజ్ఞులమై మఱేమిచేయలేకున్నను జేయకున్నను నాయన నామమైన స్మరింపమేని మనకంటెఁ గృతఘ్నులెవరు? ఆయన మనకు స్వామియెట్లయ్యెనన చిదచిద్విశిష్టుఁడు కావున. జీవులకు-ప్రకృతికిఁ గూడ ధారణ పోషణముల కాయనయే కర్త కావున. శ్రీరామపరత్వమందుఁ జెప్పఁబడిన నారాయణ శబ్దార్థమిట ననుసంధించునది. ఈయన కీగొప్పతన మెట్లువచ్చెను? శ్రీ

మహితుఁడు. కావున, ఈయనయందు గొప్పగుణములు గలవు. వానిని భక్తుల యందు వినియోగపఱచి భక్తుల రక్షించుచుఁ దన్మూలమున భగవంతునకు పేరుప్రతిష్ఠ తెచ్చునది శ్రీ. చెఱువునిండ నీరున్నది. దాని క్రిందఁ గావలసినంత పొలమున్నది. తూములేకున్న నేమి ప్రయోజనము? మనకుఁగావలసినది తూము నీరే. చెఱువు నీటితోఁబనిలేదు. ఎండని తఱుగని నిండుచెర్వు. ఎంత నీరు దీసిన నేమిభయము. శ్రీయను తూమునుండి భగవత్కృపయను నీరు తెచ్చుకొని తనక్షేత్రమును బాగుపఱుచుకొననివాఁడు పాపాత్ముఁడు. ఇట్టిస్వామి యెవఁడు? ఒంటిమిట్టయందు సర్వావతారముగ వేంచేసియుండు సీతాలక్ష్మణ సహితుఁడైన శ్రీరామచంద్రమూర్తియే. "శ్రీరంగస్థల వేంకటాద్రి కరిగిర్యాదౌశ తేష్టోత్తరే, స్థానే గ్రామనికేతనేషుచ సదాసాన్నిధ్యమాసేదుషే। అర్చారూపిణి మర్చకాభిమతితః స్వీకుర్వతే విగ్రహం। పూజాంచాఖిల వాంఛితాన్విత నుతే శ్రీ శాయతస్మైనమః." కావున సర్వావతారమే యీకాలమున సేవ్యము.

అవతారిక :— "ఈ లోనన జాంబూనదచేలుఁడు తేరవిచ్చేసెన్" అనుటచే భగవంతుఁడైన శ్రీ మన్నారాయణుండు "రక్ష్యాపేక్షామపేక్షతే" తన్ను రక్షింపుమని కోరువానికై యెదురుచూచుచుండి రక్షరక్షయను నార్తనాదము విన్నమాత్రముననే, కట్టఁబడిన దూడకూఁతవినఁగానే పరుగుదెంచుగోవువలె, నార్తరక్షకై పరుదెంచుననియు, దశరథునకుఁ బుత్రుఁడగుటచే జన్మంబునసైన సకామముగనైన భగవంతుని సేవించియుండినచో మరల జన్మంబుల మనము మఱచినను దాను మఱవక మనకోరిక నెఱవేర్చుననియు, పరత్వదశయందుఁగల మహత్త్వమవతారదశయందును గలదని "యేనెఱుంగుదు రాజేంద్ర యీ మహాత్ము"నను వాక్యముచేఁ బురుషసూక్తోక్తభగవన్మహత్త్వమున కిప్పుడు కొఱఁతలేదనియు, నీవనిర్దేశ్యుండవులోనగు కశ్యపోక్తులవలన భగవద్వైఁభవం బచింత్యమనియు, శివధనుర్భంగ-పరశురామ వాక్యములవలనను విష్ణువేయధికుఁడని దేవతలు తలంచిరనుటచే నవతారదశ యందుఁ గాని యుతర దశ యందుఁగాని శ్రీరామచంద్రమూర్తియే పరమదైవతమనియు బాలకాండము వలన నేర్పడుచున్నది.

ఇట్లు పూర్వకాండమందు స్వరూపము స్థాపించి యీకాండమందు స్వభావ మనఁగా హేయగుణ రహితత్వము కల్యాణగుణ సహితత్వము దెలుపఁబడుచున్నది. ఇఁక జెప్పఁబడుచున్న ధర్మముల ననుష్ఠించు యోగ్యతకుపయోగపడు రామాయణ పురుషమహాకుల ప్రసూతిత్వము, గుర్వనుగమనము, గురుకృపాపాత్రులై కులవిద్యను సరహస్యముగానేర్చి, గుర్వాజ్ఞానుసారము వర్తించి, తాటకా తాటకేయాది రాక్షసులఁదునిమి, గురుప్రీతి గావించుటయు, శైవధనుర్భంగంబుఁ గావించి విద్యాపూర్తి తెలిపి గుర్వాజ్ఞ స్నాతకుండై ద్వితీయాశ్రమ స్వీకారంబుగావించి సహధర్మచారిణియు సమానకులజయు నగు భార్యను గ్రహించుటయు, వైష్ణవధర్మ పరిగ్రహంబును బా

ర్వకాండంబునఁ జెప్పఁబడెను. ఇఁక వారనుష్ఠించిన పితృవాక్యపరిపాలనాది సామాన్య ధర్మములు భగవచ్ఛేషత్వ భగవత్పారతంత్ర్య, భాగవత పారతంత్ర్యము లోనగు విశేషధర్మములు ప్రతిపాదింపఁ బడుచున్నవి. పూర్వకాండమున శ్రీయోగము. ఈకాండమున భూయోగము. పూర్వకాండమున బరత్వము. ఇందు సౌలభ్యము. ముందు లక్ష్మీవిశిష్టమైన ప్రాప్యస్వరూపము. ఇందు ప్రాప్తృరూపజీవ స్వరూపము తెలుపఁబడును. అందు మొదట నతిరహస్యమై యవశ్యమెఱుఁగఁదగిన భాగవతాభిమాన నిష్ఠ నిరూపింపఁబడుచున్నది.

## ౧ సర్గము. భరతుఁడు శత్రుఘ్నునితోడఁ దనమేనమామ యింటికిఁ బోవుట.

కం. అనురక్తు ననఘు శత్రు,ఘ్నుఁ నిత్యశత్రుఘ్నుఁ గైక•కొమరుం డనుజున్
దనవెంటఁ దీసికొనుచుం, జనియెను దనమేనమామ•సదనంబునకున్. ౧

అనురక్తున్=అనురాగముగలవానిని, అనఘున్=పాపరహితుని, నిత్యశత్రుఘ్నున్=నిత్యశత్రువుల జయించినవానిని, అనుజున్=తోడఁబుట్టినవానిని, శత్రుఘ్నున్-కైకకొమరుఁడు=భరతుఁడు, తనమేనమామ సదనంబునకున్=ఇంటికి, తన వెంటఁదీసికొనుచుఁబోయెను.

అనురక్తు ననుటచే 'పరానురక్తిరీశ్వరే' యన్నట్లు శత్రుఘ్నుఁడు పరమభక్తుఁడని చెప్పఁబడెను. అనురాగమునకే భక్తి యనిపేరు, ఇట్టి భక్తి యెట్లు లభించెనన- అనఘుఁడౌటచేత- సవతి తల్లికొడుకుగదాయని యీర్ష్యాసూయామాత్సర్యాది దుర్గుణములుగాని భక్తివిఘ్నకరములైన దుస్సాంగత్యము- అభిమానము-దంభము ద్వేషము లోనగు దుర్గుణములుగాని లేకుండుటచేత; ఇక్కడ నఘ అభావమును దెలుపును.

అనఘుఁ డెట్లయ్యెను? నిత్యశత్రుఘ్నుఁడగుటచేత? నిత్యశత్రువులైన కామక్రోధలోభములను జంపుటచేత- అదియెట్లు సాధ్యమయ్యెను? కైకవంటి కాముకకుఁగొమరుఁడైనను భగవంతుఁడగు శ్రీరామునకుఁ బరతంత్రుఁడగుటచే నాయన సవతితల్లి కుమారుఁడైనను నేకోదరుఁడగు ననుజువలె స్వీయబుద్ధి నాయనకుఁ బరతంత్రుఁడై వర్తించుటచేత- ఆ పారతంత్ర్యమెట్టిది? భరతుఁడు తనకత్తిని వస్త్రమును దీసికొని నపుడవి యెట్లు ప్రతిభాషింపలేదో యట్లే యచేతనమువలెఁ దానును నాయనకు వశుఁడై వర్తించుట ఆ పారతంత్ర్యమును దెలుపును.

తన వెంటఁ దీసికొనిపోయె ననక నీసికొనుచుఁబోయెనని వర్తమానార్థకమువర్ణ ప్రయోగముచే బయలు దేఱునపుడెట్లో కడవెడల సర్వకాల సర్వావస్థలనట్లే పరతంత్రుఁడై యుండెనని భావము-ఎక్కడికిఁబోయెను? తోఁచీ తోఁచనమ్మ తోడికోడలి పుట్టినింటి పెండ్లికిఁ బోయెనన్నట్లు సవతితల్లి పుట్టినయింటికి- నీమేనమామ యింట నాకేమి కార్యమని స్వతంత్రించి పలుకునో లేక వాస్తవకేవల పారతంత్ర్యమును జూపునో యని పరీక్ష - స్థలయోగ్యతాయోగ్యతలు,

తన యానుకూల్య ప్రాతికూల్యములు విచారించుట పరతంత్రుని కార్యము గాదు. భాగవతుఁడుండు స్థలమే వానికి బరమపదము.

మహేశ్వర తీర్థవ్యాఖ్య లక్ష్మణుఁడు మహదాశ్రయముఁగోరి శ్రీరాము నాశ్రయించినట్లు శత్రుఘ్నుఁడును భరతు నాశ్రయించెను. తీసికొనుచున్=మేనమామగారి యింటఁగలుగు సుఖము శత్రుఘ్నుఁడు లేక తానొక్కఁడే యనుభవించుట సుఖానుభవము కానట్లే. కావునఁ దీసికొనిపోయెను. అనురక్త ననుటచే భరతునియందలి ప్రీతిచే శత్రుఘ్నుఁడు పోయెనుగాని యితరకారణమునఁగాదని భావము.

తిలకము. అనురక్తున్=దీనివలన భరతుని నిర్బంధమువలన శత్రుఘ్నుఁడు పోయెనేమో యను సందేహము నివారణమగుచున్నది. ఇది పరస్పరానురాగము సూచించుచున్నది.

మునిభావ ప్రకాశిక- అనఘున్=జననము మొదలు రామచంద్రమూర్తిని లక్ష్మణునివలె భరతు ననుసరించియుండుటచే మాతా పితాభ్రాతృవియోగ దుఃఖము లేనివానిని, నిత్యశత్రుఘ్నున్=కన్నులు వీనులులోనైనవి నిత్యశత్రువులు. వానిని జంపినవాఁడనఁగా జితేంద్రియుఁడని భావము - చూచువారి దృష్టిని జిత్తమును హరించుకాలమునందు లగ్నమైన చక్షురింద్రియమును నిగ్రహించి భరతుని వెంటఁబోవుటచేత జితేంద్రియత్వము ప్రత్యక్ష సిద్ధము. గోవిందరాజీయ వ్యాఖ్య-తీసికొనుచున్ అని వర్తమానకాలము నిర్దేశించుటచే భరతశత్రుఘ్నులగమనమేక కాలమందని యేర్పడుచున్నది. దానివలన భరతుని ఖడ్గశస్త్రములవలెఁ దదేక పారతంత్ర్యము స్ఫుటమగుచున్నది. మేనమామ సదనంబునకున్=ఉద్దేశద్వితీయకు షష్ఠీవిభక్తి-కావున భరతుని యుద్దేశ్యమే శత్రుఘ్నుని యుద్దేశ్యమని యేర్పడుటచే భాగవత పారతంత్ర్యము స్ఫురించుచున్నది. భగవత్పారతంత్ర్యమే భాగవత లక్షణము. భరతుఁడు భాగవతుఁడు. రామలక్ష్మణు లరణ్యమునకు, దశరథుఁడు స్వర్గమునకుఁ బోఁగా కేవలరామాజ్ఞ శిరసావహించి, తనకనుకూల తిథివార నక్షత్రములైనను జూడక, రాజ్యభారమును భరతుఁడు వహించుటచేతను యతఁడు రామపరతంత్రుఁడని స్పష్టము.పరతంత్రునకు భగవదాజ్ఞయే ప్రధానముగాని తక్కినవేదియుఁగాదు. కావున భరతుఁడు తిథివార నక్షత్రములు చూచినవాఁడు కాఁడు.

అనఘు=ఈ ప్రకరణమందు అఘశబ్దముచే (అఘము=పాపము) కేవల రామభక్తి చెప్పఁబడుచున్నది తనకు స్వామియగు భరతునకు రాముఁడు స్వామికదాయని శత్రుఘ్నునకు రామభక్తియేకాని యవ్యవధానమైన భక్తి గాదు. కావున శత్రుఘ్నునకు రామభక్తి లేక పోలేదు. కావుననేకదా భరతుఁడు శత్రుఘ్నుని నింకను నిద్రించుచున్నావా యన్నప్పుడు "నాహం స్వపిమి జాగర్మి,తమే వార్యం విచింతయన్" నిద్రపోలేదు. అన్న నేతలఁచితలఁచి మేలుకొనియున్నాను. (ప. ౨౦౪౪) అని చెప్పెను. శ్రీరాముని పట్టాభిషేక

ప్రయాణకాలమందు భరతుఁడు పగ్గములు పట్టుకొనఁగా శత్రుఘ్నుఁడు ఛత్రము పట్టుకొనెను. మథురాపురమునకుఁ బట్టము కట్టుకొమ్మని రామచంద్రమూర్తి చెప్పినపుడు వల్లెయని యంగీకరించెను. పరతంత్రుఁడు కావున మాఱు చెప్పరాదు గనుక భాగవతపరతంత్రుఁడు సందర్భము కొలఁది భగవంతుని విడువవలయునా భాగవతుని విడువవలయునా యను సందేహము వచ్చినప్పుడు భగవంతుని వదలవలయునేకాని భాగవతుని విడువరాదు. భాగవత పరతంత్రునకు భాగవతుని విడిచి భగవత్సేవచేయుట దోషము-కావున నట్టి (యఘము) దోషము శత్రుఘ్నునందులేదని భావము.

శత్రుఘ్నుఁడు=లవణాసురాదులనితఁడు చంపఁగలఁ డని తెలిసి యాయనకీ పేరు పెట్టఁబడెను.

నిత్యశత్రుఘ్నన్=నిత్యశత్రువులు జ్ఞానేంద్రియములు. అవి దేహమందీ యెల్లవేళలనుండి విషయాంతరములందుఁ బ్రీతిపుట్టించుటయను విపరీతకార్యములకుఁ గారణము లగుచుండును గావున-నవి నిత్యశత్రువులు. వానినిజంపినవాఁడు నిత్యశత్రుఘ్నుఁడు. అనఁగా నింద్రియ నిగ్రహము గలవాఁడని భావము. పురుషుల దృష్టులను మనస్సును గూడ హరించు శ్రీరామచంద్రుని యందుఁ గూడ మగ్నముగాని యింద్రియములు గలవాఁడు.

రామవిషయభక్తి భాగవత పరతంత్రునకు స్వాధికార విరుద్ధము కావున రామచంద్రునియందు మనస్సు దృష్టి మగ్నముకాకుండ వానిని ద్రిప్పుట యవశ్యకార్యము.

శత్రుఘ్నుఁడు పోయెనని చెప్పక తీసికొనిపోఁబడినట్లు చెప్పుటచే నచేతనములవంటి పారతంత్ర్యము చెప్పఁబడెను.

అనురక్తన్=ఏమిచేయవచ్చును. తోడరమ్మనుచున్నాఁడు పోక తప్పదు. కనుక పోద మని శత్రుఘ్నుఁ డిష్టములేక యర్ధాంగీకారముతోఁ బోయినవాఁడు కాఁడు. కేవలానురాగముచే భాగవతుఁడున్న చోటఁ దానుండుట విధి యని తలఁచిపోయెను. కావున నచిత్పారతంత్ర్యమునకు చేతనుని పారతంత్ర్యమునకు భేదము చెప్పఁబడెను. అచేతన పారతంత్ర్యమునకంటెఁ జేతన పారతంత్ర్యమందుఁ బ్రీతిమాత్రము విశేషము. భగవత్పారతంత్ర్యము చేతనులకు నచేతనములకు సమానము.మహాఫలప్రదమని తెలిసి బుద్ధిపూర్వకముగఁగర్తవ్యమని పరతంత్రుఁడగువాఁడు చేతనుఁడు.కావున నత్యంతసారగ్రాహియగువాఁడుశత్రుఘ్నునివలె భాగవత పరతంత్రుఁడై వర్తింపవలయు ననుటవ్యంగ్యము.

భరతునకు మేనమామయిల్లుద్దేశ్యము-శత్రుఘ్నునకు భరతుఁ డుద్దేశ్యము యుధాజిత్తు భరతుని బిలుచుకొని పోవచ్చెనుగాని శత్రుఘ్ననిగాదు.కావున భరతుఁడు బయలుదేఱువఱకు శత్రుఘ్నుఁడు తాను బోఁదలఁచినవాఁడు కాఁడు. దశరథుఁడుకాని రామచంద్రమూర్తికాని పొమ్మని చెప్పనులేదు. ప్రయాణమునకుఁ దనకు శుభకరములైన తిథివారనక్షత్రములుచూడఁ జూచినవాఁడుకాక భరతున

కేదిశుభమోయదియే తనకు శుభమని యెంచి పోయెను. ఇది భాగవత పారతంత్ర్యలక్షణము.

అనఘున్=కామాది హేతుకమైన వ్యసనములేని వానిని, శత్రుఘ్నుఁ డనఘుఁ డనుటచే నయోధ్యయందలి జనులందఱు పాపులని యేర్పడుచున్నది. ఎలన; వారలది రామభక్తితో మిశ్రమమైన భరతభక్తి కావున ననన్యభక్తి గాదు. రామభక్తి పాపమని యేలచెప్పఁబడెననఁ దనకుద్దేశ్యమైన భరతునందలి భక్తికి విరోధము కావున, ఉద్దేశ్య విరోధిత్వమే పాపత్వము. ప్రథమావధినిష్ఠ చరమావధి నిష్ఠకు విరోధము. భాగవత పారతంత్ర్యము చరమావధి నిష్ఠ. దీనికి మించినది లేదు. ఇదియే కడపటిది. ప్రథమావధినిష్ఠయందుఁ బుణ్యమెక్కువయైనను స్వోద్దేశ్య మోక్షవిరోధియగుటచే నదియుఁ బాపమువంటిదే. భక్తి యనన్యముగనుండవలయును గాని బహుముఖముగ నుండరాదు. కావున నొకమార్గమునఁ బోవువాఁడు రెండవమార్గముపై ప్రీతి నుంచరాదు. అట్లుంచెనేని రెంటనుజెడును. అయోధ్యయందు భరత కైంకర్యమును గోరువారు పెక్కురు గలరు. ఆయన వెంటఁబోయితినేని నేనొకఁడనే యావత్సేవ చేయవచ్చునుగదా యను భావముతో శత్రుఘ్నుఁడు భరతువెంటఁ బోయెను.

కం. తనకన్న తనయుపోలిక, ఘనతరసత్కారములను•గావించుచు లా
లనమొనరింపఁగ మాతులుఁ,డనయముఁదమిభ్రాతతోడ•నతఁడటనుండెన్.

రామభక్తిపూర్ణుఁడైన భరతుఁడు రామచంద్రమూర్తిని విడిచి మేనమామయింట నెట్లుండఁగలిగెననిన రామాభిమానమునకు విషయభూతుఁడైన శత్రుఘ్నుని సహవాస బలముచే నని చెప్పుచున్నాఁడు.

అతఁడు=భరతుఁడు. మాతులుఁడు=మేనమామ, ఘనతర సత్కారములను=మిగుల గొప్పవైన బహుమానములచే- తమిన్ = కుతూహలముచే- అపేక్షచే-

అన్వయక్రమము

ఘనతరసత్కారములను గావించుచు లాలనమొనరింపఁగ నతఁడనయముఁ దమిభ్రాతతోడ నటనుండెన్. కాకాక్షిన్యాయముచే ననయముఁ దమి రెండు శబ్దముల తోడ నన్వయించును.

తాత్పర్యము

1. తన కన్నకుమారునివలె మేనమామ మిక్కిలి యపేక్షతో దినదినము మంచి గుఱ్ఱము లోనగు బహుమానముల నిచ్చుచు లాలింపఁగా భరతుఁడు తన తమ్మునితో నట నుండఁగలిగెను.

2. అతఁడు అనఁగా శత్రుఘ్నుఁడు మేనమామయగు యుధాజిత్తు తన కన్న కుమారునివలెఁ జెల్లెలికుమారునికంటె నెక్కువ ప్రీతితో మిగులగొప్ప బహుమానము లిచ్చుచు లాలించుటవలన విడువని యపేక్షతో నన్నతోడ నుండెను.

శత్రుఘ్నుఁడు యుధాజిత్తిచ్చు బహుమానముల కాశపడి యందుండిన వాఁడుకాఁడు. భాగవతుఁడు భ్రాతయు తోడున్నాఁడుగదా యను నపేక్షచేఁ గేకయపురంబున నుండఁగలిగెను. భరతుఁడు నట్లె శత్రుఘ్నుఁడు తోడున్నాఁడు గదా యని యుండెను.

ఇచ్చట మఱియొక యన్వయము చెప్పవచ్చును. తనమాతులుఁడు శత్రుఘ్నుని సత్కారములచే ననయముఁదమి లాలించుటచే భరతుఁడచటనుండెను. భరతుని నతని మేనమామ సత్కారములచే ననయముఁదమి లాలించుటచే నాయన సుఖమే తన సుఖమనుకొని శత్రుఘ్నుఁడు భరతుతో నటనుండఁ గలిగెను.

## భాగవత పారతంత్ర్యము.

కర్మయోగము-జ్ఞానయోగము- భక్తియోగము- ప్రపత్తి- ఆచార్యాభిమానము అనునవియైదు ముఖ్య ముక్తి మార్గములు- వీనిలో కర్మమునకంటె జ్ఞానము ఆరెంటికంటె భక్తి శ్రేష్ఠమైనది. దానికధికారి కానివారికి దానికంటెఁ బ్రపత్తి శ్రేష్ఠమైనది. దానికంటె శ్రేష్ఠమైనది. యాచార్యాభిమానము. ఇదియే భాగవత పారతంత్ర్యము. ఇదియే పరకాష్ఠ-(కడపటి దిక్కు) దీనికి మించినది లేదని భక్తినిష్ఠుల యభిప్రాయము. భాగవత పరతంత్రునకు భగవంతుఁడును దనయాచార్యునకంటెఁ దక్కువవాఁడే. భాగవతునకు రెండవవాఁడు భగవంతుఁడు. అట్టులని భాగవత పరతంత్రుఁడు భగవంతుని నిషేధింపఁడు కాని భాగవత సేవకు భగవత్సేవ యడ్డము వచ్చెనేని భగవత్సేవనువదలి భాగవత సేవయే చేయును. కావున శత్రుఘ్నుఁడు శ్రీరామునివదలి భరతునివెంట నుండుట భాగవతానుగ్రహము సంపాదించు కొనినవానికి భగవదనుగ్రహము వచ్చునోరాదో యనువిచారము లేదు.

భగవంతుఁడు కోపించినవానిని సంజీవివలె భాగవతుఁడు రక్షింపఁ గలఁడు. భాగవతుఁడు కోపించినవానిని భగవంతుఁడు రక్షింపఁడు.

ఈ విషయమునఁ గొన్ని ప్రమాణవాక్యములు గలవు.

శ్లో. దుర్లభా భగవద్భక్తా, భావినో భువి మానవాః।
　తద్దర్శనా త్తదాలాపాత్, సులభం శాశ్వతం పదమ్.

భగవంతునియందు భక్తిగల పురుషులు దుర్లభులు. వారి దర్శనము చేతను వారితో సంభాషించుటచేతను మోక్షము సులభము.

శ్లో. మమ మద్భక్త భక్తేషు, ప్రీతి రభ్యధికాభవేత్
　తస్మాన్మద్భక్త భక్తాశ్చ, పూజనీయా విశేషతః.

నా భక్తులయందు నాకుండు ప్రీతికంటె నా భక్తులయందు భక్తిగల వారిపై నాకుఁబ్రీతిమెండు. కావున నాభక్త భక్తులే విశేషముగఁ బూజింపఁబడఁ దగినవారు.

శ్లో. సిద్ధిర్భవతి వా నేతి, సంశయోచ్యుత సేవినామ్.
　న సంశయోత్ర తద్భక్త, పరిచర్యారతాత్మనామ్.

భగవద్భక్తులకు మోక్షసిద్ధికలదోలేదో సందేహమే. కానియాయన భక్తుల సేవించువారి విషయమున సందేహములేదు.

శ్లో. కేవలం భగవత్పాద, సేవయా విమలంమనః
న జాయతే యథానిత్యం తద్భక్త, చరణార్చనాత్.

నిత్యము భక్తపాదసేవచే మనస్సు నిర్మలమైనట్టు భగవత్పాదసేవచేఁగాదు

శ్లో. ఆరాధనానాం సర్వేషాం, విష్ణోరారాధనంపరమ్
తస్మాత్పరతరం ప్రోక్తం, తదీయారాధనం పరమ్.

అందఱ యారాధనలకంటె విష్ణునారాధనము శ్రేష్ఠము, దానికంటె నాయన భక్తుల నారాధించుట శ్రేష్ఠము.

శ్లో. తస్యయజ్ఞవరాహస్య, విష్ణోరమిత తేజసః
ప్రణామం యేపి కుర్వంతి, తేషామపి నమోనమః.

అయజ్ఞవరాహమూర్తియగు విష్ణునకు నెవరు నమస్కరింతురో వారికిని మరల మరల నమస్కరించెదను.

శ్లో. పశుర్మనుష్యః పక్షీవా, యేచవైష్ణవ సంశ్రయాః
తేనైవతే ప్రయాస్యంతి, తద్విష్ణోః పరమం పదమ్.

విష్ణుభక్తులనాశ్రయించియుండు పశువులుగాని మనుష్యులుగాని పక్షులు గాని యాయన యభిమానము చేతనే విష్ణుమూర్తియొక్క పరము పదము నొందుదురు.

శ్లో. వందే నందవ్రజస్త్రీణాం, పాదరేణు మభీక్షశః.

'యాసాం హరికథోద్గీతాం, పునాతి భువనత్రయ'మ్మనికదా యుద్ధవుఁడు తలంచెను. ఎవరి హరికథలు ముల్లోకములను పావనము చేయుచున్నవో యట్టి గోపికల పాదరేణువులకు నమస్కారము.

గీ. పరమభాగవతుల పాదధూళి సమస్త। తీర్థసారమనుచుఁ దెలియలేని,
వారివారివారి, వారిఁజేరినవారిఁ, దొలుతఁగట్టి తెండు దూతలార.

గీ. పద్మనయనుమీఁది భక్తియోగంబెల్ల ముక్తియోగమనుచు మునుదెలియని
వారి, వారి, వారిఁ వారిఁజేరినవారిఁ త్రోవఁబోవవలదు దూతలార,

శివక్రోధాద్గురుస్త్రాతా, గురుక్రోధాచ్ఛివోనహి। తస్మాత్సర్వ ప్రయత్నేన, గురోరాజ్ఞాం నలంఘయేత్.

శివుఁడు కోపించినచో గురువుకాపాడును,గురువుకోపించినవానిని శివుఁడు కాపాడలేఁడు. కావున గుర్వాజ్ఞ మీఱరాదు.

ఇత్యాది ప్రమాణము లనేకములుగలవు.

కం. అచ్యుత నుండియు నిచ్చలు, నెచ్చినసుఖసంతతులను•నెలమిం గనుచున్
నిచ్చలు స్మరించు చుండిరి, సచ్చరితులు దశరథేశు•జనకున్ వృద్ధున్. ౪

ఎలమిన్=సంతోషమును, నిచ్చలు=ఎల్లప్పుడు, నిత్యశబ్దభవము నిచ్చ-నిచ్చలు, కనుచున్=పొందుచుండియును.

తాత్పర్యము

అచ్చటనుండియుఁ దమ కిష్టమైన సుఖములకంటె నెచ్చుసుఖముల ననుభవించి సంతోషించుచుండియును, సాధువర్తనులయిన భరత శత్రుఘ్నులు ముసలివాఁడును దండ్రియునగు "దశరథరాజు ముసలివాఁడాయెనే, రాజ్యభారము వహింపలేఁడే. రామచంద్రుని యువరాజుగా నింకనుజేయలేదేల? మన మాయన సేవచేయుటకు లేక పోయెనే" యని యెల్లప్పుడు తలఁచుచుండిరి.

కం. కోసలధరణీశుఁడు ప్ర,వాసుల నిజసుతుల శక్ర•వరుణోపములన్
భాసురతేజుఁడు గ్రైకే, యీసుతశత్రుఘ్నుల నెద•నెప్పుడుఁ దలఁచున్.౫

అక్కడవారి మనోగతులు చెప్పి యిక్కడ దశరథుని స్థితి చెప్పుచున్నాఁడు

అర్థము.

ప్రవాసుల=దూరదేశమందున్న వారలను, నిజసుతులన్=తన కుమారులను, శక్రవరుణోపములన్=బలమునందును స్నేహమందును ఇంద్రవరుణులతో సమానులై యొక్క రొకరొక్కొక దిక్కు నేలగల సామర్థ్యముగలవారిని.

తాత్పర్యము

కొడుకులవలన నత్యధిక తేజోవంతుఁడైన దశరథుఁడు దూరదేశమందున్నట్టియు బలమునందుఁ బరస్పర మైత్రియందు నింద్రవరుణులను బోలునట్టియుఁ దన కొడుకులను భరతశత్రుఘ్నులను దనమనస్సున సర్వదా సర్వసంపద లుండియు వా రిరువురు నాయొద్ద లేకున్నారుగదా యని తలంచుచుండెను.

కం. తనయెడలన జనియించిన, ఘనబాహుచతుష్క మనఁగ•శ్మానాథునకున్
దనయులు పురుషర్షభు లెద,ననువున నిష్టతము లైరి•నల్వురు మిగులన్.౬

అవతారిక-ఎదురుగానున్న రామలక్ష్మణులకంటె భరతశత్రుఘ్ను లెక్కువ ప్రియులగుటచే వారిని స్మరించుచున్నాఁడను సందేహము కవి దీర్చుచున్నాఁడు

తనయెడలన=తనదేహమందే-ఘనబాహు చతుష్కమనఁగ = గొప్పనగు నాలుగుచేతులో యనునట్లు-పురుషర్షభులు=పురుషశ్రేష్ఠులు-ఇష్టతములు=మిక్కిలి యిష్టులు.

దశరథుని నాలుగుచేతులుగలవానితోఁ బోల్చుటచే విష్ణురూపకధ్వని.

తాత్పర్యము

తన దేహమందే పుట్టిన నాలుగు పెద్దచేతులవంటివారై పురుషశ్రేష్ఠులైన నలువురు కుమారులు మిగుల నిష్టులగుటచేత నాలుగుచేతులలో రెండుచేతులు తొలఁగిన నెట్లు కొఱఁతదోఁచునో యట్లులందఱు నిష్టులైనను నిరువురు సమీపమందు లేమి కొఱఁతగాఁ దోఁచుచుండెను.

—• శ్రీరామచంద్ర కళ్యాణగుణవర్ణనము. •—

ఉ. అందఱిలోన రాముఁడు మ•హాత్ముఁ డనుత్తమ తేజుఁ డెంతయున్
దందడిప్రీతిఁ గూర్చుఁ దన•తండ్రికి భూతములన్ విధాతృన
చ్ఛందమునన్ గుణాఢ్యుఁ డయి;•సస్మయు రావణుఁ జంప దేవతా
బృందనుతిన్ సనాతనుఁడు•విష్ణువు దోఁచె ధరన్ నరాకృతిన్. ౬

స్మరణమం దందఱను సమానముగాఁ దలచుచుండినను శ్రీరామచంద్రు నకుఁదక్కినవారికిఁ గుడిచేతికిఁ నెడమచేతికిఁగల తారతమ్యము గలదని చెప్పుచున్నాఁడు.

అందఱిలోనన్=నలువురుకుమారులలో- మహాత్ముఁడు = గొప్పమనస్సు- గొప్ప స్వభావము గలవాఁడు. అనుత్తమతేజుఁడు=దేనికంటె నుత్తమము లేదో యది యనుత్తమము-అట్టి తేజముగలవాఁడు. దందడిప్రీతి = తఱచగుప్రీతి; భూతములన్=ప్రాణికోటులందు-విధాతృ నచ్ఛందమునన్ = బ్రహ్మదేవునివలె- విధాతృ + అచ్ఛందము-విధాతృ నచ్ఛందము. షష్ఠిసమాసమం దుకారఋకార ముల కచ్చుపరం బగునపుడు నుగాగమము. గుణాఢ్యుఁడు= గుణసంపదగల వాఁడు. తనతండ్రికి భూతములన్ విధాతృనట్లు. దందడిప్రీతిఁగూర్చున్= భూతకోటులందుఁ దనతండ్రియగు విష్ణువునకుఁ బ్రథపుత్రుఁడగుటచే బ్రహ్మ యెట్లు ప్రీతిఁగూర్చెనో యట్లనిభావము, 'ఆత్మనః ప్రథమం పుత్రం బ్రహ్మాణ మసృజత్ప్రభుః తతశ్చరాచరం విశ్వం విష్ణుర్విశ్వజగన్మయః॥అనుశాసనికము. లేదా. బ్రహ్మ తనతండ్రియగు విష్ణువునందుఁ దనతోడఁ బుట్టినభూతము లందు నెట్లు ప్రీతిగలవాఁడయ్యెనో యట్లు రామచంద్రమూర్తియుఁ దనతండ్రి విషయమందును దోడఁబుట్టినవారి విషయమందును బ్రీతిగలవాఁ డయ్యెను. సస్మయున్=గర్వముతోగూడిన వానిని- దేవతాబృందనుతిన్ = దేవతాసమూహ ముల స్తోత్రము కారణముగ;సనాతనుఁడు=నిత్యుఁడుశాశ్వతుఁడు అజుఁడునగు విష్ణువునరాకృతిన్=మనుష్యాకారమున-ధరన్ = భూమియందు-తోఁచెన్ = కాన వచ్చెను.సస్మయు రావణుననుటచేఁ బుట్టుతోడనే వచ్చిన స్వభావగర్వముచే లోకమునంతయు హా హా యన నేడ్పించువానినని భావము. రావణున్-అనుటచే వేరుతెగఁగొట్టిన జెట్టంతయుఁ జచ్చునట్లు రావణునొకని జంపిన రాక్షసులందఱుఁ జచ్చినవారే యనిభావము. రాక్షసులనందఱను జంపుమని కోరినఁ గార్య బాహుళ్యముతోఁచునని లాఘవము దోఁచుటకై యొకనిపేరు చెప్పిరని భావము దేవతాబృందనుతిన్=దేవతలు నీవట్టివాఁడ విట్టివాఁడని నోటమాటల స్తుతించిరే కాని యుపాసన చేసి వారునుగారు. అదియు నాత్మార్థమై చేసినవారుకారు. ప్రయోజనానంతరపరులై చేసిరి. అట్లు చేసినను విష్ణువు మనుష్యాకృతిని భూమియందుఁ దోఁచెను. ఎట్టి విష్ణువు ? సర్వవ్యాపకుఁడైన విష్ణువు. పుట్టువు లేనివాఁడయ్యు నిత్యుఁడయ్యు మఱియొక విధముచే నేకదేశమున నున్నట్లు తోఁచెను. ఎట్లుతోఁచెను? తాను బురుషోత్తముఁ డగుటచే జీవులకంటె నుత్తముఁడయ్యు దేవతలకెల్ల దేవతయయ్యు దేవతలకంటె నికృష్టులయి

దేవతలు హేయముగఁ జూచు మనుష్యునకుఁగల యాకారము ధరించి తోఁచెను. ఎందుఁదోఁచెను? దేవతలు కాలనైనఁ దాఁకనొల్లక యోజనమెత్తున నుండు భూమియందు తోఁచెను. దీనివలన భగవంతుని సౌలభ్యము తెలియవచ్చును. తోఁచెను? ఎట్లుతోఁచెను. స్తంభమునుండి నృసింహమూర్తి యెట్లు తోఁచెనో యట్లు కౌసల్యనుండి తోఁచెను. గర్భవాసము చెప్పఁబడెనుగదా యందురేని స్తంభగర్భవాస మెట్టిదో యిదియు నట్టిదే. అయినను కౌసల్యాదశరథులకుఁ బూర్వము తా నిచ్చిన వరమునననుసరించి వారికి విశేషపుత్రవాత్సల్యముఁ గలిగించుటకై యందఱు శిశువులు తల్లుల గర్భములందుఁ దొమ్మిది పదినెల లుండినఁ దాను బన్నెండునెల లుండెను. ఇది భక్తవాత్సల్యము తెలుపు చున్నది. భక్తులు తన్ను మఱచినను భగవంతుఁడు దాను వారిని మఱవఁడు. తోఁచెననుటచేఁ బద్మముల వికసింపఁజేయును జగము ప్రకాశింపఁజేయును చీఁకటుల విరియఁజేయును సూర్యుఁడు తూర్పునఁదోచినట్లు కౌసల్యయందుఁ దోఁచెనని భావము. దీనివలన గర్భనరక వేదన ననుభవించు బద్ధజీవులవలెఁ గాక స్వతంత్రుఁడై తనయిచ్ఛకొలఁది స్వశక్తిచే స్వసంకల్పముచేఁదోఁచె నని యెఱుఁగనగు. తోఁచెననుటచే సూర్యుఁడు మనకుఁగానరాక ముందు ఎట్టి స్వరూపస్వభావములు గలవాఁడై యుండి యాస్వరూపస్వభావముతోనే మనకు గానవచ్చునో యట్లులే రామచంద్రమూర్తియుఁ దన పరత్వము విడువక లోకమునకుఁ గానవచ్చెనని భావము.

ఆ. అమితతేజుఁడైన ♦యాపుత్రకునిచేతఁ, గోసలేంద్రతనయ ♦కొమరుమీఱె
నమరనాథుఁడైన ♦యలవజ్రపాణిచే, హవణు మీఱి వెలుఁగు ♦నదితివోలె. ౪

కౌసల్యాసుప్రజారామా (బాల, ౧౮-౧౦) యనుచోట నెవనిని గను టచేఁ గౌసల్య సుప్రజ యయ్యెనో యని వ్రాయఁబడియెను. అది యిచ్చట విశదీకరింపఁబడుచున్నది.

అమిత తేజుఁడు=ఇంతమాత్రమని పరిమాణముఁ జెప్పసాధ్యముగాని తేజస్సుగలవాఁడు. అప్రమేయతేజుఁడు పుత్రకునిచేత=చిన్నకుమారునిచే-కోస లేంద్రతనయ=కౌసల్య, కొమరు మీఱె=మనోజ్ఞతచే నతిశయించెను.

అమరనాథుండు=దేవతల కధిపతి. వజ్రపాణిచే=ఇంద్రునిచే, హవణు= ఒప్పిదము.

తాత్పర్యము.

దేవతల కధిపతియైన ఇంద్రునిఁగాంచి యదితి యెట్లు శోభించెనో యట్టు లమిత తేజస్సుగల యాచిన్నికుమారుఁడగు శ్రీరాములచేఁ గౌసల్యాదేవి శోభించెను.

వామనునిచే నదితికలె నని యొకఁడు వ్రాసెను.

ఎట్లు లదితి వ్రతములు సలిపి వామనుని గాంచెనో యట్టులే కౌసల్యయు నవమీవ్రతము లోనైనవి గావించి రామచంద్రునిఁ గాంచెను. వామనుఁడు దేవ

తలకు రక్షకుఁడయ్యెను. రామచంద్రమూర్తి మానవులకు రక్షకుఁడయ్యెను.

కం॥ అందమునన్ భుజవీర్యము. చందమున ననూయలేమి•జగతీస్థలి పై
నెందును బురిడింపఁగ రఘు,నందనుని మనోజవుం గ•నంబడఁ డొకఁడున్

ఏడవపద్యంబున గుణాఢ్యుఁడని చెప్పఁబడెను. ఇఁక నాగుణములెట్టివో వర్ణింపఁబడుచున్నవి.

ఇఁక శ్రీరామచంద్రమూర్తి కల్యాణగుణములే విశేషించి వర్ణింపఁబడును. మనుష్యులకుఁ దారకము ధర్మార్థకామములు గాదు. శుష్కజ్ఞానముగాదు. భక్తియే. అందు గుణవర్ణనము ముఖ్యము. శ్రవణ మననాదులు దీని ననుస రించి వచ్చునవియే కావుననే నారదమహర్షి వ్యాసమునికి "ధర్మముల్ ప్రవచించినఁ మెచ్చునే గుణవిశేషము లెన్నినఁగాక నీకు నీకొంచెము వచ్చుటెల్ల హరిఁగోరి నుతింపమి నార్యసన్నుతా." యని బోధించెను. అందమునన్=సౌందర్యమందు-భుజవీర్యము చందమునన్=కస్తూరి వాసనవలెఁ దాను వికార పడక యితరుల వికారపఱుచు శక్తిచే; పురిడింపఁగన్=పోల్పఁగ, మనోజవుం=తండ్రిని బోలినవానిని-"మనోజవసః పితృసన్నిభః" అమరుఁడు-మనోజవుఁడు మనోజవసుఁడు రూపాంతరములు. అసూయ=ఇతరుల గుణములందు దోష మారోపించుగుణము, జగతీస్థలిన్=భూమిమీఁద-'జగతీ రత్నగర్భాచ భూతధాత్ర్యబ్ధిమేఖలా' యని నిఘంటువు. భూమిమీఁద లేఁడనుటచే స్వర్గమం దట్టి కుమారుఁడు గలఁడని భావము. విష్ణువు=వామనమూర్తి, పురిండింపగన్, పురుడు+ఇంచు=పురిడించు, ఇత్వంబుగాని, యెత్వంబుగాని కూడుచో ననాద్యంబయిన యుత్వంబున కిత్వంబగు సు, వ్యా, క్రియ ౯౬ వందురు- అలందురు దీని కపవాదములు.

తాత్పర్యము

సౌందర్యము నందును భుజబలమునందును అసూయ లేకుండుటచేతను భూమియందు తండ్రిని బోలిన రామచంద్రునితోఁ బోల్చుటకు నొక్కఁడైనఁ గనరాఁడు.

క॥ ఎవ్వర యేనియుఁ దన్ను, న్నొవ్వం బలికినను దాను•నొడువఁడు కఱకుల్
నవ్వుచు మృదుపూర్వంబుగఁ,ద్రెవ్వనఁ బ్రతివచనమిచ్చుఁ•దిరముగుశాంతిన్

ఎవ్వరయేనియున్=ఎంతటి యల్పుఁడైనను-నొవ్వన్=మనస్సు నొచ్చునట్లు-కఱకుల్=పరుషపు వాక్యములు, నొడువఁడు=చెప్పఁడు, మృదుపూర్వంబుగన్=మెత్తనితనమే ముందు కానవచ్చునట్లు, త్రెవ్వనన్=చక్కఁగా, తిరము=స్థిరము.

తాత్పర్యము

తన మనస్సునకు నొప్పి కలిగింపవలయునను నుద్దేశముతో నెట్టివాఁడైనను గఠినముగ మాటలాడినను నిష్కారణముగ వీఁడిట్లు క్రోధమునకు వశపడియెఁగదా యెంత దుర్బలమైన మనస్సు గలవాఁడని చిఱునవ్వుతో వానికోపము తొలఁగి పోవునట్లు మెత్తనిమాటలతో, ముందు మెత్తగ మాటలాడి. వెనకఁ

గోపింపక, స్థిరమైన శాంతితో నాక్షేపమునకుఁ దగిన సరియైన సమాధానము చెప్పును.

కం॥ ఉపకార మేమిపనికే, నెపుడే నొకటి నొనర్పు•నెలమిఁ గను సదా;
　యపకారశతము సల్పిన, విపరీతము నెంచఁ డాత్మ•విజ్ఞుం డగుటన్. ౧౧

ఎలమి=సంతోషము-విపరీతము=వ్యత్యస్తము-ఆత్మన్=మనస్సునందు, విజ్ఞుండు=విశేషము తెలిసినవాఁడు.

ఉపకారమని యేకవచన ప్రయోగముచే నొక యుపకారమైనను అని యర్థము. శతము=శతం సహస్రమయుతం సర్వమానంత్య వాచకమ్మని-శత మనఁగా ననేకములని యర్థము. తాత్పర్యము

ఎట్టివాఁడైనను నెపుడైనను నేపనికైనను నెంత కొంచెమైనను నొకయుప కారము చేసినను నప్పుడు మాత్రమేగాక కలకాలము దానిఁదలచి సంతోష పడుచుండును. ఎవఁడైనఁ దన విషయమున ననేకాపరాధములు చేసినను విజ్ఞుఁడు కావున 'నకశ్చిన్నాప రాధ్యతి' తప్పు చేయనివాఁడు ధరణిఁగలఁడె కావున నెందఱనని దండింతును. క్షమించి రక్షించుట గొప్పతనముగానిశిక్షించు టేమి గొప్ప అది క్రోధ కార్యములకుఁ గారణమగునని క్షమావంతుఁడై వానిని గుఱించి విరుద్ధముగ మనస్సునందైనఁ దలఁపడు.

కీడునకు మఱుకీడు సేయుట గొప్పగాదు. కీడునకు మాఱుకీడు చేయ శక్తి లేక సహించి యూరకుండుటయు గొప్పగాదు. తన్ను దూషించిన వారిని మరల దూషించుటకు, కీడు చేసినవారికి మఱుకీడు చేయుటకు శక్తిసామర్థ్య ములు గలిగియు క్షమచే సహించి వారికి మేలే చేయుచు ప్రియములాడుట పుణ్యపురుషలక్షణము.

గీ॥ చెల్లియుండియు సైరణసేయు సతఁడు।
　　　　　　　　పేదవడియును నర్థికిఁ బ్రియముతోడఁ।
　దనకుఁగలభంగి నొసఁగు నతండు పుణ్య,
　　　　　　　　పురుషులని చెప్పి రార్యులు బుధవరేణ్య॥ భారతము.

తే॥ అతఁడు విలువిద్యఁ గఱచెడు నప్పుడైన, జ్ఞానవృద్ధవయోవృద్ధ•సజ్జనులును
　శీలవృద్ధులు నయినవి•శిష్టజనులుఁ•గూడ సత్సంప్రదాయంబు•గోష్ఠి జరపు

కఱచెడు=నేర్చుకొను, అప్పుడైనన్= అట్టిసమయమందుసహితము, విలు విద్యనభ్యసించు సమయమందు దృష్టియు మనస్సు లక్ష్యమం దుంచవల యునుగాని వానిని జెదరనీయరాదు. అట్టి సమయమందుఁ గూడ ననుటచే నితర సమయములందుఁ జెప్పవలసిన పనియేలేదని భావము కైముత్తిక న్యాయము. క్షత్రియులకు విలువిద్య కులవిద్య కావున బాల్యమునుండి యభ్యసింపఁబడును. విశ్వామిత్రుని వెంటబోయి తాట కను వధించు నప్పటికే కృతహస్తుఁడని చెప్పుటచే పంద్రెండేండ్లగు లేఁత ప్రాయమందే జ్ఞానశీల వయోవృద్ధులతోను సజ్జనులైన విశిష్ట జనుల

తోను సంభాషించి వారికిఁ దెలియని సత్సంప్రదాయములు నేర్పుచుండెను. జ్ఞానవృద్ధ=మోక్షధీర్జ్ఞానమ్మని యుండుటచేఁ బరిపక్వమోక్షవిషయులని యర్థము వయోవృద్ధ=వయస్సుచే ముసలివారైనవారు, శీలవృద్ధులు=సదాచార సంపన్నులు, సజ్జనులు=సాత్త్వికులైన సాధువులు, ఈ పదమును బైమూఁటితోను నన్వయింపవలెను. జ్ఞానవృద్ధులయిన సజ్జనులు, వయోవృద్ధులయిన సజ్జనులు, సజ్జనులగు శీలవృద్ధులని యర్థము. జ్ఞానము వయస్సు శీలముండియు సాధుత్వము లేదేని వ్యర్థము. అట్టివారు రాము సన్నిధికిఁ బోవ నర్హులుగారు. విశిష్ట జనులనుటచే నన్నివర్ణములవారు నన్ని యాశ్రమములవారు పోవుచుండిరని భావము. గోష్ఠి=సంభాషణము. సత-విలువిద్య కఱచెడు సప్పుడైనన్=అనుటచే నల్పకాలమైనను సజ్జనసాంగత్యములేక రామచంద్రమూర్తి యుండెడి వాఁడు కాఁడు.

## తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి విలువిద్య గుఱికొట్టుటకు నేర్చుకొనుసమయమందుఁగూడ జ్ఞానవృద్ధులగు సజ్జనులు వయోవృద్ధులైన సజ్జనులు సదాచార సంపన్నులైన సజ్జనులు జ్ఞానశీల వయోవృద్ధులు శీలజ్ఞానవృద్ధులు జ్ఞానవయోవృద్ధులు శీలవయోవృద్ధులు మొదలైన వారందఱు జనులు రాఁగా నిప్పుడు సమయముగాదు ఆవలరండు. ఇప్పుడు పొండనక తన యభ్యాసము తాను జేయుచునే జ్ఞానశీలాదులందు వారికి వారికిఁగల సందేహములు దీర్చి సత్సంప్రదాయము నేర్పుచుండెను.

కొందఱు లక్ష్యము మీఁద దృష్టి మనస్సుంచిరేని నితరుల ప్రశ్నములకు సరియైన ప్రత్యుత్తరము లియ్యఁజాలరు. ప్రత్యుత్తరము లొసఁగువారు గుఱికొట్టలేరు. అర్జునునివలెఁగాక రామచంద్రమూర్తి రెండు నేకకాలమున జేయ సమర్థుఁడని భావము.

సందేహము:— పెద్దలతో గోష్ఠి సల్పునని చెప్పెనుగాని పెద్దవారికి నేర్పుటకని కాదుగదా. కావున వారివలన నేర్చుకొనుటకని యేల చెప్పరాదు? అని సందేహము. దీనికి భరతవాక్యము. పద్యము ౨౫౨ ప్రత్యుత్తరము.

కం. ఎఱుకగల పెద్దలకు వా, రెఱుఁగని యవి చెప్ప నీవె యెఱుఁగని యట్టుల్ ।
గుఱుకొని సందియ మడిగెదు । కొఱలే కవ్వారికెఱుక గూర్చెడి వాంఛన్.

రామచంద్రమూర్తి బాలుఁడు. బ్రాహ్మణాదులు పెద్దలు. వారు బాలుని యొద్దకు బోధ నిమిత్తమై రావచ్చునా యనిన "గుణాః పూజ్యస్థానం గుణిషు నచ లింగం నవయః" పూజ్యస్థానము గుణవంతులయందలి గుణములుగాని స్త్రీ పురుష చిహ్నములు గావు. వయస్సుగాదు. ఉత్తరరామచరిత.

కం. తియ్యనిపలుకులు ప్రియముగ,
నెయ్యెడఁ దా మున్న పలుకు; నెసఁగినబలిమిన్
గ్రుయ్యించుఁ బరుల; ధీయుతుఁ,
డయ్యుత్తమశక్తి కెద నహంకృతిఁగొనఁడున్.

గ్రుయ్యించున్=పరాజయము నొందఁజేయును, పరులన్=శత్రువులను.

ఏసమయమందైన నను నెంతటి నీచుఁడైననుఁ దన దర్శనమునకు వచ్చె నేని తానే ముందుగా నెవ్వరవయ్యా యేల వచ్చితివని తియ్యని మాటలు ప్రియము కనఁబఱుచుచు మాటలాడును. తన బలముచేత శత్రువులు వెనుదీయు నట్లు చేయును. బుద్ధి విశేషముగల రామచంద్రమూర్తి సర్వదా లోకులకు నేమి మేలుచేయుదునా యని యాలోచించుచుండును. ఉత్తమ శక్తిచే లోకుల కెంత మేలుచేసియు నన్నాశ్రయించి యుండువారికి నేనేమి మేలు చేసితిని. ఏదో కొంచెము చేసితినిగాని నేను జేయఁగలిగినంత చేయకున్నాను గదా యని యాలోచించు చుండునుగాని నేనింత చేసితినిగదా యని పొగరు పడఁడు.

కం. దబ్బఱ లాడఁడు గొలుచు, న్నిబ్బరమునఁ బండితులను • నెఱపుదునళ్ళన్
ప్రబ్బినతమి జనులకు ముద, ముబ్బించుఁ బ్రజానురాగ • యుక్తుఁడు
బుధుఁడున్.

తాత్పర్యము

అసత్యము పలుకఁడు. రాముఁడు రెండు మాటలవాఁడు కాఁడన్నట్లు ముం దొకమాట వెనుక నొకమాట చెప్పఁడు. జ్ఞానులను వృద్ధులను నిబ్బరముగ సేవిం చును. అతిశయించు నపేక్షచే జనులకు సంతోషమే యతిశయించినట్లు చేయు చుండును. ప్రజల యనురాగముతోఁ గూడినవాఁడు. ఇట్లు రాముఁడు ప్రజ లన్యోన్యాను రాగముగలవారై యుండిరి.

చం. కరుణ గలండు, లోపఱుపఁ • గల్గెను గ్రోధము, బ్రహ్మవిన్మహి
సురతతిఁ బూజలం దనుపు, • గ్రుక్కినవారికిఁ బొక్కఁ ద్రోచు, ధ
ర్మరతుఁడు, పాయఁ డెందు నియ • మంబు, సదా శుచి, వంశవృత్తమా
దరమునఁ జల్పు నెప్పుడు, స్వ • ధర్మము క్షాత్రము గౌరవించెడిన్. ౧౫

పరుల దుఃఖము తనదుఃఖముగా నెంచువాఁడు, క్రోధము రమ్మన్నప్పుడు మాత్రమే వచ్చునట్లు తనకు వశపడియుండఁ జేసికొనినవాఁడు, వేదవేత్తలయిన బ్రాహ్మణులను బూజించువాఁడు, వ్యసనముచేతనో కష్టము పాలగుటచేతనో చిక్కుపడినవారి విషయమై తాను బరితాప పడుచు నంతతో నూరకుండక ఎక్కడ నది తెలియవచ్చునో యచ్చటనుండియే వారిని రక్షించువాఁడు, సామాన్యధర్మ విశేష ధర్మములందుఁ బ్రీతిగలవాఁడు, శరణాగత రక్షణమును తన నియమ మేకాలమందు నేసందర్భమందును వదలఁడు. లోపల వెలుపలఁగూడ నెప్పుడు కామినీకాంచనములందు నిర్మలుఁడు. వంశాచారము ప్రీతితో నెప్పుడు చలుపును. గుణవంతమైనను గాకున్నను క్షాత్రగుణము స్వధర్మమగుటచే దాని గౌరవిం చును. క్షాత్రము దుష్టశిక్షణ పూర్వక ప్రజాపాలనము.

ఉ. దాన లభించుసద్యశము • తప్పక స్వర్గఫలప్రదాయిగాఁ
దా నెద నెంచు, భద్రరహి • తం బగుకార్యముపొంతఁ బోఁడు, వి

ద్యానిధి, ప్రొద్దుపోకకయుఁ ధర్మవిరుద్ధకథాభిలాషి గాఁ
డూనిక నుత్తరోత్తరసుయుక్తుల గీష్పతివోలె వక్తయౌ. ౧౬

దానన్=స్వధర్మమును రక్షించుటచేత, స్వర్గ ఫలప్రదాయిఁగా = మోక్ష సిద్ధినే కలిగించునదిగాఁదలంచువాఁడు. తమతమ జాతిధర్మములందుఁ బ్రీతిగల వాఁడు మోక్షమును గాంచును. స్వధర్మమును గౌరవించు, ననుటచేఁబరత్వ మాపాదించు గుణములకంటె క్షత్రియ జాతియందుఁబుట్టిన కారణముచే దానినే యెక్కువగఁ దలఁచువాఁడు. దీనివలనఁ గులధర్మము విడువకయే మోక్షధర్మ మనుష్ఠింపవలయు నని యేర్పడుచున్నది.

స్వధర్మానుష్ఠాన మపరిత్యాజ్యము. అది శ్రేయస్కరమని శ్రేయస్కరధర్మ మని శ్రీరామచంద్రమూర్తి స్వానుష్ఠానముచే స్థాపించెను. దీనినే శ్రీకృష్ణమూర్తి యి ట్లుపదేశించెను. 'శ్లో॥ స్వధర్మమపి చావేక్ష్య,నవికంపితుమర్హసి॥ స్వధర్మమని యాలోచించియైనను నీవుక్షత్ర ధర్మమునుండి చలింపఁదగదు. "శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్। స్వధర్మేనిధనంశ్రేయః। పరధర్మోభయావహః॥ స్వధర్మము గుణహీనమయినను జక్కఁగా ననుష్ఠించు పరధర్మమునకంటె శ్రేష్ఠమైనది స్వధర్మమందు మరణించుట మేలు. పరధర్మము భయంకరము. 'స్వేస్వేకర్మణ్యభిరతః సంసిద్ధింలభతేనరః' తనతన కర్మములందు నాసక్తిగల మనుష్యుఁడు మోక్షమును బొందును.

"స్వభావనియతం కర్మ, కుర్వ, న్నాప్నోతికిల్బిషమ్" జన్మముచే లభించిన కర్మమునుజేయుటవలనఁ బాపములేదు. 'సహజంకర్మకౌంతేయ, సదోషమపి నత్యజేత్' జన్మముచేలభించిన కర్మము దోషయుక్తమైనను విడువరాదు.'యతః ప్రవృత్తిర్భూతానాం, యేనసర్వమిదంతతమ్। స్వకర్మణా తమభ్యర్చ్య, సిద్ధిం విందతిమానవః॥ ఎవనివలన నీభూతములకుఁ బ్రవృత్తికలిగెనో యెవనిచే సర్వ ప్రపంచము వ్యాపింపఁబడియున్నదో యట్టివానిని స్వకర్మముచేతనే యర్చించి మనుష్యుఁడు మోక్షమునొందుచున్నాఁడు.'సర్వవర్ణానాం స్వధర్మానుష్ఠానే పరమ పరిమితం సుఖమ్' అన్నివర్ణములవారికి స్వధర్మానుష్ఠానమందుఁబరమున నపరిమితము శ్రేష్ఠమునగు సుఖము గలదు. "యైస్స్వకర్మపరైర్నాథ,నరైరారాధితో భవాన్। తేతరంత్యఖిలామేతాం। మాయామాత్మవిశుద్ధయే. వి.పు. ౩-౩౦-౧౬ నాథా! స్వకర్మపరులై యెవరు నిన్ను నాత్మవిశుద్ధికొఱకు నారాధింతురో వారీ మాయ నంతయు దాఁటుదురు. 'స్వధర్మేవా, స్వవృత్తౌ వా పరీక్షణా' భార.౩౩-౭ స్వధర్మమందు స్వవృత్తియందు మంచిదా చెడ్డదాయను పరీక్షయేల ?

భద్ర రహితము=మేలులేనిది, ప్రొద్దుపోకకున్=కాలము గడుపుటకు,ధర్మ విరుద్ధ=ఇహధర్మమునకుఁగాని పరధర్మమునకుఁగాని విరుద్ధమైన, కథా = కథల యందు, అభిలాషిగాఁడు=కోరికగలవాఁడు కాఁడు. ఉత్తరోత్తరసుయుక్తులన్=

తాను|జెప్పిన యుక్తికి నెదుటివాఁడు మఱియొకటి చెప్పిన దానిని మించి మఱియొకటిచెప్పి తాను జెప్పినదే మంచిదని యెదుటివాఁ డంగీకరింపఁజేయును. దీనికి దృష్టాంతములు రామాయణమునఁ బెక్కులున్నవి. గీష్పతి=బృహస్పతి; వక్త=యుక్తియుక్తముగ మాటలాడువాఁడు, సుయుక్తులన్ = న్యాయ్యమైన యుక్తులచే, తన పంతమే గెలుపవలయునని కుయుక్తులు పన్నఁడు.

తాత్పర్యము.

కులోచితమైనక్షాత్ర ధర్మప్రకారము వర్తించుటచేఁగలుగుకీర్తియే స్వర్గఫల మిచ్చునదియని యెంచువాఁడు. ఇహపరలోక సాధకముగానికార్యము సమీపమున నైనఁబోఁడు, సర్వవిద్యలకు స్థానము. ప్రొద్దు పోవుటకై ధర్మవిరుద్ధములైన కథలు వినుటయందుఁగూడ నపేక్షలేనివాఁడు. వాదములయందు నెవ్వఁడును నెదుటివారి యుక్తిని మించి యుక్తులుచెప్పి తన యభిప్రాయమే సరియని యుక్తియుక్తముగ మాటలాడుటయందు బృహస్పతి ఎదుటివారికి న్యాయ్యమని తోఁచునట్లు చేసి కార్యము చేయునేకాని తానేమి చెప్పినను జేసినను సాగునని నాయిష్టము నేనిట్లే చేయుదును. ఇదియే సరియని చెప్పఁడు.

ఉ॥ రోగము లంట వెన్నఁడు, ని•రూఢబలాఢ్యుఁడు, దేశకాలముల్
బాగుగఁ దా నెఱుంగుఁ, నది•ప్రాయమువాఁడు, ప్రశస్తభాషుఁడున్,
జేగ గ్రహించుఁ బూరుషులఁ•జెచ్చెరఁ జూచినయంతమాత్రలోఁ,
జాగియు, నద్వితీయుఁ డని, • సాధుగుణంబున నిశ్చితుండునున్. ౧౬

నిరూఢ బలాఢ్యుఁడు=ప్రసిద్ధి కెక్కిన బలశాలి, చేగ=చేవ, చాగి=త్యాగి-దాత-అద్వితీయుఁడు. అసమానుఁడు, అనిన్ = యుద్ధమందు- 'రోగములంట వెన్నఁడు' ఇత్యాది వాక్యములచే "యువాస్యాత్సాధు యువాధ్యాయకః అశిష్ఠో ద్రఢిష్ఠో బలిష్ఠ" ఇత్యాది శ్రుతివాక్యములు ప్రతిపాదింపఁబడినవి. రోగము లంట వనుటచే నాధివ్యాధులు లేనివాఁడు, దీనిచే నాశిష్ఠార్థము చెప్పఁబడెను. అశిష్ఠుఁడు=అశన సామర్థ్యముగలవాఁడు; ప్రశస్తభాషుఁడనుటచే యువాధ్యాయకత్వము చెప్పఁబడెను. దేశకాలము లెఱుంగుననుటచే సాధుత్వము చెప్పఁబడెను. సాధుగుణంబునన్=అపకారులందును నెవఁడు సాధువో వాఁడు సాధువు అట్టి గుణము కలవాఁడు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి యాధిచేతఁగాని వ్యాధిచేతఁగాని బాధపడెడివాఁడు గాఁడు. బలవంతుఁడని ప్రసిద్ధికెక్కినవాఁడు. అధ్యయనాది కార్యములందు దేశము బలము చక్కఁగా నెఱిఁగినవాఁడు. యౌవనమం దుండువాఁడు. చక్కఁగ భాషింప నేర్చినవాఁడు. పురుషుల నొకసారి చూచిన మాత్రముననే వారి తెలివి బలమెంతో తెలిసికొనఁ గలవాఁడు. దానశీలుఁడు. యుద్ధమందు అసమానుఁడు అధికుడు లేనివాఁడు. నిజమైన సాధువని లోకులచేఁ బొగడఁబడువాఁడు.

తే॥ ఇట్టిమేలిగుణంబుల • కెల్ల తావు,రామచంద్రుండు జనమనో • రముఁ డగుచుఁ
ప్రజల కెల్లను వెలుపలి • ప్రాణ మయ్యె,రామరామాయటం ద్రవా • రతము వారు

తావు=తావు- ఇది యన్యదేశ్యము.

తాత్పర్యము

ఇట్టి గొప్ప గుణములకెల్ల నిలువ స్థానమై రామచంద్రుఁడు జనుల మనస్సులను రమింపఁ జేయువాఁడై వారికందఱకు బయటి ప్రాణమయ్యెను. కావున వారందఱు రాముని విడువలేక మఱచిపోక యుపేక్షసేయక, యెల్లప్పుడు రామారామా యనుచుందురు.

కం॥ వ్రతముల విద్దియలను నవ,సితమొనరిచి స్నాతుఁడగుచుఁ • జెలఁగెం,జదివెన్
శ్రుతులను సాంగములుగ, రఘు,పతి శస్త్రాస్త్రముల జనకు • పై చేయయ్యెన్.

అవసితము=ముగింపు, స్నాతుఁడు=స్నానము చేసినవాఁడు, సాంగములుగన్=అంగములతోఁగూడినట్లుగ,శస్త్రాస్త్రములన్=మంత్రము లేక ప్రయోగించు కత్తి,బాణములు పరశువులోనైనవి శస్త్రములు. మంత్రించి వైచునవి అస్త్రములు నారాయణాస్త్రము బ్రహ్మాస్త్రములోనైనవి,స్నాతకుఁడు=త్రయః స్నాతకాభవంతి విద్యాస్నాతకో వ్రతస్నాతకో విద్యావ్రతస్నాతకఇతి' హారీతస్మృతి. స్నాతకులు మూఁడు విధములవారుగలరు. విద్యాస్నాతకుఁడు=వేదధ్యయనము సాంతము చేసి వ్రతములు చేయనివాఁడు. వ్రతస్నాతకుఁడు=వ్రతముపూర్తిచేసి విద్య పూర్ణముగ నేరువనివాఁడు విద్యయు వ్రతములు పూర్ణముగఁ జేసినవాఁడు విద్యావ్రతస్నాతకుఁడు పరిణయానంతరమున నధ్యయనము పూర్తి చేయవచ్చును. శ్రీరాముఁడు విద్యా వ్రతస్నాతకుఁడు.

వేదములు నాలుగు ఋగ్వేదము యజుర్వేదము సామవేదము అథర్వణము. వీనియంగములు శిక్ష వ్యాకరణము ఛందస్సు నిరుక్తము జ్యోతిషము కల్పము. ఉపాంగములు. మీమాంస న్యాయశాస్త్రము పురాణము ధర్మశాస్త్రము జనకుపై చేయి అనుటచే దశరథుఁడు తక్కిన యందఱకంటె శ్రేష్ఠుఁడని భావము.

తాత్పర్యము

రామచంద్రమూర్తి వ్రతములను వేదాధ్యయనము పూర్ణముగఁజేసి స్నాతకుఁడయ్యెను. వేదములను నంగములతోడఁ జదివెను. శస్త్రాస్త్ర ప్రయోగజ్ఞానమందుఁ దండ్రిని మించెను.

సీ॥ వినుతసత్పథముగ • వెలయించె ధర మించ, జనకవంశంబును • జననికులము
సాధు వదీనుండు • సత్యోక్తి ఋజువర్తి, ధర్మార్థదర్శన • తత్పరు లగు
ద్విజులచే శిష్టు లౌ • వృద్ధులచే శిక్షి,తుండు త్రివర్గ వి • దుండు ప్రతిభ
నమరు లౌకికసమ • యాచారకృతకల్పుఁ,డును వర్తనసమర్థుఁ • డును నిభృతుఁడు
తే॥ సంవృతాకృతి,గలఁడు బా • సటయు;గుప్త,
మంత్రుఁడునమోఘమైనయ • మర్షహర్ష
ములను గల డార్జనవ్యయ • ములకుఁ దగిన,కాలములఁజక్కఁదెలిసిన • ఘనమనీషి

సత్కీర్తిమ=మంచికీర్తిగలది, అదీనుండు=దీనత్వము లేనివాఁడు, సాధువు=దోషములులేనివాఁడు. (౨) వేద ప్రామాణ్యము నంగీకరించువాఁడు, అదీనుఁడు=మనసు కలవర పెట్టుకారణములున్నను కలవరము నొందనివాఁడు, సత్యోక్తి=ఎటువంటి కష్టములందైనను నాత్మలాభమునకై యసత్యమాడనివాఁడు. ఇట్లను టచే ౧౧౨౩-వ పద్యమునందు సుమంత్రునకు నసత్యమాడనేర్పుట తండ్రి క్షేమమునకుఁగాన నసత్యముగాదు. ఇట్టులే సుందరకాండమందు సీతాదేవి హను మంతుని విషయమై చెప్పిన యసత్య మసత్యముఁగాదు. (చూ. ప. ౧౧౨౩), ఋజువర్తి=త్రికరణ శుద్ధిగల చక్కని నడవడిగలవాఁడు, శిక్షితుఁడు=నేర్పఁబడిన వాఁడు, త్రివర్గ విదుండు=ధర్మము అర్థము కామము ఇవి త్రివర్గమనఁబడును. ఇవి తెలిసినవాఁడు. అనఁగా వీని నాలోచింపవలసిన సమయము అనుష్ఠించు మార్గము వినియోగింపవలసిన విధానము తెలిసినవాఁడు. పూర్వాహ్ణమందు ధర్మము, మధ్యాహ్నమందు అర్థము, అపరాహ్ణమందు కామము నాలోచించి చేయువాఁడు. ప్రతిభ=సమయమునకుఁదగినట్లు క్రొత్తక్రొత్తగ వికాసము నొందు బుద్ధిగలవాఁడు, లౌకిక=లోకమే ప్రమాణముగాఁగలదియు, సమయ=సంకేతమే "స్యాత్సంకేతస్తు సమయ" అని యమరుఁడు. ఆచార = ఆచారమందు, కృత కల్పుఁడు=చేయఁబడిన సంస్థాపనముగలవాఁడు, వర్తనసమర్థుఁడు=ఆప్రకారము వర్తించుటయందు సమర్థుఁడు, నిభృతుఁడు = వినయముగలవాఁడు. "వశ్య ప్రణేయ నిభృత వినీతః ప్రశ్రితాస్సమా" యని యమరుఁడు. సంవృతాకృతి=గూఢమైన యాకారముగలవాఁడు. మనస్సునందు రహస్యమును ఇంగితాదు లచే వెలుపలికిఁదెలియనీక దాఁచు సామర్థ్యముగలవాఁడు. సహాయవాన్=సహాయులుగలవాఁడు, గుప్తమంత్రుఁడు=ఆలోచనలను దాఁచువాఁడు, అమోఘ మైన = వ్యర్థముగాని; అమర్ష హర్షములనుగలఁడు = కోపము సంతోషముగల వాఁడు, ఆర్జన=సంపాదించుటకు, వ్యయములకు=వెచ్చపెట్టుటకు, మనీషా=గొప్ప పండితుఁడు, మనస్ + ఈషా = మనీషా; పరరూప సంధి. ఇది శకంధ్వాదిగణ ములోఁ జేరినది. శకంధు రథకర్కంధుకుద్దాలో౽లర్కవర్ణితీ. లాంగలీషా హాలీ షాచ మనీషాచ పతంజలిః" ఇవి శకంధ్వాదులు. మనీషగలవాఁడు మనీషి.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు తన తండ్రి వంశమును తల్లి వంశమును లోకమున సత్కీర్తి ప్రసిద్ధిగలవిగాఁజేసెను, ఎట్టి దోషమునులేనివాఁడు. ఎట్టి సంకట సమయ మందును మనస్సున క్షోభచెందనివాఁడు సత్యసంధుఁడు ఋజువర్తనుఁడు. ధర్మార్థ విషయములను జక్కఁగాఁ దెలిసినవారును శిష్టులును ననుభవముగల పెద్దలునగు ద్విజులచే బోధింపఁబడినవాఁడు. ధర్మార్థ కామముల లక్షణము అవి యార్జించు మార్గములు వినియోగించు విధానములు తెలిసినవాఁడు. ఎప్పటి కప్పుడు వికసించు ప్రజ్ఞగలవాఁడు. లౌకికాచారములయు సమయాచారములయు

సంస్థాపనముగలవాఁడు. ఆ ప్రకారము నడుచుటయందును సమర్థుఁడు. వినయవంతుఁడు. తన మనస్సునందు విషయమును వెలికిరానరాకుండ దాఁచు నేర్పు గలవాఁడు. మిత్రసహాయసంపత్తి గలవాఁడు. అనుకొనినకార్యము సొంతమగు వఱకు తన ఆలోచనముల దాఁచువాఁడు. ఆర్జించు విధము వ్యయముచేయు విధము తెలిసిన గొప్పబుద్ధిమంతుఁడు.

సీ. దృఢభక్తియుక్తుఁ డు•స్థిరబుద్ధిగలవాఁడు,
దురుసుమాటలు నాల్క•తుదకుఁ దేఁడు
చెనఁటియర్థమునకుఁ•జెడుజనంబులకును, మమతసేయఁడు లేశ•మాత్ర మైన
మందుండుగాఁడు ప్ర•మత్తుండునుంగాఁడు, తనతప్పునొరుతప్పుఁ•దగ వెఱుంగు
శాస్త్రంబులను జక్కఁ•జదువరి మే లెంచు, గుణి పురుషాంతర•కోవిదుండు
తే॥ ప్రగ్రహానుగ్రహాదిస•త్పద్ధతులను; జరపు న్యాయంబుకొలఁది;వి•చక్షణుండు
మంచివారలఁ జేర్పుట•మనుచుటందు, శత్రునిగ్రహమునయందు•స్థానవిదుఁడు

దృఢ భక్తియుక్తుఁడు = దేవగురువులయందు నిశ్చల భక్తిగలవాఁడు. స్థిర బుద్ధి గలవాఁడు = అట్టి భక్తి తత్కాలమందు మాత్రముండునదిగాక స్థిర మైన బుద్ధితో సర్వదాయుంచువాఁడు, దురుసుమాటలు=దుడుకుతనపు మాటలు, నాల్కతుదకుఁదేఁడు=కొననాలుకతో నైనఁబలుకఁడు, చదువరి=పండితుఁడు.పురుషాంతరకోవిదుండు=పురుషులను జూడఁగనే వీఁడు సాధువు వీఁడసాధువు అను తారతమ్యము తెలిసికొనుటయందుఁబండితుఁడు. పురుషుల యంతరంగమును దెలిసికొనఁగలవాఁడు. ప్రగ్రహానుగ్రహములను, ప్రగ్రహ=మిత్రాదులను స్వీకరించుటయందును, అనుగ్రహ = స్వీకరించినవారిఁ బరిపాలించుటయందును, విచక్షణుఁడు=శాస్త్రమర్యాద నతిక్రమింపక మిత్రులననుగ్రహించుట- శత్రువుల నిగ్రహించు సమర్థుఁడు.

తాత్పర్యము

గురుదేవతాదులందు దృఢమైన భక్తిగలవాఁడు; అట్టి భక్తియందుఁజలనములేని స్థిర బుద్ధిగలవాఁడు. పరుషవాక్యమును నాలుక సమీపమునకైన రానీయఁడు. దుష్ట జనంబులందును జెడుకార్యములందును లవమైన నభిమానము లేనివాఁడు. శాస్త్రాధ్యయనమందు ఆ ప్రకారము కార్యములు చేయుటయందు సోమరికాఁడు కావుననే ప్రమాదము పడఁడు. లోకమునందుఁ గొందఱు పరుల తప్పు మాత్రమే తెలిసికొనఁజాలియుందురు. రామచంద్రమూర్తి తనదోష మెదిరి దోషముకూడఁ దెలిసికొనఁగలవాఁడు. కావుననేకదా "భరతుఁడు శిరస్సుచే నమస్కరించి యాచించినను నేనతని ప్రార్థనము కొనసాగించినవాఁడనుగాను" అని తన కఠినత్వమును జెప్పుకొనెను.సాంగవేదములుగాని శాస్త్రముల జ్ఞానమందుఁ బండితుఁడు ఒకరికి మేలునేయొంచు గుణముగలవాఁడు.మనుష్యుల ముఖములు చూడఁగానే వీఁడు దుష్టుఁడు వీఁడు శిష్టుఁడని తెలిసికొను సామర్థ్యముగలవాఁడు. ధర్మశాస్త్రము ననుసరించియే మిత్రులను జేర్చును. వారిని బాలించును.శత్రువుల నిగ్రహించును. ఇవన్నియు నెప్పుడెట్లు చేయవలయునో తెలిసినవాఁడు.

సీ॥ అర్జనమందు సు•హాయంబు గలవాఁడు, వెచ్చ మొనర్చును•విధిహితముగ
వ్యామిశ్రకముల శా•స్త్రావళిపట్టులఁ, గడు మేటి, ధర్మార్థ • కలన సుఖియు
నలసుఁడు గాఁడు వై•హారికంబులు శిల్ప,పను లెఱుగును నర్థ•భాగవిదుఁడు
ఏనుఁగు గుఱ్ఱంబు • నెక్కంగ నేర్చును, శిక్షింప నేర్చును జెనఁటివాని
తే॥ విల్లుపట్టెడివారిలో•నెల్ల శ్రేష్ఠుఁ, డతిరథులకెల్ల నిత్యస•మ్మతుఁడు ఘనుఁడు
తాన యభిముఖుఁడౌచు శా•త్రవుననంచు,
దండునడపింపఁజతురుఁడు•ద్దండగతిని.

వెచ్చ మొనర్చును విధివిహితముగన్=ఆయంబునందు నాలవభాగమొండె మూఁడవభాగమొండెఁ దదర్ధమొండె ననినట్లు వెచ్చించువాఁడు, విధివిహితముగన్=శాస్త్రపద్ధతి ననుసరించి, వ్యామిశ్రకములన్=సంస్కృత పాకృతాది భాషాత్మక నాటకాదులందు,శాస్త్రావళిపట్టులన్=న్యాయవైశేషిక వేదాంతాదిగ్రంథములందు, కడు మేటి=మిక్కిలి శ్రేష్ఠుఁడు. అర్థధర్మముల ననుసరించియే సుఖించునుకాని కేవల కామ పరతంత్రుఁడు గాఁడు. అలసుఁడు=మందుఁడు, వైహారికంబులు=విహార ప్రయోజనములైనవి. వినోదకార్యములు-శిల్పపనులు=శిల్పాలు చేయుపనులు. గీతవాద్యత్రములు చిత్రకర్మములు లోనైనవి- వాస్తుశాస్త్రము ననుసరించికదా చిత్రకూట పంచవటులయందుఁ బర్ణశాలలు నిర్మించుకొనిరి.అర్థభాగవిదుఁడు="ధర్మాయ యశసేర్థాయ, ఆత్మనే స్వజనాయచ, పంచధా విభజన్ విత్తమిహాముత్రచ శోభతే" యని ధనమును ధర్మము కీర్తి అర్థమునకును దననిమిత్తము స్వజనము నిమిత్తముగను నైదుభాగములు చేయువాఁ డిందునందును శ్రేయస్సుగనును అనునీతి ననుసరించి వర్తించువాఁడు. అతిరథులకెల్లన్=యుద్ధమందు నెదురులేని రథగమనము గలవారలకందఱకు,సమ్మతుఁడు = పూజ్యుఁడు-అభిముఖుఁడౌచు శాత్రవుననంచన్ = ముందు సేనలఁబంపుట యుద్ధముసేయుట ప్రజానష్టికిఁగారణమనియు, శత్రువులరాకకుఁగాచిగాని దుర్గాదులమూలమున యుద్ధము సేయుట కాని కాలవిలంబనమనియు తలఁచి తానే శత్రువున్నచోటికి నెదురుగాఁబోయి శత్రువుల నణఁచును.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి మాలకరి పూలుగోసెడి మాడ్కి- తుమ్మెదలు పుష్పములనుండి తేనెను గ్రహించువిధమున సంపాదింప నేర్చినవాఁడు- శాస్త్రపద్ధతి ననుసరించి దుర్వ్యయముచేయక యాదాయమందు నాల్గవభాగమో- మూఁడవభాగమో యాఱవభాగమో వెచ్చించువాఁడు.తర్కన్యాయ మీమాంసాది శాస్త్రములందును నాటకాది, జ్ఞానమందుఁ బ్రయోజనపడు విద్యలందును మిక్కిలి శ్రేష్ఠుఁడు.ధర్మము నర్థమునననుసరించిసుఖపడునేకాని కేవల కామమును గోరఁడు. అట్లు ధర్మము నర్థము నార్జించుటయందు మందుఁడు కాఁడు.విహారప్రయోజకములైనవానియందును గీతవాద్యత్రచిత్రరచనాది విద్యలందును,సమర్థుఁడు.ధనము నైదుభాగములుగ నెట్లు విభజింపవలయునో తెలిసినవాఁడు. ఎట్టి యేనుఁగుమ

గుణములైన నెక్కఁగలవాఁడు దుష్టులైనవానిని సాధువులుగఁ జేయు నుపాయము తెలిసినవాఁడు. ధనుర్వేదమును సమగ్రముగ నెఱిఁగినవారిలో గొప్పవాఁడు. అతిరథుల కందఱకుఁ బూజ్యుఁడు. శత్రువు నణఁచుటకై తానే వానియెదుటికిఁబోయి వానిని జయించును గాని వాఁడువచ్చువఱకుఁ గాచియుండఁడు. సేనల నంపఁడు. అయినను బనిపడినప్పుడు సేనల నడపించుటకు వ్యూహములఁ బన్నుటకు సమర్థుఁడు.

కం॥ ఏకునఁ బెనుఁగోపంబున, నాకౌకోఽసురచయంబు • లైనను దాఁకన్
 బీకాకువఱిచి తోలును,భీకరరణమున నజయ్య • విక్రముఁ డగుటన్. ౨౩

నాకౌకోఽసురచయంబు = నాక + ఓకస్ + అసుర చయము=నాకౌకస్ = దేవతలయు, అసుర=రాక్షసులయు, చయంబు = సమూహము, అజయ్య విక్రముఁడు = జయింపసాధ్యముగాని పరాక్రమముగలవాఁడు, అజయ్యుఁడు = జయింపసాధ్యముగానివాఁడు, అజేయుఁడు=జయింపయోగ్యుఁడుకానివాఁడు.

## తాత్పర్యము

యుద్ధమునందు దేవతలు రాక్షసులందఱు నేకమైయొక్కసారిగఁదాఁకినను బరాక్రమముచేతను గోపముచేతను నందఱుచెల్లాచెదరై పోవునట్లు పాఱఁదోలును.

బాలకాండముఁ బ్రథమ సర్గమందు వాల్మీకి నారదునడిగిన ప్రశ్నముల కన్నిటికిఁ బ్రత్యుత్తరము లీ సర్గమున నీయఁబడుచున్నవి. "కలన లీలనెవ్వండూన నాగ్రహంబు వణఁకు నమరతతియు" అని యడిగిన ప్రశ్నమునకిది ప్రత్యుత్తరము.లక్ష్యరూపక ప్రత్యుత్తర మరణ్యకాండము యుద్ధకాండము చెప్పుచున్నవి.

ఉ॥ కుందఁ డసూయచేత, జిత • కోపుఁడు, గర్వ మనంగ నెట్టిదో
 డెందమునం దెఱుంగఁడు, క • డిందిబలాఢ్యుఁడు నయ్యు దేని నే
 నిం దెగి మానముం గొనఁడు, • నిచ్చలుఁ గాలవశానుగత్వముం
 జెందఁడు మత్సరంబు మదిఁ • జేర్పఁడు, పొంగెడు నన్యవృద్ధికిన్. ౨౪

ఇంతవఱకు శ్రీరామునందుఁగల కల్యాణగుణములు చెప్పి యిఁక హేయగుణములు లేవని కవి చెప్పుచున్నాఁడు.

అసూయ = తనకంటె గొప్పవారిని జూచి సహింపలేక గుణము దోషముగాఁ జెప్పుట, కుందఁడు=దుఃఖింపఁడు, జితకోపుఁడు=కోపమును దనకు వశపఱుచుకొనినవాఁడు, డెందము=హృదయము,కడింది=మిక్కిలి యాశ్చర్యకరమైన,తెగి=సాహసించి,నిచ్చలు=సర్వదా,కాలవశానుగత్వముం జెందఁడు=(1)కాలమునకు వశుఁడై యుండువాఁడుకాఁడు; పదివేల సంవత్సరములు పదినూర్లేఁడులు ధర వసించెదనని కాలము తానే నిర్ణయించుకొనెనుగాని కర్మబద్ధులవలెఁగాలమునకు లోపడినవాఁడుకాఁడు (2) ప్రధానకాలానుగుణములైన సత్త్వరజస్తమస్సులకు లోపడియుండువాఁడుకాఁడు. అనఁగా శుద్ధ సత్త్వమూర్తి.మత్సరంబు=ఇతరుల మేలునందు ద్వేషము. 'మత్సరోన్యశుభద్వేష' యని యమరుఁడు.

తాత్పర్యము

శ్రీరామునకం దసూయలేదు. ఆయనయే రమ్మనినఁగాని కోపమురాదు. పొగరను నది యెటువంటిదో మనస్సునందైన నెఱుఁగఁడు. బలముచే నసాధ్య కార్యములను జేయఁగలవాఁడయ్యు నెవరినిగాని దేనినిగాని యవమానింపఁడు. శుద్ధ సత్త్వస్వరూపుఁడై ప్రకృతి గుణములకుఁ గాలమునకుఁ లోబడియుండు వాఁడుకాఁడు. ఇతరులు వృద్ధిపొందిన సంతోషించునుగాని ద్వేషింపఁడు.

కం॥ గీర్పతి బుద్ధిబలంబున, స్వర్పతి వీర్యమున క్షమను•క్షమ నిత్యము సం
తర్పిత భువనత్రయుఁడు న,హర్పతివంశ్యుండు పూజ్యుఁ•డన్ని జగములన్.

గీర్పతి=బృహస్పతి, స్వర్పతి=ఇంద్రుఁడు, క్షమ=భూమి, సంతర్పిత= సంతోషపెట్టఁబడిన, భువనత్రయుఁడు=మూఁడులోకములు గలవాఁడు, అహర్పతి వంశ్యుండు=సూర్యవంశమునఁ బుట్టినవాఁడు.

తాత్పర్యము

బుద్ధిని బృహస్పతిని, వీర్యమున నింద్రుని, నోర్పునందు భూమిని బోలు వాఁడు. ముల్లోకములను సంతోషపెట్టువాఁడు. సూర్యవంశమునఁ బుట్టినవాఁడై సూర్యునివలె నన్ని లోకములవారిచేఁ బూజింపఁబడువాఁడు.

కం॥ శాంతములై కరము ప్రజా,కాంతములై జనకహర్ష • కరములు నగుచున్
దాంతములౌ గుణముల దిన,కాంతుఁడు కాంతులను బోలెఁ•గడు రాజిల్లెన్.౨౮

కరము=మిక్కిలి, ప్రజాకాంతములై=జనులకు మనోహరములై, జనక హర్షకరములు=తండ్రికి సంతోషము కలిగించునవి, దాంతములు = ఇంద్రియ నిగ్రహములు గలవి, దినకాంతుఁడు=సూర్యుఁడు.

తాత్పర్యము

అంతరింద్రియ నిగ్రహము బాహ్యేంద్రియ నిగ్రహము కలవై జనులకు మిక్కిలి మనోహరములై తండ్రికి సంతోషకరములైన గుణములచే సూర్యుఁడు తన దీప్తిచేఁ బ్రకాశించునట్లు శ్రీరామమూర్తి మిగుల రాజిల్లెను.

ఈ పద్యమునందు శ్రీరామమూర్తికిఁ బ్రాధాన్యము చెప్పక యాయన గుణములకే ప్రాధాన్యము చెప్పఁబడెను. దినకాంతుఁడు=సూర్యుఁడు, సూర్య రశ్మిలేని దినము దుర్దినము. సూర్యరశ్మిగలదినము సుదినము. దినము(పగలు) మనోహరమగుటకుఁ గారణము సూర్యరశ్మియేకాని మబ్బుచాటుననుండు సూర్యుఁడు కాఁడు. అట్లులే శ్రీరామునందు సద్గుణములుండినను ప్రజాహితములై ప్రకాశింపవేని వ్యర్థములే. అట్టి రాముఁడుండినను లేకుండినను నొకటే. అట్లులే భగవంతుని జగద్వ్యాపార వర్జ్యమైన స్థితికంటె జగద్ధిత గుణప్రకోపముగల స్థితియే శ్రేష్ఠము. అనఁగా గుణవ్యాపార రహితమగుటచే నిర్గుణమని చెప్పఁబడు బ్రహ్మము స్థితికంటెఁ గల్యాణగుణవ్యాపారముగల సగుణస్థితియే శ్రేష్ఠము. గుడి

గుణముల కవినాభావ సంబంధము. గుణిలేక గుణములులేవు. గుణములులేని గుణిలేఁడు. కావున నిర్గుణుఁడనఁగా సృష్ట్యాదిగుణవ్యాపార రహితుఁడు. ఈ దిన మంతయు నెండలేదనిన సూర్యునందుఁ గిరణములు లేవని భావముగాదు. సూర్య రశ్మి భూమిమీఁదఁ బ్రకాశించునట్లు రామచంద్రమూర్తి గుణములచేఁ బ్రకాశించె ననుటచే సూర్యకిరణములు పక్షపాతము తారతమ్యము లేక సర్వత్ర సమముగా నెట్లు వర్తించునో యట్లే భగవంతుని గుణములు నని యెఱుంగవలయును. 'సమోహం సర్వభూతేషు' అని భగవంతుఁడు చెప్పెఁగదా.

శ్రీరామచంద్రమూర్తి తన గుణములచేఁ దండ్రిని బ్రజలను సంతోషపఱిచె ననుటచే రాజ్యభారము వహింప సర్వవిధముల యోగ్యుఁడని భావము. శ్రీరామ చంద్రమూర్తి గుణములకుఁ దండ్రి యెట్లు సంతోషించెనో యట్లే సమస్త ప్రజలు బాలుర వృద్ధులు స్త్రీలు పురుషులు సంతోషించిరని భావము.

తే॥ అనఘు నిట్టివ్రతాఢ్యుని • నప్రధృష్య,
విక్రముని రాము గుణధాము • వితతధాము
లోకపాలోపమునిఁ గోరెఁ • బ్రాకటముగ, వసుమతీకాంతదసకూర్చు • వల్లభుఁడుగ.

అనఘున్=పాపరహితుని, వ్రతాఢ్యుని=వ్రతములే సంపత్తిగాఁ గలవానిని, అనుటచే మీఁదఁజెప్పిన గుణములన్నియు శ్రీరామునిచే వ్రతములుగఁ బాలింపఁ బడుచున్నవనియు వ్రతభంగము దోషావహము గావున నట్టిదోషములు రాముని యందు లేవనియు నెఱుంగునది. అనఘు శబ్దమువలన నీయర్థము స్ఫురించు చున్నది. అప్రధృష్య విక్రమున్=తిరస్కరింపరాని విక్రమముగలవానిని, దోష రహితముగ నిన్నివ్రతము లెట్లు సాధింపఁగలిగెనన నప్రధృష్య విక్రముఁడగుటచే నని భావము. ఆయన సంకల్పించి పూనిన దానికి విఘ్నము కలిగింపఁజాలిన దేదియు లేదని తాత్పర్యము. రామున్=లోకులను వీరి వారి ననక యెల్లరును రమింపఁజేయుటే స్వభావముగాఁ గలవానిని, గుణధామున్ = అట్లు రమింపఁ జేయుటకుఁ గావలసిన సద్గుణములకు స్థానమైన వానిని, ధామము = ఇల్లు. కల్యాణ గుణములన్నియు వేఱొక చోటికిఁబోవుటకు నింతకంటె మంచిస్థానము దొరకమిచే నిందే స్థిరముగ వాసముచేయుచున్నవని తాత్పర్యము. వితత ధామున్=విస్తారముగ వ్యాపించియుండు కాంతిగలవానిని, లోకపాలోపమునిన్= లోకపాలురతో సమానుని, ఒకనిపేరుచెప్పక సామాన్యముగఁ జెప్పుటచే నింద్రాది లోకపాలుర యందుండు పాలన గుణములన్నియు నీయన యందుఁగలవు.

వసుమతీ కాంత=భూదేవి, అనఁగాఁ బ్రజలందఱనియు భూమిని నధిష్ఠించి యుండు దేవతయనియు నర్థము, కూర్చు=ప్రీతి కూర్చు, ప్రియుఁడైన వల్ల భుఁడు=ఇష్టుఁడైన భర్త, లోకపాలోపమునిన్, ఉప=సమీపమందుఁగల, మా= లక్ష్మిని గలవానినిన్, అనఁగా లక్ష్మివిశిష్టుని; సీతయే లక్ష్మి. సీతాసమేతునని యర్థము. లోకపాలాశ్చ అసౌ ఉపమశ్చ అని సమాసము. హ్రీశ్చతే లక్ష్మీశ్చ

పత్న్యౌ" అన్నట్లు శ్రీవిష్ణువునకు శ్రీభూదేవులు భార్యలు, కావున శ్రీయెట్లు రాముని స్వయంవరమున వరించెనో భూదేవియు నట్లేవరించెను. సీతాదేవి వరశుల్కయై పరాక్రమమునకై రాముని వరించెను.భూదేవి పాలనారూపక కల్యాణ గుణములఁజూచి వరించెను. కీర్తి యశస్సులు రెండు రాజునందుండవలసినవే. 'తపనీయదండైక ధవళాత పత్రితోద్దండ తేజఃకీర్తి మండలుండు' నైషధము, లోకమున నందఱు పురుషులు భూమిని దాము వరింతురు. ఈరాజ్యము నాకుఁ గావలె. ఈభూమి నాకుఁగావలెనందురు. కాని రాముఁడట్లు కోరినవాఁడు కాఁడు. భూదేవియే రాజ్యలక్ష్మియే శ్రీరామచంద్రమూర్తిని దనకు భర్తగా వరించెను. ఎట్టి భూదేవి ? వసుమతీకాంత-వసు+మతి = బంగారు విశేషించిగలది- అనగా మహాభాగ్యవతి-కాంత=మనోహర కాంతిగలది- అనఁగా సుందరి.మహాభాగ్యము సౌందర్యముగల యట్టి భూదేవి తానుగా శ్రీరామచంద్రమూర్తిని వరించెనని భావము. వల్లభుఁడు=ఇష్టుఁడు=ప్రియుఁడు.

## తాత్పర్యము

దోషరహితుఁడును; మీఁదఁజెప్పిన కల్యాణగుణములు వ్రతములుగాఁగల సంపన్నుఁడును ఇతరులచే మొక్కవోని విక్రమముగలవాఁడును, లోకులనెల్ల రంజింపఁజేయు స్వభావము గలవాఁడును **అట్టి** గుణములకు మందిరమైన వాఁడును- సర్వత్ర వ్యాపించిన ప్రకాశము గలవాఁడును లోకపాలురతో సమానుఁడును నగు శ్రీరామచంద్రమూర్తిని భూదేవియే తనకుఁదగిన ప్రియభర్తయని గ్రహింపఁ గోరెను.

## —• దశరథుఁడు రామచంద్రు యువరాజుఁ జేయ యోజించుట •—

చం॥ అతులిత తాదృశామలగుణాఢ్యుని బుత్రునిఁ గాంచి యెట్టు లేన్
ప్రతికియ యుండగా ధరణిపట్టముఁ గట్టఁ గలాఁడ వీనికిన్ ?
ముతుకఁడ నైతి వీనియెడ మోహము తద్దయుఁ బెద్ద నాకు. నే
గతి నభిషిక్తు రామువిభుఁ గాంతునొ యంచు విచారయుక్తుఁడై. ౨౮

అతులిత=అసమానమైన, తాదృశ=అటువంటి, గుణాఢ్యుని=గుణ సంపత్తి గలవానిని, ఏన్ = నేను.

## తాత్పర్యము

అసమానములైన లోకోత్తర గుణములచే సంపన్నుఁడైన కుమారునిఁజూచి దశరథుఁడు నేను జీవించియుండుకాలమందే వీనికేవిధముగా రాజ్యపట్టాభిషేకము చేయుదునో- నేనాముసలివాఁడనైతిని. వీనియందా నాకుఁ బుత్రమోహము విస్తరించియున్నది.పట్టాభిషిక్తుఁడైన రాముని నేను జూచుట యెట్లు గలుగునాయని మిక్కిలి విచారముతోఁ గూడినవాఁడై,విచారశబ్దమునకు ఆలోచించు సంతాపించు అని రెండర్థములు గలవు. రామునకుఁ దాను బట్టాభిషేకము చేయకయే మరణించుట గలిగెనేని కైకకిచ్చిన వరమును బట్టి తన కత్యంత ప్రియపుత్రుఁడైన

రామునకు రాజ్యము లేకపోవునే యని సంతాపము. తాను జీవించి యుండఁగానే పట్టాభిషేకము చేయుటకు నదుపాయమేది? ఈవార్త తెలిసిన భరతుని పక్షమున కేకయరాజు మొదలగువారు ముందు నీవిచ్చిన వరము ప్రకారము భరతునకు రాజ్యమిమ్ము రాముని కెట్లిచ్చెదవని వచ్చి నిర్బంధింతురేమో- అట్లు వారు వచ్చిరా తనయుల్లుని పక్షమున జనకుఁడు కౌసల్య పుట్టినింటివారు వత్తురేమో- వారికి వీరికిఁ గలహము జరుగునే- నేనెవరి కేమి చెప్పుదును ఇరువుర నడుమ నేను జెడిపోదునేమో-యిట్లుగాకుండ నేయుపాయముచేత రామునకుఁ బట్టాభిషేకము చేయుదునా యని యాలోచన- కార్యము ముగిసిన తరువాత నెవరేమి చేయునది యుండదు. మించిన దానికి వగచి ప్రయోజనము లేదని యూరకుందురు. ఒకవేళఁ గలహమునకు వచ్చినను రామలక్ష్మణులే వారికి బ్రత్యుత్తరమీయఁ గలిగియుందురు అని యాలోచన.

ఉ॥ ఈతని రాజుఁ జేయుటయె•యెంతయు నిష్టతమంబు, లోకసం
ఘాతమువృద్ధిఁగోరు, జన•కాండముపై ననుకంప మెందు, వి
ఖ్యాతిగ వృష్టిమంతుఁడగు•నంబుదవాహుఁడు వోలె లోకులం
బ్రీతులఁ జేయుచుండుఁ, గడు•మెచ్చుదు నాయెడకంటె వారికిన్. ౨౯

సంఘాతము=సమూహము, కాండము=సమూహము. అనుకంప=దయ, వృష్టిమంతుఁడు=వర్షము నిచ్చువాఁడు, అంబుదవాహుఁడు = వర్షాధిదేవతపర్జన్యుఁడు-మేఘ వాహనుఁడు.

## తాత్పర్యము

ఇప్పుడే శ్రీరాముని రాజుగఁ జేయుదునా వలదా? చేసినమేలా చేయకుండిన మేలా? యని యాలోచించి యాలోచించి రాజును జేయుటయే మిగుల నిష్టమైన కార్యము- ఏలన-రాజగువాఁడు ప్రజలవృద్ధి గోరువాఁడై యుండవలయును. అట్టికోరిక వీనియందుఁ గలదు. ఉత్తకోరిక యుండుటయేకాదు. దానిని బ్రజలయందు దయగలవాఁడై కార్యరూపముగఁ బర్జన్యదేవుఁడు తగిన యదనునఁ దగినంత వర్షము గురియఁజేసి లోకులను బ్రీతులఁ జేయునట్లు రామచంద్రుఁడును జేయుచున్నాఁడు. నేనుమాత్రము చేయకున్నవాఁడనా యందునేని ప్రజలు నాయందుండు ప్రీతికంటె వీనియందు నెక్కువ ప్రీతికలవారై వీనిని మెచ్చుకొన్నారు. ఇట్టివాఁడేకదా ప్రభువు గాఁదగినవాఁడు. 'పుత్రాదిచ్ఛేత్పరాజయ'మ్మన్నట్లు లోకములో నందఱును దాను మించవలయును. తనకొడుకు తన్ను మించినవాఁడుగా నుండవలయునని తండ్రి కోరవలయును.

కం॥ శమనబలదమనులకుఁ దా, సముఁడు పరాక్రమమునందు; •సరి గురువునకున్
సుమతి; ధృతి మేరుశైలో, పముఁడగు, నాకంటె సుగుణ•వంతుఁడు దలఁపన్.

శమన బలదమనులకున్=యమునకు-నింద్రునకు, సుమతిన్=మంచి బుద్ధి బలమందు, గురువునకున్=బృహస్పతికి, ధృతిన్=ధైర్యమందు, మేరుశైలోపముఁడు=

మేరు పర్వతముతో సమానుఁడు-శమనదమనులని యొకటిగా ద్వంద్వముగఁ జెప్పుట యొకరొకరు వేఱుగ సమానులు గారని తెలుపుటకే.

తాత్పర్యము

పరాక్రమమందు నింద్ర, యములకు, బుద్ధి బలమందు బృహస్పతికి,ధైర్యమందు మేరుపర్వతమునకు సమానుఁడు,సుగుణములందు నాకంటె గొప్పవాఁడు

కం॥ సన్నుతచరితుఁడు పుత్రుం, డిన్నేలను నేలు చుండ • నీవయసున నేఁ
గన్నారఁ గని యథాగతిఁ,బన్నుగ స్వర్గమునుఁ గాంచు•భాగ్యము గలదే. ౩౧

సన్నుత చరితుఁడు=సజ్జనులచేత స్తోత్రము చేయఁబడిన నడవడిగలవాఁడు-పుత్రుఁడు=పున్నామనరకమునుండి రక్షించువాఁడును, వంశమును బావనము చేయువాఁడు. పున్నామ నరకమునుండి రక్షించువాఁడు పెద్దకొడుకేకాని తక్కిన వారుగారు. పునాతీతి పుత్ర యనియు వ్యుత్పత్తి గలదు.యథాగతి=చేసిన పుణ్య పరిపాకముకొలఁది, స్వర్గమునుగాంచు=చేసిన పుణ్యముకొలఁది లభించు స్వర్గ సుఖము-i ii-నీతోడనుంట స్వర్గమున్నట్టు రామ సౌందర్యానుభవసుఖమని-పరిపూర్ణ బ్రహ్మానుభవాత్మికా ముక్తియని యుండుటచే నవిచ్ఛిన్నరామ దర్శనము వలనఁ గలుగు నానందానుభవమే మోక్ష సుఖమని భావము- అది యచ్చట లభించిన నేమి విశేషము. ఇక్కడ లభించిన నేమిలోటు?

తాత్పర్యము

సజ్జనులచేఁ బొగడ్తగన్న నడవడిగలవాఁడును సార్థకముగఁ బుత్ర శబ్దము వహించి నన్నుఁ బున్నామ నరకమునుండి రక్షించి వంశమును బావనము చేయువాఁడునగు రాముఁ డీరాజ్యమును బాలించుచుండఁగా నీవార్ధక దశయందు నేను గన్నులారఁజూచి యా పుణ్యముకొలఁది నేను స్వర్గమునకుఁబోవు భాగ్యము కలదో లేదో- సామ్రాజ్య పట్టాభిషేకదర్శన భాగ్యము నిర్భాగ్యులకుఁ గలుగదుగదా.

తే॥ అనుచు లోకోత్తరంబును•నప్రమేయ, మన్యరాజన్యదుర్లభ•మైన సద్గు
ణాళిగలరాము యౌవరా•జ్యంబునందు,
నిలుపఁ దలఁచెను సచివోక్తి•నిశ్చయించి. ౩౨

లోకోత్తరమును = లోక వృత్తము నతిక్రమించినదియు, అప్రమేయము= సంఖ్యపెట్టి చెప్పరానిది, సచివోక్తిన్ = మంత్రులమాట ననుసరించి.

తాత్పర్యము

అని యాప్రకార మాలోచించినవాఁడై దశరథుఁడు లోకాతీతమై ప్రమాణ సాధ్యముగానిదై యితర రాజశ్రేష్ఠులకు దుర్లభమైన గుణ సమూహముగల శ్రీరామచంద్రుని యువరాజు చేయవలయునని మంత్రులతో నాలోచించి నిశ్చయించెను.

కం॥ దివి భువిఁ బొడముచు నుండెడు, నవశకునోత్పాతములను•నాత్మతనువునన్
దవిలినముదిమిభరంబును, నవనివిభుఁడు ప్రాజ్ఞుఁ డగుట•నాలోచించెన్. ౩౩

రామపట్టాభిషేక విషయమున దశరథుఁడు తొందరపడుటకుఁ గారణము చెప్పఁబడుచున్నది.

దివిన్=ఆకాశమందు, భువిన్=భూమియందు, పొడముచు నుండెడి=పుట్టుచున్న-అవశకు నోత్పాతములను=చెడు శకునములను-ఉత్పాతములను.

శ్లో॥ స్వర్భానుకేతు నక్షత్రగ్రహ తారార్క చంద్రజమ్
దివిచోత్పద్యతే యచ్చ, తద్దివ్య మితికీర్తితమ్.
వాయ్వభ్ర సంధ్యాదిగ్దాహ, పరివేషతమాంసిచ
ఖపురంచేంద్ర చాపంచ, తద్విద్యా దంతరిక్షజమ్.
భూమావు త్పద్యతేయచ్చ, స్థావరం వాథజంగమమ్
తదై కదేశికం భౌమ, ముత్పాతం పరిచక్షత. ఇతి-

ఆకాశమునందు-రాహు కేతువులు-గ్రహనక్షత్ర తారలు సూర్యచంద్రులు వీరివలనఁ గలిగిన విపరీత వికారములు దివ్యోత్పాతములు.

గాలి, మేఘము, సంధ్య, దిగ్దాహము (దిక్కులు మండుచున్నట్లు నెఱ్ఱ కాంతులు గానవచ్చుట) పరివేషము (సూర్యచంద్రుల చుట్టు గుండ్రముఁ జక్రములు కానవచ్చుట) చీఁకట్లు-గంధర్వనగరములు. ఇంద్రధనుస్సు ఇవియంతరిక్షోత్పాతములు.

స్థావర జంగములవలనఁ గలుగునవి భౌమోత్పాతములు- స్థావర వికారములు=భూకంపము-శిలావర్షము వృక్షములందు రక్తము కారుటలోనైనవి.

జంగమవికారములు=పశుపక్ష్యాదులయందు మనుష్యాది జాతులు పుట్టుట, ఆత్మతనువునన్=తన దేహమందు, ప్రాజ్ఞుఁడు=తెలిసినవాఁడు.

రాజు అవశకునములకు భయపడికాదు- తాను మిక్కిలి వృద్ధుఁడగుటచే యోగ్యుఁడుసమర్థుఁడునగు పుత్రుఁడెదిగినవాఁడుండఁగా నింకను రాజ్యభారము వహించి యుండుట ధర్మముగాదని రామపట్టాభిషేక ప్రయత్నము చేసెను.

తాత్పర్యము

మరణకాలము సూచించుచు నాకాశమందు భూమియందుఁ గానవచ్చు నవశకునములు నుత్పాతములును తనకుఁ బ్రాప్తించియుండు ముసలితనమును జూచి ప్రాజ్ఞుఁడగు దశరథుఁడు తనకు మరణము సమీపమందేయున్నది. ఇఁక నాలసించినఁ బ్రయోజనము లేదని యాలోచించెను.

కం॥ రామునకును ముఖనిర్జిత, సోమునకును స్వాత్మకలిత•శోకావనయో
ద్దామునకును సద్గుణని,స్సీమున కగుప్రజలరక్తి•చింతించి మదిన్. ౩౪

ముఖనిర్జిత సోమునకును=చంద్రుని జయించిన ముఖకాంతిగలవానికి; స్వాత్మకలిత=తన మనస్సునఁదవిలిన, శోక + అవశకునముల వలనఁ గలిగిన

శోకమును; అపనయుఁబోఁగొట్టుటయందు, ఉద్ధామునకును=గొప్పవానికిని, సద్గుణనిస్స్వమునకును = మేరలేనిమంచి గుణములు గలవానికి, ప్రజలరక్తి=ప్రజలయందలి యనురాగము.

తాత్పర్యము

చూచినంతమాత్రముననే చంద్రునివలె మనస్సునకు సంతోషము గలిగించుచు వ్యసనము పోఁగొట్టు ముఖవర్చస్సు సౌందర్యముగల వాఁడును తన మనస్సున నుండు శోకమును బోఁగొట్టుటయందు సమర్థుఁడును ఇన్నియని లెక్కించిచెప్ప సాధ్యముగాని పరిమితిలేని కల్యాణగుణములు గలవాఁడును నగు శ్రీరామచంద్రునకుఁ బ్రజలయందుఁగల ననురాగమును నాలోచించెను.

కం॥ తనకును బ్రజకును శ్రేయము,ననుపును గూర్పంగ నవని•నాథుఁడు కాలం
బును జనుదెంచుట గని ప్రే,మను దీవరపడఁగ సాగె•మదిఁ దత్కృతికై. ౩౭

ననుపు = ప్రీతి; "ననుపు కాఁడయి వేల్పు నాగవాసముఁ గూడి" యని మనుచరిత్ర.

తాత్పర్యము

తనకును బ్రజకును శ్రేయస్సు ప్రీతి గలిగించు రామ పట్టాభిషేకకార్యము జరుపుటకుఁ దగినకాలము ప్రాప్తించెనని యెఱిఁగినవాఁడై దశరథుఁ డాకార్యమెప్పుడెప్పుడు నెరవేర్తునా యని తొందర పడసాగెను. శుభస్య శీఘ్రమని కలదుగదా.

—• దశరథుఁడు రాముని యువరాజుఁ జేయఁ బౌరులతో నాలోచించుట •—

కం. మంతనమునకై పతి సా,మంతుల నానావిదేశ•మహిజనముల భూ
కాంతుల ముఖ్యుల నందఱ, సంతసమునఁ బిల్వఁ బనిచె•జానపదాళిన్. ౩౮

పట్టాభిషిక్తుఁడై యుండు రాజునకు నావెనుక నాకొడుకునకు నాయిష్టము చొప్పునఁ బట్టాభిషేకము చేసెద నను నధికారములేదు- రాజ్యము ప్రజలది- రాజ్యమును బరిపాలించు శక్తి యెవనియందుఁగలదో వాని నేర్పాటుచేయు భారము ప్రజలది- కాని నారాజ్యము కావున నాయిష్టప్రకారము నాయిష్టము వచ్చినవాని కిచ్చెద నని రాజు చెప్పరాదు- ప్రజల నిమిత్తమై రాజుగాని రాజు నిమిత్తమై ప్రజలుండలేదు- కావున నన్నివిధముల రాజ్యభారము వహింప శ్రీరామచంద్రమూర్తి సమర్థుఁడని తోఁచినను బ్రజానురాగముగలవాఁడని యేర్పడినను బ్రజల సమ్మతిలేక యాయనకుఁ బట్టాభిషేకము చేయునధికారము లేకుండుటచే వారినందఱను దశరథుఁడు పిలిపించి విషయ మెఱుకపఱచి వారి సమ్మతిఁ బడయుచున్నాఁడు.

. ఇది మన పూర్వరాజుల ధర్మపద్ధతి- ఇట్టులే యయాతి తన చిన్నకొడుకు పూరునకు రాజ్యమిచ్చునపుడు ప్రజలనందఱఁబిలిపించి "భవతోఽనుమన యామ్యేవం పూరూ రాజ్యేఽభిషిచ్యతామ్" పూరునకు రాజ్యాభిషేకము చేయుటయందు మీ యనుజ్ఞ కోరుచున్నాను. అనగా వారు "యఃపుత్రో గుణసంపన్నో, మాతా

పిత్రోః హితస్సదా! సర్వమర్హతి కల్యాణం, కనీయానపి సత్తమః! అర్హఃపూరు రిదం రాజ్యం యస్త్వతః ప్రియకృత్తవ" అని చెప్పిరి. ఎవఁడు సద్గుణ సంపత్తి గలిగి, తల్లిదండ్రులకు హితుఁడై, యుండునో వాఁడు చిన్నవాఁడైనను, సత్పురుషుఁడు కావున సమస్తకల్యాణముల కర్హుఁడగుచున్నాఁడు. పూరుఁడు నీకుఁ బ్రియుఁడు కావున నీరాజ్యమున కర్హుఁడు- అని చెప్పిరి.

ధర్మరాజు పౌరజన ప్రియుఁడు కావుననే యాయనను యౌవరాజ్యమునుండి తొలఁగించుటకు ధృతరాష్ట్రుఁ డన్నిమాయోపాయములు పన్నెను.

మంతనమునకు=ఆలోచనకు, పతి=దశరథుఁడు, సామంతులన్=చేతిక్రింది రాజులను, నానావిదేశ మహిజనములన్=ఇతర దూరదేశములందుండు నానా జనములను- జానపదాళిన్=జనపదములనుండు జనుల సమూహమును- కేవల కుగ్రామముగాక పట్టనముగాక యుండు నూరు జనపద మనఁబడును.

తాత్పర్యము.

ఆలోచించుటకై సామంతరాజులను ముఖ్యరాజులను నానాదేశములందు దూరమున నుండువారిని గ్రామములం దుండువారిని దశరథుఁడు పిలిపించెను. రేపు పట్టాభిషేకమనఁగా నీదిన మందఱకుఁ జెప్పిపంపెనని భావముగాదు- దూర దేశవాసు లొకదినమున నెట్లురాఁగలరు. ఈదినమం దీపట్టాభిషేక కార్యము జరుగ వలయునని మంత్రులతో రహస్యముగ నాలోచించి తీర్మానించుకొనినవాఁడు కావున మీతో నాలోచింపవలసిన ముఖ్యకార్యమా కలదు. కావున నట్టిదినమందు మీరందఱు నయోధ్యకు రావలయునని కారణముచెప్పక యేదో పని నెపమున నందఱు నొక్కనాఁడు పురిచేరునట్టు లేర్పాటు చేసెనని యెఱుంగవలయును.

కం॥ చెవులకుఁ బందువగా వా,రవల వినం గలుగుఁగాక • యని దూరపుభూ
ధవులగు కేకయుజనకుల,నవనీపతి పిలువ నంపఁ•డయ్యెం ద్వరచేన్. ౩౭

తాత్పర్యము

అందఱకుఁ జెప్పిపంపెను గాని జనకకేకయ రాజులకు మాత్రము చెప్పి పంపఁడయ్యెను. కార్యము ముగిసినపిమ్మట వారు వినిసంతోషింపనిమ్మనియుఁ గార్యము తొందరగాఁ గావలసి యుండుటచేతను- చెప్పిపంపిన పిమ్మట వారు స్వతంత్రులు కావున సకాలమునకు రాకున్నను గార్యవిఘ్నమగు నని తలఁచి వారికిఁ జెప్పిపంపఁడయ్యెను.

వా నవకారణము పనితొందరయే కాదు. వారు వచ్చిన నేమి యనర్థములు కలుగునో యను గిలి ముఖ్యకారణము.

కం॥ వచ్చినతక్కటివారికి, వెచ్చలవిడి నుచితరీతి • విడుదులు సొమ్ముల్
పెచ్చుగ నిడి ప్రజకు న్విధి, యుచ్చైడిగలి దర్శనంబు•నిచ్చెం బిదపన్. ౩౮

తాత్పర్యము

తనయాజ్ఞ మేరకు నయోధ్యకు వచ్చిన వారికందఱకుఁ దగిన విడుదులు మొదలైనవి వారివారి యోగ్యతకుఁ దగినట్లు ఏర్పాటుచేసి కావలసిన పదార్థములు వారు సంతోషించునట్లు విస్తారముగఁబంపి వారికందఱకుఁ బ్రజలకు బ్రహ్మదేవునివలె దర్శన మిచ్చెను.

చం॥ అరిబలహంత యాదశర•థావనినాథుఁడు కొల్వు దీరఁగా
వరుసగ నున్న భూమిధవ•వర్యులు వచ్చి నృపాలదత్త మౌ
సురుచిరపీఠవర్గముల•సొంపుగ సమ్ముఖులై రహింపఁగా
సరత, మహీశుఁ డొప్పె విబు•ధౌఘసమావృతశక్రుకై వడిన్. ౩౯

అరి బలహంత=శత్రుసేనల వధించువాఁడు–ముసలివాఁడైనను జవసత్త్వములు తగ్గలేదని భావము. విబుధౌఘ=దేవతాసమూహములచే, సమావృత=చుట్టఁబడిన శక్రుకై వడిన్=ఇంద్రునివలె– ఉన్న=తక్కిన

తాత్పర్యము

దశరథుఁడు సభదీరఁగాఁ దక్కిన రాజులందఱు వచ్చి యాయనయిచ్చిన యందమైన యాసనములపై నాయనకెదురుగ సమీపమునఁ గూర్చుండఁగా నాయన దేవతలచేఁ జుట్టఁబడిన యింద్రునివలె శోభించెను.

—• ౨-వ సర్గము. దశరథు నుపన్యాసము. •—

చం॥ కలయఁగఁ జూచి యాయవని•కాంతుఁడు నిండుసభన్ వచించె ని
స్తులహితహర్ష హేతు వయి•తోరపుఁగీర్తి ఘటింప నైనమే
ల్పలుకులు దుందుభిస్వని•భంబు గభీరము రాజయోగ్యము
స్లలితము మాధురీధురము•నవ్యము నాగతి మేఘఘోషుఁడై. ౪౦

నిస్తుల=సమానములేని, హిత=మేలునకు, హర్ష=సంతోషమునకు, హేతువయి=కారణమయి, మేఘఘోషుఁడై=మేఘధ్వనివంటి కంఠధ్వనిగలవాఁడై.

తాత్పర్యము.

ఇట్లు సభదీరి, సభయందుండువారి నందఱఁ గలయఁజూచి, భేరి ధ్వనివంటిదై, గంభీరమై, రాజు చెప్పుటకు యోగ్యమై, మనోహరమై, మిగులఁ దియ్యనైన విధముగ, నందఱకు వినవచ్చునట్లు మేఘధ్వనివంటి ధ్వనితో నసమానమైన మేలునకు సంతోషమునకుఁ గారణమై మిగులకీర్తికరములైన పలుకు లిట్లు చెప్పెను.

కం॥ కడుపునఁ బుట్టినబిడ్డల, వడువున నాపూర్వు లెల్ల•వసుధాప్రజలన్
దడవుగ రక్షించిరి కడు, విడి నిది మీ కెల్లరకును•విదితంబె కదా? ౪౧

ఇఁక దశరథునుపన్యాసము చెప్పఁబడుచున్నది.

ఆర్యులారా? మా పూర్వులెల్లరు భూజనులను దమ కడుపునఁబుట్టిన బిడ్డలఁ దండ్రులు రక్షించు రీతి దీర్ఘకాలము రక్షించిరి. ఇది మీకు సందఱకుఁ దెలిసిన విషయమేకదా.

తే॥ అట్టి యిక్ష్వాకుకులమునఁ•బుట్టి నట్టి,యేను బూర్వులు పాలింప•నెసఁగిసౌఖ్య
మునకు సర్వంబునౌజగం•బునకు మిగుల,
శ్రేయమునుగూర్పయోజన•సేయువాఁడ.

అట్టి యిక్ష్వాకువంశమునఁ బుట్టిననేను బూర్వులు పరిపాలింపఁగా వృద్ధిచెంది సుఖపడ సర్వమైన జగజ్జనంబునకు మిగుల శ్రేయస్కరమైన కార్యము నొకటిచేయ నాలోచించుచున్నాఁడను.

కం॥ పెద్దలు నడచినత్రోవన, తద్దయు హెచ్చరికతో య•థాశక్తిగ నేఁ
బద్ధుగ రక్షించితిఁ బ్రజ, నిద్దియు మీమానసముల•కెఱుకయు కాదే. ౪౩

మా పెద్దలే ప్రకారము ప్రజలకు హితమైనమార్గమున నడచిరో యామార్గమునందే నేనును మిగుల హెచ్చరికతోఁ బ్రమాదములేక శక్తివంచనములేక ప్రజలను రక్షించితిని. ఇదియును మీమనస్సులకుఁ దెలిసిన విషయమేకదా.

కం॥ భూతలహితముం జల్పఁగ, నేతరుణమునందుఁ గోరు•నీమే నిట్టుల్
శ్వేతచ్ఛత్రమునీడను, ఖ్యాతిగ దుర్భరజరైక•కలితం బయ్యెన్. ౪౪

ఏ సమయమందును భూమిజనులకందఱకు మేలేచేయవలయునని కోరుచుండు నీదేహము మీరిప్పుడు చూచురీతిగాఁ దెల్లగొడుగు నీడయందే యందఱకుఁదెలియునట్లు భరింపరాని వార్ధకముతోఁ గూడినదయ్యెను; (నీడయందే పెరుఁగుచెట్లు వేగముగఁ దెల్లఁబాఱునట్లు నేనును శ్వేతచ్ఛత్రము నీడచే నిట్లైతినని భావము.)

కం॥ అఱువదివే లేఁడులు నా,కఱుగొఱ లేకుండఁ గడచె•సంగంబును వో
టఱియెను, దెఱపును మఱపును,
వఱలకమును హాయి నుండ•వాంఛ జనించెన్. ౪౫

నాకఱువదివేల సంవత్సరములు కొఱఁతలేకుండఁ గడచెను. దేహము దుర్బలమయ్యెను. ఎఱుకమఱపులు ప్రారంభించి కర్తవ్యము మఱచుట యొకటిచేయఁబోయి మఱియొకటిచేయుట యిట్టిస్థితి దాపరింపకముందే యీ భారమును వదలించుకొని సుఖపడఁ గోరెదను.

ఉ॥ ఎంతయు ధైర్యశౌర్యములు•నేవుఁ గలాఁడు, జితేంద్రియుండు, దు
ర్దాంతవసుంధరాభరణ•దార్ఢ్యయుతుండును, ధర్మశీలుఁ, డే
కాంతము దాల్పఁగా దగిన•గాఢభరంబును మోచి మోచి వి
శ్రాంతికి నాస చేసితిఁ, చి•రంబుగ నాకు ననుజ్ఞ నీయరే. ౪౬

ఏవిధముగ సుఖపడఁ దలఁచితివందురేమో నాయాలోచన చెప్పెద వినుఁడు. మిక్కిలి ధైర్యము శౌర్యము పరాక్రమము గలవాఁడును ఇంద్రియనిగ్రహము గలవాఁడును, మోయ మిగులఁ గష్టమైన యీ భూభారమును

మోయఁగల దార్ఢ్యము గలవాఁడును. ధర్మస్వభావము గలవాఁడును నగువాఁడే కచి త్తముతో భరింపవలసిన యీ యధికభారమును దీర్ఘకాలము మోచిమోచి యిఁకభారము దొలఁగించుకొని యిన్ని దినములు కష్టించిన గాసిపాయ స్థిరముగ సుఖపడవలయునని యాసపడుచున్నాను. నాకు మీరందఱు ననుజ్ఞ యీయఁ బ్రార్థించెదను.

ఉ॥ ఇచ్చటఁ జేరి యుండెడిద్వి•జేంద్రుల కందఱ కిష్టమేని, మీ
రిచ్చగ నౌనటం చనెద•రేని, మదాదిమపుత్త్రు రామునిన్
బ్రచ్చుఱ ధూతశాత్త్రవుఁ, బు•రందరసన్నిభు, ధార్మి కాగ్రణిన్,
సచ్చరితున్, మహామహుని,•సర్వగుణంబుల మత్సమానునిన్.　౪౩

అట్టైన రాజ్యముగతియేమి? ప్రజలనందఱ నేమిచేసి పోయెద వందురేమో? నాకుఁదోఁచినంతలో దానికిఁ దగిన యేర్పాటు చెప్పెదను. మీకిష్టముండిన దానిని మీ రంగీకరింపవచ్చును. అది యేదందురా? ఇచ్చటనుండెడి ద్విజుల కందఱకు సమ్మతమైనయెడల, మీరందఱు నేకవాక్యముగ నిండుమనస్సుతో నంగీకరించి సరియనెదరేని నాకుఁ బెద్దకొడుకును శత్త్రువుల జయించినవాఁడును-ఇంద్రునితో సమానుఁడును ధర్మాత్ములందు శ్రేష్ఠుఁడును సదాచారసంపన్నుఁడును,గొప్ప మహిమగలవాఁడునునన్ని గుణంబులయందు నాతో సమానుఁడును.

తే॥ పుష్యమునుగూడి యున్నట్టి•పూర్ణచంద్రు
చందమున నేను యౌవరా•జ్యంబు రాము
ధర్మభృద్వరు నరసింహు•శర్మయుక్తిఁ
బూన్పఁదలఁచితి మీచి త్త•ముల నెఱింగి.　౪౪

విల్లుపట్టెడువారిలో శ్రేష్ఠుఁడును పురుషసింహుఁడును నగు రామునిపుష్య నక్షత్రము పున్నమతోఁగూడినట్లు మీయభిప్రాయ మెఱింగి యువరాజుగాఁ జేయఁదలఁచినాఁడను.

తే॥ నాథుఁ డగువేనిచేతను•నాథవ త్తరం బగుచు ముజ్జగంబులేన్•రమణమీఱు
నట్టి శ్రీమంతుఁ డౌలక్ష్మ•ణాగ్రజుండు,జగతికనురూపవిభుఁడౌట•దగునరాదె:

నాయల్పరాజ్యమేకాదు. ఎవఁడు నాథుఁడుగ నైనచో మూఁడులోకంబులును నాథుఁడు గలవానిలో శ్రేష్ఠములగుచున్నవో యట్టి శ్రీమంతుఁడును లక్ష్మణున కన్నయునగు రాముఁడు భూమికిఁదగిన భర్తయగుట యర్హమేకదా. (మూఁడులోకములనైన నేలఁగలవాఁ డీభూలోకములో నొకమూలలో నొకభాగమైన దీని నేలఁ జాలఁడా యని భావము.)

కం॥ ఇప్పుడ యీభూభారము, నెప్పరమున రామునందు•నిలిపి ధరణి కీ
గొప్పగుశ్రేయముఁ గూరిచి, తప్పుట భారంబు నేను•దద్దసుఖింతున్.　౪౫
నెప్పరము=వేగము. రూ. నెప్పళము.

ఇట్లిప్పుడు చేయఁదలఁచినా వందురేమో. ఇఁక నెప్పుడోకాదు. ఇప్పుడే మీసమ్మతి తెలుపుటే యాలస్యము. శీఘ్రముగ నీభూభారము శ్రీరామచంద్రు నందు నలిపి భూప్రజలకు నీమేలు సమకూర్చి భారము దొలఁగిపోవుటచే నేనును సుఖపడెదను.

కం॥ అనువగు ప్రయోజనం బిది, యొనరించు నయేని, మంచి • యోజనయిదియేన్
గొనసాగించుట యెటు లో, యనుమతిని నొసంగుఁడీ మ • హాజనులారా! ౨౧

ఇప్పుడు నేను జెప్పిన యాలోచన ప్రయోజనవడునని, మీకు మేలు కలిగించు నాలోచనయని, మీకుఁదోఁచెనేని యీ యాలోచన కార్యముగఁ బర్య వసించుటెటులో మహాజనులారా! యట్టి విధానమును ననుమతింపుఁడు.

కం॥ ఇంతకు లెస్సయుఁ గలిగినఁ జింతింపుఁడ, యంటిఁ బ్రేమ • చేత, స్వజనతా
చింతకుఁ గడమే లగు నదు, మంతరవున్వారు హితము • నాలోచింపన్. ౨౨

ఒకవేళ మీకునాయాలోచన సరిపడదాయెనా యింతకు మేలైన యాలో చన దెలుపుఁడు. నేను జెప్పితిని గావున నీయన జెప్పినది యంగీకరింపకుండిన నేమి నొవ్చుకొనునో యని మీరు తలంపవలదు. నాకొడుకు గావునఁ బుత్ర వాత్సల్యముచే నంటిని. వాని రాజ్యమున సుఖపడవలసినవారు మీరుగాని నేను గాను-అదియును గాక కార్యాలోచనములం దైనవారి యాలోచన పక్షపాత ముతోఁ గూడియుండును మధ్యవర్తుల యాలోచన మేలై యుండును - కేవల ముదాసీన మనుష్యుల యాలోచన పనికిరాదు. వారుపేక్షచే నేదియెట్లయినమన కేమి యని యేదో యొకటి నోటికివచ్చినట్లు చెప్పుదురు. అట్టియాలోచన కొఱ గాదు. కావున రామపక్షపాతమున నేను జెప్పునాలోచనకంటె మధ్యవర్తులయిన మీ యాలోచన మేలై యుండును.

చం॥ అని జనపాలుఁ డాడిన మ • హామ్ముద మంది నృపాళి వర్షమున్
నినుచుఘనంబుఁ గాంచి భువి • నిండఁగఁ గేకలు వైచు నెమ్మిపిం
డెనయఁగ మేలు మే లనుచు • నెంతయు మెచ్చురవంబు పేర్మిఁ గం
పనమును గాంచెఁ దత్సభయు • బాఢముగాఁ బ్రతిశబ్ద మిచ్చుచున్. ౨౩

ఘనంబు=మేఘము.

తాత్పర్యము

అని దశరథుఁడు చెప్పఁగా రాజులందఱు మిగుల సంతోషించినవారై మంచి వర్షము గురియింప సిద్ధముగనుండు మేఘమును గాంచి భూమినిండఁ గేకలువైచు నెమిళ్ళగుంపువలె మేలుమేలు బాగుబాగు అని దశరథుని శ్లాఘించు ధ్వనిచే సభామంటపము ప్రతిధ్వని యిచ్చుచు వడఁకెను.

—• పౌరులు శ్రీరాముఁడు యువరాజగుటకు సమ్మతించుట. •—

తే॥ అంత ధర్మార్థవిదుఁ డైన•యవనినాథు,
వాక్యముల విని బ్రాహ్మణ•వరులు పౌర
జానపదులునుగూడి యో•జన యొనర్చి,
యిట్టు లని రేకమతు లయి•వృద్ధనృపతి. ౨౪

దశరథుఁ డీ ప్రకారము చెప్పఁగా విన్నవారై బ్రాహ్మణశ్రేష్ఠులును పౌరులును గ్రామజనులును నందఱు గలసి మాటలాడి యాలోచించి యేకాభిప్రాయులై ముసలి రాజుతో నిట్లనిరి.

కం॥ ఏఁడులు పూఁడు లవెన్నియొ, ఱేడా! వేవేలు చనె మ•ఱిన్ వృద్ధుఁడవున్
వేఁడెదము రామచంద్రుని, బోఁడిమి యువరాజుఁ జేయ•భూతలమునకున్

ఏఁడులు పూఁడులు=అనేక సంవత్సరములు, వేవేలు = వేలకొలఁదులు- మఱిన్=అదియునుగాక-మఱియును=ఇందు 'యు' లోపింపఁగా మ 'మఱిను' అయి 'ను' మీఁది యచ్చులోపింప 'మఱిన్' అయ్యెను.

తాత్పర్యము

రాజా! నీవెన్నియో వేలసంవత్సరములు రాజ్యము పాలించితివి-ముసలివాఁడవై తివి కావున రాజ్యపాలనమునకై శ్రీరామచంద్రుని యువరాజుఁజేయఁ గోరెదము.

కం॥ కోరుదుము మహాబాహుని, శ్రీరఘువరు భూరిబలుని•శ్రీరాముఁ గనన్
వారణయూథాధిపయా,నారోహణు ఛత్రసంవృ•తాననకములున్. ౨౬

మహాబాహునిన్ = ఆజానువులైనబాహువులు గలవానిని-ఇది మహాపురుషలక్షణము. శ్రీరఘువరున్=సంపద్యుక్తుఁడై రఘువంశమున నింతవఱకుఁ బుట్టినవారిలో శ్రేష్ఠుని-భూరి బలునిన్=మహాబలము గలవానిని, శ్రీరామున్= లక్ష్మీవిశిష్టుఁడైన రాముని, వారణ యూథాధిప యానారోహణున్-శ్రేష్ఠమైన యేనుఁగుపై నెక్కిన వానిని, ఛత్రసంవృతాననకములున్ =శ్వేతఛ్ఛత్రముచేఁ గప్పఁబడిన ముఖకమలము గలవానినిగాఁ జూడఁగోరెదము.

మహాబాహుని=రఘువీరుని-మహాబలుని- పట్టపు టేనుఁగుపై నెక్కి శ్వేతచ్ఛత్రము నీడచే విలసిల్లు ముఖారవిందముగల రామచంద్రమూర్తినిఁ జూడఁ గోరెదము-అని చెప్పుటచే శ్రీరామచంద్రుఁడు రాజ్యమేలుటవలనఁ గలుగు విశేష సుఖభోగముల కాశపడి మేము శ్రీరాముని రాజుగాఁజేయుమని కోరలేదు పట్టాభిషిక్తుఁడై పట్టపుటేనుఁగునెక్కి శ్వేతచ్ఛత్రము నీడను రాఁగా నాయన సౌందర్య విశేషముఁజూడ నభిలాషగలవారమై కోరుచున్నామని భావము.అట్లైన మీరు శ్రీరాముని సౌందర్య దర్శనమునఁ-గలుగు నానంద మనుభవింపఁగోరితి రే కాని రాజ్యపరిపాలనార్హత గలవాఁడని కాదుగదా యని దశరథుఁడను నేమో యని,మహాబాహున్=నీరాజ్యమంతయు నాయనకొక చేతికిఁ జాలదు.నీరాజ్యము

దక్షిణ సముద్రమున సగమువఱకే ఆవల నీకు రాజ్యము లేదు. అది లంకా రాజ్యము. రామచంద్రమూర్తి- మహాబాహుఁడు కావున దానినిగూడ నేలఁ గలఁడు కదా. సుందరకాండమందు హనుమంతుఁడు సురసతో "రాముని యాజ్ఞఁ బోయెదను। రాముని రాజ్యమునందు నుండుటన్। రామరో నీకునన్ దగవురాముని కార్యముఁదీర్ప" నని చెప్పెను గావున సముద్రమధ్యము వఱకు నిక్ష్వాకు రాజ్యమే.

మహాబాహున్-ఆజానుదీర్ఘంబులైన బాహువులవాఁడు అని చెప్పుటచే నాయన బాహువులు చూడఁగానే యీయన మహాపురుషుఁడని యెట్టివారికిఁ దోఁచుచుండఁగా నాయన రాజ్యపరిపాలన శక్తియందు సందేహమెట్లు గలుగఁ గలదు. అప్రాకృత నిత్యవిభూతిని-ప్రాకృత లీలావిభూతిని రెంటిని బాలింపఁ గలదికదా యీయనబాహువు-మహాబాహున్-దుష్టుల శిక్షించుననిశిష్టులరక్షించు నని బాహువులేకదా? ఆరెండేకదా రాజకృత్యములు కావున బాహుప్రశంస. అయోధ్య ౧౫౨౪వ పద్యము చూసనది,

శ్రీమహాబాహునిన్='బాహుచ్ఛాయామవష్టబ్ధ్య' యని చెప్పినట్లు మమ్మును రక్షింప నాయన భుజములనీడయే చాలును. ఆనీడ నున్నంతమాత్రముననే యెండవడఁబడినవాఁడు చెట్లనీడసుఖించినట్లు సంసారతాప పీడితులమగు మేము సుఖింతుము ఇచ్చట నీశ్లోకము ననుసంధించునది. శ్లో॥ ధ్యానాభ్యాసవశీకృతేన మనసా యన్నిర్గుణం నిర్గుణం। తేజః కశ్చన యోగినోయది పరంపశ్యంతి పశ్యంతుతే। అస్మాకంతు తదేవ లోకన చమత్కారాయ భూయాచ్చిరం కాళిందీపులినేషు యత్కిమపి తన్నీలమ్మహోధావతి॥ ధ్యానాభ్యాస బలమున మనస్సును వశపఱచికొని యోగులు తమ హృదయమందుండు జ్యోతిని జూచినఁ జూతురుగాక దానితో మాకుఁబనిలేదు మాదృష్టికి యమునానదీ తీరమందిసుకదిబ్బలమీదఁ బరుగెత్తుచుండినవాని నల్లనిఛాయ గోచరించినఁ జాలును. మధుసూదన సరస్వతి.

మూర్తినంతయుఁ జెప్పక బాహువుమాత్రలుఁ జెప్పనేలఁ యనిన గోటఁ బోవుపనికి గొడ్డలి కావలయునా? అదియునుగాక "రరక్షధర్మేణ బలేనచైవ" ధర్మముచేతను బలముచేతను రక్షించె నన్నట్లు రాముని భుజమందు ధర్మబలముకూడఁగలదని సూచించుటకే-శ్రీరఘువరున్=సంపదతోఁగూడిన రఘు వంశమువారిలో గొప్పవానిని 'దీనాన్దానేన రాఘవః' దీనులను దానముచే రక్షించువాఁడు రాఘవుఁ డన్నట్లు రఘువంశమునఁ బుట్టినవారు దీనరక్షణ మందుఁ బ్రసిద్ధులు అట్టివారిలో నుత్తముఁడు శ్రీరామచంద్రమూర్తి-దీనరక్షణ మనఁగా కష్టమును తత్కాలమున నుపశమింపజేసి పంపుటకాదు.

'అనృశంస్యం పరోధర్మ' యన్నట్టు లట్టికష్టమునకు వారు మరలవశపడకుండునట్లు సదుపాయము పరుల కుపదేశించినఁగాని యారక్షణము పూర్తిగాదు. కావున మరల నట్టికష్టమునకుఁ బాలుపడకుండ రక్షించువాఁడు రామచంద్రమూర్తి

రఘువరున్=ధర్మబుద్ధియందు రఘుమహారాజుకన్నను శ్రేష్ఠుని- ఆఁకలిగొన్నవానిని జంపిన నీకుఁబాపమురాదా యనియొకఁడడుగ రఘు వూరకుండెను. రాముని స్వభావమన్ననో యట్టిదిగాదు. 'అప్యహం జీవితం. జహ్యామ్' ఆశ్రితరక్షణము నిమిత్తమై ప్రాణమైన నిచ్చెదనని చెప్పినవాఁడు రామచంద్రమూర్తి, భూరిబలునిన్=దృఢమగు మనోబలముగలవానిని 'నహిప్రతిజ్ఞాం సంశ్రుత్య' ప్రతిజ్ఞచేసి తప్పువాఁడను గాను 'సత్యజీయం' ఆశ్రయించినవానిని వదలువాఁడనుగాను. ఏతద్వ్రతంమమ' ఇది నావ్రతము. అని యిట్టి మనోబలముగలవాఁడు, రామచంద్రమూర్తి.

వారణ... ...రోహణున్=పట్టాభిషిక్తుఁడయిన రామునిఁ జూడఁగోరినవారు సభామండపమున సింహాసనాసీనుఁడైనపుడు చూడవచ్చునుగదా యనిన నట్లుగాదు. తనసుందర గంభీరవిలాసగమనమును తనపట్టపుటేనుఁగు శత్రుంజయమునకు నేర్పుచున్నాఁడాయనునట్లు దానిపై హాయిలుమీఱఁ గూర్చుండి శ్వేతచ్ఛత్రము పట్టించుకొని పురవీథులవెంట వచ్చినపుడు "ఏకస్స్వాదునభుంజీత" మధురాహార మొక్కఁడే తినరాదను న్యాయ మనుసరించి మేము మాదారపుత్రమిత్రబంధువర్గములతోడ నింటింటివాకిట దర్శించి యానందానుభవమునఁ గృతార్థుల మగుదుము అని భావము. జ్ఞాని తా నొక్కఁడే తరించును. భక్తుఁడిష్టశిష్టజనులతోఁ దరించును.

ఛత్ర.......కమలున్=ఛత్రము మఱుఁగు లేకుండినఁగదా మీకుఁ జక్కని దర్శన మబ్బును అట్లెప్పుడైన వచ్చినపుడు దర్శింపరాదా యనిన నప్పటి సౌందర్యమప్పుడేకాని పట్టాభిషేకమునాఁటి సౌందర్యము తక్కిన దినములలో వచ్చునా? పెండ్లికొడుకునాఁటివేషము రూపము ఆవలవచ్చునా? అట్టులేకదా యిదియును. ఇదియొక జన్మమున నొకనాఁటికార్యమే. ఛత్రము మఱుఁగు కొంచెముగా నుండవలసినదే. ఏలన: మా రాముని దివ్యసుందర విగ్రహపూర్ణ సౌందర్యమును చెడుదృష్టిగలవారు చూచిన నేదైనఁ గీడు కలుగునేమో యని మాకు భయము. ఆసక్తిగల వారము మేము మాయింఢ్లయొద్దకు వచ్చినపుడు హారతులిచ్చి పూర్ణముగ దర్శించి కృతార్థుల మగుదుము. చెడుదృష్టివలనికీడు తొలఁగిపోవ నింటింటి వాకిట కర్పూర నీరాజన మిచ్చెదము. అనేవమున మేము సకుటుంబముగా శ్రీరామచంద్రమూర్తిని సమీపించి కన్నులు కఱవుదీఱవీక్షించి కృతార్థుల మయ్యెదము. సింహాసనమున నున్నప్పుడు చూచిన మాకీ సౌకర్య సౌభాగ్యసంతోష సాహిత్యము లభించునా?

అదియునుగాక గొడుగునీడను గొంతకనఁబడి కొంతకనఁబడకయుండినఁబూర్ణముగఁ జూడవలయునని చూపఱు కోరిక యుప్పొంగుచు మఱిమఱి దర్శించి

యానందింతురు. అదియునుగాక రాముఁ డతి సుకుమారగ్రాత్రుఁడు. గొడుగు నీడ లేకున్న అట్టివానిముఖ మెండకు గాలికి వసివాళ్లువాఁడునేమొ. అట్టులు గాకుండ నిపుడు రాముని యంతరంగ స్నేహితులే భూచక్రవాళ మనుగొడుగును జాగ్రత్తగఁ బట్టుకచే వారును ధన్యులగుదురు.తక్కినవేళ నేభృత్యుఁడో పట్టును.

ఒక పాశ్చాత్యుఁడు ఏకచ్ఛత్రాధిపత్యమున కర్థము వ్రాయుచుఁ బూర్వము హిందూరాజుల కాలములో రాజొకఁడే గొడుగు పట్టుకొనుచుండెను గాని రాజు తప్ప జనులెవ్వరు గొడుగు పట్టరాదని వ్రాసెను. అజ్ఞానపరిణామ పరిణాహ విజృంభణ మింతకన్న మఱియొండుగలదా అదియునుగాక "ఏకచ్ఛత్రాం మహీంభుంక్తే యని సాముద్రికమునఁ జెప్పియున్నట్లు మిట్టపల్లములులేక సమమై గుండ్రమై విశాలమైన శిరస్సియనకుఁ గలదని సూచించునదియు తన నిరంకుశాధికారముచేత నితరరాజుల నీయన తనకు వశపఱుచుకొన్నాఁడని తెలుపఁగలదియు నగు తెల్లగొడుగు నితనిముఖముపైఁబట్టఁగా నందుఁ బరభాగ కాంతిగలిగి వెలయుచున్న ముఖముగలవానిని రాముని, కనఁగోరెదము-ఇట్టి పట్టాభిషేక మహోత్సవాలంకారముతో నున్న రామునిఁ జూడఁగోరెదము-పుట్టువుచేతనే రాముఁడు-అందుఁ గుణాభిరాముఁడు-అందుఁ బట్టాభిషేక సౌందర్యాభిరాముఁడు నగు జనమనో రాముని జూడఁగోరెదము. ఆహా యేమి మా పూర్వపుణ్యవిశేషము-అట్టి పుణ్యవిశేషఫలమును మాకుఁ గలిగింపుము.

కనన్ గోరుదుము=మేము గోరునది దర్శనము మాత్రమే-రాజులు పట్టాభిషేకము చేసికొనునపుడు ప్రజలకుఁ బన్నులు తోసివేయుటలోనగు మేలు చేయుటకలదు-అట్టిలాభము మేము కోరము. మేము కోరునది దర్శనలాభమే-దానిని నీవు కలిగింపఁ గోరెదము- అంతమాత్రము నీవు చేసినఁజాలును.ఆయన ముఖారవింద దర్శనమే మాకుఁ బూర్ణ బ్రహ్మానందదాయకమైయుండ క్షుద్ర లాభముల మేమాశింతుమా?

కోరుదుము=ఇది మాకోరిక-మాయధీనమందుండునది యింతమాత్రమే-కార్యము చేయవలసిన వాఁడవు నీవేకదా.

కోరుదుము=మాకేమా యిట్టియాశ మిక్కుటమైయున్నది - శ్రేయాంసి బహువిఘ్నాని మంచికార్యములకు విఘ్నములు మెండు. గొంతెమ్మకోరిక చేసెదవో యేమో ఇది నీవు మానోటిమాట దీసికొని మమ్ము మాటమాత్రము చేతనే సంతోషపెట్టెదవో లేక నిజముగాఁ గార్యము నెఱవేర్చి సంతోషపెట్టెదవో - ఎట్టులైనఁ జేయుము మాకోరిక యిది. ఏలయింతాశ మీకందువా? అందమైన వస్తువు చూచినపుడు దానియందాశ కలుగక మానదు.ప్రేమగలవారు శ్రేయస్సు గోరక దేనిని గోరుదురు? ఇందు శ్రేయస్సు రామునకు మాత్రమే కాదు. మాకును నీకును గలదు. మఱియును మీకింతయాశ నిజముగా నుండిన

నిన్నాళ్లు నాతో నేలచెప్పలేదు. నాయందు విశ్వాసము లేకగదా యందువేమో. అట్లుకాదు నీవు మాకు సర్వవిధముల రక్షకుఁడవే. మాకోరిక నీతోఁ జెప్పవలసినది మాకు విధియైనను నీప్రభుత్వము మఱియొకని కిమ్మని కోరిన నీవేమి తలంతువో. నాప్రభుత్వము వీరికి సరిపడ లేదని దురభిప్రాయపడెదవేమో యని భయపడుచుంటిమి. ఇప్పుడు నీవే యావిషయము ప్రస్తావించుటచే మేము దానినే కోరుచున్నాము.

కోరుదుము అను బహువచన ప్రయోగముచే నీ విషయమున మేమందఱ మేకగ్రీవముగఁ జెప్పుచున్నారమనియు మాలో నభిప్రాయభేదము లవమైన లేదనియు భావము. ఇది నిజమని నేనెట్లు నమ్ముదు నందువా "ఇంగిత జ్ఞశ్చ రాఘవా"యన్నట్లు మాముఖనయన వికాస కంఠధ్వనులచేతనే నీవు గ్రహించి యుండవచ్చును. నీయభిప్రాయము నీవు తెలుపఁగానే (౨౩-వ పద్యము) ఎంతయు మెచ్చురవంబు పేర్మిఁ గంపనమును బొందెఁ దత్సభయు బాఢముగాఁ బ్రతిశబ్దమిచ్చుచున్-అన్నట్లు-సభామంటపమంతయు రాజునెదుట నిట్లు ధ్వనింపవచ్చునా యను మట్టుమర్యాద లోఁ దలఁపని సభాసదుల శ్లాఘారవంబున నెట్లు సభామంటపము గడగడలాడెనో తెలియుదా. నిన్ను మెచ్చనివాఁ డొకఁడైన నిందుఁగలఁడా? అదియునుగాక "లోకపాలోప మునిఁగోరెఁ బ్రకటముగ వసుమతీకాంత తనకూర్చు వల్లభునిఁగ" నని యిట్లు పూర్వమే మాయభిప్రాయమే గాక సమస్త ధరాప్రజల యభిప్రాయమునై యున్నది. మాయభిప్రాయమన నేల భూకాంతయే రాముని స్వయముగ వరించెను. నేను ధరాపతినుండ నన్ను విడిచి వేఱొకని నెట్లువరించును? భూమిపాంసులగదా కామిని వయస్సువాని వలచినట్లు ముసలివానిని వలచునా? అదియునుగాక రాముఁడు లోకపాలోపముఁడు, లోకపాలుఁడు విష్ణువేకాని యితరులుకారు. ఇతరులయందా పదము గౌణముగ నన్వయించును గావునఁ దనభర్తను దాను వరించుట న్యాయ్యమే కదా. హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యాయని శ్రీభూదేవు లిరువురు విష్ణుభార్యలే అందు శ్రీ దేవి సీత ముందుగా వరించెను. ఇపుడు భూదేవి వరింపక మానునా?

తాత్పర్యము

రాజా! యాజానుదీర్ఘ బాహుండును శ్రీమంతమైన రఘువంశమునఁ బుట్టిన వారిలో శ్రేష్ఠుఁడును గొప్ప దేహబల మనోబలములందు నసమానుఁడు నగు శ్రీరాముఁడు శత్రుంజయమను పట్టపుటేనుఁగుపై నెక్కి శ్వేతచ్ఛత్రము నీడలోరాఁగా మేమందఱముఁ గన్నారఁ జూడఁ గోరుచున్నారము.

కం॥ అని వారెల్లరుఁ బలికిన, విని వారిమనః ప్రియంబు విధ మెఱుఁగఁగ నే
మిని దెలియనివానివలెన్, జనపాలకుఁ డనియె నెల్ల జనములఁ గనుచున్.

ఏమిని=ఏమియును-ఇందు 'యు' లోపించి 'ను' వర్ణముమీఁది ఉవర్ణమునకు ఇ వర్ణము రాఁగా ఏమని యనియయ్యె.

### తాత్పర్యము

ఈప్రకారము సభయందలి ప్రముఖులందఱు నేకవాక్యముగఁ దెలుపఁగా వారి మనస్సునందలి ప్రియమెంతమాత్రమో యది రామునియందలి ప్రీత్యతిశయముచేఁ జెప్పఁబడెనా లేక తనయందలి యప్రీతిచే రాముఁడు కోరఁబడెనా యని పూర్ణముగఁ దెలియఁగోరి యేమియుఁ దెలియనివానివలెనే యాసభ్యులనెల్లఁ జూచి దశరథుఁ డిట్లని యడిగెను.

కం॥ జనపతులారా! నానుడి, వినివినకయమువ్న రాముఁ విభుఁ గోరితి రే
మన మీతమకముఁ జూడఁగ, ననుమానం బయ్యె నిశ్చయం బాదరయా

జనపతులారా=రాజులారా! నానుడి=నామాట, ఏమనన్=నేనేమని యందును, మీతమకము=మీకాంక్ష-తొందరపాటు.

### తాత్పర్యము

రాజులారా! రాముని యువరాజు జేసెదనని నామాట వానోర వెడలినో లేదో మీరు దానిని పూర్ణముగ వినివినకముందే రాముఁడు ప్రభువుగా నుండఁగోరితిరి. మీతత్తఱపాటు-మీకాంక్షచూడ నన్నేదియో సందేహము బాధించుచున్నది. మీవాస్తవాభిప్రాయముఁ దెలుపుఁడు. మీరు భయపడనక్కఱలేదు. నా పరిపాలనమందు నేదైన లోపము గలిగి యిది తొలఁగిపోయిన మేలని తలఁచుచున్నారా? లేక రామునియందలి ప్రేమాతిశయముచేతనా? నిజము చెప్పుఁడు

కం॥ లేనో? ధర్మాత్ముఁడ నేఁ, గానో? ప్రజ కెల్ల సుఖముఁ గల్పింపనొ? నేఁ
బోనో మీమతి? మీరేలా నాసుతు రాజుఁ జేయఁ లాలసపడఁగన్? ౨౦

తన యభిప్రాయమును సర్వజను లామోదించుటయే కాక యావిషయమందు వారికిఁగలయాశ వేగిరపాటుచూచి తనకోరిక సంపూర్ణముగ ఫలించెనని లోలోన సుప్పొంగుచు దానిని వెలికిఁ దెలియనీక రామునివిషయమున జనాభిప్రాయము పూర్ణముగ విని యానందింపఁగోరి మరల మరల నిట్లు దశరథుఁడు ప్రశ్నించుచున్నాఁడు.

### తాత్పర్యము

నే నింకను జీవించియున్నానుగదా. ధర్మపద్ధతిని బ్రజలఁ బాలించుటయందు నాకు మనస్సులేదా? ప్రజలకు సుఖము నేను గలిగించుటలేదా? మీ యభిప్రాయ ప్రకారము నేను నడచుకొనుటలేదా? ఏల నాకంటెఁ జిన్నవాఁడై రాజ్యపాలనమందనుభవములేని నా కుమారుఁడు రాజుగావలయునని యింత యత్యాశపడుచున్నారు. నాయందు మీకుఁ బ్రీతివిశ్వాసము లుండెనేని నీకుమారుఁ డెప్పటికైన రాజగువాఁడే అయినకేమి తొందరవచ్చెను. నీవే యింకను గొంతకాలము రాజుగా నుండుమని చెప్పక యిట్లు చెప్పుట కేమి కారణము. నేను మీకేమి ద్రోహము చేసితిని?

—• పౌరులు శ్రీరాముని గుణములు వర్ణించుట. •—

సీ॥ అనుచు మహాత్ముఁ డా•డిన విని వారెల్ల, నొక్కమాటగ నిట్టు•లూఁది యనిరి
భూపాల! దేవక•ల్పుండు రామునియందుఁ,గల్యాణగుణములు•గలవు పెక్కు
లానందకరము ల•య్యవి ముచ్చటింతుము,వినవయ్య వీనుల•విందు గాఁగ
సత్యశౌర్యుఁడు రామ•చంద్రుండు దివ్యగు,
ణంబులఁ బురుడు స్వ•ర్నాయకునకు
తే॥ మేటియిక్ష్వాకులం దెల్ల• మేలుబంతి, రాముఁడార్జవధర్మప•రాయణుండు
లోకమున సర్వవినుతసు•శ్లోకుఁ డతఁడె,
రామువలనజనించె ధ•ర్మంబు సిరియు. ౨౦

భూపాల అనుటచే నీవు రాజ్యము చక్కఁగనే చేయుచున్నావనిభావము. ఊఁది=ఒత్తి, దేవకల్పుఁడు=విష్ణువుతో సమానుఁడు•సత్యశౌర్యుఁడు. సత్యమే శౌర్యముగాఁగలవాఁడు కావున నాయన సత్యము చేతనే భుజబలముతోఁ బనిలేక లోకముల జయించువాఁడు. వంచనలేని శౌర్యముగలవాఁడు. న్యాయ్య యుద్ధమందు ధర్మప్రకారము తనశౌర్యము చూపునేకాని యెట్లైన గెలువ వలయునని యధర్మము నాశ్రయింపఁడు. రామచంద్రుఁడు=చంద్రుఁ డేప్రకారము సమస్త భూతకోటులను పశుపక్ష్యాదులను సైతము సంతోషింపఁజేయునో యంతకు మించి యన్ని జీవకోటులను పక్షివృక్షాదులను గూడ సంతోషింపఁ జేయువాఁడై చంద్రునికంటె నభిరాముఁడైనవాఁడు. దివ్యగుణంబులన్= అప్రాకృతములైన భగవద్గుణంబులయందు, స్వర్నాయకునకు=వైకుంఠాధి పతియగు నారాయణునకు-పురుడు=సమానుఁడు-స్వర్ శబ్దము వైకుంఠమందే ముఖ్యాన్వయము. దేవలోకమందు గౌణము స్వర్నాయకుఁడనఁగా నింద్రుఁ డను నర్థము సరిగాదు. ఆయనయందు జారత్వ చోరత్వ కామదానత్వ క్రోధ లోభ మోహాసూయా ద్వేషాది దుర్గుణములు పెక్కుగలవు. రాముఁడో కల్యాణ గుణధాముఁడు హేయగుణ రహితుఁడు. ఆర్జవము=చక్కని నడవడి-ధర్మము వీనికి-పరాయణుఁడు=పరమగతియైనవాఁడు, సర్వవినుతసుశ్లోకుఁడు=సమస్త జనులచే స్తోత్రము చేయఁబడు మంచికీర్తిగలవాఁడు. లోకమునం దెంతటి యుత్తమ పురుషునైనఁ దప్పులు పట్టనివారుండరు. రామునందట్లు చెప్పువాఁడు లేఁడు.

తాత్పర్యము

ప్రజల క్షేమముగోరు గొప్పమనస్సుగల దశరథుఁ డిట్లు చెప్పఁగా విని పండితులు పామరు లనుభేదములేక యెల్లవారు నొక్కమాటగ నీప్రకారము నొత్తిచెప్పిరి. రాజా! నీపాలనమందు లోపముండుటచే మేము రాముని గోరిన వారముగాము. భయలాభలోభ పక్షపాతలోల బుద్ధులమై చెప్పినవారము కాము దేవునితో సమానుఁడైన రామునందు నానందకరములగు ననేక కల్యాణ గుణములు గలవేగాని హేయగుణమొక్కటైన లేదు. నీకొడుకగుటచేత నీకాయన మహిమ తెలియక పోవచ్చును నీకుఁ దెలియదేని మేము చెప్పెదము.

చెవుల పండువుగ వినుము. అట్లుండిన నేల యింతవఱకు నాకుఁ జెప్పలేదందు వేమో. నీవడుగలేదు మేము చెప్పలేదు. అడిగినప్పుడు చెప్పిననే మాయందింత సందేహము గలవాఁడవేనడుగక చెప్పిన మఱియెంత సందేహింతువో. శ్రీరాము నకు సత్యమే శౌర్యము. శౌర్యసాధ్యములైన కార్యములుగూడ శౌర్యముతోఁ బనిలేక సత్యమువలననే యాయనకు నగుచుండును. శౌర్యము చూపవలసి వచ్చినప్పుడును సత్యము దప్పఁడు. చందురునికంటెను సుందరుఁడు. అప్రా కృత గుణములందు సాక్షాన్నారాయణునకు సముఁడు. ఇక్ష్వాకుఁడు మొద లాయన వంశమునఁ బుట్టినవారిలో గొప్పవారనిపించుకొన్నవారిలో శ్రేష్ఠుఁడు. ఆర్జవమునకు ధర్మమునకుఁ బరమగతి. లోకములో నెంత గొప్పవారైనను వారిని కొందఱుమాత్రమే పొగడుదురు. రాముని కీర్తియో వీరు వారనక శత్రులు మిత్రులు ఉదాసీనులనక యెల్లవారిచేతను బొగడిత కన్నది. ఇంతయేల ధర్మమునకు లక్ష్మికి జనస్థానమే రాముఁడు. రాముఁడే వాని కునికిపట్టు-రాము నాశ్రయించి యవి జీవించుచున్నవి-రాముఁడు లేకుండిన లోకమున ధర్మము లేదు-సిరిలేదు.

సీ॥ చంద్రునిరీతి ప్ర•జారంజనంబున, క్ష్మాసాటి విమలక్ష•మాగుణమున
నసుపమబుద్ధి బృ•హస్పతితుల్యుండు, విబుధేంద్రునకు జోడు•వీర్యమునను
సకలధర్మజ్ఞుండు•సత్యసంధుండును, శీలవంతుఁ డసూయఁ•జేర నీఁడు
అపరాధులకు నైన•నాదరంబునె చూపు, దుఃఖుల కూఱట•దోఁపఁబలుకుఁ
తే॥ గృతము మఱవండునిర్జించె•నింద్రియముల,
మనసు మెత్తన స్థిరమతి•మధురవాది
నిజమరియు నాలకించెను•నిఖిల మార్య,
వృద్ధసద్విప్రులను గొల్చి•విహితరీతి. ౨౧

క్ష్మ=భూమి, విబుధేంద్రుఁడు=ఇంద్రుఁడు- శీలవంతుఁడు = సదాచార సంపత్తి గలవాఁడు, మధురవాది=తియ్యనిపలుకులు పలుకువాఁడు, నిజమరి= నిజము చెప్పువాఁడు, విహితరీతిని=శాస్త్రోక్తపద్ధతిని, నిజము+అరి=నిజమరి అసూయ=పరుల గుణములందు దోషమెంచు గుణము-స్థిరమతి = గొప్పసంక టము వచ్చినను ధ్యానుజేయు నంగీకరించిన కార్యము దప్పక చేయువాఁడు.

మధురవాది నిజమరియున్=మధురముగ నుండిననే యథార్థవాదిగానిజనుల కహితమైన సత్యమును బాటింపఁడు. "సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియం। ప్రియంచ నా నృతంబ్రూయాత్, దేషధర్మస్స నాతనః" యనికదా ధర్మశాస్త్రము చెప్పుచున్నది. (2) నిజమరియున్=సత్యం వద=సత్యమే చెప్పుము అని శ్రుతి బోధించునట్లు నిజమే మాటలాడును. అస త్యము జనులకుఁబ్రియమైయున్నను మాటలాడఁడు. (3) నిజముపరలోకహితమగు

నదృష్టము 'సత్యేసలోకాన్ జయతి' యనుచో సత్యశబ్దమున కీయర్థమే చెప్పఁబడెను గదా. నిజమరి=అట్టి నిజము గలవాఁడు. మధురవాదియైనను పరలోకమునకు విరోధమగు నిచ్చకములు చెప్పఁడు. మధురవాది=వేసవికాలమునమండు నెండల వేఁడిమికి మిగులఁ దపించినసేలపై నొక్క మేఘము వర్షించిననెంతచల్లపడునో యట్లు తాపత్రయములడఁగ మాటలాడువాఁడు ఇట్టి గుణములీయన కెట్లువచ్చెను. పుస్తకములు చదువుటచేతనా? ఎట్లువచ్చినను నణఁకువతోఁగూడినవా? గర్వముతోఁ గూడినవా? ఇట్టి సందేహమునకు సమాధానము. అర్యవృద్ధవిప్రులను=అర్య=గొప్పవారగు- ఈగొప్పతనము వీరికివచ్చుటకు హేతువు వీరనేక గురువులయొద్ద ననేకశాస్త్రములు పెక్కుతడవలు శాస్త్రమర్యాద ననుసరించి పఠించుటచే నని యెఱుంగునది. వృద్ధ=వయస్సుచేతను, జ్ఞానముచేతను ముసలివారు. ఇటువంటివారగు నద్విప్రులను=సాత్త్వికులగు బ్రాహ్మణశ్రేష్ఠులను గొలిచి=సేవించి, బ్రాహ్మణులనని చెప్పుటచే ననేకశాస్త్రములఁ జదివి బ్రహ్మజ్ఞాన సంపన్ను లయిన క్షత్రియులున్నను, వారి నుపాసింపక యట్టి గుణములు గల బ్రాహ్మణులనే యుపాసించెనని భావము. తనకు సర్వముఁ దెలిసియున్నను నంతటితోఁ దృప్తినొందక యింకను,నెవరెవరి యొద్ద నేమేమి విశేషరహస్యము లున్నవో యవియును సంపాదింపవలెనని యట్టి బ్రాహ్మణుల నుపాసించెనని భావము. తేనెటీఁగలు పుష్పములనుండు తేనెలు గొంచెమైనను విడువక సర్వమును గ్రహించునట్లు తానును బ్రాహ్మణులయొద్దనుండు సర్వశాస్త్రసారమును గ్రహించెను. తమయొద్దఁజేరి శ్రద్ధతో గ్రహించువానికి సర్వాంశములు చెప్పువారుగదా జ్ఞానాధికులగు సద్బ్రాహ్మణులు, విహితరీతిఁగొల్చి=తాను రాజకుమారుఁడ నను నభిమానముచే వారిని దనయింటికి రమ్మనక తానేవారింటికిఁబోయి తద్విద్ధిప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయాయన్నట్లు నమస్కారసేవా ప్రశ్నపూర్వకముగా గ్రహించెను. నాలుగవ పాదాదిని విసంధిగ వ్రాయుటకు కారణము పాదాంతమగుటచే నని యెఱుంగునది.

## తాత్పర్యము

రాజా! చంద్రుఁడెట్లు పిన్నలని పెద్దలని స్త్రీలని పురుషులని పండితులని పామరులని ధనికులని దరిద్రులని భేదము తలఁపక లోకులను సంతోషింపఁజేయునో యట్లులే నీకుమారుఁడు రాముఁడు సమస్తప్రజలను సంతోషింపఁజేయువాఁడు. నిష్కల్మషమైన యోర్పునందు భూమికి సమానుఁడు అసమానమైన బుద్ధియందు దేవతలకు గురువగు బృహస్పతితో సమానుఁడు. సామాన్యధర్మములు విశేషధర్మములనఁబడు సకలధర్మములను దెలిసినవాఁడు. ఆయనప్రతిజ్ఞ తప్పునదికాదు. తాను గొప్పవాఁడు తక్కినవారు కొలఁదివారను తారతమ్యబుద్ధి లేక సమానప్రతిపత్తి యెక్కువ వారితో బోలెఁదక్కువ వారితోడను గలసి మెలసి యుండువాఁడు. అసూయాది దుష్టగుణములను దగ్గఱకు రానీయఁడు.

దోషమును జేసినవారియందైనను నాదరమును గనఁబఱుచునేకాని కాఠిన్యము వహింపఁడు-కష్టపడువాఁని జూచినపుడు ప్రారబ్ధబలమున వారికష్టము ద్రోయ రానిదయ్యెనేని వారిమనస్సునకు శాంతిగలుగఁ బలుకును. కోపించినవారినిఁ జూచినను వారికోపము చల్లారుమాటలనే చెప్పును. ఒకరు తనకుఁ జేసినమే లెంతకొంచెమైనను మఱచిపోఁడు. మఱిహెచ్చుగ భావించును. ఇంద్రియము లను జయించి వానిని లోపఱిచికొనెను. వెన్నవంటి మెత్తని మనస్సుగలదయా వంతుఁడు కావున నాశ్రయించినవారిని దూరమందు విడిచిన వారేమి బాధపడుదురో యని భయపడుచుండువాఁడు. ఎవరు కొంచెము తనదీనస్థితి చెప్పుకొనినను అయ్యో పాపమేయని వారిని దగ్గఱఁదీసి కాపాడువాఁడు. చంచల మైన మనస్సుగలవాఁడు కాఁడు. తేనెవంటి తియ్యనిపలుకులు పలుకువాఁడు. సత్యవాది-ఆర్యులు=వృద్ధులునగు బ్రాహ్మణులసేవచేసి వారివలన శాస్త్రప్రకా రము సమస్తవిషయములను విన్నవాఁడు.

క౦॥ వీరుఁడు రణవితరణముల, ధీరుఁడు సురమర్త్యపూర్వ•దేవావిదితం

బై రాజిలునస్త్రాళి వి,శారదుఁడును సాంగవేద•చతురతరుఁడున్. ౧౫

రణవితరణములన్=యుద్ధమందును-దానమందును, వీరరసమున మూఁడు విధములవారు గలరు. రణవీరుఁడు-దానవీరుఁడు దయావీరుఁడని - ధీరుఁడు= ధైర్యశాలి, జంకులేనివాఁడు. సుర, మర్త్య, పూర్వదేవా విదితంబై =దేవతలకు మనుష్యులకు రాక్షసులకుఁ దెలియరానివై-పూర్వదేవతలు = రాక్షసులు-పూర్వ దేవా, సురద్విషయని యమరుఁడు-విశారదుఁడు=పండితుఁడు, సాంగవేది, అంగములతోఁ గూడిన వేదవిద్యయందు, చతురతరుఁడు=మిగుల సమర్థుఁడు.

తాత్పర్యము

శత్రువులతో యుద్ధము చేయుటయందును బీదలకు దానము చేయుట యందును వెనుకముందు చూచువాఁడు కాఁడు. అట్టిసందర్భములందు జంకు గొంకు లేనివాఁడు. ఇట్టిశక్తి యెట్లువచ్చెనన నది స్వభావసిద్ధమగుటయేకాక దేవతలకు మనుష్యులకు రాక్షసులకుఁ దెలియని యనేక శస్త్రాస్త్రములను సమ ర్థముగ నెఱిఁగిన పండితుఁడు. వేదములను వేదాంగములను నర్థముతోడ గ్రహించినవారిలో మిగుల సమర్థుఁడు- కావున శాస్త్రపాండిత్యమందు శాస్త్ర పాండిత్యమందు నీయనను మించిన వారు లేరు.

క౦॥ వ్రతవిద్యల స్నాతుండ ౖ,

ద్భుతముగ గాంధర్వ మెఱుఁగు•బుధనుతుఁడుమహా

మతి కళ్యాణాభిజనుం, డతులితసద్గుణగరిష్ఠుఁ•డమలుఁడు సతమున్. ౧౬

వ్రతవిద్యల స్నాతుఁడు=వేద మధీత్యస్నాయా త్తని స్మృతి చెప్పినట్లు వేదములను సాంతముగఁ బఠించి వ్రతములనన్ని సలిపి స్నాతకము చేసిన వాఁడు. కల్యాణాభిజనుండు=గుణములచేఁ బవిత్రములయిన తల్లిదండ్రుల వంశములు గలవాఁడు. సతము=ఎల్లప్పుడు.

## తాత్పర్యము

కొందఱు వేదాధ్యయనము సాంతముచేసి స్నాతకులగుదురు. కొందఱు వ్రతములందు స్నాతకులగుదురు రాముఁడో రెండింటియందును స్నాతకుఁడు సామవేదాధ్యయనమున కుపయోగమగుటచే సంగీతమును నాశ్చర్యకరముఁగ నెఱుఁగును. ఈ కారణములచే జ్ఞానులచేతను స్తోత్రము చేయఁబడినవాఁడు. విద్యలుండియు బుద్ధిలేదను లోపములేకుండ గొప్పబుద్ధికలవాఁడు. ఈ గొప్ప బుద్ధియు గొప్పగుణములు గొప్పవారగు తల్లిదండ్రులవంశములఁ బుట్టుటచే స్వభావముగ సత్కులప్రసూతిత్వముచేఁ గలిగెను. బంగారునకు మెఱుఁగుపెట్టి నట్లు లీయనయు స్వసద్గుణములచే మిగుల గొప్పవాఁడు. కావుననే సర్వకాలము లందును నిర్మలమైన మనస్సుగలవాఁడు.

కం॥ దురమునకై లక్ష్మణుతోఁ, బురమును బల్లెలను గావఁ•బోయి యరుల సం
గరమున నిర్జింపక తా, మరలఁడు సుమి,
శరణ మన్న•మన్నించుఁగ్రుపన్. ౬౪

దురమునకై=యుద్ధమునిమిత్తము, అరులన్=శత్రువులను, సంగరమునన్=యుద్ధమందు, నిర్జింపక=జయింపక-మరలఁడు=వెనుకకురాఁడు.

## తాత్పర్యము

దుష్టవర్తనులగు శత్రువులు పురములవారికిఁగాని పల్లెలవారికిగానిఁ కీడుకలిగించెదరా వారిని శిక్షించి జనులకు బాధతొలఁగించుటకై లక్ష్మణుతోడఁ బోయి బహిరంగయుద్ధమందు వారిని జయించికాని వెనుకకురాఁడు. అట్లువారు యుద్ధమునకు రాక శరణుచొచ్చి యిఁక నట్టిదుష్టకార్యములు చేయమనిచెప్పిరా యెంతటి కీడుచేసిన దుష్టులనైనను దయతో రక్షించును.

దీనివలన శ్రీరాముఁడు యువరాజగుటకుముందే కొందఱు శత్రువులను వధించినట్లు చెప్పఁబడెను. (అయోధ్య ౧౧౮౩-వ పద్యము చూడు) అందుఁ దిమిధ్వజసుతుఁడైన శంబరుని వధించినట్లు చెప్పఁబడెను.

సీ॥ రణరంగమునసుండి•క్రమ్మఱి వచ్చుచో,రథముననేఁ గుంజ•రముననేని
తనయిల్లుచేరక•మునుమున్న పౌరుల, నందఱఁ దనవారి•యట్ల చీరి
కుశలంబులడుగుమీ•కొడుకులకరుసమే,యిల్లాండ్రు లెస్సలే•భృత్యజనులు
శిష్యులు సుఖులె కా•క్షేమ మే యగ్నులు,జనదాఁటి పోవుగా•ఛాత్రగణము
తే॥ లల్లురును నాఁడుబిడ్డలు•నలరువారె?
సౌఖ్యవతు లొకొ్క కోడండ్రు•సాధులార!
యనుచు జనకుఁడు బిడ్డన•ట్లడుగుఁ గ్రుచ్చి
క్రుచ్చి పేర్పేర నందఱఁ•గుతుకమునను. ౬౫

రణరంగమునసుండి=యుద్ధప్రదేశముననుండి, క్రమ్మఱి=మరలి-కుంజరమునన్=ఏనుఁగుమీఁద, అరుసమే=హర్షమా? హర్షశబ్దభవము అరుసము - ఛాత్రగణము=శిష్యసమూహము, పేర్పేర=వరుసగ నందఱిపేర్లు చెప్పుచు, దీనివలన

నయోధ్యాపురంబున నున్న ప్రతిగృహమునందుండు నెల్లవారిని వారిపేర్లతోడ రాముఁడెఱిఁగెనని తెలిపెడిని. రామునకు దెలియని మనుష్యుఁడే యయోధ్య యందులేఁడు. ఆహా యెక్కడి జనవాత్సల్యము. అంతఃపురస్త్రీలవలె నుండు రాజులకురామునకునెక్కడి పోలిక-ఈకారణముచేతనే యిప్పటికి రామరాజ్యము రామవాక్యమని పేరు జగమునఁ బ్రసిద్ధినొందినది. అప్పుడెంతలేకున్న నిప్ప టికికించిచ్ఛేషము మిగులును.

## తాత్పర్యము

మహారాజా! రాముని గుణములను మేమేమని వర్ణింతుము. గొప్పవారు గొప్పవారిని తమ కక్కఱ లవసరముల నుపయోగపడు వారిని నాదరించుట గొప్ప విషయముగాదు. అది నీవును జేయుచునే యున్నావు. నీకుమారుని జన వాత్సల్య మెట్టిదో మాయనుభవముచేఁ జెప్పెదము వినుము. యుద్ధమునకుఁ బోయి కొంతకాల మయోధ్యయందు లేకయుండి శత్రువుల జయించి రథము నందో యేనుఁగుమీఁదనో కూర్చుండి మరలి యయోధ్యప్రవేశించి తనయింటికిఁ బోయి నిన్నుఁ దల్లిని భార్యను జూచుటకు ముందే మార్గమందుఁగల పురజనుల నందఱను దనయాత్మబంధువులను బిలిచినట్లు చనవుగను మర్యాదగను బిలిచి ప్రతిగృహస్థుని నయ్యా మీకొడుకులు సంతోషముతో నున్నారా? మీభార్యలు బాగున్నారు కదా. మీసేవకులకు శిష్యులకు సుఖమేకదా. అగ్నిహోత్రమునకు హానిలేదుకదా. మీశిష్యులు మీయాజ్ఞమీఱి వర్తింపరుకదా. మీయల్లుండ్రు నాఁడు బిడ్డలు బాగున్నారుకదా. కోడండ్రకు సుఖమేకదా. యని ప్రతిగృహమం దుండు వారిపేర్ల నన్నిటిని వరుసగఁ జెప్పుచు నడిగి తెలిసికొని సంతుష్టిపడి యావల నింటికిఁ బోవును. ఇటువంటివాఁడు మఱి యెవ్వఁడయ్యా?

కం॥ వ్యసనంబులు జనములకును,
బొసఁగినఁ దా నధికదుఃఖముమను బొందును; సం
తసమును గన జనములు సం,
తసమును దా నొందుచుండుఁ దండ్రి విధమునన్. ౬౭

వ్యసనంబులు=దుఃఖములు, పొసఁగినన్=కలిగినయెడల, తాన్=రాముఁడు అధిక దుఃఖమును=వారుపడెడి బాధకంటె నెక్కువబాధను, సంతసము=సంతో షము, జనములకున్=దేవతలకుఁ దల్లులకు నంతఃపురస్త్రీలకే కాదు భూమి మీఁదఁబుట్టిన సమస్తప్రాణికోట్లకునని గ్రహింపవలెను. అయినను జనములను పదము మనుష్య పర్యాయముగా వాడఁబడుచుండుటను మహాలమున మను ష్యాణా'మ్మని యుండుటను మనుష్యుల కనియే గ్రహింపవచ్చును. ఈ కారణ ముచే పండిత పామరస్త్రీ పురుష బాలవృద్ధ ధనిక దరిద్రాదిభేదములు రాముని దయయెఱుఁగదు. ఆయనదయ సర్వసమము. అందఱార్తులయందుఁ బ్రవర్తిం చును. అధికదుఃఖమును=అనఁగా కొంచెము పేషు దుఃఖించుటగాదు, మొదటవిశేష

ముగ దుఃఖించి యాపలఁ గ్రమక్రమముగఁ దగ్గి మఱచుటగాదు. బురదలో దిగఁబడిన యేనుఁగు దానిలోనుండి తప్పించుకొని యొడ్డెక్కుటకై యెట్లు సర్వ శక్తి వినియోగించునో యట్లు తన సత్తకొలఁది దుఃఖించును. ఏల రామునికంత దుఃఖమనిన నిది నాపరిపాలనమందలి వైగుణ్యముచేతఁగదా నాపరిపాలనమునకు లోపడిన వారి కిట్టికష్టము కలిగెను. ఎట్లు వీరిని దీనినుండి యుద్ధరింతును. అని వారిని మరల నుద్ధరించువఱకు దుఃఖించుచుండును. నేనై మిమ్ము రక్షింపవలసియుండఁగా మీరై వచ్చి రక్షింపఁగోరువఱ కుపేక్షించితిని గదా యని సిగ్గుచున్నదని కదా రాముఁడు దండకాటవి మునులకుఁజెప్పెను. సీతావిషయమై రామ విలాపమున కిదియే కారణము. అధిక దుఃఖమనఁగా బాధచే దుఃఖించువారుకూడఁ దమకై దుఃఖించు నీయన దుఃఖమునుజూచి తమ దుఃఖమును మఱచి యీయన దుఃఖమును నివారింప యత్నించు నంతటి దుఃఖమని భావము.

## తాత్పర్యము

బిడ్డలకు వ్యాధిగాని యితరకష్టముగాని వచ్చెనేని వారుపడెడి బాధకంటె వారి తల్లిదండ్రుడు లెక్కువబాధ వాత్సల్యాతిశయముచేఁ బడుచుందురు. బిడ్డలు సంతోషించిరా వారికంటె నెక్కువగ వీరు సంతోషింతురు. అట్టులే యయోధ్య యందేకాదు లోకములందన్నిట నుండు జనములలో నేప్రాణికైన దుఃఖము కలిగెనా జగత్పితయగు రామచంద్రుఁడు వారికంటె నెక్కువగఁ బరితపించును. భగవంతుఁడగు రామచంద్రుఁ డత్యంత దయామూర్తి కావున దుఃఖించు జనులఁజూచి యయ్యో వీంకి జ్ఞానము రావలె బాగుపడ వలయునని నేను శాస్త్రములు కల్పించి విజ్ఞులచేఁ జెప్పించి యప్పుడప్పుడు నేను బ్రత్యక్షముగ బోధించి యింతశ్రమించినను వీరు వక్రమార్గములఁ బోయి కష్టముల పాలగుచున్నారుగదా. వీరినెట్లు మతిమంతులఁజేయుదునని విశేషముగ దుఃఖించును. మంచిమార్గమునను౦డి సుఖపడు వారిని జూచి విశేషించి సంతోషించును.

పైపద్యంబులందుఁ జెప్పఁబడినవి సర్వసజ్జన సామాన్యలక్షణములు. ఈ పద్యమునందు శ్రీరాముని యసాధారణ గుణములు చెప్పఁబడెను.

పుత్రాదుల సంతోషమువలనఁ దండ్రులకుఁగలుగు సంతోషము రెండు విధములు. తమ బిడ్డలకు ధనలాభము లౌకికసహాయము గలిగిన పామరులగు తండ్రులు సంతోషింతురు. 'ప్రనృత్యంతి పితామహాః యద్యేకోపి గయాం వ్రజేత్తన్నటుల తమవంశ మభివృద్ధినొంది యందుఁ బెక్కుఁ రుదయించిరేని యందఱిలో నొక్కండైన గయకుఁబోవువాఁడు గలుగునుగదా యని పితరులు నృత్యమాడుదురన్నట్లు, శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు, కశ్చిద్యతతి సిద్ధయే। బహుజన్మసహస్రాంతే దిష్ట్యాయస్తుప్రపద్యతే" వేలకొలఁదిజనులలో నెవఁడో యొకఁడే మోక్షమునకై యత్నించును. అట్టివాఁడును పెక్కువేల జన్మములు

కడచిన పిమ్మట నదృష్టము బలమునఁ బ్రవర్తిచేయును. అన్నట్లు ప్రత్యాశ కలుగును గావున అధికముగ ననువదము సంతసించుననుచోటను ననువర్తింప వలయును. రాముఁడు సంతోషించుట పురమున నింటివారు సంతోషించు నపుడేకాదు. కూఁతురు పుట్టుటలోనగు కార్యములందు నింటివారికి ననాదరణ బుద్ధియుండినను వాకిట శుభసూచకముగ మామిడియాకు తోరణములు పూల దండలు లోనైనవి కట్టినను రాముఁడు సంతోషించుచుండెను.

కల్యాణ గుణైకతానుఁడు భగవంతుఁడగు రామునందు హేయగుణమైన దుఃఖమును జెప్పవచ్చునాయని యాక్షేపము. రామచంద్రమూర్తి తనకుఁ గలిగిన దుఃఖములకై శోకించిన వాఁడెన్నఁడుకాఁడు. బిడ్డలకుఁ గష్టమువచ్చిన వారికి దుఃఖించు తండ్రివలె నయ్యో నావారి కిట్టి దుఃఖము కలిగెనే. ఇది నివర్తించుటయెట్లని వారికై దుఃఖించును. దీనికే దయాగుణ మనిపేరు. కావుననే రామచంద్రమూర్తికిఁ గరుణాకాకుత్స్థుఁడని బిరుదు.

సీ॥ బహుళసంకటములు•ప్రాప్తించె నేనియు,సత్యంబు దప్పని•చదురుకాఁడు
ఎగచుచో శత్రుల•నింద్రచాపముఁ బోలు,
పెనువిల్లు ధరియించు•బిరుదుకాఁడు
రోషంబయేని సం•తోషంబ యేనియుఁ,బొల్లువోవఁగ నీని•పోటుకాఁడు
ప్రత్యక్షమైననా•రాయణునట్టుల, నెఱి మించు తేజొప్పు•నీటుకాఁడు
తే॥ సూటి తప్పనిబాణంబు•నేటుకాఁడు,మంచియుక్తుల గురుఁబోలు•మాటకాఁడు
పాటి దొఱఁగనికథలందు•నేటుకాఁడు, దేవపతియైన నీతిని•దీటు కాఁడు. ౧౭

సంతోషశబ్దభవము సంతసము-రూ. సంతోషము. చదురుకాఁడు=నేర్పరి చాతుర్యశబ్దభవము చదురు. బిరుదుకాఁడు=పౌరుషశాలి బిరుదము తద్భవము బిరుదు బిరుదము, ఎగచు=శత్రువులపైపడి తఱుము. పొల్లుపోవఁగ నీని= వ్యర్థపడనీయని, పోటుకాఁడు=పోటుగలవాఁడు, నెఱి=అందము. తేజము తద్భ. తేజ. గురుఁన్=బృహస్పతిని, పాటి=క్రమము-నీతి, దీటు=సమానము. అనుబంధమైన కాఁడునకు కలవాఁడని యర్థము.

## తాత్పర్యము

ఎన్నియో యెటువంటి దుస్సహమైనచో కష్టములు కలిగినను సత్యము దప్పినయెడలఁ గష్టములు దొలఁగునట్లుండినను సత్యము దప్పని సమర్థుఁడు. "వారిజాక్షులందు వైవాహికములందుఁ బ్రాణవృత్తి మానభంగమందుఁ జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు బొంకవచ్చు"నను నీతి దుర్బలులకు శరణము గాని బొంకాడక కార్యము చేయఁగలిగిన సమరుని విషయముగాదు. శ్రీరాముఁడు సుమంత్రునకు నసత్యమాడ నేర్పెను. సీతాదేవి హనుమంతుని విషయమున నసత్యమాడెనందురేమో అది పరప్రాణ రక్షణార్థముగాని స్వలాభార్థముగాదు. ఆసందర్భములందు స్వసామర్థ్యమునకు వినియోగములేదు.

పగవారిని యుద్ధమునఁ దఱుమునపు డింద్రధనుస్సువంటి పెద్దవిల్లు ధరియించి చూడఁగనే శత్రువులు భయపడునట్లుండువాఁడు. బక్కకోపము పెదవులచేటు అన్నట్లు దుర్బలులకుఁ గోపమువచ్చిన భయములేదు. సంతోషము వచ్చిన లాభములేదు. రెండు ఫలహీనములే-రాముని విషయమం దట్లు గాదు. ఎవరి విషయ మందైన సంతోషించెనా మేలు-కోపించెనా కీడు తప్పక చేయువాఁడు. కావున రాముని నాశ్రయించిన వారికి మేలు తప్పక కలుగుట సిద్ధము. "యత్రరామో భయంనాత్ర నాస్తితత్ర పరాభవః" రాముఁ డున్నచోట జననమరణ శత్రుదారిద్ర్యాది రూపకభయములేదు అవమానముజన్మము లేదు. ఈగుణములు లేని రాజు రాజుగానుండఁ దగఁడు. "శ్లో॥ ప్రసాదో నిష్ఫలో యస్య క్రోధశ్చాపి నిరర్థకః, నతంభర్తార మిచ్ఛంతి; షండం పతిమివస్త్రియః" భార. ౫-౩౪-౭౧ నపుంసకుఁడగువానిని స్త్రీలు భర్తగాఁగోర నిచ్ఛగింపనట్లు ఎవనికోపము అనుగ్రహము వ్యర్థములో యట్టివానిని భర్తగా ప్రజలు గోరరు.

శ్రీమన్నారాయణుఁ డెట్టెట్టి చిహ్నములు గలవాఁడని శాస్త్రములు చెప్పుచున్నవో యట్టి చిహ్నములన్నియు శ్రీరామునం దుండుటచే నాయనను జూచినవారు శ్రీమన్నారాయణుఁడే మనకుఁ బ్రత్యక్షమైనాఁడని తలఁచున్నట్లు చేయు సౌందర్యముచే తేజస్సుచే నతిశయించువాఁడు. రామబాణము గురి తప్పిన దెప్పుడులేదు. చమత్కారముగ యుక్తియుక్తముగ ధర్మము తప్పక మాటలాడుటయందు బృహస్పతిని మించినవాఁడు. ఈకారణముచే వితండావాదము విరుద్ధకథలు వీనియందు సమర్థుఁడయ్యును నీతిక్రమములు తప్పని చరిత్రములందు మేటియగువాఁడు. ఇంద్రుఁడైన నీయనకు సమానుఁడు గాఁడు. ఇది వాస్తవమేకదా. మేరుపర్వతము మనకు గొప్పదియేకాని బ్రహ్మాండమున నది యెన్నవభాగము.

కం॥ ఇమ్మున విండుల నగుకను,బొమ్మలఁ గలవాఁడు విషయ•ములకై చపల
త్వమ్మును బొరయనివాఁడు న,
హమ్మతి లేకుండువాఁడు•నతిమహిముండున్. ౭౮

ఇమ్మునన్=అందమునందు-విండులన్=ఎక్కు పెట్టఁబడిన ధనస్సులను, విషయములకై=రూపరసగంధాదులకై, చపలత్వము=మనస్సు నిలుకడలేమి-అహమ్మతి=అహంకారము, అతిమహిముండు=అసాధారణమైన మహిమగలవాఁడు-అమానుషచర్యగలవాఁడు. తాత్పర్యము

ఎక్కుపెట్టఁబడి వంపుగానుండు వింటిదబ్బలవలె నందమైన కనుబొమ్మలు కలవాఁడు రూపరసగంధాది విషయములకై పాతరలాడని స్థిరమైన మనస్సు గలవాఁడు. అహంకారము లేనివాఁడు. మనుష్యులయందుఁ గానరాని గొప్ప మహిమ గలవాఁడు.

కం॥ ఈలోక మేల? యెక్కఁడె, త్రైలోక్యం బైన నేలఁ దగు; వధ్యులనే
పాలార్చెడిని; నవధ్యుల,జోలికిఁ బోవండు సత్యశూరుం డగుటన్. ౬౯

వధ్యులు=వధింపనర్హులు-అవధ్యులు=చంపరానివారు - సత్యశూరుఁడు= యుద్ధాదులందు ధర్మము తప్పనివాఁడు. సత్యమే శౌర్యముగాఁ గలవాఁడు కావున సత్యేన లోకాన్‌జయతి' యన్నట్లు ఆయుధముపట్టక సత్యముచేతనే లోకములనన్నిటిని జయించువాఁడు.

## తాత్పర్యము

రాజా! శ్రీరామచంద్రమూర్తి యీరాజ్యమును బాలింప యోగ్యుఁడా యని మాయభిప్రాయ మడిగితివి. తుచ్ఛమైన యీ భూలోకమేకాదు. మూఁడు లోకములను బాలింప సమర్థుఁడు ఎట్లు? బలముగలవాఁడగుటచే నందఱ హింసించి వశపఱచుకొనియా యందువేమో అట్లుగాదు వధింపఁదగిన దోషము చేసినవారగుటచే జంపఁదగినవారిని మాత్రమే వధించును గాని యితరుల వధింపఁడు. అట్లైన యుద్ధాదు లెట్లుచేయును. శత్రుబాహుళ్య మగునుగదా యందువా. అట్టి భయము లేదు. ఆయన సత్యముచేతనే ముల్లోకముల జయించును. ఒకవేళ విల్లుపట్టి యుద్ధము చేయవలసివచ్చినా ధర్మమార్గమున యుద్ధముచేయునుగాని ధర్మము విడిచి యుద్ధముచేయఁడు అందు నెంత కొంచెము శత్రువులకు బాధకలిగింపవలెనో యంతే కలిగించి జయించును.

కం॥ సంతస మిడుపురుషున కేకాంతము ఘటియించుఁ గామితార్థములన్;భా
స్వంతుఁడు కరములఁబోలెన్, శాంతప్రజాకాంతగుణగణంబుల వెలుఁగున్

సంతసమిడు=తనకు సంతోషము కలిగించు, ఏకాంతము=మిక్కిలి, కామితార్థములన్=కోరఁబడిన ప్రయోజనములను, ఘటియించున్ = సమకూర్చును, భాస్వంతుఁడు=సూర్యుఁడు, కరములన్=తనకిరణములచే శాంతముతోఁగూడి, ప్రజాకాంత=జనమనోహరములైన, గుణగణములన్=సద్గుణసమూహములచే - వెలుఁగున్=ప్రకాశించును.

## తాత్పర్యము.

తనకు సంతోషము కలిగించిన వారికి మనస్సునందుఁగల కోరికకంటె మిక్కుటమైన ఫలము నిచ్చును (కుచేలునకుఁ గృష్ణునివలె) సుగ్రీవునిచే నాజ్ఞాపింపఁబడిన హనుమంతుఁడు భృత్యకార్యము నిర్వహించెను. అది యాయనకు విధి అట్లు చేయకుండిన నన్నిక్రోఁతులలో నాయనయు నొకక్రోఁతిగా నెన్నఁబడియుండును. స్వామి కార్యమును భృత్యుఁడు నిర్వహించినపుడు ఏదో గొప్ప బహుమానమిచ్చినఁ జాలును. రాముఁడట్లు చేయలేదు. హనుమంతుఁడు చేసిన కార్యము తనకు సంతోషకరము గావునఁ ద్రిలోకాధిపత్య మిచ్చినను గొఱఁత యని భావించి తన్నే సమర్పించుకొనెను. (ఎంతో శ్రమించి తనకు సంతోషము కలిగించెనని రాముఁ డిట్లుచేసెను గాని సీతాదేవి రాముఁడు జయించెను అని

రెండుమాటలు చెప్పినదానికే సీతాదేవి తన్నర్పించుకొనుట - కస్వతంత్రురా లగుటచే రాముఁడిచ్చినదానికంటె నెక్కువయేమి యిత్తునా యని యాలోచించెను. హనుమంతునకు రాముఁడిచ్చినదికూడఁ గొంచెఁత యనియే సీతాభి ప్రాయము) తన్ను సంతోషపెట్టినవారికి మేలు చేయుటయం దేమి విశేషమందు రేమో భగవంతుఁడు తన్నాశ్రయించినవారికి నెక్కువమేలు (మోక్షము) చేయును. తక్కినపామరుల కైహికసుఖము లిచ్చి రక్షించును. సూర్యుఁడు లోకమున కంతయు వేడిమి కలిగించినను తనకిరణముల నాశ్రయించిన వారి చలినే కదా నిశ్శేషముగఁ బోఁగొట్టును.

ఇందు నాలవపాదంబున సంయుక్త నకారమునకు ణకారమునకు యతి

సూర్యకిరణములకు రామునిగుణములకుఁ బోలికచెప్పుటచే సూర్యకిరణములందు హేయకిరణములేనట్టు రామునందన్నియుఁ గల్యాణగుణములే కాని హేయగుణము లేదని భావము. భగవంతుఁడు నిర్గుణుఁడన్నప్పుడు హేయగుణములు లేనివాఁడు కల్యాణగుణములు కలవాఁడనియేగదా వాస్తవార్థము.

తే॥ అట్టిరాముని సత్యశౌ•ర్యాదిధాము, నఖిలసజ్జననుతసద్గు•ణాభిరాము
లోకపాలోపమునిఁగోరెఁ•బ్రాకటముగ,
వసుమతీకాంతదనకూర్పు•వల్లభుఁడుగ. ౩౧

సత్యశౌర్యాదిధామున్-సత్యము = అధర్మమార్గమున నిష్కారణముగ నితరులకు నష్టిగాని తనకు లాభముగాని కలుగక భూతహితముగఁ జెప్పెడు మాట. నిరపరాధులకుఁ గష్టము కలిగించు సత్యము సత్యము గాదు. నిరపరాధులఁ గష్టమునుండి తొలఁగింప బొంకినను నది బొంకుగాదు. శౌర్యము= శూరభావము. మరణమునకు భయపడక యుద్ధమునఁ బోరఁబడుట శౌర్యము. 'శూరో మరణనిర్భయాత్' అని వచనము. ఆదిశబ్దముచే వీర్యపరాక్రమములు గ్రాహ్యము-వీర్యము=తాను వికారము పొందక శత్రువులను మనస్సునఁ గలవరపడి పరువెత్తునట్లు చేయుగుణము. పరాక్రమము=యుద్ధమునందులఘు సంచారము చేయుచు ప్రవేశింపరాని చక్రవ్యూహాదులందన్నిటఁ బ్రవేశించి శత్రువుల నాక్రమించుట పరాక్రమము. ఇట్టి గుణములకు ధామున్=వాసస్థానమైనవానిని అనఁగా నీగుణములన్నియు రామునందు స్థిరముగ నెలకొని కాపురము చేయుచున్నవని భావము.

సజ్జననుత=సాధువులచేఁ బొగడఁబడిన, సద్గుణ=మంచిగుణములచే-అభిరామున్=ఒప్పుచుండువానిని-లోకపాలోపమునిన్=దిక్పాలకులతో సమానుఁడగువానిని. ఇంద్రాదులు దిక్పాలకులు-వానిలో నెవనిపేరు చెప్పక లోకపాలోపముఁడనుటచే అష్టదిక్పాలకులయందుండు గుణములు రామునందుఁ గలవనిభావము అటుగాక లోకపాలోపమునిన్=సర్వలోకరక్షకుఁడైన శ్రీమన్నారాయణుని, వసుమతీకాంత=భూదేవి-వసుమతి=బంగారు ధనము గలది-తనకూర్పు = తనకిష్టుఁ

డైన వల్లభుఁడు=ప్రియుఁడు. భూమిగోరె ననఁగా లక్షణచే భూమియందలి జనులందఱు నని భావము.

లోకములో రాజులందఱు తమకు భూ ప్రజాధిపత్యము కోరువారే. రాముని విషయమట్టిదిగాదు. భూప్రజలే రాముఁడు తమకుఁ బ్రభువుగా నుండఁ గోరిరి. భూమియేకోరె ననుటచే రామునివిషయమున విరుద్ధాభిప్రాయము గలవాఁ డొక్కఁడైన లేఁడని భావము. వసుమతి సుమతి మతిమతి యగుకాంత (సుందరి) దరిద్రుని దుర్మతిని మతిహీనుని గురూపిని ప్రియుఁడుగఁ గోరనట్లు భూదేవియు వసుమంతుఁడు సుమతి మతిమంతుఁడు సద్గుణాభిరాముఁడు శౌర్యాది ధాముఁడు నగుఁ రామునిఁ గోరెను. భూదేవి సాక్షాద్విష్ణువును వరించుట సమంజసమేకదా కూర్చువల్లభుఁడుగ ననుటచే గత్యంతరము లేక వరించుట కాదనియుఁ బ్రేమపూర్వకముగ నుత్కంఠతో వరించుట యనియు నర్థము తనకూర్చువల్లభుఁడుగన్=అనుచోఁ దనకు+ఊర్చు+వల్లభుఁడనియు సంధివిడఁదీయనగు, ఊర్చు=శ్వాసముపుచ్చు. తనకొఱకై శ్వాసముపుచ్చు=జీవించువల్లభుఁడని యర్థము. రాముఁడు జీవించుట భూరక్షణార్థమని భావము. ఇది సత్యమేకదా.

తాత్పర్యము

దుష్టశిక్షణమున కుపయుక్తములైన ధైర్య శౌర్య వీర్య పరాక్రమాదులును, సాధురక్షణమున కుపయోగకరములైన శాంతి దాంతి లోనగు సద్గుణములును, ధర్మసంస్థాపనమునకుఁ గావలసిన సత్యగుణమునుగల రాముని, దిక్పాలురతోడను శ్రీమన్నారాయణుతోడను తుల్యుఁడగు రాముని; నిక్కడఁ జేరిన మేము నలువురము గోరుటగాదు. భూదేవియే=భూప్రజలందఱు నేకగ్రీవముగ నాయనను దమపతిగా వరించిరి. వారి యభిప్రాయమునే మేము దెలుపుచున్నారము. కావున నీవిషయమున దేశమందు భిన్నాభిప్రాయములేదు.

కం॥ ఈరీతిని ద్వత్సుకృతా,ధారుని శ్రీరాముఁ గంటి•తనయునిఁగా నీ
వోరాజ! యేమిపుణ్యమొ, మారీచుఁడు కశ్యపర్షి•మాద్కిం జూడన్. ౩౨

త్వత్సుకృతాధారునిన్=నీపుణ్యమున కాధారమైనవానిని ఆధారహీనమైన పదార్థము నేలఁబడునట్లు నీపుణ్యము రాముని నాధారముగఁ గొనియున్నది. ఆయనను చేవిడిచిన నీకధోగతియే యని భావము. దశరథుని సత్యమును రాముఁడు కాపాడకుండిన దశరథునకు నరకప్రాప్తి తప్పియుండదుగదా. ఊరక చేవిడిచిన దానికే యాయన నికృష్టపుఁ జావు చచ్చెను.

తాత్పర్యము

రాజా! నీ వెంత పుణ్యవంతుఁడవో-పుత్రశబ్దమును సార్థకము చేయుచుఁ బున్నామ నరకమునుండి తప్పించుటయేకాక తక్కిన పుణ్యములను జెడకుండ రక్షించి రాజులవశ్యము పోవలసిన నరకమునకు నిన్నుఁబోకుండ రక్షించు

వానిని రాముని గొడుకుగాఁ గంటివి. నీకు మఱియొకఁడు పుత్రుఁడై యుండె నేని కాముకుఁడువగు నిన్ను నరకమునుండి తప్పింపఁ జాలియుండఁడు. నీవును యోగ్యుఁడవగుటచేతనే మరీచికిఁ గశ్యపుఁడు సుతుఁడై జనియించినట్లు మహర్షి తుల్యుఁడగు రాముఁడు నీకు సుతుఁడై జనించెను. ఆయన తండ్రిగా స్వీక రింపఁదగినవాఁడవు నీవు తప్ప వేఱొకఁడు లేఁడు.

కం॥ రాముఁడు సుఖియగుఁ గావుత,
రాముఁడు చిరజీవి యగుచు • రంజిలుఁ గాతన్
రాముఁడు నిరామయుం డగు, రామునకున్ దేహబలము • గ్రాలెడి నెపుడున్

సుఖి=సుఖముగలవాఁడు, చిరజీవి=దీర్ఘకాలము బ్రదుకువాఁడు, నిరా మయుఁడు=(నిర్+ఆమయము) వ్యాధిలేనివాఁడు.

కం॥ అని వేల్పులు గంధర్వులు, జనములుఁ బన్నగులు రాష్ట్ర • జనపదములఁ బ
ట్టనములఁ బరదేశంబులఁ, మనసిమను గోరుచుండ్రు • మహిపా! సతమున్.

వేల్పులు=దేవతలు, జనములు=ఋషులు, దేవగంధర్వ శబ్దములతోడ వచ్చుటచే నిచట జనములనఁగా ఋషులనియే చెప్పనొప్పును. జనపదములు= గ్రామములు, పట్టనము=పత్తనము, సంస్కృత శబ్దమగు పట్టనశబ్దమందు ణత్వములేదు. తవర్గ పంచమాక్షరమే గ్రాహ్యము. శ్రీరంగపట్టనమని రామ రాజభూషణుఁడు. పట్టనశబ్ద వికృతి పట్టణము.

పరదేశంబులన్=ఇతరరాష్ట్రములవారును (రాజులు ప్రజలు) రాముని క్షేమము గోరుచుందురు. వారు గోరనేల? "అసంతుష్టోద్విజో నష్టః, సంతుష్ట ఇవపార్థివః సలజ్జా గణికానష్టా, లర్లజ్జేవ కులాంగనా" తృప్తిలేని బ్రాహ్మ ణుఁడు. తృప్తిగలరాజు, సిగ్గుగల వేశ్య, సిగ్గులేని కులాంగన చెడుదురు. అన్నట్లు సాధారణముగా రాజులు పరరాష్ట్రములను దమ వశపఱచుకొన దండెత్తుచుందురు. ఆకారణమున నితర రాష్ట్రముల రాజులకుఁ బ్రజలకుఁ గూడఁ గష్టములు సంభవించును. రాముఁడు ధర్మాత్ముఁడు జితేంద్రియుఁడు కావున నాయనవలన నెవరి కేవిచారము భయములేదు. కావున నాయన మేలు గోరుచుందురు.

### తాత్పర్యము

రాజా-రామునకు నెపుడు సుఖమే కలుగుచుండును గాక. రాముఁడు దీర్ఘకాలము జీవించునుగాక రామునకు నాధి వ్యాధులవలన బాధలేకుండును గాక. రామునకు రోగబాధ లేకుండుటయే గాక దేహబలము వర్ధిల్లుచుండును గాక యని యీవిధముగ దేవతలు గంధర్వులు-ఋషులు పన్నగులు లోనగు వారు రాష్ట్రములందును గ్రామములందును పట్టనములందును మనదేశమందే కాక యితర దేశములందును సర్వకాలములందును గోరుచుందురు.

ఉ॥ రాముని మేలుకోరి నగ • రంబున రాష్ట్రమునందుఁ బక్కణ,
గ్రామములందు నిత్యముఁ ద్రి • కాలములందును నెల్ల వేల్పులన్

నేమ ముసన్ భజింత్రు తరుణీమణులున్ ముదుసళ్లు స్త్రీలునున్
గ్రామజనాదినాగరులు రాముని దప్ప స్మరింప రెవ్వనిన్.

నగరము=పెద్దపట్టణము (వ్యు-తన నడుమ పర్వతముగలది) పక్కణము=బోయపల్లె. తరుణీమణులు=నడిమిప్రాయమందుండు స్త్రీరత్నములు, ముదుసళ్ళు=వృద్ధస్త్రీలు, స్త్రీలునున్=ఆడువారుకూడ. అనుటచే పురుషులు మాత్రమేకాదు గృహకృత్యలంపటలైన స్త్రీలు నని యర్థము, నాగరులు=నగరమందుండువారు.

## తాత్పర్యము

రాజా! రామచంద్రుని విషయమున మంచి యభిప్రాయముగలవారు రాజకీయ వ్యవహారంబులందు సంబంధముగల పురుషులు మాత్రమేకాదు, మనదేశమందేకాదు ఇతర దేశములందును; మన నగరమందేకాదు ప్రతినగరమందును, ప్రతి రాష్ట్రమందు బోయపల్లెలందు, నితరగ్రామములందును; నెపుడో యొకప్పుడు మాత్రముకాదు ప్రతిదినము నిత్యకృత్యముగా నుదయ మధ్యాహ్న సాయంకాలములందును, రాముని మాహాత్మ్య మెఱిగిన పండితులే కారు పల్లెటూళ్ళవారు, పట్టణములవారు. పురుషులు మాత్రమేకారు ప్రాయపుస్త్రీలు, ముదుసళ్లు=పెద్దవారు మాత్రమేకారు. బాలురు బాలికలు. మనుష్యులు మాత్రమేకారు. దేవతలు గంధర్వులు పన్నగులు ఋషులుకూడ, నొక దేవతనేకాదు తమ యిష్టదేవతల నందఱను రామునకు సుఖము గలుగవలె రాముఁడు దీర్ఘాయువు కావలె. రామునకు దేహారోగ్యము స్థిరమై యుండవల నని ప్రార్థించుచున్నారు. సర్వదా యిందఱును రాముని దప్ప మఱి యితరులఁ దలంచుటయేలేదు.

శ్రీరామునందట్టి యనన్యప్రేమ భక్తిగలవారగుటచేతనే వీరికందఱకు శ్రీరామనిర్యాణ కాలంబున ముక్తిలభించెను.

"ఉపాసతా మాత్మవిదః పురాణాః॥ పరంపుమాంసం నిహితం గుహాయామ్।
వయంయశోదా శిశుబాలలీలా, కథాసుధాసింధుషు లీలయామః॥కృష్ణకర్ణా.॥

హృదయ గుహయందుండు పురుషుని నాత్మవిదు లుపాసింపనిండు. మేము యశోదాదేవి శిశువైన బాలకృష్ణుని కథలనెడి యమృత సముద్రమున సోలలాడుచుందుము.

గీ॥ రామచంద్రుఁగూడి రాకలఁ బోకలఁ॥గదిసితిరుగువారుఁ గన్నవారు। వంటి
కొన్నవారు నాకోసల ప్రజ। లరిగి రాదియోగు లరుగుగతికి. భాగ.౯ ౩౬.౨

యేపితేషు భగవదం శేష్వను రాగిణః కోసలనగరః
జానపదాస్తేపి తన్మనస స్తత్సలోక మాప్నుయుః. విష్ణుపురాణము.

రామచంద్రమూర్తియం దనురాగముగలిగి యాయనయందు మనస్సునిలిపిన కోసలనగరమందలి పల్లెలయందలి జనులుకూడ సాలోక్యముక్తినందినవారైరి.

'రాముఁడుఁదప్ప స్మరింపరెవ్వనిన్' అనుటచే హరిభక్తి యనన్యమై యుండవలయుననియు స్వసంప్రదాయ ప్రకార మితరదేవతల వర్జించినను నది రామభక్తి కుదురుటకే యనియు గ్రాహ్యము. 'మామేవయేప్రపద్యంతే మాయామేతాం తరంతితే' నన్నొకనినే యెవరు ప్రపత్తిచేయుదురో వారీ మాయను దాఁటుదురు. మామేకం శరణంవ్రజ=నన్నొకనినే శరణుచొరుము. అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥ "నేను దప్పఁ దమకు వేఱుగతిలేదని చింతించు వారియొక్క యోగక్షేమములను నేనేవహింతును" అనికదా శ్రీకృష్ణభగవానుఁడు చెప్పెను. ఇట్టివాక్యము లనేకములు భగవద్గీతయందుఁ గలవు. కావునఁ బెక్కు దేవతల భక్తిగాని క్షుద్రదేవతాభక్తిగాని ప్రయోజన పడదు.

ఈజనులందఱు రామునితోడఁ బ్రత్యక్షదర్శన స్పర్శన సల్లాపాదులచే సాంగత్యము గలవారుగా నుండఁజాలరు. ఇందు నితరులు రాముని గుణా దులఁ జెప్పఁగా విని యనేకులు రామునందుఁ బ్రేమగలవారైరి. కావున భగవ ద్గుణ శ్రవణమువలనను బ్రేమజనించుటచే మోక్షసిద్ధిగలదు. రామాయణమం దును శ్రీ భాగవతమందును శ్రవణమునకు విశేషఫలము చెప్పఁబడినది. ప్రహ్లా దుఁడును దానిని ప్రథమముగ గణించెను. కావున నీకాలపువారును రామగుణ శ్రవణముచేత తరింపవచ్చును.

సీ॥ ఇందీవరశ్యాము♦సౌందర్యజితకాముఁ, గమనీయగుణపాత్రుఁ♦గంజనేత్రు
శాత్రవమదనాశు♦జనరసనావాసుఁ గరుణాలవాలు సుం♦దరకపోలు
నవయౌవనోదీర్ణు♦నవ్యయశఃపూర్ణు, జలనిధిగంభీరు♦శైలధీరు
సజ్జనతాసక్తు♦సత్యధర్మసుయుక్తు, మంజులమృదుభాషు♦మథితదోషు
తే॥ యౌవరాజ్యపదంబున♦నలరు చుండ
దేవ! కనఁగోరెదము దేవ♦దేవతుల్య
మాహితముఁ గోరి యామత్స్య♦మీహితంబు
నే సమాహితమును జేయు♦వే యటంచు. ౩౬

ఇందీవరశ్యామున్=నల్లకలువవలె నల్లనైనవానిని-విధైన లోఁతుపాఁతు తెలియరాక గంభీరమైనది (ఆకాశము-సముద్రము) నీలవర్ణముగను ఒక్కొక్క సారి కొంచెము ఆకుపచ్చగాఁ గానవచ్చును. కాన విష్ణువు నీలవర్ణుఁడన్నప్పు డతిగంభీరుఁడనియు నాయన లోఁతెఱుఁగరాదనియు భావము. దూర్వాంకుర శ్యాముఁడనియు రామునిఁ జెప్పుటగలదు. సౌందర్యజితకామున్ = చక్కఁదన ముచే జయింపఁబడిన మన్మథుఁడు కలవానిని; సాక్షాన్మన్మథ మన్మథయన్నట్లు మన్మథుఁడును మనకిట్టి సౌందర్యము లేదాయెఁగదా యని వెతపడునంతటి సుందరుఁడు. వాస్తవమున లోకమున నెవరెంతసౌందర్యము కలవారైనను వారిసౌందర్యము భగవత్సౌందర్యములో వంశమనియే యెఱుఁగనగు. కమ

నే

నీయగుణపాత్రున్=మనోహరములైన కల్యాణగుణములకు నాధారమైనవాఁడు అనుటచే హేయగుణ మొక్కటియైన నాయనయందు లేదని భావము.

కంజనేత్రున్=ఎఱ్ఱకమలములవంటి కన్నులుగలవానిని- శాత్రవమద నాశన్=పగవారి గర్వము నణఁచువానిని- శాత్రవనాశ ననక శాత్రవమదనాశ ననుటచే వారి మదమణఁచుటకు నెంతమాత్రమువారిని దండింపవలయునో యంతమాత్రము పరాక్రమముఁ జూపునేకాని క్రోధపరవశుఁడై సులభసాధ్యుని కఠినదండముపాలుసేయఁడు. జనరసనావాసున్ = లోకుల నాలుకయందు వసించువానిని అనఁగా మీఁది పద్యములందుఁ జెప్పునట్లు ప్రతిమనుష్యుఁడు రామశబ్దము సర్వదా యుచ్చరించు వాఁడేయైయుండెను. కరుణాలవాలు= దయకుఁ బాదైనవాఁడు. (ఆలవాలము=చెట్లపాదు) కరుణయనెడు కల్ప వృక్షమునకు జన్మభూమి-నిలువనెలవు- రాముఁడే. కరుణాకుత్పయనికదా యీయనకు బిరుదు- సుందరకపోలున్=అందమైన చెక్కిళ్లు గలవానిని, నవ యౌవనోదీర్ణున్=క్రొత్తయగు యౌవనముచే గొప్పయగు వానిని ఇప్పటికి రామునకు ౨౫ సంవత్సరముల ప్రాయము. నవ్యయశఃపూర్ణున్=శ్లాఘ్యమైన కీర్తిచేనిండినవానిని, జలనిధిగంభీరున్ = సముద్రమువలె లోఁతెఱుఁగరాని వానిని- శైలధీరున్=శైలమువలెఁ జలింపని ధైర్యముగలవానిని-సజ్జనతాసక్తున్= (జనతా=జనసమూహము) సాధుజన సమూహమునందు మిగులఁ బ్రేమగల వానిని, సత్యధర్మసుయుక్తున్= సత్యధర్మములతో మిక్కిలి గూడినవానిని, మంజులమృదుభాషున్=మనోహరముగను మృదువుగను మాటలాడువానిని- విరసముగఁ బరుషముగ నెప్పుడు మాటలాడఁడని భావము. మథితదోషున్= మథింపఁబడిన దోషములు గలవానిని-దోషరహితుని, దేవదేవతుల్యున్=దేవత లందఱు నెవనిఁ దమదేవుఁడుగా భావింతురో అట్టి నారాయణునితో సమానుని- మత్+సమీహితము=మాకోరిక, సమాహితము= నెఱవేర్పఁబడినది - చేయవే= చేయుమా యని ప్రార్థించెదము.

తాత్పర్యము

నల్లకలువవంటి నీలమైనదేహకాంతి గలవానిని-మన్మథునిమించిన చక్కఁదనము గలవానిని కల్యాణగుణముల కాధారభూతుఁడైనవానిని కమలములవలె మనోహరములైన కన్నులుగలవానిని-పగవారి పొగరణఁచువానిని,సర్వజనులచే సర్వవేళల నుచ్చరింపఁబడు నామముగలవానిని-దయకుఁ బాదియైనవానిని- అందమైన చెక్కిళ్లుగలవానిని-క్రొత్తయౌవనముం దుండువానిని - యశస్సుచే నిండిన లోకముగలవానిని-సముద్రమువలె లోఁతు తెలియనీయని వానిని, పర్వతములవలెఁ జలింపనివానిని, సజ్జనులయందు సౌజన్యమునందు నాశక్తి గల సత్యము ధర్మమును గూడియుండువానిని-ఇంపుగ మెత్తగ మాటలాడు వానిని దోషరహితుని దేవాది దేవునితో సమానుఁడగువానిని శ్రీరామచంద్రమూర్తిని,

యువరాజుగా నుండఁ గన్నులారఁజూచి సంతోషింపఁ గోరెదము. కావున మా మేలు గోరినవాఁడవై మాకోరిక నెఱవేర్పుము. అని ప్రజలెల్లరు.

—• ३ సర్గము. పట్టాభిషేకసంభారంబులు గూర్ప దశరథుఁ డాజ్ఞాపించుట. •—

కం॥ పుంజికొనుసంతసంబున, నంజలి ముకుళించి యెల్ల•రాడిన విని లో
రంజిలి వారికి రఘుకుల,కుంజరుఁ డత్యంతముదము•గులుకఁగఁబలికెన్.

పుంజిగొను=అతిశయించిన.

తాత్పర్యము

అతిశయించిన సంతోషమున నందఱొక్కమాటగఁ జేతులుజోడించి ప్రార్థింపఁగా రఘువంశ శేఖరుఁడగు దశరథుఁడు మనస్సున సంతోషించి యిట్లు చెప్పెను.

ఆ॥ ఏమి నాయదృష్ట•మెంతయుఁ బ్రీతుండ, నైతి నార్యులార•యైకకంఠ్య
ముగను నాతనూజుఁ•బూన్పంగ యౌవరా,జ్యంబు నీర లెల్ల•సమ్మతింప.

ఐకకంఠ్యము=ఏకగ్రీవముగ-ఒక్క మాటగా, ఈరలు=మీరు.

తాత్పర్యము

అయ్యలారా! ఏమి నాయదృష్టము. మీరందఱొక్కమాటగ నాకొడుకును యువరాజుఁజేయ సమ్మతించితిరి. ఏమినాభాగ్యము, తండ్రికిఁ బుత్రుఁడు కలిగినప్పుడు కలుగు సంతోషము సంతోషముగాదు. ప్రజలెప్పుడు వానినిమంచి వాఁడని కీర్తింతురో యప్పుడు నిజమైన సంతోషము కలుగును. అట్టిభాగ్యము నేఁడు నాకుఁ గలిగెను.

తే॥ అనుచు వారల నెల్ల మన్ననలఁ దనిపి. వామదేవవసిష్ఠుల•వంకఁ జూచి
వలయుసంభారములఁగూర్పు•వలయుమీరు,
శ్రీరఘూత్తముపట్టాభి•షేకమునకు. ౭౯

తాత్పర్యము

అని యాప్రజలనెల్లఁ దగు మాటల గౌరవించి తృప్తిపడఁజేసి యావల వసిష్ఠుని వామదేవునిఁ బురోహితులఁజూచి మునీంద్రులార శ్రీరామచంద్రు పట్టాభిషేకమునకుఁ గావలసిన పదార్థములనెల్లఁ బ్రోగుచేయుఁడని కోరెను.

కం॥ చైత్రము సర్వసుఖశ్రీ,పాత్రము ఫలపుష్పనికర•భరితోరువనీ
గోత్రము పుణ్యం బిది నా,పుత్రుని యువరాజుఁ జేయఁ•బోలును నిపుడే.

చైత్రము=చైత్రమాసము సర్వసుఖ శ్రీపాత్రము=సమస్తసౌఖ్యసంపదలకు నాధారము. ఫల.........గోత్రము=పండులయొక్కయు పూలయొక్కయు సమూహముచే నిండిన గొప్ప వనప్రదేశముగలది. పుణ్యము=పుణ్యకార్యములు చేయ యోగ్యమైనది.

తాత్పర్యము

ఈ చైత్రమాసము సమస్త సౌఖ్యసంపత్తులకు నాధారమైనది. భూప్రదేశమంతయు పండ్లచేతను బూలచేతను నిండి భారముచే వంగిన వృక్షములుగలది. పుణ్యకార్యములు చేయ యోగ్యమైనది. కావున నిపుడే నాకొడుకును యువరాజుఁ జేయఁదగిన కాలము.

కం॥ అని జనపాలుఁడు విరమిం,చిన మేల్ మే లనుచు జనము•చెచ్చెర ఘోషిం
చిననినద మణఁగ మెల్లన, మునివరుని వసిష్ఠు రాజ•ముఖ్యుఁడు పలికెన్.

విరమించినన్=చెప్పి చాలింపఁగా, నినదము=చప్పుడు. ౨౧

తాత్పర్యము

అనిచెప్పి రాజు చాలింపఁగా శుభము శుభము అని జనులందఱు ధ్వనించిరి. ఆశబ్ద మణఁగిపోఁగా దశరథుఁడు వసిష్ఠమునితో నిట్లనియెను.

కం॥ రామాభిషేకమున కిపు, డే మీ రుపకరణములను•నేర్పఱుపుఁ డనం
గా మౌని యరత వఱలెడి, ధీమహితుల మంత్రివరుల•దిక్కుం గనుచున్.

అరతన్=సమీపమందు, మీరు=పూజ్యార్థమున బహువచనము.

తాత్పర్యము

వసిష్ఠమునీంద్రా రాముని నభిషేకించుటకుఁ గావలసిన పదార్థముల నెల్ల మీరు సిద్ధము చేయుఁడు అని చెప్పఁగా నాయన తన సమీపమందున్న బుద్ధిమంతులగు మంత్రులఁజూచి యిట్లని చెప్పెను.

—• వసిష్ఠుఁడు మంత్రులతో వలసిన సంభారములఁ జెప్పుట. •—

సీ॥ బంగారు రత్నముల్•బలులునోషధులును లాజలు శుక్లమా•ల్యములుఁ దేనె
గమ్మునినేయియుఁ•గొరికపుట్టంబు,లరదంబు ధ్వజము స•ర్వాయుధములుఁ
జతురంగబలము సు•స్తంబేరమము వెలి,చామరంబులు వెల్ల•ఛత్రమొండుఁ
బైఁడికుండలునూఱుఁబైఁడికొమ్ములయెద్దు, సంపూర్ణమౌవ్యాఘ్ర•చర్మమొకటి

తే॥ చందనము లోనుగాఁగ నే•షవ్యములును
వేగకయమున్న వసుధేశు•వేశ్మమందు
నగ్నిగృహమునఁ జేర్పుఁడీ•యనఘులార
యనుచును వసిష్ఠమౌనీంద్రుఁ•డనియె మఱియు. ౨౩

శుక్లమాల్యములు=తెల్లనిపూలదండలు, కొరికపుట్టము = చలువచేయని వస్త్రము, స్తంబేరమము=ఏనుగు. (స్తంబము=గంట్లు, దానియందుఁ గ్రీడించునది స్తంబేరమము. సప్తమి-అలుక్సమాసము.)

వేగకయమున్న=సూర్యోదయముగాకముందే, వసుధేశువేశ్మము=రాజుగృహము, అగ్నిగృహము=రాజు హోమముచేయు నగ్నికుండముగల యింటియందు. (క్షత్రియులు నిత్యాగ్నిహోత్రులుకదా.)

తాత్పర్యము

బంగారు- రత్నములు- బలులు- వనమాలికలు- పేలలు- తెల్లపూల దండలు. తేనె- కమ్మని వాసనగలనేయి- చలువచేయని వస్త్రము-తేరు-ధ్వజము క్షత్రియులు ధరించు నన్నియాయుధములు-రథములు-ఏనుఁగులు-గుఱ్ఱములు-కాలినడక భటులునను నాలుగువిధముల సేనలు- పట్టపుటేనుఁగు- తెల్లవింజామరము- ఒక తెల్లగొడుగు- బంగారుకుండలు- కొమ్ములకు బంగారుతొడుగులు వేసిన యెద్దులునూఱు-అన్ని యవయవములు సంపూర్ణముగానుండు నొక పులితోలు-శ్రీగంధము మొదలుగాఁగల తేఁదగిన పదార్థముల నుదయము కాకముందే రాజు వాకిట నుంచవలసినవి యచ్చట, లోపల నుంచవలసినవి లోపల నగ్నిహోత్రశాల యందుంచ వలసినవియచ్చటఁ బుద్ధ్యాత్ములారా చేర్పవలయును అని వసిష్ఠుఁడు మంత్రులకుఁ జెప్పి మఱియు నిట్లనియెను.

కం॥ హారంబులఁ జందనమున,
ద్వారాంతఃపురములన్ సు•ధన్ నగరము శృంగారంగ
గారింపుఁడు చల్లుఁడు వ, న్నీరంబుల ధూప మిడుఁడు•నెఱబుగులుకొనన్.

బుగులు కొనన్=పరిమళించునట్లుగా, సుధన్=సుద్దచే నఁగా తెల్లని పూఁతలచేత.

తాత్పర్యము

మంత్రులారా! రాజగృహము ద్వారములను అంతఃపురములను హారములచేతను శ్రీగంధముచేతను, సున్నపుఁ బూఁతలచేతను శృంగారింపుఁడు. పట్టనము ప్రజలందఱు వారివారి గృహములకు సున్నము కొట్టించి తెల్లని పూఁతలు పూయించి యలంకరించునట్లు చేయుఁడు వీధులందుఁ బన్నీరు చల్లుఁడు-పట్టనమంతయు సువాసనతో నిండునట్లు అగరుసాంబ్రాణి మొదలయిన వానిచే ధూపములు వేయుఁడు.

కం॥ పాలుపెరుఁగుతో నోకనూ, ర్వే లగుద్విజులకును లెస్స•రేపకడన్ మీ
రాలస్యము లే కన్నము, చాలఁగ నిడ వలయు భక్తి•శ్రద్ధయుఁదోఁపన్. ౯

రేపకడన్=ఉదయకాలమున, ఆలస్యము = జాగు, నూఱు + వేలు= నూర్వేలు, సంయుక్తంబున నలఘురేఫము లఘువగు.

తాత్పర్యము

ఇంతియకాక రేపటి యుదయకాలమందు లక్షబ్రాహ్మణులకు జాగుచేయక పాలు పెరుఁగుతోడ నన్నము దండిగఁ బెట్టవలయును. శ్రద్ధయు భక్తియువదల రాదు. శాంతికై యీకార్యము చేయవలయును.

కం॥ రేపటియుదయంబున మీ, రోపిక దక్షిణలతోడ•నుర్వీసురులన్
వే పిలిపించి యొసంగుం, డి పేలలు నేయి పెరుఁగు•నెయ్యముమీఱన్. ౧౦

పేలలు=దీనినే వాడుకయందు పేలాలందురు. ఈశబ్దము మావ వంటిది. నేయి-నెయ్యి, నెయ్యము స్నేహశబ్దభవము.

తాత్పర్యము

ఈరాత్రి కడవఁగనే యుదయకాలంబున మీరు ప్రాలుమాలక బ్రాహ్మణులను బిలిపించి దక్షిణలతోడ లాజలు (పేలలు) నేయి, పెరుఁగు స్నేహభావముతో నొసఁగవలయును. అశ్రద్ధకూడదు.

కం॥ ఇనుఁ డుదయించినయా వెంటనె యగుఁజూడి స్వస్తివాచనము దానికినై
ఘను లగువిప్రులఁ గూర్చుండనఘాత్మకులార! పీఁటలమరింపరయా. ౧౧

ఇనుఁడు=సూర్యుఁడు, స్వస్తి వాచనము=పుణ్యాహవాచనము. అనఘాత్మకులారా=పుణ్యాత్ములారా! పీఁట-పీఠీ-శబ్దభవము.

తాత్పర్యము

సూర్యోదయమైన వెంటనే స్వస్తివాచనము జరుగును. కావున దానికి రావలసిన యుత్తమబ్రాహ్మణుల నావేళకు సరిగా వచ్చునట్లేర్పాటు చేయవలయును. వారువచ్చి కూర్చుండుటకు నందఱకుఁ బీఁట లమర్పవలయును.

దీనివలన శుభకార్యములు నిర్వహింప నింటికివచ్చిన బ్రాహ్మణులను నేలపైఁ గూర్చుండఁ జేయరాదని సూచితము.

కం॥ కట్టింపుఁడు కల్వడములఁ, గొట్టింపుఁడు సున్న మన్నికూటములందున్
దట్టముగ నీరుచల్లఁగ, దిట్టము గావించి ముగ్గు దీర్పింప రయా. ౧౨

కల్వడములు=తోరణములు.

తాత్పర్యము

వాకిండ్లకుఁ బచ్చాకుతోరణములు-పూలదండలు కట్టింపవలయును. అన్ని గోడలకు లోపల వెలుపల గదులలోఁగూడ సున్నము కొట్టింపవలయును. దుమ్ము పోవునట్లు ముందు చిమ్మి యావల నీళ్ళు బురదగాకుండఁ జల్లించి వెంటనే ముగ్గులు పెట్టింపవలయును. అలికి విడిచినఁగడప దాఁటరాదు, పచ్చాకుతోరణములని వేఁపాకు నుంకేసులాకు రావాకులోనైనవి కట్టరాదు. మామిడియాకు ప్రశస్తము. శుభకార్యము జరుగునింట నివియన్నియుఁ జేయవలయును.

కం॥ తాలంబులతోన ర్తక, జాలంబులతోడ వారసతులున్ పొగసుల్
మేలిమిగఁ జేసికొని భూపాలయము ద్వితీయకక్ష్యయం దుండఁదగున్.

వారసతులు=వేశ్యలు-వెలయాండ్రు (వారము=వేశ్యలకు విటులిచ్చు వడుపుధనము. అట్టి ధనమాశించి భార్యలగువారు వారసతులు) వర్తకజాలంబులు=నృత్యముచేయువారి సమూహంబులు-భూపాలయము= రాజగృహము, ద్వితీయకక్ష్య=రెండవ తొట్టికట్టు.

తాత్పర్యము

భోగము వడుచులు చక్కఁగ నలంకరించుకొని తాళములు లోనగు సాధనములతోడను నర్తకులతోడను రాజగృహంబున రెండవకక్ష్యయందుండ వలయును.

కం॥ దేవాయతనంబుల భూ,దేవులు పూజింప వలయుఁ•దెగ కన్నాదుల్
వావిరి మాల్యాదులఁ జై,త్యావళులం దిడఁగ వలయు•నర్హక్రియలన్.౬౦

దేవాయతనములన్=దేవాలయములందు-భూదేవులు = బ్రాహ్మణులు-స్వర్గమున నున్న దేవతఁ జెప్పునపుడు మాత్రమే దేవశబ్దమునకు దేవుఁడని యేకవచనము. మాల్యాదులు=పూలదండలు మొదలయినవి-చైత్యావళులన్=అర్హక్రియలన్=యోగ్యమైన కార్యములను.

తాత్పర్యము

దేవాలయములందు బ్రాహ్మణులు పూజగావించు చుండవలయును నాలుగు త్రోవలు కలియుచోట నుండు చిన్నదేవమందిరనులు (భజనకూట ములు లోనైనవి) పూలదండలచే నలంకరింపవలయును. విడువక లేదయి పోయినదనక యన్నదానము చేయవలయును. దీనివలన శుభకార్యములందు నన్నదానము. దేవాలయములందు నన్నదానము, దేవాలయము లందలి దేవతలకుఁ బూజ చేయింప వలయు ననియు భజనమందిరము లున్నచోట వాని నలంకరింపవలయు ననియు సూచన.

కం॥ రామాభ్యుదయోత్సవమున, భామానితమండలాగ్ర•భాసితయోధుల్
దా మూని మంచిచేలలు, భూమీశాంగణముఁ జొరఁగ•బోలున్ శీవిన్.౬౧

రామాభ్యుదయోత్సవమునన్ = రామునిమేలునకై చేయు నుత్సవము నందు, భామానిత=తళతళమను ప్రకాశముచే గౌరవింపఁదగు, మండలాగ్ర=కత్తులచే, భాసిత=ప్రకాశించు, యోధుల్=యుద్ధభటులు, చేలలు=వస్త్రములు-భూమీశాంగణమున్=రాజుమొగసాలను.

తాత్పర్యము

రామపట్టాభిషేకకాలమున, ఖడ్గములను ధరించిన యుద్ధభటులు మంచి శుభ్రవస్త్రములు గట్టుకొని రాజుండు ప్రదేశమున నొక్కటిగఁ బ్రవేశింపవల యును. వీరాసమయమునకు బాగుగారావలయును. ముందుచెప్పినకార్యములు ముందే జరుగవలయును.

కం॥ అని కార్యంబుల నెల్లను, గొనకొని వచియించి, నృపతి•కుంజరునకుఁ దాఁ
బొనరింపవలయు పనులన్, వినిచి యచట నుండి శీర్చె•వివిధంపుబనుల్.

కొనకొని=ఆమూలాగ్రము, వినిచి=వినిపించి, ప్రేరణార్థకము.

తాత్పర్యము

ఈప్రకార మెవరెవరి కేయేపనులు చెప్పవలెనో వారివారి కవి చెప్పి తరువాత రాజునకుఁ దాను చేయవలసిన పనులు వినిపించి తక్కిన కార్యములు వసిష్ఠుఁడు దా నచ్చటనుండియె చక్కఁబఱిచెను.

తే॥ అన్ని కార్యంబు లీరీతి నను్పపరిచి, వామదేవవసిష్ఠులు భూమినాథుఁ
గాంచికావించితిమి యెల్ల కార్యముల న,
టంచుపచియింపనాతండు మించెనెలమి. ౬౩

అనుపుపఱిచి=చక్కఁజేసి, కావించితిమి యెల్లకార్యములు=ప్రథమోత్తమ పురుషంబుల నికారమునకు సంధివై కల్పితము.

ఎలమిన్=సంతోషముచే.

తాత్పర్యము

ఈప్రకారము జరుగవలసిన కార్యములన్నిటికి నేర్పాటుచేసి వసిష్ఠవామదేవులు రాజుతో సర్వకార్యములు వెఱవేఱ నేర్పాటులు చేసితి మని చెప్పఁగా నాయన సంతోషించెను.

దీనివలన యజమానుఁడు నీ వీపని చేయుము నీ వీపనిచేయుమని చెప్పినంతనే ప్రయోజనములేదు. ఆప్రకారము సర్వము జరిగినదని ముందుగనే తెలిసికొనియుండవలయును. కార్యము చేయుచు నదిలే దిదిలే దని వానికై పరువులెత్తరాదు.

—• దశరథుఁడు శ్రీరాములను సభకుఁ బిలిపించుట. •—

ఉ॥ అంత సుమంత్రు ఱేఁడు సుకృతాత్మకు నిప్పుడ రామచంద్రు నా
ఘాంతకుఁ దోడి తెమ్మనుడుఁ బోయె నతండును దోడి తేర; భూ
కాంతుఁడు నాల్గుదిక్కులను గల్గునృపాళులు మ్లేచ్ఛపర్యశై
లాంతవనాంతవాసులు న యంబున సూరెలఁ గొల్వఁ గొల్వునన్. ౬౪

ఱేఁడు=రాజు-ఇది రాట్ శబ్దభవము-సుకృతాత్మకున్ = పుణ్యవంతమైన మనస్సుగలవానిని, మ్లేచ్ఛపర్య=మ్లేచ్ఛులందు శ్రేష్ఠులు, శైలాంతవనాంతవాసులు=కొండలయందు వనములయందు వసించువారు ఇచ్చట అంత శబ్దమునకుఁ బ్రదేశమని యర్థము, శైలాంతమనఁగా పర్వతప్రదేశమని యర్థము. సూరెలన్=ప్రక్కలందు, కొల్వునన్=సభయందు.

కం॥ అమృతాంధసులు భజింపఁగ, నమరేశ్వరుఁ డనఁగఁ బొల్చి యతులప్రాసా
దమున నట నుండి యుజ్జ్వల, విమలశతాంగంబునందు వెలిఁగెడి వానిన్.

అమృతాంధసులు=అమృతమాహారముగాఁ గలవారు దేవతలు-అమరేశ్వరుఁడు=దేవతలకుఁ బ్రభువు-ఇంద్రుఁడు, అతుల=అసమానమైన, ప్రాసాదమున=మేడఇంటియందు, అటనుండి=ఆ మేడయందుండియే (వీథివెంటవచ్చు రామునిఁ

జూచెనని యన్వయము) ఉజ్జ్వల=ప్రకాశించు, విమల=మలినములేని, శశాంగంబునందున్=తేరియందు.

౯౪-౯౫ తాత్పర్యము

వసిష్ఠవామదేవులు సర్వము సిద్ధమని చెప్పఁగానే దశరథుఁడు సుమంత్రునితో శ్రీరామచంద్రమూర్తిని నాయొద్దకుఁ బిలిచికొనిరమ్మని చెప్పఁగా నతఁడు వెడలిపోయెను. దశరథుఁడు కొలువుకూటమునందు సుధర్మయందు దేవేంద్రుఁడు దేవతలచేఁ గొలువఁబడునట్లు మ్లేచ్ఛప్రభువులచేతను పర్వత వనవాసులగు నధిపతులచేతను గొలువఁబడుచుండి యసమానమైన యా మేడ మీఁదనుండియే నిర్మలమై ప్రకాశించు తేరిమీఁద వచ్చువానిని.

సీ॥ కనియెను శ్రీరాముఁ•గమనీయగుణధాము,సారంగగమనుఁ గం•జాతనయను
　నాజానుబాహు నీ•లాంబుదసమ దేహు,మిహికాంశువదను గాం•భీర్యసదను
　గంధర్వపతితుల్యుఁ•గరుణారసాతుల్యు, సన్నుతతత్త్వుఁ బ్రశ•స్తసత్త్వు
　నౌదార్యగుణసాంద్రు•నఖిలావనాతంద్రు, నగధీరు లోకతా•పాపహారు
తే॥ భయవఘర్మార్భిత ప్రభూ•ప్రజల కెల్ల, హర్షదుం డగుపర్జన్యు•నట్టివాని
　మహితరూపగుణౌదార్య•మహిమకలిమిఁ,
　　　　　　　　బురుషమనమైనఁ•దాఁజూఱ•వుచ్చువాని. ౯౬

కమనీయగుణధామున్=మనోహరములైన కల్యాణగుణములకు స్థానమైనవాని; ధామశబ్దమునకుఁ దేజస్సనియు నర్థముగలదు. కావున సూర్యుఁడు కానవచ్చినను గానరాకున్నను గిరణములచేతనే యెట్లు లోకమిత్రుఁడై వర్తించునో యెట్లు చంద్రుఁడు తనశీతకిరణములచే లోకమును రంజింపఁజేయునో యట్లు రామునిఁ జూచినవారు చూడనివారుకూడ నాయన గుణములను విని కని యాయన తమకు మిత్రుఁడనియు సంతోషమే కలిగించువాఁ డనియుఁ దలఁచి సంతోషింతురు. సారంగగమనున్=మదించిన యేనుఁగు నడకవంటి నడక గలవానిని. మిక్కిలి గర్వముగల వాఁడు విలాసముగా నడచుటవలె-మదముచే మందమై యందమైన నడకగలవానివలె నడచువాఁడు- గర్వముగలవారు టాకుటీకుగా నడచుటకు గర్వము కారణము. ఆనడకయు సహజముకాదు. రామునందో యట్టినడక సహజము. గర్వమువలన వచ్చినదికాదు. గొప్పగుణములు గలవారినడకయు గొప్పగానేయుండును. మృగము లన్నిటిలో గొప్పదియగు నేనుఁగు గుణములచే గొప్పదియై యాగుణమునకుఁ దగినట్లుగ నడచును క్షుద్ర జంతువు లట్లు నడవఁజాలవుకదా కంజాతనయనున్=కమలములవలె విశాలమై మనోహరమైన కన్నులుగలవానిని; ముఖమునకుఁ గన్నులందము. జింక చిన్న జంతువైనను దానికన్నులు విశాలము లగుటచే మృగముకూడ నందముగఁ గానవచ్చును. అట్టులే యేనుఁగునకుఁ బరిమాణమునకుఁ దగిన కన్నులులేకచిన్న కన్నులు కలదయి యున్నది. రామునకో జగన్మోహనములై ఆకర్ణాంతములై

ప్రకాశించును. కావుననే సీత వియోగమున రాముని కన్నులను 'మమ పశ్యంతి యేనాథం రామం రాజీవలోచన'మ్మని స్మరించి స్మరించి విలపించెను. ఆజాను బాహున్=మోఁకాటిని ద్రాఁకుచున్న వ్రేళ్ళుగల బాహువులఁ గలవానిని (ఆ+జాను+మోఁకాటివఱకుఁగల-బాహున్=బాహువులు గలవానిని)- లాంబుద సమ దేహున్=నల్లని మేఘముతో సమానమైన దేహముగలవానిని-నీటితో నిండిన మేఘము నల్లగానుండును. అదియే వర్షముగురియింపఁగలది. అట్లులే రాముఁడు భక్తులకోరికలవారిగ నిచ్చువాఁడని భావము. హిమాంశువదనున్=మంచుకిరణములు గలచంద్రుని బింబమువంటి ముఖముగలవానిని-ఏడ్చు చుండు బిడ్డలుకూడ చంద్రబింబము చూడఁగానే పోరుమాని సంతోషింతురు. అట్లులే యెట్టి దుఃఖాక్రాంతుఁడును శ్రీరాముని఼ జూచినంతనే తనదుఃఖమంతయు మఱచి సంతోషపడును. గాంభీర్యసదనున్ = గంభీరగుణమునకు నిల్లయినవానిని-తనయాంతర్య మిట్టిదని యెదుటివానికిఁ బట్టియాయని గుణము గాంభీర్యము. లోఁతైన మనస్సుగలవాఁడు. గంధర్వపతి తుల్యున్ = దేవతలయందు గంధర్వులు సుందరులు-సౌందర్యమున వారితో సమానుని, అప్రాకృతమును ప్రాకృతులు గ్రహింపలేరు. కావున వారికిఁ దెలియుటకై ప్రాకృతోపమానములే చెప్పవలసి యుండును. కరుణారస=దయారసమునందు; అతుల్యున్=సమానుఁడు లేనివానిని-కరుణాకాకుత్స్థుడని రామునకు బిరుదుగదా. సన్నుతతత్త్వున్=సాధువులచే స్తోత్రము చేయఁబడిన రహస్యమైన వాస్తవముగలవాఁడు. శ్రీరాముని రహస్య మాయనభక్తు లెఱిఁగి స్తుతింపఁగలరు గాని తక్కినవారికి సాధ్యపడదని భావము. 'తస్యభావః తత్త్వం' అనఁగాఁ బౌరుష మనియు నర్థము. ప్రశస్త సత్త్వున్=మిక్కిలి పొగడఁబడిన బలము. లేక సత్త్వగుణము గలవాఁడు. శివధనుర్భంగములోనగు కార్యములచే నింతటిబలశాలి లేఁడనియు సాత్త్వికులలో నింతటి సాత్త్వికుఁడు లేఁడనియుఁ బొగ్డ్తగన్నవాఁడు. ఔదార్యగుణ సాంద్రున్=ఉదారమైన గుణముచే దట్టమైనవాఁడు. దట్టముగా ఘనీభవించిన యుదారగుణమే రాముఁడని భావము. ప్రజ్ఞానఘనుఁ డన్నట్లు. అఖిలావనాతంద్రున్=అఖిల=సమస్తమును=చరాచరములైన సమస్త జీవికోటులను-అవన=రక్షించుటయందు-అతంద్రున్=కూరుకుపాటులేనివానిని-హెచ్చరిక గలవానిని ఎవరెవరి నెట్లెట్లు రక్షింపవలయునో వారివారి దశాయోగ్యతల ననుసరించి హీనజంతువని యలక్ష్యములేక రక్షించువానిని-నగధీరున్=దండివానలకుంగాని తగులఁబెట్టఁ బడినపుడుగాని పిడుగులు పడినపుడుగాని ప్రలయమందైనను నెట్లు పర్వతము చలింపదో యట్లు లెట్టిదశయందును ధైర్యమువిడువనివాని. లోకతాపాపహారున్=లోక=భువనము జనము వీనితాపములను ఆధ్యాత్మిక, ఆధిభౌతిక ఆధిదైవతములను, అపహారున్ = పోఁగొట్టువానిని-భయద=భయంకరమైన ఘర్మ=వేఁడిమిచే; అభితప్త=మిగులతాపము గొనిన; భూప్రజలకు=భూమియందలి జనులకు; హర్షదుండగు = సంతోషము గలిగించునట్టి

పర్జన్యునట్టివాని=వర్షాధిదేవతవంటివానిని ఎండకాలమున మండునెండలచేఁ దాపముఁగొన్న జనులు వర్షించు. మేఘమునుజూడఁగానే యెట్లుసంతోషింతురో యట్లు తనదర్శనముచేతనే లోకుల తాపముల నన్నిటిని బోఁగొట్టువానిని.

మీఁదవ్రాసిన కొన్ని విశేషణములందుఁ గొప్ప విశేషణములు స్ఫురించు చున్నవి. గంధర్వ పతితుల్యన్=గంధర్వులు కామసౌఖ్యమునకు సౌందర్యమునకుఁ బ్రసిద్ధులు. శీక్షకామాశ్చగంధర్వా యని కలదు గదా. అట్లైనచో కామ సౌఖ్య సౌందర్యములు స్త్రీలయందును గలవుగదా యట్టివాఁడా రాముఁడని కనట్లుగాదు సన్నుత తత్వుఁడనుటచే 'రాకేందు బింబమై రవిబింబమై యొప్ప నీరజా తేక్షణ నెమ్మొగం' బన్నట్లు సౌందర్యమునకుఁ దోడు పౌరుషమును గలదని భావము. ఆజానుబాహువనుటచేఁ బౌరుషమునకుఁ దగిన యాకారము ప్రశస్త సత్త్వు ననుటచే దానికిఁదగిన బలము కలవని భావము. సారంగ గమను ననుటచే నట్టి బలపౌరుషములు గలవాఁడెట్లు నడవవలయునో యట్లు నడుచువాఁడని తాత్పర్యము.

ఎండకాలమున సూర్యుఁ డెండచే లోకము తపింపఁజేయుట తన ప్రతాపముఁ జూపి లోకుల బాధింపవలయునను క్రూరబుద్ధిచేఁ గాదు. హిమ శిశిర ఋతువులందు మంచుచేఁ జెడిన యోషధులను మనుష్యులను మరల సుజీవింపఁ జేయుటకే. వాతరోగికిఁ దాపకర సేవసేయుట సుప్రసిద్ధమేకదా. అంతియకాదు. సూర్యుఁడట్లు తపింపఁజేయుట మరల వర్షము కురిపించుటకే. అట్టులే రాముని బలపౌరుషములని భావము. దీనివలన భగవంతుఁడు మనకుఁ గలిగించు తాపములు పూర్వకృత పాపము నశింపఁజేసి యుత్తరకాలమున సంతోషము గలిగింపఁ జేయుటకేగాని మనల దుఃఖితులఁ జేయవలయునను తలఁపునఁ గాదని వ్యంగ్యము. మహిత శ్లాఘ్యములగు, రూప=సౌందర్యము, గుణ=సౌశీల్యము, ఔదర్య=దానగుణము; వీని మహిమ=గొప్పతనముయొక్క కలిమిన్=సంపదచే, గుణఃగుణ్యతే ఇతిగుణః అను వ్యుత్పత్తినిబట్టి సదా జనులచే ధ్యానింపఁబడు సౌశీల్యగుణమని యర్థము. గొప్పవాఁడు తన గొప్పతనము నెంచక యల్పునితోఁ గలసి మెలసి యుండుటకు సౌశీల్యమనిపేరు. ఆహా నక్కయెక్కడ, నాకలోక మెక్కడ? నన్నట్లు అల్పులమైన మనమెక్కడ మహారాజకుమారుఁడు మహానుభావుఁడు నగు రాముఁడెక్కడ. అటువంటివాఁడు మన నీచత నెంచక మనలో నొకఁడుగఁ గలసిమెలసి తిరుగుచు మనకుఁ దెలియనివి తెలుపుచు మంచికార్యములు చేయుఁ బ్రేరించుచు మన కోరికలఁ దీర్చుచున్నాఁడే యని లోకులాశ్చర్యముతో సర్వదా యాయననే ధ్యానించునట్టి సౌశీల్యము గలవాఁడు. ఔదార్యము=దానముచేయుగుణము ఈగుణములచేఁ బరుషములైన పురుషుల మనస్సులనైనఁ గొల్లపెట్టువాఁడు. ఇటువంటి శ్రీరాముఁడు దూరముననే దేరిపైఁ గూర్చుండి వచ్చుచుండ దశరథుఁడు తన మేడపైనుండి చూచెను.

శ్రీకృష్ణుఁడు గొల్లెతల మనస్సులను చనపంకకు లాగుగొనుటకై వారి వెన్న పాలు మీఁగడ హరించెను. శ్రీరామచంద్రమూర్తియో తన సౌందర్యాతిశయమునను సౌశీల్యముచేతను దానాతిశయముచేతను కఠినములైన పురుషుల మనస్సులను గూడ నాకర్షించెనన పుష్పకోమల కోమల హృదయముల నాకర్షించుట వింతయా. ఇట్లు స్త్రీలయుఁ బురుషులయు మనస్సులను గొల్లకొట్టుటచే వారియందు మనస్సు అనునది లేక యది రామచంద్రునందే లయమైపోఁగా చిత్తరువులవలె గాఢసమాధినున్న యోగులవలెఁ దన్మయత్వము చెందిన భక్తులవలెఁ బ్రియవియోగంబున దశమావస్థకుఁ బాలైన కామినులవలె నైరని భావము.

పురుషులు పురుషుల మోహించుట యన రసాభాసముగదా యందురేమో. మనము స్త్రీలై పుట్టియుండిన నిట్టి పురుషునితో సంభోగించు నదృష్టము కలవారమై యుందుముకదా. అట్టి భాగ్యము మనకు లేదాయెగదా, యని పురుషులువ్విళులూరుచుందురని భావము. పురుషులట్లు తలఁపఁజేయు సౌందర్యము గలవాఁడు రాముఁడని భావము. "శ్లో॥ పాంచాల్యాః పత్రాక్ష్యాస్స్నాయంత్యా జఘనంఘనం. యాస్త్రీయోదృష్టవత్యస్తాః పుంభావ మనసాయయుః" అని కలదు గదా. అనఁగా-ద్రౌపది స్నానముచేయు సమయంబున నామె పిఱుఁదులను జూచిన స్త్రీలు అయ్యో మనము మగవారము కామైతిమికదా యని విచారపడుదురఁట.

తాత్పర్యము

మనోహరములైన గుణములను స్థానమయినవానిని. మదపుటేనుఁగువలె నందముగ నడచువానిని, కమలములవంటి కన్నులు గలవానిని, మోఁకాలు దాఁకునిడుపాటి బాహువులు గలవానిని, నల్లమేఘము కాఁతివంటి కాంతిగల దేహము గలవానిని, చంద్రునివంటి ముఖముగల వానిని. గాంభీర్యమునకు నెలవైనవానిని, గంధర్వరాజుతో సమానుని, దయయందు నసమానుని, సజ్జన స్తుతి ప్రాతముగు తత్త్వము గలవానిని, బొగడఁదగిన బలము సత్త్వగుణము గలవానిని, మిక్కిలి యుదారగుణము గలవానిని లోకుల నందఱను రక్షించుటయందు హెచ్చరికగలవానిని ధైర్యమునందుఁ బర్వతమువంటి వానిని జనుల తాపత్రయము బఱఁచువానిని నెండ వేఁడిమికి పొటపొటలాడు జనులకు సంతోషమిచ్చు వానదేవతవంటి వానిని,అతిశయించిన సౌందర్యగుణముచేతను ఉదారత్వముచేతను బురుషుల మనములైనఁ గొల్లపెట్టువానిని శ్రీరామచంద్రమూర్తిని జూచెను.

కం॥ చూచియుఁ జూచియు నెంతేఁ, జూచియుసంతృప్తిలేక•సొక్కుచు నుండన్
వే చనుదెంచె రథం బా,రాచనగిరిద్వారసీమ•రహి డాయంగన్. ౬౩

చూచియు=అదాటునఁ జూచియు, చూచియు=అంతతోఁ దృప్తిలేకమరల మరలఁ జూచియు. ఎంతేఁజూచియు=అంతతోను దృప్తిలేక యేకాగ్రదృష్టితోనేకాగ్రమనస్సుతోఁ జూచియు. సంతృప్తిలేక=పూర్ణముగాఁ దృప్తిపడక; సొక్కుచు

నుండన్=తన్మయత్వమున మైమఱపు చెందుచుండఁగా, ఇది పరభక్తి-పరజ్ఞాన-పరమభక్తివంటిదని యెఱుంగునది. అత్యంత రుచిగల పదార్థమును ముక్కుముసఁగఁ దినినను ఇంకను దిందమా యని యాశయున్నటులని యూహించునది. వేయునునదికళ. కావున పరమైన చకారము జకారము కాలేదు. డాయంగన్ సమీపించునట్లు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తిని జెప్పొర్పక చూచి చూచి యెంతచూచినను సంతుష్టిలేక తదేక ధ్యానానందముచే మైమఱపు వచ్చుచుండఁగా శ్రీరామచంద్రమూర్తి యెక్కినతేరు రాచనగరి వాకిటవచ్చి నిలచెను.

తే॥ అంతటసుమంత్రుఁ డవనిజా•కాంతునకును,
దానుగై దండ యొసఁగి ర•థంబునుండి
దించి తండ్రిని గనఁబోవు•దేవనిభుని,
వెనుకఁ బ్రాంజలి యగుచుసు•జనుచుచుండె. ౯౮

అవనిజాకాంతునకును=సీతానాథుండైన శ్రీరామునకు, కైదండ=ప్రభువులకు సుకుమారస్త్రీలకు నెత్తునుండి దిగునపుడు అలసినపుడు పరిచారకులూఁతగా చేయి యిచ్చుట, ప్రాంజలి=చేతులుమోడ్చినవాఁడు.

తాత్పర్యము

ఇట్లు రథము నిలువఁగా సుమంత్రుఁడు తాను ముందుగా రథము దిగి రామచంద్రమూర్తికి చేయియూఁత యియ్యఁగా నాయనదిగి తండ్రియొద్దకుఁ బోవుచుండఁగా సుమంత్రుఁ డాయన వెనుక జేతులు జోడించుకొని పోవుచుండెను.

కం॥ జనకునిఁ గనునుత్సుకతన్, జనవర్యుం డుండురాజ•సదనాగ్రంబున్
జనకసుతాపతి యెక్కెను,వినయంబున మోడ్పుఁగేలు•వెలయం దఱిసెన్

కను + ఉత్సుకతన్=చూడవలయునను కోరికతో, సదనాగ్రంబున్=ఇంటిపై భాగమును, మేడమీఁదికని యర్థము. తఱిసెన్=సమీపించెను.

కేలుమోడ్చి సమీపించె ననుటచే గురువులయొద్దకుఁ బోవుటకు ముందే చేతులు జోడించుకొని పోవలయునని సూచితము.

తాత్పర్యము

తండ్రిని జూడవలయునను సంతోషముతో నాయనయుండు మేడమీఁదికి రామచంద్రమూర్తిపోయి రెండుచేతులు జోడించుకొని తండ్రిని సమీపించెను.

ఉ॥ వంచినభక్తి రాముఁడమ•వచ్చితి నంచును దండవత్ప్రణా
మం బొనరించి నిల్వ సుతు•మానవపాలుఁడు చూచి హర్షవే
గంబునఁ గౌఁగిలించుకొని•కాంచనరత్నమయాసనంబునం
దింబుగ నుండఁగా రఘుకు•లేశ్వరు రాముని నుంచెనర్మిలిన్. ౧౦౦

వంచినభక్తిన్=అతిశయించిన భక్తిచే, దండవత్ప్రణామంబు=కట్టెవలె సాఁగిలబడి చేయు నమస్కారము. కాంచన రత్నమయాసనంబునన్=బంగారు రత్నములచే నిండిన యాసనమందు. ఇంబుగన్=చక్కఁగ, అర్మిలిన్=ప్రేమతో వంచెన్=ఆజ్ఞాపించెను. దండప్రణామలక్షణము. నిధాయదండవద్దేహం ప్రసార్య చరణౌకరౌ। బద్ధ్వా ముకుళవత్పాణీ। ప్రణామో దండసంజ్ఞితః॥ కట్టెవలె దేహమును నేలఁబడవైచి చేతులు కాళ్ళు చాచి రెండుచేతులు మొగ్గవలె ముకుళింపఁ జేసినచో ప్రణామమగు దండవత్ప్రణమేద్భూమా। వుపేత్యగురుమన్వహమ్. గురువులకుఁ బ్రతిదినము దండమువలె నేలఁబడి నమస్కరింపవలయు నని ప్రమాణము. ఆశీర్వచనార్థము చేయు నమస్కారము అభివాదన మనఁబడును. ఎవరికెట్టు లాశీర్వదింపవలయునో యది తెలియని బ్రాహ్మణుఁడు శూద్రుఁడు గావున నట్టిబ్రాహ్మణునకు నభివాదనము చేయరాదు. అభివాదనమందు భోశబ్దము కడపట రావలయును బ్రాహ్మణుఁడు శర్మయని క్షత్రియుఁడు వర్మయని తన పేరునకు గడపటఁ జేర్పవలయును.

తాత్పర్యము

ఇట్లు సమీపించి 'రామవర్మాహమస్మిభో;'యని దండాకారముగ సాష్టాంగ నమస్కారము చేసి లేచి నిలువఁగ రాజకుమారునిఁజూచి సంతోషాతిశయముచేఁ గౌఁగిలించుకొని ప్రీతితో నాయనా రామచంద్రా యీ బంగారు పీఠముపైఁ గూర్చుండుమని చెప్పెను.

కం॥ దిననాథుఁ డుదయసమయం,
బున మేరువుఁ గాంతియుక్త•ముగఁ జేసెడిమా
ద్కని రాముఁడు తత్పరమా,సనమును రహి మీఱఁ జేసె•స్వప్రభమహిమన్ ౧౧

తాత్పర్యము

సూర్యుడుదయకాలమునఁ దనకాంతిచే మేరుపర్వతమును బ్రకాశింపఁ జేయునట్లు రామచంద్రమూర్తి బంగారుపీఠమును దనకాంతిచే వెలుఁగఁజేసెను. దీనివలనఁ బెద్దలు చెప్పక తమకుఁదామే కూర్చుండరాదని సూచన.

కం॥ కౌసల్యాసుతసహితం,బై సభ రాజిల్లెఁ బెక్కు•లగుచుక్కలచే
భాసుర మగుశరదభ్రము, వాసి సుధాకరునిచేత•భాసిలుభంగిన్ ౧౨

భాసురము=ప్రకాశించు-శరదభ్రము= శరత్కాలమందలి యాకాశము-శరత్కాలమున మేఘములు లేక యాకాశము నిర్మలమైయుండును. అట్టికాలమున నక్షత్రముల నడిమి చంద్రుఁడనుటచే శ్రీరాముని తేజస్సునందు తక్కినవారి తేజస్సు లీనమై ప్రకాశ రహితములై నవని భావము. సుధాకరునిచేన్=చంద్రునిచేత భాసిలుభంగిన్=ప్రకాశించు విధమున.

తాత్పర్యము

అనేక నక్షత్రములచేఁ బ్రకాశించు శరత్కాలమందలి యాకాశము చంద్రునిచే మిగులశోభిల్లినట్లు నానారాజులచేఁ బ్రకాశించు నాసభ శ్రీరామచంద్రునిచే మిగులఁ బ్రకాశించెను.

కం॥ అద్దంబునఁ గన నగుతన, నిద్దపురూపంబు వోలె•నృపతియుఁ దనయు
 ట్లద్దిర వెలుంగురాముని,
 ముద్దులసుతుఁ గాంచి మిగుల•మురియుచుఁ దనలోన్ ౧౦౩.

అద్దిర ఆశ్చర్యార్థకము. అద్దమునఁ దనయాకారమే యున్న దున్నట్లు కానవచ్చును.అట్లే రాముఁడు దశరథునిబోలి యున్నాఁడని భావము. రామదశరథులకుఁ బోలిక రామాయణమున రెండుమూఁడుచోట్లఁ జెప్పఁబడినది. స్త్రీ పతివ్రతయగునేని యామెకొడుకు తండ్రినిబోలుట వింతగాదు. ఆత్మావై పుత్రనామాసి యని అంగాదంగా త్సంభవసి యని కలదుగదా. రతికాలమందు పతినే స్మరించుచు ఋతుస్నానముకాఁగానే మఱియెవరినిఁ జూడకముందే తొలుతొల్త భర్తనుజూచిన స్త్రీకి జనించెడికొడుకు తండ్రినిబోలి యుండును.

తాత్పర్యము

అద్దములోఁ గానవచ్చు తనప్రతిబింబమువలెఁ నగవడు ముద్దుల కుమారుని జూచి తండ్రి యాహా నేనెంత యదృష్టవంతుఁడను ఇట్టికుమారుఁడు నాకుఁ గలిగెఁ గదా ఇంతకంటె నాకు రాగల సుఖశుభసంతోషము లేవిగలవని తనలోనే రాజు మురియుచుండెను.

కం॥ చిన్ని చిఱునవ్వు మోము, న్వన్నియ చిలుకంగ హొయల•వఱలెడివానిన్
 జిన్నారిసుతునిఁ గనుచుం, గన్నారఁగ ననియె హరికిఁ•గశ్యపురీతిన్.౧౦౪

చిన్ని=మనోజ్ఞమైన 'చిన్నియన్నలార మన యశోద చిన్నమగవానిఁగనెనఁట' యని భాగవతము హరికిన్=ఇంద్రునకు, హొయలన్ = విలాసముచే. చిన్నారి=అందము.

తాత్పర్యము

ముద్దులగురియు నెమ్మోమునకు నందమైన చిఱునవు వన్నె పెట్టినట్టు కాఁగా సొగసుచే నతిశయించిన తనగారాబుకొడుకును గన్నులకఱవుదీరఁ జూచుచు నింద్రునకుఁ గశ్యపుఁడు చెప్పినట్లు చెప్పెను.

—• దశరథుఁడు శ్రీరామునకుఁ దనయభిప్రాయంబుఁ దెలుపుట •—

ఉ॥ నాయన రామచంద్ర! నిను•నాయనురూపగుణాఢ్య వత్సపుం
 దోయజనేత్రయందు సుత•నూజునిఁ గంటిని, నీవునున్ మహా
 మేయగుణాళి లోకులకు•మె చ్చొనరించితి, పుష్యయోగమం
 దీ యువరాజుఁ జేయ మది•నెంచితి నిన్నుఁ గుమారకాగ్రణీ! ౧౦౫

నాయనురూపగుణాఢ్య=నాగుణములవంటి గుణములనెడి సంపత్తిగలది.పట్టపుందోయజనేత్ర=పట్టము నాతోడఁగట్టుకొని నాతోడ సింహాసనమందుఁ గూర్చుండిన స్త్రీయందు నిన్నుఁ గుమారునిగాఁ గంటిని. ఇట్లనుటచే నీవు జన్మమువలననే రాజ్యార్హుఁడవని భావము కౌసల్య (1) యనురూపగుణవతి (2) పట్టపుదేవి కావునను అట్టి యామెయందుఁ బుట్టినను నీవు మంచిపుత్రుఁడ వగుటను రాజ్యార్హుఁడని భావము. కుమారకాగ్రణీ=జ్యేష్ఠకుమారుఁడా? నీవు పెద్దకుమారుఁడవు కావున నీవే రాజ్యార్హుఁడవు. నీకుఁదప్ప మఱియొకనికి నీసియరాదు. జన్మము వలనఁ గలిగిన యీ విశేషములేగాక నీయందు స్వతస్సిద్ధమైన యోగ్యతయుఁ గలదు. అదియే దన ప్రజలు మెచ్చుకొనునట్టి గుణములుగలవాఁడగుట.మీఁదఁ జెప్పినయన్ని గుణము లుండియు ప్రజలు సంతోషింపని నడవడిగలవాఁడు రాజ్యార్హుఁడుకాఁడు. మెచ్చొనరించితి=మెప్పుపుట్టఁజేసితివి - పుష్యయోగము=పుష్యనక్షత్రముతోఁ గూడినదినము, రాముఁడు పునర్వసువునందుఁ బుట్టినవాఁడగుటచే పుష్యము సంపత్తారయగుచున్నది. పుష్యమి యనుట సరికాదు.

తాత్పర్యము

నాయనా కుమారా రామచంద్రా నాకుఁదగిన గుణసంపత్తి గలదియు నాపట్టపుదేవియు నగు కౌసల్యా దేవియందు నిన్ను సత్పుత్రుని గంటిని.నీవును గొప్పగుణములు గలవాఁడని లోకులచే మెప్పుపడసితివి. కావున జ్యేష్ఠనందనా నిన్ను జేపు యువరాజుగాఁ జేయ నాలోచించితిని.

కం॥ నీవు స్వభావముచేతనె, వావిరి వినయంబు సుజన•వర్ణిత గుణసం
భావనయుం బొందితి; నీ, కెవిధమున నీడు లేమి•యెఱుఁగుదు నరులన్.

స్వభావముచేతనే=సహజముగ, వావిరి=అధికముగ, సుజనవర్ణిత గుణసంభావనయున్=సజ్జనులచేఁ గీర్తింపఁబడిన సద్గుణముల గౌరవము. ఈడు=సమానము. కొందఱు వినయమును సద్గుణములను శాస్త్రజ్ఞానమువలన, గురూపదేశమువలన లోకానుసరణమువలనఁ బ్రాయము వచ్చినపుడు నేర్చుకొందురు. రామునకో యవి సహజములు.

తాత్పర్యము

నీకు పుట్టువుతోడనే వినయము సజ్జనశ్లాఘ్యమైన సుగుణములు వచ్చినవి. నీకు సమానులు మనుష్యులందు లేరని నాకుఁ దెలియును.

మత్తకోకిలము. నీ వెఱుంగని యట్టినీత్యవి•నీతు లున్నవె యెందునే?
నేవి క్రొత్తగ నీకు నేర్పఁగ•నేను నేర్తుఁ గుమారకా!
భావితాదృతిఁ జేసి పుత్రక•వత్సలత్వము పేర్మి నే
నేవియో యొకకొన్నిటిన్ వచి•యించెద న్విను నందనా! ౧౦౪

నీతి + అవినీతి=నీత్యవినీతులు=నీతిదుర్నీతులు, నీతు లనుసరించుటకు-అవినీతులు పరిహరించుటకును దెలియవలెను. భావిత=పొందఁబడిన, ఆదృతిన్=ప్రీతితో-ఆదరణముతో, పుత్రక=కుమారా, వత్సలత్వము = బిడ్డలయందుఁ దల్లిదండ్రులకుండు ప్రేమయొక్క, పేర్మి = అతిశయముచేత, నందనా=కుమారా. సంతోషింపఁ జేయువాఁడు కావునఁ గొడుకునకు నందనుఁడనిపేరు.

మత్తకోకిలము:-ర-స-జ-జ-భ-ర గణములు ౧౧-వ యక్షరము యతి.

తాత్పర్యము

కుమారా! నీకుదెలియని నీతులు-అవినీతులు లేవు. నేనేమి నీకుఁ గ్రొత్తగా నేర్పఁగలను. అయినను నీవు పుత్రుఁడవను వాత్సల్యము పెంపునఁ గలిగిన యాదరణముచేఁ దండ్రులు కొడుకులకు హితముపదేశించుట ధర్మము గావున నేవియో కొన్ని నీకుఁజెప్పఁదలఁచితిని. నీవు నానందనుఁ డవగుట నన్నుసంతోషింపఁ జేయుట నీకుఁదగిన కార్యము 'పితతో వాక్యకరణాత్'. తండ్రి బ్రదికి యున్నకాలమున నాయన చెప్పినట్లు విని నడచువాఁడు పుత్రుఁడనఁబడును గావున నేను జెప్పినట్లు నీవు నడచిన నేను సంతోషింతును. అట్లైన నన్నేమి చేయుమనెదవా.

దీనివలన "కం॥ ఎఱుక గలవారి కైనను, గఱుపకతక్క రుచితప్రకారము లెల్లన్, గొఱలు హితులట్లగుట నఁ! దఱకును జెప్పంగవలయుఁ దగియెడి బుద్ధుల్" భార.వి."శ్లో॥ పిత్రాపుత్రో వయస్థోపి సతతం వాచ్యఏవతు। యథాస్యాద్గుణ సంయుక్తః. ప్రాప్నుయాచ్చమహద్యశః॥ కొడుకువయస్సు వచ్చినవాఁడైనను వానికి సుగుణ సంపత్తి మంచి గొప్పకీర్తి యెట్లువచ్చునో యదితండ్రి యెప్పుడు చెప్పుచుండవలెను. అను నీతులు సూచితములు

సీ॥ వినయవంతుండవై•విజితేంద్రియుండవై, నిత్యసుశీలివై•నెగడవయ్య

కామంబు క్రోధంబు•గలిగించునట్టిదుర్వ్యసనంబులను ప్రీతి•వదకుమయ్య

తక్షకాదిఁబరోక్ష•దశఁదన్ను మనుమంత్రి, తతులసమ్ముఖమునఁ•దనుపవయ్య

ధనధాన్యములకొట్లు•శతశాస్త్రశాలలు, వెలితిపోకుండఁ జూ•పెట్టవయ్య

తే॥ యిట్లు ధరయేలుచున్న న•రేంద్రుఁగాంచి,

ప్రకృతిజనులెల్ల సంతోష•భరితులగుదు

రతనిహితవర్యులెల్లరు•నమృత మొంది,

సంతసిలు వేల్పులట్టుల•సంతసింత్రు. ౧౦౮

వినయవంతుఁడవై=మిక్కిలి వినయము గలవాఁడవై అనగా నామాట కెదురాడక యని భావము. ఈ నడవడి గలవాఁడఁగుటచేత రామా యువరాజవు గమ్మనిన నట్టులే కానిమ్మనెను. అడవికిఁ బొమ్మనిన నట్టులే కానిమ్మనెను. తండ్రి యాజ్ఞ నిర్వర్తించుట పుత్రునకు విధికాని తన కనుకూలమైన వినుట తనకుఁ బ్రతికూలమైన వినకుండుట గాదు. తండ్రియాజ్ఞ తన కాపదగలిగించునా సంపద గలిగించునా యని కొడుకు యోజింపరాదు.

విజితేంద్రియుండవై=ఇంద్రియము జయించిన వాఁడవై, కామక్రోధలోభమోహాదులకుఁ జాలుపడకుము. నిత్యనుశీలివై = ఎల్లపుడు సదాచారము మాననివాఁడవై.

దుర్వ్యసనములు, వెలఁది, జూదము, పానము, వేఁట, పరుషముగఁ బలుకుట, కఠినముగ శిక్షించుట, ధనము వ్యర్థముగ వ్యయముసేయుట, ఇవి యేడును వ్యసనములు.

వేఁట, జూదము, పగటినిద్ర, అపనింద, స్త్రీచాపలము, మదము, నృత్తము, గీతము, వాద్యము, వ్యర్థమైన నడక ఇవి కామమువలనఁ గలుగు వ్యసనములు కొండెములు చెప్పుట, సాహసము, ద్రోహము, ఈర్ష్య, అసూయ, ధననాశము వాక్పారుష్యము, కఠినశిక్ష ఇవి క్రోధమువలనఁ గలుగు వ్యసనములు.

ఈ గిలా యందు ప్రీతి యుంచకుము.

తక్షకాదిన్=వడ్రంగి మొదలైన వారిని, పరోక్షదశన్=అధికారుల మూలమున, తన్పుచున్=తృప్తులఁ జేయుచు, సమ్ముఖమునన్ = ప్రత్యక్షముగ, కొట్లు=గదులు, తత=విస్తారమైన, శస్త్రశాలలు=ఆయుధాగారములు, వెలితి పోకుండన్=కొఱఁతలేక నిండియుండునట్లు, చూపెట్టవయ్యా=కనిపెట్టుము.

## తాత్పర్యము

రామచంద్రా నీవు మిక్కిలి వినయముగలిగి యింద్రియముల జయించి సదాచార సంపన్నుఁడవై కామమువలనఁ గలుగు వ్యసనములను; క్రోధము వలనఁ గలుగు వ్యసనములను ప్రీతిపెట్టక వడ్రంగి మొదలగు పనివాండ్రను నధికారుల మూలమున సంతుష్టిపడఁ జేయుచు, మంత్రులు లోనగు వారిని నీవే సమక్షమునఁ బిలిచి దానమానాదుల సంతుష్టిపడఁ జేయుచు నుండుము. ధనశాల్లలు-ధాన్య-ఆయుధశాలలు కొఱఁతపడకుండునట్లు కనిపెట్టుము. ఇవి కావలసినపుడు సంపాదింతమని యుపేక్షింపకుము.

ఈప్రకారము రాజ్యముచేయు రాజును జూచి మంత్రులు అధికారులు ప్రజలు లోనగు నెల్లవారు మిగుల సంతోషింతురు. ఆరాజు మిత్రులను అమృతము ద్రావిన దేవతలవలె నానందభరితులై శత్రువులవలని భయము విడిచి సుఖులై జీవింతురు.

ఈ పద్యమున మొదటిపాదమునఁ జెప్పిన వినయము జితేంద్రియత్వము సుశీలము సర్వజనులు ననుష్ఠింపఁ దగినవి శ్రీరామచంద్రుఁడు వినయవంతుఁడు గనుకనే నేర మేమిచేయకయుఁ దండ్రి వాక్యమని యడవులపాలాయెను. జితేంద్రియుఁడు కనుకనే కైకమీఁదఁ గాని తండ్రిమీఁదఁగాని కోపింపక యేకాంతమున భార్యాయుక్తుఁడై పదమూఁడు సంవత్సరము లుండియు నస్ఖలిత బ్రహ్మచర్య వ్రతనిష్ఠుఁడై యుండెను. నిత్యనుశీలి గనుకనే సీతను విడిచియు మరల వివాహము చేసికొనక స్త్రీసాంగత్య మపేక్షింపక "పుత్రార్థం

నోద్వ హేదన్యాం కర్మపుత్రాహి యోగినః। అపుత్రోపి పరంయాతి కర్మీ;నా న్యోపి సత్సుతః॥ అను నిష్ఠయందు నిలిచినవాఁడు. పుత్రులు లేరని పురుషుఁడు రెండవ వివాహము చేసికొనరాదు. వారివారి పుణ్యకర్మమే వారివారిని నుద్ధ రించును. కావునఁ బుణ్యకర్మములు చేయువాఁడు పుత్రులు లేకున్నను నూర్ధ్వ లోకమున సుఖించును. అట్టి కర్మములు చేయనివాఁడు పుత్రులుగలవాఁడైనను పుణ్యలోకముల నుండఁజాలఁడని శ్లోకార్థము. ఈవిషయమున సీతాదేవి వాక్య ములు స్మరించునది. అరణ్యకాండము ౧౦౩-౧౦౮ పద్యములు చూడుము.

వినయవంతుండవై =“శ్లో. తేభ్యోధి గచ్ఛేద్వినయం। వినీతాత్మాపి నిత్యశః। వినీతాత్మాహి నృపతి। ర్నవినశ్యతి కర్హిచిత్. సహజబుద్ధిచేతను, అర్థశాస్త్రము మొదలగువానియందలి జ్ఞానముచేతను, శిక్షితుఁడైనను పెద్దలవలన వినయము నేర్వవలయును. వినయవంతుఁడైన రాజెన్నఁటికినిఁ జెడఁడు. “శ్లో॥ బహవోఽ వినయాన్నష్టాః, రాజానస్సపరిచ్ఛదాః॥ వనస్థాఅపిరాజ్యాని, వినయాత్ప్రతి పేదిరే. అవినయముచేఁ బెక్కురురాజులు సపరివారముగా నశించిరి. అడవియం దొంటరిగానుండు వారైనను, వినయముచే రాజ్యమును సంపాదించుకొనిరి. శ్లో॥ వేనో వినష్టోఽవినయా। న్నహుషశ్చైవపార్థివః। సుదాసో యావనశ్చైవ సుముఖో నిమిరేవచ॥ వేనుఁడు, నహుషుఁడు సుదాసుఁడు సుముఖుఁడు నిమి వీ రవినయముచేఁ జెడిరి. “శ్లో॥ పృథుస్తు, వినయాద్రాజ్యం, ప్రాపవాన్ మను రేవచ, కుబేరశ్చ ధనైశ్వర్యం, బ్రాహ్మణ్యం చైవగాధిజః॥ వినయముచే పృథుచక్రవర్తి-మనువు రాజ్యము సంపాదించిరి. కుబేరుఁడు ధనైశ్వర్యము, విశ్వామిత్రుఁడు బ్రాహ్మణ్యము సంపాదించిరి, మను-౭-వ అధ్యాయము. విజితేంద్రియుండవు. “ఇంద్రియాణాం జయేయోగం। సమాతిష్ఠేద్దివానిశమ్। జితేంద్రియోహి శక్నోతి. వశేస్థాపయితుం ప్రజాః॥ రాత్రిపగలు నింద్రియముల జయింపఁ బ్రయత్నించుచుండవలయును. ఇంద్రియముల జయించిన వాఁడే ప్రజలను వశపఱచుకొనఁగలఁడు. “దశకామసముత్థాని తథాష్టౌ క్రోధజానిచ. వ్యసనాని దురంతాని, ప్రయత్నేన వివర్జయేత్॥ కామమువలనఁ బదిక్రోధము వలనఁ గలుగునని యెనిమిది నగు కష్టకారణములగు వ్యసనములను ప్రయత్న పూర్వముగ వదలవలయును.“శ్లో॥ కామజేషు ప్రసక్తోహి, వ్యసనేషు మహీపతిః॥ వియుజ్యతేర్థ ధర్మాభ్యాం, క్రోధజేష్వాత్మనైవతు కామము వలనఁ గలుగు వ్యసనములం దాసక్తుఁడగువాఁడు అర్థధర్మముల నాశముచేసికొను చున్నాఁడు క్రోధమువలనఁ గలిగిన వ్యసనములం దాసక్తిగలవాఁడు తనదేహమును నాశముచేసి కొనుచున్నాఁడు. “మృగయాక్షోదివాస్వప్నః। పరివాదః స్త్రియోమదః। తౌర్యత్రికం వృథాట్యాచ కామజో దశకోగుణః॥ వేఁట - జూదము - పగటినిద్ర - పరనింద - స్త్రీసాంగత్యము -

పానమువలన మదము-నృత్తగీతాదులు-వ్యర్థసంచారము:-ఇవి కామమువలనఁ బుట్టునవి. ఇవి కడపట వ్యసనమునకుఁ గారణము లగుటచే వ్యసనము లని చెప్పఁబడినవి. ఇవి మితముగనైన దోషములుకావు. అదియేపిచ్చిగా వాని యందు మనస్సు లగ్నముచేసి చేయవలసిన యితర కార్యములకు హానిగలి గింపరాదు ప్రజలకు-పశువులకు-వన్యమృగములవలన బాధగలిగినప్పుడు వేఁట దుష్టముగాదు. ఋతుకాలముల స్వస్త్రీతో సంభోగించుట దుష్టముగాదు. రాత్రి మేలుకొని యుండుటచేతనో యెండలోఁ దిరిగిన బడలిక చేతనో పగలు నిద్రిం చుట చెడ్డకాదు ఇట్టులే తక్కినవి. శ్లో॥ పైశున్యం సాహసం, ద్రోహ ఈర్ష్యా సూయార్థదూషణమ్। వాగ్దండంచ పారుష్యం క్రోధజోపి గుణోష్టకః॥ కొండెము చెప్పుట, సాధువుల బాధించుట, ద్రోహము, పరులగుణముల సహింపమి అసూయ ధనము వ్యర్థము చేయుట-కఠినముగ మాటలాడుట-కఠిన దండము; ఇవి క్రోధమువలనఁ గలుగువ్యసనములు. మనువు ౭-వ అధ్యాయము.

శ్లో॥ శబ్దః స్పర్శశ్చరూపంచ,రసోగంధశ్చపంచమః। ఏకైకమలమేతేషాం వినాశ ప్రతిపత్తయే. శబ్దము- స్పర్శము- రూపము- రసము- గంధము అను నీయైదింటిలో నొక్కొకటియే నాశముచేయుశక్తిగలది యగును. ఎట్లులన నిర్మలమైన పచ్చిక దిని చాలదూరము దాఁటఁగల జింకలు వేఁటగాని పాటవిని చంపఁబడుచున్నవి. పర్వత శిఖరములందు సంచరించుచు మహావృక్షములను వేళ్ళతోఁ బెకలించు నేనుఁగులు ఆఁడేనుఁగు స్పర్శమున కాశపడి బంధింపఁబడు చున్నవి. దీపమునుజూచి భ్రమించి శలభములు దానియందుఁబడి చచ్చు చున్నవి. జలములందెందో యడుగునఁ గన్నులకుఁ గానరాకయుండుచేపలు అమిషాశచేఁ జచ్చుచున్నవి. మదపునీళ్ళవాసనకు భ్రమసి తుమ్మెద లేనుఁగుల చెక్కిళ్ళపై వ్రాలివానిచెవుల దెబ్బలచేఁ జచ్చుచున్నవి.

కామముచే రావణుఁడు- జూదముచే నలధర్మరాజులు-వేఁటచేఁ బాండు రాజు-పానముచే యాదవులు నాశమైరి.

కం॥ అని బోధించుచు నుండఁగ, విని రామునిమిత్రవరులు•వేగ పరువునన్
జని చెప్పిరి కౌసల్యకు, జనపాలునివచనసరణి•సంతసమారన్. ౧౦౯

అని యీ ప్రకారము, దశరథుఁడు శ్రీరామునకు రాజనీతి యుపదేశించు చుండఁగా విని శ్రీరాముని హితులు పరువునఁబోయి కౌసల్యాదేవితో 'నమ్మా దశరథ మహారాజుగారు మీకుమారునకు శ్రీరామచంద్రమూర్తికి యౌవరాజ్య పట్టాభిషేకము చేయునఁట. ఆయనయే శ్రీరామునకుఁ జెప్పఁగా విని వచ్చితిమి" అని దశరథుఁడు చెప్పిన మాటలనెల్లఁ జెప్పిరి. ఆమెయు మిగుల సంతోషించెను.

కం॥ ఆరామామణి యొసఁగెను, శ్రీరామునివార్త యనుసు•హృద్వర్యులకున్
మేరలు మీఱు ధనంబులు,హారంబులు వివిధమణిమ•యాకల్పంబుల్. ౧౧౦

రామామణి=స్త్రీరత్నము, సుహృద్వర్యులకున్=రాముని మిత్రులకు, ఆక ల్పంబుల్=అభరణములు.

## తాత్పర్యము

గొప్పవారి కోపము గాని సంతోషముగాని వ్యర్థముగాఁ బోదు. కావున మహానుభావురాలయిన యా కౌసల్య తనకుమారుని విషయమైన శుభవార్త తెల్పిన యతనిహితులకు విస్తారధనములు ముత్యాలసరములు నానావిధము లయిన మణులు చెక్కిన యాభరణములు కానుకగ నొసఁగెను.

ఇది సంతోషవార్త చెప్పినవారికి బహుమాన మియ్యవలయుననిసూచించు చున్నది.

కౌసల్యకు ధనమెక్కడిది? ౧౬౨-వ పద్యమున మంథరావాక్యమును బట్టి (౫౬౨) కౌసల్యావాక్యము పట్టియుఁజూడ నామెయొద్ద విశేషధనములేనట్టు తోఁచుచున్నది. అదియును శాస్త్రప్రకారము స్త్రీలధనము వారి భర్తలదే కావున వారు స్వతంత్రించి భర్తయాజ్ఞ లేక వ్యయపఱుపరాదుకదా. ఈ విషయమున మనుస్మృతి "భార్యాపుత్రశ్చ దాసశ్చ। త్రయఏతేఽధనాస్మృతాః। యత్తేసమధి గచ్ఛంతి, యస్యైతే తస్యతద్ధనమ్॥౮-౪౧౬ అని చెప్పుచున్నది అనఁగా భార్యకొడుకు-దాసుఁడు వీరు ధనము లేనివారలు వీరెవ్వరివారో వీరిధనము వారిదే.

"తస్మాత్ స్త్రియో నిరింద్రియో అదాయాదాః" యని శ్రుతియుఁగలదు. ఇట్లని స్త్రీలకు సొంతధనము లేకపోలేదు. మనుస్మృతియందే (౯-౧౯౪) శ్లో॥ అధ్యగ్న్యధ్యా వాహనికం, దత్తంచ ప్రీతికర్మణి, భ్రాతృ, మాతృ, పితృ, ప్రాప్తం, షడ్విధం స్త్రీధనం స్మృతమ్" స్త్రీధన మాఱువిధములు (౧) అధ్యగ్ని (౨) అధ్యావాహనికము (౩) భర్త అత్తమామ మొదలగువారు ప్రీతిచేనిచ్చి నది (౪) తోడఁబుట్టిన వారిచ్చినది (౫) తండ్రియిచ్చినది (౬) తల్లియిచ్చి నది. ఈయాఱువిధముల ధనము స్త్రీధనమే. దీని వినియోగమందు స్త్రీ కధి కారము గలదు.

అధ్యగ్ని=వివాహకాలమందు నగ్ని కెదుట స్త్రీకి నియ్యఁబడిన ధనము అధ్యగ్ని స్త్రీధనమనఁబడును. పుట్టినింటనుండి భర్తయింటికిఁ బోవునపుడువారు వారిచ్చిన ధనము అధ్యావాహనిక మనఁబడును. ప్రీతిచే భర్తయిచ్చినది భర్తృ దత్తము. అట్టులే అన్నదమ్ములు-తల్లిదండ్రులిచ్చినదియు స్త్రీధనమే.

ఇట్టి ధనము కౌసల్యకుఁగలదని లక్ష్మణుఁడు చెప్పెను. చూడు వ. ౭౭౩ ౭౭౪.

ఇట్లు స్త్రీలకు లభించిన ధనము వారియనంతర మామె బిడ్డలకుఁ జెంద వలయును. బిడ్డలులేక భర్తకంటె ముందు మరణించెనేని భర్తకుఁ జెందవల యును. ఈ కాలమున వివాహసమయమందు వధూవరు లగ్నిసమీపమునఁ బీఁటలపై నుండఁగనే వారిపేర బంధువులిచ్చు వస్త్రాభరణాదులగు కానుకలను దల్లిదండ్రులో యత్తమామలో యపహరించి వాడుకొనుచున్నారు. ఇది దోషము. ఇట్టివా రధోగతుల పాలగుదురని మనుస్మృతి చెప్పుచున్నది.

శ్లో॥ స్త్రీధనానితుయే మోహా, దుపజీవంతి బాంధవాః నారీయానాని వస్త్రంవా, తేపాపాయాంత్యధోగతిమ్॥ కన్యాదాన నిమిత్తమైన శుల్కము నిషేధము అట్టులే కన్యకకై యిచ్చినది యితరులు గ్రహించుటయు నిషేధమే. ఏ బంధువులు మగఁడుగాని తండ్రిగాని యితరులుగాని భార్యయొక్కగాని పుత్రిక యొక్కగాని వాహనముగాని వస్త్రముగాని మఱియేదైనను దీసికొని స్వప్రయోజనమునకై వాడుకొందురో వారాపాపకార్యము చేయుటచే నధోగతుల పాలగుదురు. మను. ౩-౫౨. వధువు పేరఁ జదివించినవి వియ్యంకుల పరివర్తన పదార్థములలోఁ జేరవు. అటైన స్త్రీకి ధనము లేదనిన నేమియర్థము? పుట్టినింట నుండునపుడు తల్లిదండ్రులయో వారు లేనపుడు తోడఁబుట్టినవారలయో యనుమతిలేక వారిద్రవ్యము తాను స్వతంత్రించి వాడరాదు. భర్తయింటనున్నప్పుడు భర్తద్రవ్యముగాని భర్తకు మఱఁదులకుమ్మడిగానుండు ద్రవ్యముగాని వారి యనుమతి లేక వాడరాదు. భర్తసమ్మతిపై నతిథులకు నభ్యాగతులకు బిచ్చములకుఁగాను వ్యయము చేయుటయందు దోషప్రసక్తియేలేదు. భర్త యూరలేనపుడు నైమిత్తిక కర్మములందు దానము చేయుట భర్తయాజ్ఞ లేకపోయినను దోషముగాదు అనఁగా భర్తశ్రేయస్సునకై యాకార్యము చేయకపోయినచో భర్తకుఁ బ్రత్యవాయము కలుగునేని దానిఁదొలఁగించుటకై భర్తయాజ్ఞ లేకయే భార్యచేయు దానము దోషయుక్తముగాదు. అటుగాక తన యిష్టప్రకారము భర్తసొత్తు వినియోగించెనేని దొంగతనము చేసినపాపము ననుభవించును దీనికిఁ బ్రమాణము ఆపస్తంబులు "నహిభర్తుర్విప్రవాసే నైమిత్తికే దానేస్తేయ ముపవిశంతి."

చం॥ జనకుని సన్నుతిందనిపి•స్యందనమెక్కి రఘూత్తముండు దాఁ
జనియె నిజాలయంబునకుఁ•జయ్యనఁ బౌరు లనుజ్ఞఁ గాంచుచున్
జని తమకోర్కి పండుటకు•సమ్మతి మీఱఁగ నిల్లువేల్పులన్
దనిపి రభీష్టపూజనవి•ధానములం గడు సంప్రహృష్టులై. ౧౧

సన్నుతిన్=విధివిహితమైన నమస్కారముచే, తనిపి=సంతోషపడఁజేసి; స్యందనము=రథము, నిజాలయంబునకున్=తన యింటికి, చయ్యన=త్వరగా; ఇల్లువేల్పులు=తమ యిండ్లయందుఁ దాము పూజచేయు నిష్టదేవతలను; కడు సంప్రహృష్టులై=హృష్టులనఁగా=హర్షము బొందినవారు, ఆనందించినవారు, ఏదియో కొంచెము లాభము కలుగఁగానే యానందించుట హర్షము. అపురూప పుటతిథి, చిరకాలవియోగమున నున్న ప్రియులు కలిసికొనిన ప్రహర్షము కలుగును. తొలిచూలు కొడుకు గలుగుట మొదలైనవి సంప్రహర్షము కలిగించును. ఇట్టి సంప్రహర్షము నతిశయించినది కడు సంప్రహర్షము బ్రహ్మానందమనియే చెప్పనగు.

## తాత్పర్యము

తండ్రి చెప్పిన పలుకులు విని శ్రీరాముఁడాయనకు ధర్మశాస్త్రప్రకారము నమస్కరించి మీరెట్టు లాజ్ఞాపించిన నట్టులే చేసెదనని చెప్పి సంతోషపడిచి తన రథమెక్కి తన యింటికిఁ బోయెను. అంతటఁ బురజనులందఱు వెంటనే రాజా నుజ్ఞపడసి తమకోర్కి యిన్నాళ్ళకు ఫలించెఁగదా యని బ్రహ్మానంద మనుభవించుచున్నవారై యట్టి యదృష్టము కలుగఁజేసినందునకై తమతమ గృహములందుఁ దా మర్చించు దేవతలను విశేషముగఁ బూజించిరి.

మరలి వెడలి పోవునపుడు నమస్కరించెనని చెప్పుటచే గురువులయొద్దకు వచ్చునపుడేకాక మరలఁ బోవునపుడును వారికభివాదము చేయవలయునని సూచన. దేవతలయొద్దనుండి గురువులయొద్దనుండికాని సెలవు తీసికొనిపోవునపుడు వారికిఁ బ్రదక్షిణము చేయునపుడు వారికి వీఁపుకానరాకుండఁ బోవలెను-ప్రదక్షిణము చేయవలయును.దేవతా గురుసన్నిధి నాత్మప్రదక్షిణము నిషిద్ధము

## ౪-వ సర్గము.

ఉ॥ పౌరులు వీడుకో ల్వడసి•పాయఁగ నావల నిశ్చయజ్ఞుఁ డౌ
ధారణినేత మంత్రి సహి•తంబుగ నెల్లియ పుష్యయోగ మై
శ్రీ రహి మీఱఁ గాన రఘు•శేఖరునిన్ యువరాజుఁ జేయఁ బెం
పారు నటంచు నిశ్చయము•నాడి సభం, జనె నింటిలోనికిన్. ౧౧-౨

వీడుకోలు=అనుజ్ఞ-ఇంటికిఁ బోవుటకు ననుమతి-నిశ్చయజ్ఞుఁడు=ఈ కాలమున నిట్టికార్యము నిట్టులు చేయవలయునని తీర్మానించుకొనినవాఁడు. ధారణినేత=భూపతి-నేతృశబ్దతత్సమము నేత.

## తాత్పర్యము

పురజనులు తమ యిండ్లకుఁబోవ రాజుచే ననుజ్ఞ గొనిపోఁగా నిశ్చయ జ్ఞానముగల దశరథుఁడు మంత్రులతోఁగూడి ఱేపు పుష్యనక్షత్రముగావున శ్రీరామునకు యౌవరాజ్య పట్టాభిషేకము జరుగునని నిశ్చయముగఁ జెప్పి తన యింటిలోనికిఁ బోయెను.

—• దశరథుఁడు శ్రీరామునిఁ దననగరునకుఁ బిల్పించుట •—

కం॥ ఈరీతి నృపతి యంతర, గారంబున జేరి సూతుఁ•గని వేగమునన్
శ్రీరఘురాముని నిం కొక, వారము తోడితె మ్మటంచు•వాక్రుచ్చుటయున్.

అంతరగారంబు=లోపలిగృహము = గృహము లోపలి భాగము=సభాకూటము గాదనుట, వారము=మాఱు, వాక్రుచ్చుటయున్=చెప్పఁగా.

తా త్ప ర్య ము

ఈవిధముగా దశరథమహారాజు గృహములోపలికిఁ బోయి సుమంత్రునిఁబిల్చి త్వరగా నీవుపోయి మఱియొకసారి శ్రీరాముని బిలుచుకొని రమ్మని చెప్పఁగా.

ఉ॥ చయ్యన నేగి, రాము మొగ◆సాలను నిల్చి, యుదంత మంపఁగా,
నయ్యనఘుండు శంక గొని◆యాతనిఁ బిల్వఁగఁ బంచి, రాజుగా
రియ్యెడ నన్నుఁ బిల్చుపని◆యెయ్యది నా, మిముఁ దోడితేర గా
నయ్య వచించెఁ, బోకయుఁ ద◆దన్యము సేఁతయు మీయధీనముల్. ౧౧౪

మొగసాల=ముఖశాలా శబ్దభవము. ముంగిటిచావిడి; ఉదంతము=వార్త.

తా త్ప ర్య ము

సుమంత్రుఁడు రాజాజ్ఞమేరకు శ్రీరాముల మందిరమునకేగి మొగసాల యందు నిల్చి సుమంత్రుఁడు రాజుగారి పనుపున దర్శనార్థమై వచ్చినవాఁడని వార్తపంపఁగా నిష్కల్మష చిత్తుఁడైన శ్రీరాముఁడు తండ్రిగారియొద్దకుఁ బోయి యుండి యిప్పుడే వచ్చితినే యింతలో నేమివిపరీతము పొసఁగెనని సందేహించి లోపల రమ్మని సుమంత్రు నాజ్ఞాపించి సుమంత్రా యింతలో మరలఁ బిలిపింప నేమికారణమని ప్రశ్నింపఁగా నదియేమో నాకుఁదెలియదు మిమ్ముఁబిలుచుకొని రమ్మని రాజుగా రాజ్ఞాపించిరి. నేను వచ్చితిని. అప్పటికి వచ్చుటకు రాకుండుటకు మీరు స్వతంత్రులు అని యతఁడు చెప్పెను.

సుమంత్రుని చర్యవలన నెంతపరిచితి యున్నను గొప్పవారి యిండ్ల లోనికిఁ దటాలున దూఱరాదు. ముందువార్తపంపి వారు రావచ్చుననినఁ బోవలయునని సూచన. "అనాహూతః ప్రవిశతి। అపృష్టో బహుభాషతే। అవిశ్వస్తే విశ్వసతి। మూఢచేతా నరాధమః॥ పిలువఁబడక ప్రవేశించుట అడుగకున్నను విశేషించి మాటలాడుట, నమ్మరాని వాని నమ్ముట మూఢచిత్తుల లక్షణము.

చం॥ అనవుడు వేగ తండ్రిఁ గన◆నారఘురాముఁడు పోయి దూరమం
దున కని దండవత్ప్రణతిఁ◆దూర్ణముగా ఘటియింపఁ, బ్రేమమైఁ
దనయుని లేవనెత్తి, వసు◆ధాపతి కౌఁగిటఁ జేర్చి, యోగ్యపీ
ఠిని గనిపించి, కైకొనఁ గ◆డింది ప్రియంబునఁ బల్కె రాఘుతోన్.

దండవత్ప్రణతి=దండాకారముగా నమస్కారము, తూర్ణము=శీఘ్రము. చూచిన వెంటనే.

తా త్ప ర్య ము

సుమంత్రుఁ డీప్రకారము చెప్పఁగా వెంటనే తండ్రిని జూడఁగోరి శ్రీరామ చంద్రమూర్తి బయలుదేఱిపోయి దూరమునందుండియే చూచి చూచినవెంటనే సాష్టాంగనమస్కారము గావింపఁగా ప్రేమతో దశరథుఁడు నేలవ్రాలిన శ్రీరాము

లేవనెత్తి కౌఁగిటఁజేర్చి యోగ్యమైన యాసనమును జూపి కూర్చుండుమని చెప్పి యీప్రకారము పలికెను.

—•{ దశరథుఁడు శ్రీరాముని యువరాజుఁ జేయుటకుఁ గారణము లాయనతోఁ జెప్పుట. }•—

శా॥ రామా! వృద్ధుఁడఁ బెక్కులేండ్లు మనితిన్,•రాజ్యంబు ప్రాజ్యంబుగాఁ
గామంబుల్ మన సారఁ బొందితిని, నేఁ•గావించితిన్ సత్క్రతు
స్తోమంబుల్ సరసాన్న దక్షిణలతోఁ•దోరంబుగా దాన ము
ద్దామశ్రీ విలసిల్లఁ జేసితి యథా•తాత్పర్యశాస్త్రంబుగన్. ౧౧౬

సత్క్రతుస్తోమంబుల్=శ్రేష్ఠములైన యజ్ఞసమూహములు, తోరంబుగాన్=విశేషముగ, యథాతాత్పర్యశాస్త్రంబుగన్=శాస్త్రవిధి నతిక్రమింపక దానియభిప్రాయప్రకారము, వృద్ధుఁడను=వయస్సుచే ముసలివాఁడను, ప్రాజ్యము=అధికము ఉద్దామశ్రీ=అధిక కీర్తిసంపద.

అన్నదక్షిణలతో=అన్నదానము-దక్షిణ-లేని యజ్ఞము తామసయజ్ఞము అదివ్యర్థము. అనర్థకరము కావున నట్టిలోపము లేకుండఁ జేసితినని భావము.

శ్లో॥ విధిహీన మసృష్టాన్నం, మంత్రహీన మదక్షిణమ్
శ్రద్ధా విరహితం యజ్ఞం, తామసం పరిచక్ష్యతే. భగవద్గీత.

శాస్త్రప్రకారము చేయఁబడనిది, అన్నదానములేనిది, మంత్రలోపము గలది, దక్షిణలేనిది, శ్రద్ధలేనిది, యగు యజ్ఞము తామసమనఁబడు నను భ॥గీ॥ వాక్యమిందుఁ బ్రమాణము, యజ్ఞమనుటచే దేవయజ్ఞము పితృయజ్ఞము రెండును గ్రాహ్యములు.

తాత్పర్యము

రామచంద్రా! నాయనా! ముసలివాఁడను. అనేకసంవత్సరములు జీవించితిని. యథేచ్ఛముగా రాజ్యము పరిపాలించి మనస్సునఁగల కోరికలన్నియుఁ బూర్ణముగ ననుభవించితిని. రసవంతములయిన యన్నములతోను దక్షిణలతోను అనేకములైన గొప్పయాగములు సలిపితిని. అధికకీర్తి కేకొఱఁత లేకుండ శాస్త్రప్రకారము విశేషదానములఁ గావించితిని.

చం॥ సలిపితి సర్వదానములు,•శాస్త్రము లన్నిటి నభ్యసించితిన్,
దలఁగితి నాత్మదేవవసు•ధావిబుధర్షి పితౄణబంధముల్,
కలిమిని సర్వభోగములు•కామితము ల్దని వార నొందితి,
న్పలియు నతుల్య నిష్ఠ నిను•నందనుఁ గాంచితిఁ బూరుషోత్తమా! ౧౧౭

ఆత్మ దేవ వసుధావిబు ధర్షి పితౄణబంధముల్ = ఆత్మఋణము-దేవఋణము-బ్రాహ్మణఋణము-ఋషిఋణము-పితృదేవతల ఋణము అను నప్పులను-తలఁగితిన్=తొలఁగఁజేసితిని-కామితముల్ = కోరికలు-తనివారన్=తృప్తి కలుగునట్లుగ తనివి + ఆరన్=అని పద విభాగము-తనివు అని శబ్దమునుగలదు,

బలియుస్=బలవంతుని-ఇది రాజ్యరక్షణమునకు ముఖ్యముగఁ గావలసిన గుణము-అతుల్యస్=అసమానునిస్-రాజునకు సమానుఁడు మఱియొకఁ డుండె నేని-వైరము-కలహము దేశక్షోభము కలుగక మానదు. నిన్ను రాజును జేసిన నట్టిభయము లేదు. ఇష్టస్=నాకును లోకులకును సమ్మతమైనవానిని-తండ్రికిష్టుఁడు గానివాఁడును రాజ్యార్హుఁడుగాఁడు. కావున రాజునకుండవలసిన గుణములన్నియు నీయందున్నవి. పురుషోత్తమున్=పురుషుఁడు, రూ-పురుషుఁడు పురుషులందు శ్రేష్ఠుఁడాయని మనుష్యులఁ జెప్పునపుడు సప్తమీ తత్పురుషము చెప్పవలయును. భగవంతునిజెప్పునపుడు పురుషులు జీవులు కావున పురుషులందు శ్రేష్ఠుఁడని చెప్పిన భగవంతుఁడును జీవకోటిలోఁజేరిన వాఁడగును గావునఁ బురుషులకంటె శ్రేష్ఠుఁడని పంచమీ తత్పురుష సమాసము చెప్పవలయును.

## తాత్పర్యము

నాయనా! గోభూహిరణ్యాది సమస్తదానములు చేసితిని. అన్ని శాస్త్రములు నేర్చి వానియందలి విషయము లభ్యాసమందుంచితిని సుఖానుభవముచే నాత్మఋణమును, యజ్ఞాదులచే దేవఋణమును, దానముచే బ్రాహ్మణఋణమును, బ్రహ్మచర్యముచే ఋషిఋణమును సంతానముచే పితౄణమును దీర్చితిని. ఐశ్వర్యము సంపాదించి కోరికదీర సమస్తభోగములు కొఱఁతలేక తృప్తియగునట్టు లనుభవించితిని. బలవంతుఁడు అసమానుఁడు తల్లిదండ్రులకుఁ బ్రజలకు నిష్టుఁడైన నందను నిన్నుఁగాంచితిని. కావున నాకెట్టికొఱఁతయులేదు.

వేదప్రకారము బ్రాహ్మణుఁడు మూఁడప్పులచేఁ బుట్టుచున్నాఁడు. "జాయమానోవై బ్రాహ్మణ స్త్రిభిర్ ఋణ వాజాయతే బ్రహ్మచర్యేణ ఋషిభ్యః యజ్ఞేన దేవేభ్యః ప్రజయాపితృభ్యః' యని శ్రుతివచనము కలదయినను గొందఱుమతమున ఋణములైదు. అటుగాకున్నను ముఖ్యములైన యీమూఁడును దక్కినవాని కుపలక్షణముగా గ్రహింపనగు. దేవాదులు మనకుఁజేసిన యుపకారమేమి మనము పుట్టకముందే వారికెట్లు ఋణపడితిమి అనఁగా.

శ్లో॥ సహయజ్ఞైః ప్రజాసృష్ట్వా, పురోవాచప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వ, మేష వో స్త్విష్టకామ ధుక్
దేవాన్ భావయతానేన, తేదేవా భావయంతు వః
పరస్పరం భావయంతః, శ్రేయః పరమవాప్స్యథ. భ.గీ.౩॥౧౦-౧౧

పూర్వకాలమునఁ బ్రజాపతి యజ్ఞములతోడఁ బ్రజలను సృష్టించి యిట్లు చెప్పెను.ఓప్రజలారా యీ యజ్ఞములచే బాగుపడుఁడు. ఇవియే మీకోరిన కోరికలనెల్ల సమకూర్చును. ఈయజ్ఞములచే దేవతల నారాధింపుఁడు. మీచే నారాధింపఁబడి దేవతలు మిమ్ముఁబోషింతురు.ఇట్లు దేవతలు మీరు పరస్పరము వృద్ధిఁ బొందించువారై పరమశ్రేయస్సును బొందఁగలరు.

శ్లో॥ ఇష్టాన్ భోగాన్హి వో దేవా, దాస్యంతే యజ్ఞభావితాః
తైర్దత్తా నప్రదాయైభ్యో, యోభుంక్తే స్తేన ఏవ సః.    ౧౨

యజ్ఞములచే నారాధింపఁబడి దేవతలు మీకిష్టభోగముల నీయఁగలరు. అట్టివారిచే నీయఁబడినవానిని మరల వారికియ్యక తానే భుజించువాఁడు దొంగయే.

ఈప్రకారము సామాన్యముగ మాత్రమేగాక మనుష్యుల ప్రత్యవయవమునకు నధిష్ఠానదేవతలు గలరు. ఆయాయవయవమును నాయాదేవత పోషించుచుండును. ఇది మనము తల్లిగర్భమున నున్నప్పటినుండి జరుగు కార్యము. కావున దేవతలకు మనము ఋణబద్ధులమయియే పుట్టుచున్నాము. ఆఋణముఁ దీర్చుకొనుటకై కృతజ్ఞులమై మనము యజ్ఞములు (దేవతారాధనలు) చేయవలెను. అట్లుచేయనివారు దొంగలు కృతఘ్నులు నగుదురు. కావున దేవతలఋణము దీరుటకై యజ్ఞములు (దేవతారాధనలు) చేయవలయును. యజ్ఞమునకు నారాధనమనియే యర్థము.

వేదబాహ్యులుగాని వారికందఱకుఁ గర్మాచరణమందు బ్రాహ్మణాదులకుఁ బండితులకైనను పామరులకైనను వైదికకర్మమందు హితాహిత బోధమందు బ్రాహ్మణ సాహాయ్యము కావలసియున్నది. కావున నట్టివారికిఁ బ్రత్యుపకారార్థము దానములు చేయవలెను.

ఋషుల ఋణము బ్రహ్మచర్యముచేఁ దీర్పవలయును. బ్రాహ్మణుఁ డిరు గోత్రములవాఁడు. జననముచే వచ్చినది జనక గోత్రము. రెండవది ఋషి గోత్రము. ఆయాఋషుల తేజస్సు ఆయా గోత్రముల వారియందు వంశపరంపరగా వ్యాపించి రక్షించుచుండును. ఇది పిత్రార్జిత ధనమువంటిది. పిత్రార్జితము గోలుపోయి స్వార్జితము లేకయుండువాఁడు దరిద్రుఁడెట్లగునో యట్లే తపస్సు సంధ్యాది నిత్యకృత్యములుచేసి తేజస్సును వృద్ధిచేసికొనుటకు మాఱుగ దుష్టాహార దురాచార దుష్టవిహారములచేఁ దేజస్సు గోలుపోయినవాఁడు క్రమక్రమముగా హీనజాతి వాఁడగును. తానార్జింప లేకపోయినను ఋషిదత్తమైన తేజస్సునైనఁ గోలుపోవక యుండుట బ్రాహ్మణ బీజమునకుఁ బుట్టిన ప్రతిబ్రాహ్మణునికి విధియైయున్నది. మనప్రార్థనము మన ప్రయత్నము లేకయే తమ తేజస్సును మన కనుగ్రహించిన ఋషుల ఋణమును దీర్చుకొనుట విధి. వారా తేజస్సును బ్రహ్మచర్యము చేతనే సంపాదించినవారు బ్రహ్మచర్యమనఁగా (1) వేదాధ్యయనము (2) వీర్యమును దుర్వ్యయము చేయక దుష్కామమునకుఁ బాలుపడకయుండుట. కావున నీరెంటిచేత తమ గోత్రఋషులను దృప్తులఁ జేయవలయును.

పితృ ఋణమనఁగాఁ బితృదేవతల ఋణము. సంతాన దాతలు పితృదేవతలు. సంతానార్థులు పితృదేవతల నారాధింపవలయునని శ్రీభాగవతమునఁ

గలదు. మరణించిన మన తండ్రి-తాత-ముత్తాతలు - వీరి స్వాధీనమందుండు వారు. కావున మన పితరులపేర మన మీదేవతల నారాధించితిమేని వారు మన పితరులకు సుఖము నూర్ధ్వలోకములు గలిగింతురు. మనము శ్రాద్ధాదులచేవారి నారాధింపక పోయితిమేని వారు మన పితృపితామహ ప్రపితా మహాదులకే సహాయముచేయరు. ఆకారణముచే వారథోలోకముల పాలయి మనల శపింతురు. కావున మావంశము వృద్ధియగునుగాక వారు నివా ములచేతను పిండాది దానములచేతను మాకూర్ధ్వలోకములు గలిగింతురు గాక యని మన పితరులు గోరుచుందురు. మనకుఁ గరణకళేబర దాతలైన వారి విషయమునఁ గృతజ్ఞులమై వారికి నూర్ధ్వలోకసుఖములు గలుగుటకై సదాచారసంపన్నుని శాస్త్ర విశ్వాసిని పితృభక్తిపరుని ధర్మశాస్త్ర పద్ధతిని పుత్రుఁడుగాఁగని వారి ఋణము తీర్చుకొన వలయును, శ్రాద్ధాది పితృకర్మములు చేయుట తమయొక్కయుఁ దమవంశము యొక్కయు క్షేమమునకే కాని యితరుల నుద్ధరింపఁ గాదు.

ఆత్మఋణము-భూమిమీఁదఁ బురుషుఁడు పుట్టుట యైహికసుఖము నాముష్మికసుఖము నను రెండుసుఖముల నార్జించుటకే. 'అనిషిద్ధ సుఖత్యాగీపశురేవ నసంశయః' యన్నట్లు శాస్త్ర నిషిద్ధములుగాని సుఖముల నిష్కారణముగ వదలువాఁడు నిస్సందేహముగఁ బశువే. దానివలన వాఁడు సాధించు పురుషార్థమేదియు లేదు. ఆముష్మిక సుఖము గోరువాఁడైనను శాస్త్ర సమ్మతములైన తత్తదాశ్రమ విహిత సుఖముల ననుభవింప వచ్చును. అట్లు చేయనివాఁడు దేహమును ఆత్మను నిష్కారణముగఁ బీడించి చెడును. 'ఆత్మాన మవసాదయే' త్తని గీతావాక్యము కలదుకదా. ఈ విషయము భారతమందిట్లు చెప్పఁబడెను. మోక్షధర్మపర్వము. "దేవర్ష్యతిథి భృత్యేభ్యః। పితృభ్యశ్చాత్మనస్తథా। ఋణవాన్ జాయతేమర్త్య, తస్మా దనృణతాంవ్రజేత్। స్వాధ్యాయేన మహర్షిభ్యో దేవేభ్యో యజ్ఞకర్మణి। పితృభ్యః శ్రాద్ధదానేన నృణామభ్యర్చనేనచ। పాకశేషశ్చ భృత్యానాం, పాలనే నాత్మనోపిచ" మనుష్యుఁడు భూమిమీఁదఁ బుట్టుటకు దేవఋణము-అతిథిఋణము-భృత్యఋణము-పితౄణము-ఆత్మఋణము కారణములు. ఈఋణములనుండి విడివడినవానికి జన్మకారణములేదు కావున నాఋణములన్ని, తీర్చుకొని పోవలెను. వేదాధ్యయనముచే ఋషిఋణము-యజ్ఞములచే దేవఋణము- శ్రాద్ధములచేఁ బితృఋణము అతిథుల నాదరించుటచే మనుష్యఋణము వందుకొన్న దానిలో మిగిలినది యిచ్చుటచే భృత్యఋణము, ఆత్మను రక్షించుటచే (జ్ఞానమున) ఆత్మఋణము తీరిపోవును.

కం॥ రాజితగుణి వగునిను యువ, రాజుంగాఁ జేసి మిగుల•రాగంబున భూ
మీజన మలరంగను బే,రోజను గను బొకట బొఱఁత•యుత్తమచరితా!౧౧౮

రాజితగుణ=ప్రకాశింపఁజేయఁబడిన గుణములు కలవాఁడు-ఇట్లనుటచే శ్రీరాముని నాశ్రయించుటచే సద్గుణములకే ప్రకాశము గలిగెను గాని వానివలన శ్రీరామున కేప్రకాశము గలుగలేదని భావము. 'అనర్ఘ్యమపి మాణిక్యం హేమాశ్రయ మపేక్షతే" మాణిక్య మెంతవెలగలదైనను బంగారు నాశ్రయింపఁ గోరుచున్నది యన్నట్లు బంగారునందుఁ బొదిగిన మాణిక్యమునకే కాంతిగాని బంగారునకుఁగాదు. ఆమాణిక్యమునే యినుమునందుఁ బొదిగిన తేజోహీనమై కానవచ్చును. కావున సద్గుణములన్నియుఁ దమలాభమునకే శ్రీరాము నాశ్రయించెనని భావము. రాగము=అనురాగము-ప్రేమ.

తాత్పర్యము

నాయిహపర సౌఖ్యములకై నేను జేయవలసిన కార్యములన్నియుఁ జేసితిని. కాని యొకకొఱఁతమాత్ర మున్నది. అది యేదంటివా? గుణాధిక్యుఁడవు నుత్తమ చరితుఁడవునగు నిన్నుఁ బ్రేమతో యువరాజుగాఁజేసి భూమి జనులందఱు ననురాగముతో సంతోషింపఁజేయుట యొక్కటియే కొదువ. అది చేసితినేని నే నీలోకమున జీవించి యిఁకఁ జేయవలసిన కార్యములేదు.

ఉ॥ కావున నావచించునది•కాదన కీ వొనరింపఁగాఁ దగున్,
పావనశీల! నీవు నర•పాలుఁడుగా జను లెల్లఁ గోరి రి
ట్లావిధి, నట్లుగాన నిను•జయ్యన నే యువరాజుఁ జేసెదన్,
నీవు భరింపఁ బూను మవ•నిం, గత మే మిటుచేఁత కంటివేన్. ౧౯

పావనశీల=పవిత్రపు నడవడిగలవాఁడా, కతము=కారణము-చేఁత=చేయుట

తాత్పర్యము

కావున నేను జెప్పఁబోవునది 'సరికాదు. నీవు జీవించియుండఁగా రాజ్యభారము 'నేను వహింపరాదు' అని చెప్పక నీవు తప్పక చేయవలయును - ప్రజలందఱు నాబలాత్కారములేక వారంతటవారే నిండు మనస్సుతో నిన్ను యువరాజుఁజేయ నంగీకరించిరి. కావున నేను నట్లుచేసెదను. కాఁబట్టి నీవు దీని నంగీకరింపవలయును. ఇప్పుడు దీనికేమితొందర ఇంకను గొన్నినాళ్ళు జరుగఁగూడదా యందువేమో.

ఉ॥ భీతిదదుర్నిమిత్తములు•పెక్కులు గాంచెద స్వప్నమందు, ని
ర్ఘాతము లుల్కలుం బడఁగఁ•గంటి మహారవసంయుతంబుగా,
జ్యౌతిషికాళి రాహుకుజ•సప్తతురంగులు జన్మతారకన్
వే తవులంగఁ జొచ్చి రన•వింటి, నిఁ కేమి వచింతుఁ బుత్రకా! ౨౦

భీతిద=భయంకరములగు, దుర్నిమిత్తములు=అపశకునములు - స్వప్నమందున్=కలయందు-నిర్ఘాతములు=పిడుగులు- ఉల్కలు=కొఱవులు- మహారవసంయుతంబుగాన్=మిక్కిలిధ్వనితోఁగూడునట్లు-జ్యౌతిషకాళి=గ్రహచారశాస్త్రము తెలిసినవారు-సప్తతురంగుఁడు=సూర్యుఁడు.

తాత్పర్యము

నీపట్టాభిషేకమునకై నేను దొందరపడు కారణము చెప్పెద వినుము. నా స్వప్నమందు నల్లవస్త్రము ధరించిన స్త్రీ నన్నుఁగౌగిలించుట లోనగు దుశ్శకునము లనేకములు కానవచ్చుచున్నవి. అవిగాక లోకు లందఱకుఁ దెలియునట్లు పిడుగులు కొఱవికట్టె లాకాశమునుండి రాలుచున్నవి. వీనివలనఁగీడు నీకే కలుగునని యెట్లు నిశ్చయమందువేమో: నాజాతకము చూచిన జ్యోతిశ్శాస్త్రము తెలిసిన పండితులందఱు రాహువు-అంగారకుఁడు-సూర్యుఁడు నాజన్మనక్షత్రమును బీడింప నున్నారని చెప్ప వింటిని దీనివలననే ఫలము నీవు గ్రహింపఁ గలవు. నా మరణకాలము సమీపించినదని నేను వేఱుగఁ జెప్పవలయునా.

శ్లో॥ ద్వాదశాష్టమ జన్మస్థా, శన్యర్కాంగరకా గురుః
కుర్వంతిప్రాణసందేహం, స్థానభ్రంశం ధనక్షయమ్.

అని జ్యోతిషవాక్యము. అనఁగా ౧-౨-౮-౧ లగ్నములందు శని-సూర్యుఁడు। అంగారకుఁడు-గురువు నుండి రేని ప్రాణసందేహము స్థానభ్రంశము ధన నాశము కలుగును.

సీ॥ ధ్రువమండలమున నరుంధతిఁ గనుశక్తి। గంటికిఁ గలుగంగఁ గానకున్న ముక్కున వలపటఁ జెక్కవాసినయట్లు దోఁచినఁబూర్ణ చంద్రుఁడు మలినుఁ। డై కానవచ్చిన నాయువు సంవత్సరమునఁ గడచను రాజముఖ్య। కాంతితొల్లిటి యట్లుగాక యంతకు నెక్కు। డైనను గడుఁజెడ్డ, యట్లువ్రజ్ఞ। క్రొత్తగాఁ బెద్ద యైనను గొంచెమైన। నాఱునెలల మరణదశయగుట గలుగు। నిందుమండలమున రవియందు నడుమఁ దెఱపిగాంచినఁ దెగునేడు దివసములకు॥ కం॥ వినుగుడిలో నున్నసమయ। మున సురభిద్రవ్యములను బొలవలచుటగ। ల్గిన నాఱు దివసములఁగ। ల్గును మృత్యు సమాగమంబు గుణరత్ననిధీ॥గీ॥ ముక్కు వ్రాలుట కర్ణముల్ మొగ్గఁబడుట। రదనపైవర్ణ్య మఱివిరాగభావ, మంగమతికృష్ణమగు టుల్లమదరఁ జెడుట। సూచకములు సద్యో మృత్యుగోచరతకు॥ గీ॥ కారణములేక దాపలికను ద్రవించు॥ నెత్తిచక్కటి ధూమంబు నెగయునపుడ। మరణ దశ యావహిల్లెడు మానవునకు-జనకనృప యివి బ్రహ్మ చెప్పిన విధములు॥ మహాభా. - శాంతి. ౬-౧౨౬-౧౨౮-౧౨౭.

తననీడ దనకుఁ గానరాకపోవుట-అద్దమునందు నీళ్ళయందుఁ దన శిరస్సు గానరాకపోవుట-చంద్రునివలె సూర్యుఁడు కానవచ్చుట-కిరణములు కానరాకపోవుట-యీ మొదలైనవి మఱికొన్ని గలవు ఇవిమేలుకొని యున్నప్పుడు కానవచ్చునవి. నల్లరంగు నల్లదంతములు గలవాఁడు కలలోఁ గానవచ్చినను సారాయము త్రాగినట్లు తామర తూండ్లు తిన్నట్టు లొంటికమలము ధరించినట్లు గాడిదలు పందులు కట్టిన వాహనములపైఁ బ్రయాణము చేసినట్లు-కలలోవచ్చినను శీఘ్రమున మరణించును. సుందరకాండమందుఁ ద్రిజటాస్వప్నము

చూచునది త్రిజటా దశరథ భరత స్వప్నములు సత్యము లగుటచేతను స్వప్నములు భగవంతునిచే సృష్టింపబడునని శ్రుతిచెప్పుటచేతను అనుభవమందు ననేక స్వప్నములు ఫలించుటచేతను, ధాతువైషమ్యముచేఁ బైత్యవికారాదులచే వచ్చు కలలుదప్పఁ దక్కినవి సత్యములేయగు.

తే॥ ఇట్టిశకునంబులఫలంబు•నెంచి చూడ, నవనిపతి మరణించు, లే•దా మహాప
దాళి ఘటియిల్లుఁగానరా•జ్యంబుఁగొనుము,
ప్రాణవంతుండనై యుండు•నపుడవత్స! ౧౨.

తాత్పర్యము

ఈ శకునముల ఫలము లన్నియు నాలోచించిచూడఁగా రాజగువాఁడు మరణించును. అటుకాదేని దానితో సమానమైన గొప్పయాపదయైన సంభవించును. కావున నేను జీవింతునో జీవింపనో. నేను జీవించియుండఁగానే నాయనా! రాజ్యము గొనుము.

తే. మన్మనోవృత్తియిప్పుడీ•మాడ్కినున్న,
దింక నెపుడెట్టులుండునో•యెఱుఁగరాదు
కాన నిప్పుడ యభిషేక•గరిమఁగనుము,
కలదె ప్రాణికి మనసుని•ల్కడతనూజ! ౧౩

మత్ + మనో + వృత్తి=నామనోవర్తనము-ఈమాడ్కిన్= ఈవిధముగ-ప్రకృతాంశమును సాధింప సామాన్యన్యాయము తేఁబడుటచే నర్థాంతరన్యాసాలంకారము.

తాత్పర్యము

పుత్రా! రామచంద్రా యిప్పుడు నామనస్సున నీకే రాజ్యమీయవలయు ననియున్నది. ఇఁకమీఁద నేకాలమున నెట్లు మాఱునో తెలియరాదు. కావున నామనస్స్థిరస్థితి యందుండఁగనే పట్టాభిషేకము చేసికొనుము. ప్రాణులచిత్తములు చంచలములని నీకుఁ దెలియునుగదా.

'అనిత్యచిత్తః పురుషః' తస్మిన్ కోజాతు విశ్వసేత్
తస్మాత్ప్రధానం యత్కార్యం, ప్రత్యక్షం తత్సమాచరేత్,
భార. ౧౨-౮౦-౯

పురుషులచిత్తములు నిలుకడగా నుండునవి కావు. కావున వాని నెవఁడు నమ్మును? ముఖ్యమైనకార్య మెప్పటికప్పుడు చేయుటేబాగుగాని జేపుమాపని జరుపరాదు. పుణ్యకార్యములు వెంటనే చేయవలయును. పాపకార్యము లాలసింపవలెను.

తే॥ వర్తిలెడి రాఘవా! పున•ర్వసువు నేఁడు
పుష్యయోగంబు రేపాట•బుధులు నీవు

యౌవరాజ్యంబుఁ గొనఁగ యోగ్యం బటంచుఁ
దెల్పి రటు సేయు, నను మది తీవరించె. ౧౨

### తాత్పర్యము

రామచంద్రా! నేడు నీజన్మతారయగు పునర్వసువు. రేపు నీకు సంపత్తారయగు పుష్యము. కావున పండితులు రేపే నీవు యౌవరాజ్యంబు గ్రహింప మేలని చెప్పిరి. కావున నీవు నట్లుసేయుము. ఈవిషయమున నామనస్సు చాలఁ దీవరించుచున్నది. ఆలస్యముకూడదు.

ఉ॥ సీతయు నీవు రే యుపవసింపుఁడు, దర్భలపైఁ బరుండుఁడీ,
ప్రీతి వచింపుమీ హితులు రే నినుఁ జక్కఁగఁ గావ, విఘ్న సం
ఘాతము లెన్ని యేన్గలుగుఁగావున నిట్టిక్రియాకలాప మం
దాతతజాగరూకత నయంబు వహింపఁగ నెట్టివానికిన్. ౧౩

### తాత్పర్యము

అట్లైన నన్నేమి చేయుమనెదవేమో-ఈరాత్రి నీవు సీత యిరువురు నుపవాసము చేయవలయును. దర్భలు పఱుచుకొని దానిపైఁ బండుకొనవలయును. ఈరాత్రియంతయు నీస్నేహితులు నిన్ను హెచ్చరికతో రక్షింప బోధింపుము. ఇట్టికార్యములందు విఘ్నము లనేకములు గలుగును. నీమేలోర్వనివా రెవరైన నీకు నేకిడైనఁ జేసి రాజ్యము నీకు లభింపకుండ యత్నముఁచేయుదురు. ఇన్నాళ్ళేలచేయలేదందువేమో తమయిష్టునికి రాజ్యమిత్తునని యాశతో నూరక యుండవచ్చును. ఇప్పుడు నానిశ్చయము తెలియఁగానే నిరాశులై నీకుఁగీడుచేసి తాము రాజ్యము హరింప యత్నింతురు. కావున నెంతవానికైనను మిక్కిలి హెచ్చరికగలిగి యుండుట నీతి.

సీతయు నీవు నుపవసింపుఁ డనుటచే శాస్త్రవిహితకర్మ మేదిచేసినను భార్యాభర్తలు కలిసి చేయవలయు నని సూచన ఆపస్తంబులు 'పాణిగ్రహణాద్ధి సహత్వం కర్మసు తథాపుణ్యకాలేషు ద్రవ్యపరిగ్రహేషుచ"-

భార్య సహధర్మచారిణి కావున నామెను విడిచి యేధర్మకార్యము భర్త చేయరాదు. వ్రతవేళఁదప్ప దర్భలమీఁదఁ బండుకొనరాదు.

కం॥ అదిగాక యొండునున్ నా,మది నున్నది భరతుఁ డిటకు మరలకమున్నే
యెదితీరున నభిషేకము, తుదసాగించుటయె మేలు తోఁచెం జూడన్. ౧౪

### తాత్పర్యము

నే నీవిషయమునఁ దీవరపడుటకు నామరణభీతి యొకటియే కారణము గాదు. వేఱొక కారణము గలదు. నేను నీకియనైతినేని నాయనంతరము నీకు రాజ్యము దక్కునో దక్కదో యని నాసందేహము. కావున భరతుఁడు మేన

మామ యింటనుండి యిచ్చటికి మరలి రాకముందే యేవిధముగనైన నీపట్టాభి షేకకార్యము ముగించుటయే క్షేమమని నాయభిప్రాయము.

ఉ॥ నే నిటు లంటి నా వలదు• నీయనుజుండు జితేంద్రియుండును
న్యాయముగ ధర్మవర్తి కరు•ణాపరుఁ డగ్రజభక్తుఁ డైననున్
మానవమానసంబు లతి•మాత్రచలంబులు, ధర్మనిత్యులం
దేనియు సజ్జనావళుల•నేల, నవే కృతశోభ లయ్యెడిన్. ౧౬

నాన్=అనన్, అగ్రజభక్తుఁడు=అన్నయందు భక్తిగలవాఁడు, అతిమాత్ర చలంబులు=విశేషము నిలుకడలేనివి.

తాత్పర్యము

నాయనా! భరతుని విషయమై నేనిట్లు సందేహించుట తగునా యన కుము. అతఁడు నీతమ్ముఁడు. కావున నీయట్టి సద్గుణములు గలవాఁడే. జితేంద్రియుఁడగుటచే రాజ్యమునకు నాశపడువాఁడు కాఁడు. ధర్మవర్తి కావున న్యాయమున నీకు రావలసిన రాజ్యమును నగ్రజన్యాయము వదలి పిన్నయైనఁ దా నాశించువాఁడును గాఁడు. దయావంతుఁడు కావున రాజ్యమునకై నీయందు నాయందు పగసాధింపఁబూనువాఁడును గాఁడు. పితృ సమోజ్యేష్ఠ యని యన్నను దండ్రివలెఁ జూచువాఁడు. ఇన్ని సద్గుణములు భరతునందున్నను అతఁడును మనుష్యుఁడే కావునను మనుష్యుల మనస్సులు మిక్కిలి చంచలములు (చంచలం హి మనః కృష్ణ) కావున నెంతటి ధర్మనిష్ఠులందేని యెంతటి సత్పురుషులందేని కలకాలము మనస్స్థిరముగనుండునని విశ్వసింప రాదు. "అన్యథాచింతితో హ్యర్థః పునర్భవతి నోన్యథా। అనిత్యమతయో లోకే. నరాః పురుషసత్తమ" భార. ౫-౮౦-౬. ఇప్పుడొక విధమున నాలోచించినదే తరువాత మఱియొక విధముగ నగును ఏలన లోకమున మనుష్యుల మనస్సులు నిలుకడ గలవి కావు. అటయిన దుష్టులకు ధర్మనిష్ఠులయిన సత్పురుషులకు భేదమేమందువా? దుష్టులు కార్యానంతరముకూడఁ బగ సాధించి కీడు చేయయత్నించుచుందురు. సత్పురుషులు కార్యము కాకముందు భిన్నాభిప్రాయము కలవారైనను కార్యము ముగిసిన పిమ్మట ద్వేషింపక కడచిపోయిన దానికి విచారమేల యని కలసి మెలసి యుందురు. కావున భరతుఁడు రాకముందే నీవు పట్టముఁ గట్టుకొంటివా యతఁడు సత్పురుషుఁడు ధర్మజ్ఞుఁడు కావున నీరాజ్యము నాకుఁ గావలయు ననఁడు. అటుగాక ముందుగా వచ్చెనా తనకుఁ గావలయు నను నేమో. అతఁడట్లనినఁ గుటుంబకలహములే గాక దేశక్షోభయుఁ గలుగును. కావున నతఁడు రాకముందే నీవు పట్టాభిషేకము చేసికొనవలయునని తొందరపడెదను.

భరతుని విషయమున సందేహించుటకుఁ గారణము ఈ కాండమందలి ౨౪౨౦ పద్యము చూడుఁడు. దశరథుఁడు కైకను వివాహమాడు నపుడు కైకకుఁ బుట్టిడి కొడుకునకు తన రాజ్యమిచ్చెద నని ప్రమాణము చేసెను.

ఆ కారణమున భరతుఁడో, యతనికిఁ గావలసినవారో రాజ్యమపేక్షింతురో యని దశరథుభయము.

తే॥ చెల్లు నెల్లియ పట్టాభి•షేకమహము, పోయిరానాయనా! యని•భూమిధవుఁడు
పలుక సాష్టాంగ మెఱఁగి స్వ•భవనమునకు,
నరిగి వెంటనెచనెఁదల్లి•యంతిపురికి. ౧౬-౧౭

తా త్ప ర్య ము

ఎల్లియ=రేపే, మహము=ఉత్సవము, స్వభవనము=తనయిల్లు, అంతిపురి=అంతఃపురము, ఎఱఁగి=నమస్కరించి.

తా త్ప ర్య ము

ఈ కారణములచే నాయనా రేపే పట్టాభిషేకోత్సవము జరుగవలసియున్నది. రామచంద్రా! పోయిరమ్ము. ఈవిషయము చెప్పుటకే నిన్నుఁ బిలిపించితిని. అని రాజు చెప్పఁగా శ్రీరామచంద్రుఁడు సాష్టాంగ నమస్కారము చేసి తనయింటికిఁ బోయి వెంటనే తల్లియుండు నంతఃపురమునకు నామెను దర్శించి శుభవార్త తెలుపుటకై పోయెను.

సీ॥ అరిగి రాముఁడు దేవ•తాయతనంబున, వెలిపట్టుఁ బుట్టంబు•వెలయుదానిఁ
దలఁగని భక్తిని•దనయుని శ్రీయుకు; నొనరింపుమని ప్రొక్కు•చున్నదాని
నిలువేల్పుపైఁ దన•హృదయంబుఁ గీలించి,ధ్యానైకరతి మౌన•మూనుదాని
నతులితగతిని ప్రా•ణాయామమునఁ బరా,త్పరుని జనార్దనుఁ•దలఁచుదానిఁ
తే॥ దనప్రవృత్తిని వినిసుమి•త్రయును లక్ష్మ,
ణుండుమునువచ్చి జనకత•నూజనటకుఁ
దోడి తెప్పింపమువ్వురఁ•గూడియుండు, దానిసాధ్వీమతల్లిని•దల్లిఁగనియె.

దేవతాయతనంబునన్ = దేవపూజాగృహమందు, వెలిపట్టుఁ బుట్టంబు=తెల్లని పట్టు వస్త్రమును, వ్రతమునిమిత్తమై యీవస్త్రమును ధరించెను. దేవపూజవేళ తెల్లని పచ్చనివస్త్రములు ధరించుట ప్రశస్తము 'సితపీతంబులు ధార్యములని భారతము. రక్తవర్ణము నల్లవర్ణము నిషిద్ధములు-తలఁగని=చెదరని-తనయుని=తనకుమారుని, శ్రీయుక్తున్=రాజ్యలక్ష్మితోఁ గూడిన వానిఁగా, ఇలువేల్పున్=తమయింటఁ బ్రతిదినము నారాధింపఁబడు దేవతను శ్రీమన్నారాయణుని, కీలించి=నిలిపి, ధ్యానైకరతిని=ధ్యానమునందలి ముఖ్యాభిలాషచే ప్రాణాయామముఁ జేయుచుననఁగా రేచక పూరక కుంభకములందు, పరాత్పరుని=పరమని చెప్పఁబడు వారికంటెఁ బరుఁడైనవానిని-జనార్దనునిన్=శ్రీమన్నారాయణుని-జన+అర్దనుఁడు=భక్తజనులను సంతోషపెట్టువాఁడు. 2) దుష్టజనులను బీడించువాఁడు-ప్రవృత్తి=పట్టాభిషేక విషయవార్తను, జనకతనూజను=సీతను, తోడి తెప్పింపన్=ఆమె యే స్వతంత్రించి రాఁగూడదు గావుననో లేక యామెకీవార్త తెలియదనుకారణము చేతనో అందుబలిపి సంతోష

పడవలయుననియో దాసికలను బంపి పిలిపింపఁగా, సాధ్వీమతల్లిని=పతివ్రతల యందు శ్రేష్ఠురాలిని, మతల్లిక-మచ్చరిక-ప్రకాండము, ఉద్ఘము-తల్లజము ఇవి యుత్తరపదములై శ్రేష్ఠత్వమును దెలుపును.

తాత్పర్యము

ఇట్లు రామచంద్రుఁడు జననీగృహంబున కేగి యందుఁ దెల్లని పట్టు వస్త్రము గట్టుకొని దేవపూజా మందిరంబున నిండారు భక్తితో శ్రీరామచంద్రుని మిత్రులచేఁ దాను విన్నవార్త నిజమై శ్రీరామునికిఁ బట్టాభిషేకము జరుగవలెనని నమస్కరించుదాని, నిలువేల్పును శ్రీమన్నారాయణునిఁ దన హృదయమున నిలిపి తదేకనిష్ఠగా ధ్యానించుదాని, దేవతలయందు నధికులని చెప్పఁబడువారి కంటె నధికుఁడైన శ్రీమన్నారాయణునిఁ బ్రాణాయామమునఁ దలఁచు దానిని. తన పట్టాభిషేకవార్త విని సుమిత్రయుఁ లక్ష్మణుఁడు రాఁగా దాసికలఁబంపి పిలిపింపఁగా వచ్చియుండు సీతతోఁ గూడిన దానిని, పతివ్రతాశిరోమణియైన తన తల్లినిఁ జూచెను.

ఇందుఁ గౌసల్యాకృత్యములు చెప్పఁబడినవేకాని యన్నియు నేకకాలమున శ్రీరాముఁడు పోయినప్పుడే చేసెనని తాత్పర్యముగాదు.

ఈ పద్యమందుఁ గౌసల్య దేవపూజ చేయుచుండునట్లు చెప్పఁబడెను. ఇట్టి యధికారము స్త్రీలకుఁ గలదాయని ప్రశ్న.

స్త్రీలకుఁ బతిశుశ్రూషకంటె వేఱుదేవపూజలోనైనవి లేవని పూర్వపక్షము.

శ్లో॥ నాస్తి స్త్రీణాం పృథగ్ధర్మో. నావ్రతం నాప్యుపోషణమ్, పతిం శుశ్రూషతేయాతు, తేన స్వర్గే మహీయతే॥ మనువు స్త్రీలకుఁ బ్రత్యేకముగ వ్రతములు ధర్మములు ఉపవాసములు లేవు. ఎవతె పతి శుశ్రూషచేయునో యామెకు స్వర్గము లభించును.

అశ్వలాయనుఁడు:—శూద్రాణాం ద్విజశుశ్రూషా। విహితా బ్రహ్మణా యథా। స్త్రీణాం స్వభర్తృ శుశ్రూషా, తథైవ విహితాసదా॥ శూద్రులకు ద్విజశుశ్రూషయెట్లు వేదవిహితమో యట్లే స్త్రీలకు భర్తశుశ్రూషయే సదావిహితము.

అత్రి-'నవ్రతే నోపవాసేన, ధర్మేణ వివిధేనచ, నారీ స్వర్గమవాప్నోతి, ప్రాప్నోతి పతిపూజనాత్'। వ్రతములు ఉపవాసములు నానాధర్మములు చేయుటచే స్త్రీకి స్వర్గమురాదు. పతిశుశ్రూష చేతవచ్చును.

యద్దేవేభ్యోయచ్చ పిత్రాదికేభ్యః కుర్యాద్భర్తాభ్యర్చనం సత్క్రియాంచ। తస్యహ్యర్ధ సాఫలం నాన్యచిత్తానారీభుంక్తే భర్తృశుశ్రూషణేన॥ భర్తచేయు దేవపూజ-పితృపూజ-పుణ్యములు మొదలగువానిలో సగము పుణ్యఫల మాయ నకు నేకచిత్తముతో శుశ్రూషచేసి భార్యపొందును.

స్కాందము-వ్రతోపవాసనిరతా, యానారీ పరమోత్తమా। భర్తారంనాను వర్తేత, తస్యాః పాపాగతిర్భవేత్॥ వ్రతములు - ఉపవాసములు చేయు స్త్రీ

మిగుల నుత్తమురాలు. అయినను ఆమె భర్తననుసరించి చరింపక పోయెనా యామెకుఁ బాపగతులే లభించును.

పరాశరుండు పత్యౌ జీవతి యానారీ- తపోష్య వ్రతచారిణీ। ఆయుష్యం హరతే భర్తుః సానారీ నరకం వ్రజేత్॥ మగఁడు జీవించియుండు స్త్రీ యుపవాస వ్రతములాచరించెనేని మగని యాయువును క్షీణింపఁజేసి తాను నరకమునకుఁ బోవును.

ఇత్యాది వాక్యములచే స్త్రీలకు జపతపములు లేవని యేర్పడెను.

సిద్ధాంత మేమనఁగా: పై వాక్యములు స్త్రీలకు భర్తృశుశ్రూష యనివార్యమనియు నదిచేయక మఱియేదిచేసిన నది వ్యర్థము దోషావహమనియుఁ గావున భర్తృ శుశ్రూష ముఖ్యమని స్థాపించుచున్న వేకాని మోక్షసాధనములైన వానికై స్త్రీలు యత్నమే చేయరాదని నిషేధించుటలేదు. స్త్రీలకు భర్తృ శుశ్రూషా ఫలమును జెప్పువాక్యము లన్నియు స్వర్గమును భర్తతోడి సాలోక్యమును జెప్పుచున్న వేకాని కేవల మోక్షవిషయమైన ప్రస్తావనయేలేదు. అకారణమున స్త్రీలు మోక్షమునకు యోగ్యులు కారా? దానికి వారు ప్రయత్నించుట దోషమా? కాదు గాని వారి జపతపో యోగములు భర్తృశుశ్రూషకు విఘ్నమాపాదించునవియై యుండరాదు. రెంటిలోనొకటి విడువవలసినట్టు తటస్థించెనేని జపతపములు వదలవలయునే కాని భర్తృ శుశ్రూష వదలరాదు. శత్రుఘ్నుని భాగవత పారతంత్ర్య విషయమై వ్రాసినది చూడుఁడు.

కౌశికుఁడు మాతాపితృ సేవవదలి తపస్సునకు మరగిన నతనికి ధర్మవ్యాధుఁడు కం॥ నీయధ్యయనము సుకృత్రాయానము నిష్ఫలంబులై చను గురుసే! వాయుక్తి లేక తక్కినఁ। జేయుము నావలుకు మేలు చేకుఱునీకున్ భార. అర. ౨౧౩.౨. అని చేయఁగలిగిన రెండును జేయుము. రెండును జేయలేకున్నఁ దపస్సువదలి గురుసేవ చేయుమని బోధించెను. జపతపంబులు చేసిన మేలు. చేయకుండినఁ బ్రత్యవాయము లేదు. స్త్రీలకు భర్తసేవ పురుషులకు మాతాపితృసేవ చేయకుండినఁ బ్రత్యవాయము కలదు. ఇట్టులే గృహస్థులవిషయమై "తస్మాద్గృహాశ్రమస్థస్య నాన్యద్దైవతమస్తివై ఋతేఽతిథిమ్" అనఁగా గృహస్థునకు నతిథికంటె దైవము లేఁడని శాస్త్రము చెప్పుచున్నది కదా. అకారణమున నతిథిసేవతప్ప గృహస్థుఁడు జపతపములు చేయరాదని చేసినఁ బాపమని భావమా? జపముచేయు కాలమం దతిథివచ్చెనేని జపము వదలియైన నతిథిని గౌరవింపవలయునని భావము. అట్టులే స్త్రీలవిషయమందును, వారు చేయు జపతపములు మొదలగునవి భర్తృశుశ్రూషకు నడ్డమువచ్చునవిగానుండ రాదు. కావున భర్తయనుజ్ఞ దీసికొని యవి చేయవచ్చును. అట్టియనుజ్ఞతీసికొని యుండినయెడలఁ గొంచెమేదేని లోపము గలిగినను నతఁడు సహించును. దాని వలనఁ బ్రత్యవాయభయము లేదు. ఒకఇల్లాలు తనచంటిబిడ్డఁడాఁకలికినేడువఁగాఁ

బాలిచ్చుటకై తీసికొని చన్నియ్యఁ బ్రారంభించెను. ఇంతలో నెందోపోయి యుండిన మగఁడెండలో సొటసొట లాడుచు నాఁకలిగొని వచ్చెను. అప్పుడా యిల్లాలేమిచేయవలె? పాలుత్రాగుబిడ్డ నీడ్చిపాఱవేసి పతికి స్నానానికి నీళ్ళియ్యఁ బోవలయునా? బిడ్డకుఁ బాలిచ్చివచ్చెదవని సమాధానము చెప్పకొన వచ్చునా? బిడ్డకుఁ బాలిచ్చుట స్త్రీస్వధర్మము కావునఁ బతియాజ్ఞపొంది స్త్రీ యే కార్యమైనఁ జేయవచ్చును. భర్త కతిథియెక్కువయైనను ఆయన భార్య కతిథి కంటె భర్తయే యెక్కువ. కామంతు భర్తురనుజ్ఞయా వ్రతోపవాస నియమాదీనా మభ్యాసః॥ శంఖః॥ భర్తయనుజ్ఞపొంది వ్రతోపవాస నియమములను స్త్రీ యథేష్టముగా నభ్యసింపవచ్చును. 'భార్యా భర్తృమతేనైవ వ్రతాదీనాచరేత్సతీ, పతివ్రతయగు భార్య భర్తయనుమతి చేతనే వ్రతాదుల జరుపవలయును కాత్యాయనుఁడు.

భర్తలేని స్త్రీలు పుత్రులయనుమతి నొందవలయును; "నారీఖల్వననుజ్ఞాతా భర్త్రాపిత్రా సుతేనవా, విఫలం తద్భవేత్తస్యా, యత్కరోత్యౌర్ధ్వదైహికమ్" ఆదిత్యపురాణము. నారీఖల్వననుజ్ఞాతాభర్త్రాపిత్రాసుతేనవా నిష్ఫలంతు భవేత్తస్య, యత్కరోతి వ్రతాదికమ్"

దీనివలన పతిగాని సుతుఁడుగాని లేని స్త్రీ తండ్రియుండిన నాయన యనుమతి నొందవలయును ఈముగ్వురులేని స్త్రీలు వారివారి యిష్టముచొప్పున యథేచ్ఛముగఁ జేసికొనవచ్చును. సుతాదులయాజ్ఞ వారిద్రవ్యముపయోగించు నపుడే కాని తనధనముతో ధర్మకార్యములు చేయునపుడు భగవత్సేవలకు కాదు.

కావునఁ గౌసల్య దేవతారాధనము ప్రాణాయామముచేయుట దోషావహముగాదు. ప్రశస్తకార్యమే.

ఈవిషయమున నీవాక్యంబులు స్మర్తవ్యంబులు.

స్త్రీలు శూద్రులు బింబారాధనము చేయువచ్చుననుటకుఁ బ్రమాణములు.

శ్లో॥ బ్రాహ్మణైః క్షత్రియై ర్వైశ్యైః, శూద్రైః స్త్రీభి స్తథేతరైః
యథార్హ మిజ్యస్సేవ్యశ్చ, నిత్యం సర్వేశ్వరో హరిః॥

బ్రాహ్మణులచేతను క్షత్రియులచేతను వైశ్యులచేతను శూద్రులచేతను స్త్రీలచేతను తదితరులచేతను సర్వేశ్వరుఁడగు హరిబింబము (ప్రతిమ) పూజింపఁదగినది. (ప్రతిమాలక్షణము పరిచ్ఛేదము)

శ్లో॥ బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యైః। శూద్రైశ్చ కృతలక్షణైః
అర్చనీయశ్చ సేవ్యశ్చ। భక్తియుక్తై స్సదాహరిః॥

తాపాది సంస్కారములుగల భక్తులగు బ్రాహ్మణులచేతను క్షత్రియుల చేతను వైశ్యులచేతను-శూద్రులచేతను ఎల్లవేళ హరి పూజింపఁ దగినవాఁడు-సేవింపఁ దగినవాఁడు-భీష్మపర్వము.

శ్లో॥ మృదశ్మమణీ రత్నేన, తామ్రేణ రజతేనవా
కృత్వాప్రతికృతింకుర్యా, దర్చనాం కాంచనేనవా॥
పుణ్యందశగుణం దద్యా, దే తేషాము త్తరో త్తరమ్
జయకామే జయేద్రాజా, విద్యాకామో ద్విజో త్తమః
వైశ్యోవాధనకామస్తు, శూద్రః పుణ్యఫల ప్రియః
సర్వకామాస్త్రీని యోవాపి, సర్వాన్ కామానవాప్నుయుః

మన్ను-శిల-శ్రేష్ఠమణులు, రాగి, వెండి, బంగారు, వీనిలో దేనితోనయిన భగవంతుని ప్రతిమచేసి యర్చింపవచ్చును. ముందుదానికంటె వెనుకటివానితోఁ జేసినదానికిఁ బదింతలు హెచ్చుఫలముగలదు. ఇట్టులే క్రమముగా హెచ్చింపవలెను. ఇట్లర్చించిరేని జయముకోరిన రాజు జయించును. విద్యకోరిన బ్రాహ్మణుఁడు విద్యావంతుఁడగును. ధనముకోరు వైశ్యుఁడు ధనవంతుఁడగును. పుణ్యఫలముగోరు శూద్రుఁడు పుణ్యవంతుఁడగును. స్త్రీ యేకోరికతోఁ జేసినను నాయన్నికోరికలు పొందును. అశ్వ-వైష్ణవధర్మశాస్త్రము. ౨౧ అధ్యా. అనుజ్ఞాతాః స్త్రియశ్చైవ, మర్చయంతో జగద్గురుమ్. యథార్హ మపి శూద్రాద్యాః। సర్వేయాంతి పరాంగతిమ్. భారద్వాజ సంహిత. భర్తచే నాజ్ఞపొందినస్త్రీలును, యోగ్యతకుఁ దగినట్లు శూద్రాదులును నీవిధముగ నర్చించిరేని యందఱు పరమపదమునకుఁ బోదురు "అనుజ్ఞాతా తుయాభర్త్రా సైవకుర్యాద్యథావిధి। వ్రతోపవాసనియమ, దేవతారాధనాదికమ్" నారదీయపురాణము. భర్తచేననుజ్ఞ పొందిన స్త్రీమాత్రము యథావిధిగ వ్రతములు- ఉపవాసములు దేవతారాధనము మొదలయినవి చేయవచ్చును. 'ఇతరాతు నకుర్వీత జీవమానే స్వభర్తరి, అజ్ఞానాద్యదివాలోభా, ద్యది కుర్యాత్ప్రమాదతః, తత్సర్వం నిష్ఫలంతస్యా, ఇతి వేదవిదోవిదుః॥ నారదీయము: భర్తజీవించియుండు నితరస్త్రీ యట్లుచేయరాదు. తెలియనితనము చేతనో లోభముచేతనో చేసెనా యది యంతయు వ్యర్థమని వేదవేత్తల యభిప్రాయము. శ్లో॥ అనారాధ్య హృషీకేశం, విధవా భోక్తుమిచ్ఛతి, సాప్రజేన్నరకం ఘోరం కాలసూత్రమధోముఖీ'॥ నారదీయము విష్ణువు నారాధింపక విధవభోజనము చేయఁగోరెనేని యది తలక్రిందుగఁ గాలసూత్రమను నరకమునఁబడును. అట్లైన శ్లో॥ జప స్తప స్తీర్థసేవా, ప్రవజ్యామంత్రసాధనమ్। దేవతారాధనం చైవ. స్త్రీశూద్రపతనానిషట్॥ అను వచనము గతి యేమందు రేమో.

ఈశ్లోకము వైదికపర్యాయమని పూర్వులు వ్రాసియున్నారు అనఁగా స్త్రీలు శూద్రులు వేదమంత్రములతో నర్చింపరాదని యభిప్రాయమే కాని కేవల నిషేధమనికాదు. తాంత్రికముగఁ జేయవచ్చును. 'యథార్హమపి శూద్రాద్యా' యని యనఁగా వారివారి యోగ్యతకుఁ దగినట్లు శూద్రాదు లర్చింపవచ్చునని పెక్కు

వాక్యములు గలవు. ఇంతయేల? అతిశయ భక్తియుక్తులై సంస్కారసంపన్ను లైన యాచార్యులచే నధికారము పొంది మంత్రానుష్ఠాన నిష్ఠులై దానికిఁదగిన యాచారముగలిగి దురాచారము వదలినవా రేవర్ణమువారైనను యథాశక్తి భగవదర్చను ప్రతిదినము పూజింపవలయునని భాగవతధర్మము తనయింటి లోనే దేవతాయతనమందు నారాయణార్చనము చేయుచున్నట్లు చెప్పుటచేఁ గౌసల్య ప్రతిదినము నారాయణార్చనము చేయుచుండెనని గ్రహింపవల్లయును

ప్రాణాయామ మనఁగా శ్వాసనిరోధము. దాని యిష్టమువచ్చినట్లు పోనీ యక శ్వాసమును వశపఱుచుకొనుట ప్రాణాయామ మనఁబడును. లోపలి గాలిని ముక్కుతో వెలుపలికి విడుచుట రేచకమనఁబడును, మరలగాలిని లోపలికిఁ బీల్చుట పూరక మనఁబడును. పీల్చినగాలిని లోపలనే బిగించుట కుంభకమనఁ బడును. ఇందు భేదములనేకములు గలవు. ముందులోపలిగాలి నెడమముక్కు మూసి కుడిముక్కుతో వెలుపల విడిచి తరువాత కుడిముక్కు మూసి యెడమ ముక్కుతో గాలిని మంత్రోచ్చారణముచేయుచు లోపలికి మెల్లగాఁ బీలువవల యును. అట్లుపీల్చి రెండు ముక్కులుమూసి మంత్రము జపించుచు నది పూర్తి యైన పిమ్మట లోపలి గాలిని కుడి ముక్కుతో విడువవలయును. ఇట్లు విడిచి వెంటనే యెడమముక్కుమూసి గుడిముక్కుతోనే గాలిని జపించుచుఁబీల్చి లోపల నిలిపి కుడిముక్కుమూసి యెడమ ముక్కుతో గాలిని వెలుపల విడువవలయును. ఇట్టులే మార్చి మార్చి చేయవలయును. గాలిపీల్చుట ౧౬ చిటికలు వేయుకాల మైనచోఁ గుంభకము ౬౪-రేచకము. ౩౨-పూర్తుగ నుండుటయుత్తమ పక్షము, జపాదులకై చేయుప్రాణాయామమందు మూఁడును సమానముగ నుండ వచ్చును. సంధ్యావందనమునఁ బ్రాణాయామము గాయత్రీమంత్రముతోఁ జేయవలయును. కౌసల్యకు గాయత్రీ జపకాలము గాకుండుటను నారాయణుని ధ్యానించెనుటచేతను నారాయణాష్టాక్షరితో జపించెనని గ్రాహ్యము. ఈ మంత్ర మిరువదియైదుమార్లు జపించుచుఁ బ్రాణాయామము చేయవలయును. ఇందుఁగొన్ని భేదములునుగలవు. స్త్రీలకు యోగమం దధికారముఁగలదు.

కం॥ కాంచి యభివాదనముఁ గా,వించి రఘూత్తంస మంత•పీనులవిం దౌ

వంచితవాక్యంబుల వి,న్పించెన్ హర్షమున మేను•నెఱి గగురింపన్.౧౫

ఉత్తంసము=తలయందుంచుకొను పువ్వు-ఇది శ్రేష్ఠార్థమునను బ్రయో గింపఁబడును. ఇట్టులే యవతంస వతంస శబ్దములు-ఉత్తంసశబ్దము నపుంస కము గావున మువర్ణకాంతముగఁ బ్రయోగింపఁబడెను. అవతంసంబవుపార్వతీ పతికి॥ అని ప్రయోగము. గగురింపన్=గగ్గురుపాటు కలుగఁగా.

## తాత్పర్యము

తల్లినిజూచి యభివాదనము గావించి శ్రీరాముఁడు వినఁదగు మాట లచేఁ దన్ను మహారాజు యువరాజుగాఁజేసెదనని చెప్పినమాటలు వినిపించెను.

ముందే వినినవార్త మరలవినిన నేమిసంతోష మనరాదు. ఇదివఱకు విన్నది పరోక్షవార్త-సేవకులు చెప్పినది. ఇది ప్రత్యక్షవార్త-ఇదివఱకు విన్న దానిని రూఢిపఱుచునది- కావున నమ్మకము. అందుఁ గొడుకు చెప్పినది.

శా॥ తల్లీ! నాయన యానతిచ్చె నను గో•త్రాపాలనప్రక్రియా
సల్లీలం జరియింప, నేఁ యువరా•జశ్రీ గొనన్, రేయి నే
నిల్లాలుం దగు నిత్రుపూన నఁట, నా•కీరీతి మాతండ్రి దా
నల్లాపించెఁ బురోహితాన్వితుఁడు నై•సంతోష మేపారఁగన్. ౨౦

శ్రీరాముఁడు తండ్రి తనతోఁ జెప్పినవాక్యముల సారంశమును దల్లికిట్లు చెప్పుచున్నాఁడు.

ఆనతి=ఆజ్ఞప్తి శబ్దభవము. గోత్రా=భూమియొక్క - (గోత్ర=భూమి, గోత్రము=పర్వతము) పాలనప్రక్రియా=పరిపాలించు కార్యమనెడి, సల్లీలన్= మంచిక్రీడయందు. సల్లీల యని చెప్పుటచే నింతవఱకు నాడుచుండిన చెండాటలు లోనైనవి కాలయాపనము ప్రయోజనముగాఁగలవి. ఈ యాట ధర్మము ప్రయోజనముగాఁగలది. రాజ్యపాలన మాట యనుటచే రామునకది కష్టమైన కార్యము కాదనియు సుకరము సంతోషకరమునైన దనియు శ్రీరామచంద్రుని భావము. నిత్రుపు=ఉపవాసము, పురోహితాన్వితుఁడునై=పురోహితునితోఁగూడినవాఁడై-మంత్రి పురోహిత సమ్మతిలేదేని రాజు చెప్పినను అకార్యమగునని నమ్మరాదు. వారు వలదనిన మానవలసియుండును. వారును సమ్మతించుటచే నీకుఁ దప్పదని భావము. సంతోషమే పారఁగన్=అనుటచేఁ బరుల బలాత్కారము చేతనో-యిష్టము లేకయుఁ జేయకతప్పదు కావునఁ జేయుఁడనియో చెప్పలేదు నిండుసంతోషముతోఁ జెప్పెనని భావము.

## తాత్పర్యము

తల్లీ! నాయన నాకిట్లుత్తర్వు చేసెను. ఏమన-కుమారా! నీ విదివఱకును బోకకై యాడునట్టి యాటలు చాలించి యాయాటలకు మాఱుగ భూమిపరిపాలించుట యను మంచి యాటయందుఁ బ్రవర్తింపుము. నీ వుదయముకాఁగానే యౌవరాజ్యలక్ష్మిని గైకొనుము. ఈరాత్రి నీవు నీభార్య యుపవసింపవలసినదనియు నీవిధముఁగా మాతండ్రి పురోహితులతోఁగూడి వారిసమ్మతిపై సంతోషముతోఁజెప్పెను. ఇది తండ్రియాజ్ఞ కావునఁ దప్పించుకొన సాధ్యపడదు.

కం॥ పీడ కిపుడ చేయుము నీ,కోడలికిని నాకు రేపు•కొమరుగ శుభముం
గూడఁగఁ జేసెడిక్రియలను,బాడిమెయిన్ మాకు శుభము•పరివర్ధిల్లన్. ౨౧

తల్లీ! యింక నీవు సందేహింపక రేపు నీ కోడలికి నాకు న్యాయపద్ధతి శుభము కలిగించు పనులేవేనియున్నవో యవి యన్నియు వదలక చేయుము.

—• కౌసల్య శ్రీరాముని దీవించుట •—

సీ. అన నిట్లు దీర్ఘకా•లాభికాంక్షితవాక్య,మును విని కౌసల్య•మోద బాష్ప
కలవాక్యమునఁ బల్కఁ•గన్న తండ్రి! రామ!చిరంజీవి వగుచును•బరఁగవయ్య
శ్రీసమేతుండ వై•చెలఁగి నాదుసుమిత్ర, బాంధవులను బ్రీతి•బఱుపవయ్య
జనకుని సంతుష్టుఁ•జలుపుటచే బలే,కళ్యాణతార ని•గ్గంటి వయ్య

తే॥ రామ! నీవిప్పుడిక్ష్వాకు•రాజ్యరమకుఁ
బతివి గాపుట నేఁజేయు•పద్మలోచ
నార్చనము నేఁడు ఫలయుత•మయ్యె నయ్య
మొనసి శత్రులు చెడిరయ్య•ముద్దులయ్య! ౧౩౨

దీర్ఘకాలాభి కాంక్షిత వాక్యము=చిరకాలముగ నెప్పుడెప్పుడు వినుదునా యని యెదురుచూచుచున్న యీ మాట- ఇచ్చటఁ జిరకాలమనఁగా బాల్యము పోయినది మొదలుకొని యని యర్థము. ఇప్పుడు రామునకు ౨౭ సంవత్సరములు కావున ౯ సంవత్సరములుగా నని భావము. మోదబాష్పకల వాక్యమునన్=సంతోషముచే నానంద బాష్పములు కనులనుండి రాలు దగ్గుత్తికతోటి సూక్ష్మ వాక్కులచే, బలే=బౌరా, సంతోషమును దెలుపువాక్యము, కల్యాణతార=శుభనక్షత్రము, రాజ్యరమకు=రాజ్యలక్ష్మికి, పద్మలోచనార్చనము=శ్రీమన్నారాయణపూజ. పద్మలోచనా+పద్మలోచన+అర్చనము=లక్ష్మీనారాయణపూజ.

శ్రీరామచంద్రుఁడిట్లుచెప్పఁగా నెప్పుడీశుభవార్త వినఁగలుగుదునా యని చాలకాలముగ నెదురుచూచుచున్న కౌసల్యాదేవి యానంద బాష్పములు రాల సంతోషాతిశయముచే మాట రాకున్నను సన్నని యెలుఁగున నిట్లనియెను. తండ్రీ! బాయనా! రామచంద్రా! యిటువంటి శుభవార్త నాచెవులవేసి యానందింపఁజేసితివి కావున దీర్ఘకాలము జీవింపుము. రాజ్యలక్ష్మితోఁగూడిన వాఁడవై బంధువులకు మేలుకూర్చుటేకదా రాజలక్షణము. తండ్రిమెచ్చుకొనునడవడి గల వాఁడవగుటచే ఆహా యెటువంటి శుభనక్షత్రమున నిన్నుఁగంటినయ్యా రామచంద్రా! నీవిపు డిక్ష్వాకు రాజ్యలక్ష్మికిఁ బతివగుటఁజేసి యిన్నిదినములుగ నేను జేయు శ్రీమన్నారాయణార్చనము ఫలించెను. ఇఁక శత్రువులు మనము చెఱుపకయే చెడిరికదా కుమారా.

హితరక్షణము-అహిత శిక్షణము రాజకృత్యమైనను కౌసల్య యుత్తమస్త్రీ కావున దమకుఁ మేలుమాత్రమే చేయఁగోరెను. ఇతరులకుఁ (కైకేయ్యాదులకు) గీడుకోరినదికాదు.

జనకుని సంతుష్టుఁ జలుపుటచే ననుటచే దశరథునకుఁ గైకేయి ప్రియురాలు. సవతి మచ్చరమునఁ గైకేయికిఁ గౌసల్యయందు ద్వేషభావము గలదు. ఆకారణముచే దశరథుఁడు కామదాసుఁడై కౌసల్య నుపేక్షించి పట్టపుదేవికిఁ జూపఁదగిన

గౌరవము చూపుచుండినవాఁడు కాఁడు. భర్త తనప్రియురాలికొడుకును బహూకరించునుగాని యప్రియురాలికొడుకును బహూకరింపఁడు. అట్లుండియుఁ దన యందుఁ బ్రీతిలేని తండ్రికిఁ బ్రీతి కలుగ వర్తించుట యన సామాన్యకార్యము గాదు. అదియునుగాక రాజ్యము కైక కొడుకునకుఁ బూర్వమే దత్తము. శ్రీరామునకు రాజ్యము వచ్చుటకు నిన్నివిరోధములుండినను దశరథుఁడు శ్రీరామునకే రాజ్యమిచ్చునటుల తీర్మానించుకొనుటకు శ్రీరామచంద్రుని గుణము లెట్టివై యుండవలయును. అట్లుగాకున్న :- పెద్దకొడుకునందుఁ దండ్రికి సహజ ప్రేమాధిక్యము. శునశ్శేప చరిత్రము చూచునది. కావునఁ దండ్రిని నీవు సంతోషింపఁ జేసితివని యదియొక గొప్పకార్యముగఁ జెప్పవలసిన పనియేలేదు నీ కృత్యము నీవుచేసితివి సూర్యోదయముకాఁగానే గూబలు చెట్లతొఱ్ఱలలో దాఁగినట్లు మనప్రయత్నము లేకయే శత్రువులు చెదురుదురని భావము. చెదిరి=సమీప భవిష్యదర్థమున భూతకాలముపయోగింపఁబడెను.

చం॥ అని జనయిత్రి పల్కఁ దర • హాసవికాసవిలాసభాసురా
    ననమున లక్ష్మణుం గని ధ • నం బగునీవసుధాతలంబు నె
    ల్లను దమి నాకుఁ దో డయి చె • లంగుచు నేలుము నీవు, లక్ష్మి ని
    న్ననువుగ నాద్వితీయ మగు • నాత్మవు గావునఁ బొందె లక్ష్మణా. ౧౩

జనయిత్రి = తల్లి, దరహాస=చిఱునవ్వుయొక్క, వికాస = వ్యాపించుట యొక్క, విలాస=లీలచే, భాసుర = ప్రకాశించు, ఆననమునన్ = ముఖముతో, ద్వితీయమగు నాత్మవు = రెండవ ప్రాణమవు - వెలుపలి ప్రాణము.

తాత్పర్యము

అని యిట్లు కౌసల్య చెప్పఁగాఁ జిఱునవ్వుతో వికాసము నొందిన ముఖముతో శ్రీరాముఁడు లక్ష్మణుంజూచి యాభూచక్రమంతయు నాసక్తితో నాకు సహాయుఁడవై యుండి పరిపాలింపుము. నీవు నారెండవ ప్రాణము గావున లక్ష్మి నిన్ను వరించెను. నన్ను వరించినపుడు నిన్ను వరించినట్లే.

అహా! యిపుడు నాప్రాణము సుఖపడినదనుట లోకప్రసిద్ధము. కర్తృత్వము విషయసంయోగము దేహమునకుఁ గలిగినను నిజముగ సుఖదుఃఖానుభవము చేతనునకే- కావున నైశ్వర్యము నాకులభించినను దానివలన సుఖమనుభవించువారు నాకుఁ బ్రాణములయిన మీరే యని భావము. ఈవాక్యమే రామచంద్రమూర్తి మనస్థితి దెలుపఁగలదు మమప్రాణాహి పాండవాయన్నట్లు

కం॥ భోగంబులు రాజ్యఫలా, • భోగంబులు నిచ్చకొలఁది • భోగింపు మికన్
    రాగమున నీకు నైకా, దే గొప్పగఁ జూతు రాజ్య • మేన్ జీవితమేన్. ౧౪

భోగంబులు=సుఖములు, రాజ్యఫలా భోగంబులు=రాజ్యమేలుటవలనఁ గలుగు ఫలముల యతిశయములు, ఇచ్చకొలఁది=ఇష్టప్రకారము, రాగమునన్ = ప్రేమముచే.

తాత్పర్యము

లక్ష్మణా! సుఖములు; రాజ్యమువలనఁగలుగు విశేషఫలములు నీక నీయిష్టము చొప్పున ననుభవింపుము. నేను రాజ్యముగోరుటగాని జీవించి యుండఁగోరుటఁగాని నీ నిమిత్తమేకదా.

ఈ రాజ్యమువలన నాకుఁ గలుగు లాభము సుఖములేదు. అవి లేకుండిన నాకురాఁగల నష్టియు లేదు. నేను జీవించియుండినఁ గదా నా యాశ్రితుల యక్కఱ అవసరముల, సహాయపడఁగలను. నాకైశ్వర్యముండినఁగదా నాయాశ్రితుల సుఖపెట్టఁగలుగుదును. దినమొలవాఁడా కాళ్ళకడ వానికిఁగప్పు మన్నట్లు నేను దరిద్రుండనైన నితరుల నెట్లుసుఖపెట్టఁగలను. అను తాత్పర్యముతో నేను జీవించుటను సంపద సంపాదించుటను గొప్పగఁ జూచుచున్నానుగాని యాత్మార్థముగాదు.

కం॥ అనుఁగుందమ్మున కిట్లని, జననుల కభివాదనంబు • సలుపుచు భక్తిన్
జనకజ కనుజ్ఞఁగొని తాఁ,జనియెన్ రాముండు తననిశాంతంబునకున్. ౧౩౫

అనుఁగుందమ్మునకున్=ప్రియసోదరునకు- కర్మధారయంబుల నుదంతంబులకుఁ బరుషసరళంబులు పరంబు లగునపుడు నుగాగమంబగు. సులభ. సం. సూ. ౪౫. ప్రకారము అనుఁగుందమ్ముఁడయ్యె, జననులకున్ = కౌసల్యాసుమిత్రలకు, నిశాంతంబునకున్ = ఇంటికి.

తాత్పర్యము

ప్రియసోదరున కిరీతి పచించి తల్లులకు భక్తితో నమస్కరించి సీతయు వెడలిపోవఁదల్లులచే ననుజ్ఞగొని శ్రీరాముఁడు తనయింటికిఁ బోయెను.

—• { ౫-వ సర్గము. దశరథుపంపున వసిష్ఠుఁడు శ్రీ సీతారాముల నుపవాస ముంచుట. } •—

కం॥ క్షితిపతి వసిష్ఠసంయమి, పతినిం గని రామచంద్రుఁ • బత్ని యశశ్శ్రీ
క్షితిలబ్ధికి నుపవాస, వ్రతముం జరపింప మీరు • వలయును బోవన్. ౧౩౬

క్షితిపతి = రాజు దశరథుఁడు, సంయమిపతిన్ = మునీశ్వరుని, రామచంద్రుఁబత్నిన్ = రామచంద్రుని ఆయన భార్యయగు సీతను ఇరువురను. యశశ్శ్రీ క్షితి లబ్ధికిన్=కీర్తి సంపద భూమి లభించుటకుఁగాను, భూమిమీఁదఁ బుట్టిన ప్రతిమనుష్యుఁడు యశస్సును సంపాదింపవలయును. అది సంపదలేక రాదు. కావున సంపద సంపాదింపవలెను. భూమి లేక సంపద లేదు.

తాత్పర్యము

అప్పుట దశరథుఁడు వసిష్ఠమహామునిని జూచి మునీంద్రా! యశస్సు,సంపద, రాజ్యము లభించుటకై శాస్త్రీయవిధమున వ్రతము జరుపవలయును. వ్రతములందుత్తమమైనది యుపవాసము. నేను సీతారాముల నీరేయి యుపవసింపఁ

జెప్పితిని. వారు పిల్లవాండ్రగుట యెట్లు చేయుదురో యేమో. కావున నది శాస్త్ర ప్రకారము జరుపుటకు మీరుపోయి యేర్పాటు చేసిరావలెను.

చం॥ అని యిటు ఱేఁడు పల్కిన మ॰హామతి యమ్మునినాథుఁ డట్టులే
చనె నొకవిప్రయోగ్య మగు॰స్యందన మెక్కిరఘూద్వహాలయం
బున, కటు మౌని కక్ష్యలను॰మూఁటిని దాఁటి చనంగ రాముఁడున్
విని యెదు రేగి డింపఁ గడుఁ॰బ్రీతిఁ బ్రియంబుగఁ బల్కె మౌనియున్.

విప్రయోగ్యము = బ్రాహ్మణులెక్కఁదగినది, స్యందనము=తేరు, రఘూద్వహాలయంబునకున్=శ్రీరాముని యింటికి, కక్ష్యలను=తొట్టి కట్టులను.

తాత్పర్యము

రాజీప్రకారము చెప్పఁగా గొప్పమనస్సుగల వసిష్ఠుఁడు బ్రాహ్మణుల కర్హమైన తేరెక్కి శ్రీరాముని యింటికిఁబోయెను. ఆయనరాక విని శ్రీరాముఁడెదురుగ మూఁడవకక్ష్యకే పోయి చేయూఁత యిచ్చి రథమునుండి దింపఁగాఁ బ్రీతితో మునీంద్రుఁడిట్లనియె.

రాముఁడెదురేగె ననుటచే గురువులరాక తెలియరాఁగానే శిష్యులెదురుగఁ బోవలయునని సూచన.

శ్లో॥ ప్రతిశ్రవణ సంభాషే, శయానో నసమాచరేత్-
నాసీనో నచభుంజానో, నతిష్ఠన్న పరాఙ్ముఖః॥

శిష్యుడు పరుండికాని కూర్చుండికాని భుజించుచుఁ గాని పెడమోముతోఁ గాని గురు మాటకు బదులు మాటాడుటగాని ముచ్చటలుగాని చేయరాదు.

శ్లో॥ ఆసీనస్య స్థితఃకుర్యా, దభి గచ్ఛం స్తు తిష్ఠతః।
ప్రత్యుద్గమ్యతా వ్రజతః, పశ్చాద్ధావస్తు ధావతః॥

గురు వాసనమునఁగూర్చుండి యాజ్ఞ యిచ్చిన యెడల శిష్యుఁడు తాను నిలఁబడియు, నిలఁబడి యిచ్చిన యెడల నెదురేగియు,వచ్చుచు నిచ్చినయెడల నెదురుకొనియుఁ బరుగిడుచు నిచ్చినయెడలఁ దానువెంబడి పరుగిడుచు,దానిఁ గైకొనుటగాని సంభాషణముగాని చేయవలయును.

శ్లో॥ పరాఙ్ముఖస్యాభిముఖో, దూరస్థస్యైత చాంతికమ్
ప్రణమ్యతు శయానస్య, నిదేశేచైవ తిష్ఠతః॥

గురువు పెడమోముతోనుండినచోఁ దా నెదురేగియు, దవ్వున నున్నచోఁ దానుదగ్గఱియుఁ,బరుండియున్నచోఁ దా నమస్కరించియు,నిలఁబడియున్నచోఁ దాను దాపున నిలఁబడియు గురువు నాజ్ఞను జేయుటగాని మాటలాడుటగాని చేయవలయును. మను. ౨-౧౯౫.

కం. అన్నా! నీజనకుండు ప్ర॰సన్నత యువరాజుఁ జేయ॰సమకట్టెఁ గదా
నిన్నహుషుండు యయాతిబ,లెన్నెఁ డుపవాసవిధి వ॰లెన్ జరుపంగన్.౧౩౨

అన్నా = ఇది ప్రీతిచేఁ జెప్పెడుమాట, ప్రసన్నతన్=నీ యందనుగ్రహ మిదిగలవాఁడై, సమకట్టెన్ = ప్రయత్నించెను.

తాత్పర్యము

నాయనా రామచంద్రా! రాజు నీయెడ సంతోషించినవాఁడై నహుషుఁడు యయాతికిఁ బట్టముఁ గట్టినట్లు నీకుఁ బట్టముఁ గట్ట యత్నించెఁగదా. ఆ కార్యము జరుపుటకు ముందు సీతయు నీవు నుపవాస వ్రతము జరుపవలెను.

ఉ॥ సీతయు నీవు, జేవ యభిషేకము జేఁ దొనరించునంట, సం
చాతరణీద్యవంశజు ధరాత్మభవ న్విధిచోదితంబు నా
రీతి సమంత్రకంబుగ వరిష్ఠతపస్వి యతోపవాసను
స్ఫీతులఁ జేసి యర్చనల శ్రీరఘురాముఁ డొనర్ప నందుచున్. ౧౩౯

జేఁ డొనరించునంట=రాజు చేయఁదలఁచి యున్నాఁడఁట, ఒనరించు నవక 'యొనరించునఁట' యనుటచే నిది జేని యభిప్రాయమువాత్రమే. (అనఁగా నది జరుగఁబోవునది కాదు- దైవసంకల్పము భిన్నముగా నున్నదని భావము. రాజాజ్ఞ మీఱరాదు. దైవరహస్యము వెలిపెట్టరాదు.) కావున మీ రుపవాసముండ వలసినదే. తరణీద్యవంశజున్=సూర్యుని ప్రసిద్ధవంశమునఁ బుట్టినవానిని, ధరాత్మ భవన్=భూపుత్రియగు సీతను, విధిచోదితంబు=శాస్త్రము విధించిన ప్రకారము, సమంత్రకంబుగన్ = మంత్రయుక్తముగ, వరిష్ఠతపస్వి = తపస్సులయందు శ్రేష్ఠుఁడు, యతోపవాససుస్ఫీతులన్ = నియమముగల యుపవాసముచే గొప్ప వారిని.

తాత్పర్యము

రామచంద్రా! రాజు నీకు జేపే పట్టాభిషేకము చేయునఁట. అని చెప్పి రాజాజ్ఞప్రకారము సీతాదేవిని శ్రీరాముని శాస్త్రప్రకార ముపవాసముండఁజేసెను. ఇట్లుచేసి శ్రీరామునిచేఁ బూజింపఁబడి

కం॥ వెనువెంట వచ్చు రఘురా,
మునిముని నిలు నిలు మటంచు ముదల నొసఁగి తాఁ
జనియెను రామనివేశనము, ను వీడి రథస్థుఁడగుచుఁ బురమార్గమునన్.

ముదల = ఆజ్ఞ. ౧౪౦

తాత్పర్యము

తన్ను సాగనంపఁ దన వెంటవచ్చు శ్రీరాముని నీవు నిలుము నిలుము రావలదనిచెప్పి శ్రీరాముగృహమువీడి రథమెక్కి పట్టనమున వీథులవెంటఁ బోయెను. ముని ముని నిలు నిలు ఛేకానుప్రాసము.

— శ్రీరామపట్టాభిషేకమునకై జనులు గుంపులు గూడుట. —

చం॥ మునికులసార్వభౌముఁ డిటు మోదముతో వరుగం బ్రియుండవదుల్
తనహితు లెల్లరుం గొలువఁ దాఁ జని యాత్మగృహంబులోనికిన్

జనకసుతామనోహరుఁడు•సాంత్వపువాక్కుల వారిఁ బ్రీతులం
బొనరఁగఁ జేసి వెండి రఘు•ముఖ్యుఁ డనుజ్ఞ యొసంగె వారికిన్. ౧౪౧

ప్రియంవదుల్ = ఇంపగు వాక్కులు చెప్పువారు, ఇచ్ఛకాల మారులు- హితులు=మేలుగోరిచెప్పువారు, కొలువన్=సేవింపఁగా, సాంత్వపు వాక్కులన్= మంచి మాటలచే.

తా త్ప ర్య ము

మునిశ్రేష్ఠుఁడైన వసిష్ఠుఁ డిల్లువెడలిపోఁగాఁ బ్రియవాదులు హితవాదులు నగువారు సేవించుచుఁ దోడరాఁగాఁ దనయింటిలోనికిఁబోయి శ్రీరాముఁడు వారల నెల్ల మంచిమాటలచే సంతోషింపంజేసి యిఁకఁ బొండని యనుజ్ఞయిచ్చెను.

కం॥ విచ్చినకమలంబులు మద,మెచ్చిన శకునములు నైరఁ•హించుకొలను నా
నచ్చుజిగిఁబురుషయువతిస,ముచ్చయములతోడరాము•మొసల వెలసెన్.

శకునములు=పక్షులు, అచ్ఛుజిగి=స్వచ్ఛమైన కాంతిగల, మొసల=మొగ సాల, అచ్చుజిగి=సమాసంబున విభక్తిలోపంబు, అచ్చ తెలుపు=అచ్చవెన్నెల.

తా త్ప ర్య ము

వికసించిన తామరలు- మదించిన పక్షులుగల కొలనివలె మిగులకాంతిగల స్త్రీపురుష సమూహములతో శ్రీరాము మొగసాల ప్రకాశించెను.

సీ॥ ఇసు మెత్తి చల్లిన•నిలను రాలకయుండ,మూఁగినమూఁకచే•మొనయువాని
నెవ్వ డెవ్వ డటంచు•నెదురు చూచుకుతూహ,లవ్రజచేతఁ జె•లంగువాని
జనతాతరంగహ•ర్ష స్వనోద్గాఢ మై, యంబురాశికి నుద్ది•యైనవాని
నంబువుల్ చల్లి వృ•క్షంబులు గట్టి మీఁల్,రంగవల్లులను బ•రంగువాని
తే॥ నెవ్వ డెప్పుడు భాస్కరుఁ•డేగుదెంచు,
ననుచు నత్తిత్తూబువుఁ•గనుచు నున్న
బాలబాలావధూవృద్ధ•పటలిచేత, మించి యిబుకైన తెరువులఁ•గాంచె మౌని. ౧౪౩

ఇసుము=ఇసుక, జనతా=జనసమూహములనెడి, తరంగ=అలలయొక్క (గుంపువెంబడి గుంపు వచ్చుటచే నలలకుఁ బోలిక), హర్షస్వన=సంతోషధ్వను లచే, ఉద్గాఢమై=మిక్కిలి యతిశయించినదై, అంబురాశికి=సముద్రమునకు, ఉద్ది=సమానము, రంగవల్లులు=ముగ్గులు, అత్తిత్తి=మెడలు నిక్కపెట్టి, బాలా= ఆఁడుపిల్లలు, వధూ=వయస్సువచ్చిన స్త్రీలు.

తా త్ప ర్య ము

శ్రీరాము ధామము విడిచి దశరథునింటికి వసిష్ఠుఁడు పోవునపుడు వీథు లున్నవిధమును గవి వర్ణించుచున్నాఁడు.

ఇసుక చేతులతో నెత్తియెగచల్లిన నొకయిసుకరేణువైనను భూమిమీఁదఁ బడకుండునట్లు జనసమూహముచే నిండియున్నవానిని, శ్రీరామచంద్రమూర్తికి

నెప్పుడు పట్టాభిషేకము జరగునా యెప్పుడు కన్నులారఁ జూతుమా యని మిక్కిలి కోరికగల ప్రజలచే నిండినవానిని అలలధ్వనిచే నతిశయించిన సముద్రమువలె జనుల కోలాహలముచే వ్యాపించినవానిని, వీథులనన్నిట నీళ్లుచల్లి యరఁటి స్తంభములు గట్టి నానావిధములయిన ముగ్గులు దీర్చియుండువానిని సూర్యుఁ డెప్పుడెప్పుడు పుట్టునా యింకను బుట్టలేదే యని త్వరపడుచు సూర్యుఁడు పుట్టెనేమో యని మెడలు నిక్కపెట్టి తూర్పుచూచుచున్న మగపిల్లవాండ్రు - ఆఁడుపిల్లలు - వయస్స్త్రీలు-ముదుసళ్ళు వీరి సమూహముచే నిబుకైపోవనెడములేని వీథులను, ముని గాంచెను.

కం॥ మిద్దెల మేడల ధ్వజతతు, లద్దిర యెగురంగ సాగె • హర్షముతో నీ
సుద్దిని మింటను వేలుపు, ముద్దియలకుఁ జెప్పు చున్న•మచ్చట దోఁపన్.

తాత్పర్యము ౧౪౪

మిద్దెలమీఁదను మేడలమీఁదను బౌరులచేఁగట్టబడిన ధ్వజములు గాలికి నెగురుట చూడఁగా నవి శ్రీరామపట్టాభిషేకవార్తను స్వర్గముననుండు దేవతాస్త్రీలకు సంతోషముతోఁ జెప్పుచున్నవా యన్నట్టులుండెను.

అలం. ఉత్ప్రేక్ష

కం॥ జనతాలంకృతిభూతము, జనతానిసులితమోద•జనకం బగుప
త్తనమున నుత్సుకజనములఁ,గనుచుం బ్రజ బంతి దీర్చు•గతి మెల్లచనెన్.

తాత్పర్యము ౧౪౫

జనులయలంకారముచే నిండినదియు జనుల కసమానమైన సంతోషము గలిగించునదియునైన యయోధ్యానగరమున రామపట్టాభిషేకము చూడఁగోరిక గల జనముల నడుమ వసిష్ఠునితేరు పోవునపుడు దానికి నెడమిచ్చుటకై యిరుపాయలుగాఁజీలు జనములను జూడ జనులను బంతులు దీర్చుచున్నదాయేమి యన్నట్టులుండెను.

చ॥ అరుసముతోడ మౌని యవి•యన్నియుఁ గాంచుచు నేగియేగి డాల్
వరఁగ సితాంబుదాంచలని•భం బగు ప్రాలునృపాలచంద్రుమం
దిరమును జేర నేగ, గురు•దేవవిభుం డన నానృపాలుఁడున్
దొరతొర లేచి తన్నట నెదుర్కొని కార్యము ప్రశ్న సేయుడున్. ౧౪౬

అరుసము=హర్షశబ్దభవము సంతోషము, డాల్=కాంతి, సితాంబుదాంచలనిభంబు=తెల్లని మేఘము కొనతో సమానమై, గురున్=బృహస్పతిని- తొరతొర = శీఘ్రముగా.

తాత్పర్యము

ప్రజలకు శ్రీరామునందుఁగల శ్రద్ధాభక్తులు చూచి సంతోషపడుచు మెల్లగాఁ బోయి తెల్లమేఘము నంచువలెఁ గాంతికలదై యొప్పు దశరథు నగరుచేరఁ

బోఁగా నాయనయు బృహస్పతి నెదుర్కొనఁ బోయిన యింద్రునివలె నెదురుగాఁ బోయి యేమిజరిగెను? సీతారాములు ఉపవాసవ్రతముఁ బూనిరా? యని యడుగఁగా

కం॥ జరపితి సకలం బనియెను, ధరణీపుతోడన సభాస•ద్వ్రజ మెల్లన్
గురుమతి లేచి వసిష్ఠునిఁ, గరముం బూజింప నవని•కాంతుఁడు పిదపన్. ౧౪౩

కం॥ జరిగినవృత్తాంతము విని, గురువర్యుననుజ్ఞఁ గాంచి•కూడినమనుజో
త్కరమునకున్ సెల విచ్చెను, బరమముదంబునను దగిన•భంగిని నిట్లుల్.

### తాత్పర్యము ౧౪౪

కార్యమెట్లు జరుపవలయునో సర్వమట్టులే జరపితిని- అని సభాకూటము నకుఁబోఁగా నచ్చటి సభ్యజనులందఱులేచి గౌరవించిరి. అపిమ్మట సీతారాముల వృత్తము పౌరజనులచర్యలు వారి యుత్సాహము సర్వము వసిష్ఠుఁడు వివరింపఁగా విని గురువర్యుని యనుజ్ఞగొని సభయందుండువారికెల్ల మీరిఁక మీయిండ్లకుఁ బోవచ్చునని సంతోషముతో సెలవిచ్చిపంపెను.

మానిని. వారల నెల్లరఁ బోవఁగఁ బంచి నృ•పాలుఁడు సింహము శైలగుహన్
జేరెడిరీతి సమగ్ర్యసువేషవి•శేషవధూజనతాకులజం
భారినిశాంతమనోహరరాజగృ•హంబును జొచ్చి సఋక్షగణో
దారనభంబును జందురునట్టులు•దా వెలిఁగించె స్వదీధితులన్. ౧౪౫

సమగ్ర్య.......గృహంబును- సమగ్ర్య=సంపూర్ణమగు, సువేషవిశేష= క్రొత్తవై మేలయిన యలంకారములుగల, వధూజనతాకుల=స్త్రీసమూహముచే నిండినదై, జంభారినిశాంత=ఇంద్రునిగృహమగు వైజయంతమువలె- మనోహరమైన రాజగృహంబును, సఋక్షగణ=నక్షత్రసమూహముతోఁగూడిన, ఉదార= గొప్పదగు, నభంబును=ఆకాశంబును, స్వదీధితులన్=తనకాంతులచే.

### తాత్పర్యము

దశరథమహారాజు సభ్యులనెల్లఁ బోవ ననుజ్ఞయిచ్చి సింహము తనగుహను ప్రవేశించునట్టులు నానావిధములైన నూతనాలంకారములచే సొబగారు స్త్రీజనములచే నందమై యింద్రునిమేడనుబోలిన తనగృహంబునఁ బ్రవేశించి తనకాంతులచే నక్షత్రములచే నిండిన యాకాశమును జంద్రునివలెఁ బ్రకాశింపఁ జేసెను.

## —• ౬వ సర్గము. శ్రీరాముఁడు నారాయణార్చనము సేయుట •—

కం॥ చనుడుఁ బురోధయుఁ దా మజ్జన మొనరిచి నియతమతి వి•శాలాక్షిని బ
త్నిని గూడి రామభద్రుం, డనఘుఁడు నారాయణుని స•మర్చన సలిపెన్.

పురోధ=పురోహితుఁడు, మజ్జనము=స్నానము, నియతమతిన్=నియమముతోఁగూడిన మనస్సుతో, విశాలాక్షిని = వెడలుపైన కన్నులుగలదియగు, పత్నిని=భార్యను, మజ్జనమొనరించి యనుటచేఁ గాయశుద్ధియు, నియతమతి యనుటచే మనశ్శుద్ధియుఁ, దెలుపఁబడెను.

## తాత్పర్యము

తనకుఁ జెప్పవలసిన వన్నియుఁజెప్పి పురోహితుఁడగు వసిష్ఠుఁడు వెడలి పోఁగా శ్రీరామచంద్రుఁడు సతీసమేతుఁడై స్నానముచేసి విశాలాక్షియగు భార్య తోడ శ్రీమన్నారాయణు నారాధించెను.

ఇచ్చటఁ జెప్పఁబడిన నారాయణమూర్తి శ్రీరంగనాయకులని,యుద్ధకాండ మందును,ఉత్తరకాండమునందును జెప్పఁబడు కులధన మిదియని పురాణగాథ-విభీషణున కనుగ్రహించినది యామూర్తినే. తానే నారాయణుఁడే మరల నీపూజ యెవరి నుద్దేశించి యనిన గృహదేవతార్చనము లోకవిడంబనార్థము లోకసంగ్ర హార్థమునని యెఱుంగవలయును.

౧౮౪-౧౩౭-౧౩౦-౧౩౧-౧౩౩ పద్యములవలన నిక్ష్వాకువంశజుల యిలవేల్పు శ్రీమన్నారాయణుఁడని యేర్పడుచున్నది. విశాలాక్షీశబ్దమునకు లక్ష్మియనియు నర్థముగలదు. ఋతేమాయా విశాలాక్షీం తవ పూర్వ పరిగ్రహా మ్మని యీరామాయణమందే ప్రయోగము కలదు.కావునను బాలకృష్ణునిఁదప్పఁ దక్కిన పురుషమూర్తులను మాత్రము పూజింపరాదు. లక్ష్మీయుక్తముగానే పూజింపవలెను. కావున పత్నినిగూడి రామభద్రుం డనఘుఁడు విశాలాక్షిని నారాయణుని సమర్చన సలిపెన్ అనియు నన్వయింపఁదగు. ఈయర్థము బోధించుటకే క్రిందిపద్యమున శ్రీపతిన్ అని ప్రయోగింపఁబడియె. పత్నినిగూడి యనుటచే 'పత్న్యైర్నో యజ్ఞసంయోగ' యని దీక్షానియమమందు భార్యా సహాయత్వము శ్రుతిసిద్ధము,పత్నితోఁగూడి యర్చించె ననుటచే ధూపదీప గంధ తాంబూలాద్యుపకరణములు భార్య యందీయఁగా శ్రీరాముఁడు పూజించె నని యెఱుంగవలయును.

భర్తలు దేవతలఁ బూజించునపుడు భార్యలు బొమ్మలవలెఁ గూర్చుండ రాదు. లేచి పెత్తనాలకుఁ బోరాదు. ప్రక్కనఁకూర్చుండి భర్తకుఁగావలసినవన్ని యందిచ్చుచుండవలెను.

విశాలాక్షిని పత్నిగూడి యనుటచే సీతాదేవి విశాలమైన కన్నులు తన మనస్సు నాకర్షించుచున్నవైనను అనఘుఁడు కావున కామ దూషితుఁడు గాక యర్చించెనని భావము.

మజ్జన మొనరించి యనుటచే నేవైదిక కర్మమైనను స్నానముచేసియే చేయవలయునని సూచితము.

'వేదకర్మాధి ప్రయోక్ష్య న్నాదిత ఏవతీర్థే స్నాత్వా' యని బోధాయనులు, 'మనఃప్రసాదాత్సత్యోక్త్యా తపసాస్నాన కర్మణా ఆచంత్యాచ మనశ్శుద్ధింకృత్వా కర్మసమారభేత్" అని గౌతముడు-ప్రసన్నమైన మనస్సుతో సత్యవాక్యముతోఁ దపస్సుతో స్నానముచేసి యాచమించి మనస్సు శుద్ధిచేసికొని కర్మనారంభింప వలెను.

'నహిస్నానం వినాపుంసాం, ప్రాయత్యం కర్మసుస్మృతమ్। హోమే జప్యే విశేషేణ, తస్మాత్స్నానం సమాచరేత్' వ్యాసులు. పురుషులు స్నానము చేయక ముఖ్యముగ హోమము జపము చేయరాదుగనుక స్నానము చేయవలయును.

చం॥ తలను హవిస్సుపాత్రము య•థావిధిఁ దాల్చి, జ్వలించు నగ్నిలో
వల విధిపూత మాజ్యఘృతము•భ క్తిమెయిం బరదైవతంబునుం
దలఁచుచు వేల్చి, శేషమును•దద్దయుఁ బ్రీతి భుజించి శ్రీపతిన్
నిలిపి యెడంద, దర్భశయ•నీయమునన్ హరిమందిరంబునన్. ౧౩౧

యథావిధి=శాస్త్రవిధానము నతిక్రమింపక, విధిపూతము=మంత్రములచేఁ బవిత్రమైన, ఘృతము=నెయ్యి, జలించు నగ్నిలోన్ = మండుచున్న యగ్ని యందు, వేల్చి=హోమముచేసి, శేషమును=హోమముచేయఁగా మిగిలినదానిని, శ్రీపతిన్=లక్ష్మివిశిష్టుఁడైన నారాయణుని, ఎడందన్=హృదయమందు, దర్భ శయనీయమునన్=దర్భలచేఁ జేయఁబడిన పాన్పునందు, హరిమందిరంబునన్ =ప్రణవాకారమైన విష్ణుమందిరంబునందు, తలను హవిస్సుపాత్రమును, యథా విధి దాలిచి యనుచో "ఉపరిహిదేవేభ్యో ధారయంతీతి" శ్రుతివాక్య మనుసం ధింపవలయును. పరదైవము=తం దేవతానాం పరమంచదైవత'మ్మను శ్రుతి చెప్పిన నారాయణు నని యర్థము.

జ్వలించు నగ్నిలో ననుటచే మండుచున్న మంటలో హోమము చేయ వలయును గాని పొగరాఁజునప్పుడు చేయరాదని సూచన.

శ్లో॥ బహుంశుష్కేంధనే చాగ్నౌ, సుసమిద్ధేహుతాశనే
విధూమే లేలిహానేచ హోతవ్యం కర్మసిద్ధయే॥ విష్ణు

ఎండిన కట్టెలు విశేషముగనుండి పొగలేక జ్వాలలుగల యగ్నియందు కర్మసిద్ధిఁగోరువారు హోమము చేయవలయును.

నిప్పులయందు, జ్వాలలు లేని యగ్నియందు హోమముచేసినఁ గీడు కలుగును. ఆజ్యధార మాషస్థూలము నాలుగంగుళముల దీర్ఘమునై యుండ వలెను. అన్నాహుతి పచ్చి యుసరిక కాయయంత యుండవలెను.

'యోంతర్ఛపి జుహో త్యగ్నౌ, వ్యంగారేచైవ మానవః
మందాగ్నిరామయావీచ, దరిద్రశ్చైవ జాయతే॥

శేషముభుజించి=హోమముచేయఁగా మిగిలినది భుజింపవలయును.

హవిరుచ్ఛిష్టం సర్వేప్రాశ్నీయుః॥ ఆశ్వలాయనులు. ఏతస్మిన్కాల అగ్నిద్రే యజమానః పురోడాశానాం ప్రాశ్నాతి॥

దర్భశయనీయమున ననుటచే వ్రతదినములందు మంచములమీఁదఁ బరుపులమీఁదఁ బండుకొనరాదని సూచన. "స్వాస్తీర్ణే కుశసంస్తరే" అని ప్రమా ణము. నాసం ద్యాంశయీత"బోధాయనులు,"ఉపరిత్యేన శయీత"అపస్తంబులు

'ఖట్వాసనంచ శయనం,వర్జయే ద్దంతధావనమ్। స్వపే తదేకః కుశేష్వేవ,నరేతః స్కందయేత్క్వచిత్' యముఁడు.

శ్రీపతిన్నిలిపి యెడంద ననుటచే సత్కర్మములందు భగవద్ధ్యానము చేయవలయునని సూచన.

'ఈశ్వరే నిత్యకాలాత్మా చింతనీయః సుకర్మసు'గోపాలకారిక. 'ద్వేరూపే వాసుదేవస్య, చరంచాచర మేవచ, చరం సన్న్యాసినాం రూప, మచరం ప్రతిమాదికమ్' వ్యాసులు.

భగవంతుఁడగు వాసుదేవునకు చరరూప మచరరూపమని రెండు రూపములు గలవు. సన్న్యాసులరూపము చరము-ప్రతిమాదు లచరము.

తా త్ప ర్య ము

హవిస్సుగల పాత్రమును శ్రుతియందుఁ జెప్పఁబడిన ప్రకారము శిరముమీఁది కెత్తి మందుచున్న యగ్నిహోత్రములో మంత్రవంతమైన నేతిని భక్తితో శ్రీమన్నారాయణుని ధ్యానించుచు హోమము చేసి హోమముచేయఁగా మిగిలిన దానిని భుజించి శ్రీమన్నారాయణుని హృదయమున నిలిపి దర్భలచే నేర్పాటు చేయఁబడిన శయ్యయందు నారాయణు మందిరంబునందు (శయనించెను).

హవిస్సు భుజించుటవలన నుపవాసవ్రతభంగముగదా యని శంకింపఁ బనిలేదు.

శ్లో॥ అష్టానై్య తాన్యవ్రతఘ్నాని, హ్యాపోమూలం ఘృతంపయః, హవిర్బ్రాహ్మణ కార్యంచ, గురోర్వచన మౌషధమ్మని యుండుటచే నౌషధము హవిస్సు.నీళ్ళు, పాలు, నేయి, మందు, భుజించుటవలన వ్రతభంగములేదు, బ్రాహ్మణ కార్యమనఁగా నిచట శ్రాద్ధమునందు నిమంత్రణము, గురువు చెప్పినట్లు చేసినను వ్రతభంగము లేదు.

కం॥ వినియతవాఙ్మానసుఁడై, జనకసుతాసహితుఁ డగుచు•శయనించెను, మేల్కొని వేగ జాము గల దనఁ,
దనగృహ మఖిలం బలంకృ•తము సేయించెన్. ౧౨-౩

వినియత=మిక్కిలి నియమింపఁబడిన, వాక్=వాక్కు, మానసుఁడై=మనస్సుగలవాఁడై అనఁగా మౌనము వహించి మనస్సు చలింపనీయనివాఁడై, జనకసుతా సహితుఁడు=సీతతోఁగూడినవాఁడు, వేగ జాము గలదనన్=తెల్లవాఱుటకు నొకజాము కాలమున్నదనఁగా, వినియతవాఙ్మానసుఁడై యనుటచే వ్రతవేళ మాటలాడక యేకధ్యానముగ నుండవలయు నని సూచన.

'జపకాలే నభాషేత, వ్రతహోమాదికేషుచ' జపకాలమందు, వ్రతకాలమందు, హోమాదులందు మాటలాడరాదు.

## తాత్పర్యము

దర్భశయ్యమీఁద భార్యతోడఁ బరుండియు నామెతో మాటలాడక యామెయందు మనస్సుపోనీయక యసిధారా వ్రతచర్యా నిష్ఠుఁడై పండుకొని నాలుగవజాము పుట్టఁగనే మేల్కొని లేచి తన యిల్లంతయు స్త్రీలచే నలంకారము చేయించెను.

దీనివలన గృహాలంకరణమును స్త్రీలు సూర్యోదయమునకు ముందే చేయవలయునని సూచన.

అశూన్యదేహ లీకార్యా, ప్రాతఃకాలే విశేషతః : యస్యాః శూన్యా భవేత్సాతు, శూన్యం తస్యాః కులంభవేత్॥ పాదస్య స్పర్శనం తత్ర,అసంమార్జ్యాచ లంఘనమ్: కుర్వన్నారక మాప్నోతి, తస్మాత్తత్పరి వర్జయేత్॥ ప్రాతఃకాలే స్త్రీయాకార్యం। గోమయేనాను లేపనమ్। ప్రత్యహం సదనేతస్మాన్నైవదుఃఖాని పశ్యతి॥ స్పృశంతి రశ్మయోయస్య గృహం సమ్మార్జ నాదృతే। భవంతి విముఖాస్తస్య, పితరోదేవ మాతరః॥ నిశాయాః పశ్చిమే యామే ధాన్య సంస్కరణాదికమ్, క్రియమాణాం హినారీణాం, సర్వశ్రేయో ధనావహమ్॥ సంధ్యాకాలేతు సంప్రాప్తే, ధాన్య సంస్కరణాదికమ్। కురుతేయాతు మోహేన, వంధ్యాజన్మని జన్మని, సంధ్యాకాలేతు సంప్రాప్తే, మార్జనం నకరోతియా। భర్తృహీనా భవేత్సాతు, నిస్స్వా జన్మని జన్మని. అకృత స్వస్తికాయాతు, క్రామేల్లిప్తాంచమేదినీమ్॥ తస్యాశ్శ్రీః వినశ్యంతి, విత్తమాయుర్యశ స్తథా,నాక్రమే దంఘ్రిణా జాతు, పుత్రదారధనక్షయాత్, ఉలూఖలంచ ముసలం, తథాచైవ ఘరట్టకమ్. యదాక్రమాణాత్పాపీయో, నాప్నుయాదుత్తమాం గతిమ్. మార్కండేయపురాణము.

ముఖ్యముగాఁ ప్రాతఃకాలమందు (సూర్యోదయమునకు ౩ గడియలకు ముందిటికాలము ప్రాతఃకాలమనఁబడును) ఇల్లు పాడుగా (అలుకక) నుంచరాదు. ఎవతె యట్లుంచునో దానివంశము శూన్యమగును. అట్లు అలుకని గడపను గాలితోఁ దాఁకరాదు-దాఁటరాదు. అట్లు దాఁకినను దాఁటినను నరకప్రాప్తియగును. ప్రాతఃకాలమందే గోమయముతో నిల్లలుకు స్త్రీయింట దుఃఖములు గలుగవు. కసవు చిమ్మకముందే సూర్యకిరణము లెవనియింటఁ బడునో వాని పితరులు విముఖులై పోదురు. రాత్రి కడపటిజామునందే ధాన్యము చక్కఁజేసియుంచుకొనుస్త్రీకి సర్వశ్రేయస్సులు ధనము గలుగును. సంధ్యాకాలమం దెవతె మోహముచే ధాన్యము జక్కఁజేయునో(దంచుట చెరుగుటలోనైనవి)యది జన్మజన్మమున గొడ్డురాలగును. సంధ్యాకాలమం దెవతె యిల్లుకసవు చిమ్మదో యది పతిలేనిదై జన్మజన్మమున దరిద్రురాలగును. ముఖము కడుగుకొనక కుంకుమ ముఖమునఁ బెట్టుకొనక చెదరిన వెంట్రుకలు వ్రేళ్ళతోనైన దువ్వుకొనక యెవతె యలికిన భూమిని దాఁటునో దానికి ధనము- ఆయుస్సు-కీర్తి నశించును.కాళ్ళచే

బోలు రోఁకలి విసరుఱాయి (తిరుగలి) దాఁటరాదు. అట్లు దాఁటు పాపాత్ముఁడుత్తమ లోకమునకుఁబోఁడు. వాని పుత్ర దారధనములు క్షయించును.

యద్గృహం రాజతే నిత్యం, రంగవల్ల్యాను లేపనైః
తద్గృహే వసతే లక్ష్మీ,ర్నిత్యం పూర్ణ కలాన్వితా॥

ఏ యింటిలోఁ బ్రతిదిన మలుకులు ముగ్గు లుండునో యాయింట లక్ష్మీదేవి పూర్ణకళలతో వసించును.

మేల్కొని వేగజాము గలదనఁ- శ్రేయస్కాముఁడు సూర్యోదయమునకు ముందుగనే లేవవలయును. లేచి; ప్రవృత్తిమార్గమందుండు వారు ధర్మార్థకామములను నివృత్తిమార్గమందుండు వారు యోగాభ్యాసముగాని భగవచ్చింతనముగాని కావింపవలయును గాని నిద్రింపరాదు. బ్రాహ్మేముహూర్తే చోత్థాయ। చింతయే దాత్మనో హితమ్। ధర్మార్థకామాన్ స్వే కాలే। యథాశక్తి సహ్యాపయేత్, యాజ్ఞవల్క్యుఁడు.

షోఢా విభజ్యరజనీం, చరమాంశే ప్రబోధితాః
పత్న్యా సహహరిం, ధ్యాత్వా, ధర్మమర్థంచ చింతయేత్॥

కం॥ సూతజనవందిమాగధ, చేతోహరవాక్యములను•జెవివండువుగా
సీతాపతి విని నిశ్చల,చేతంబున సంధ్య వార్చి•శ్రీమధువైరిన్. ౧౩౩

సూతజన=మహాత్ములయు, దేవతలయు మహాత్త్వము వర్ణించువారియొక్క, వంది=స్తోత్రపాఠకులయు, మాగధ=మగధ దేశమందుఁ బుట్టి రాజవంశములఁ జెప్పువారియొక్కయు, చేతోహర=మనస్సును హరించు నింపైన, వాక్యములను పలుకులను, నిశ్చల చేతంబునన్=చలింపని మనస్సుతో.

సంధ్య.

ఏతదక్షర మేతాంచ, జపన్ వ్యాహృతి పూర్వకామ్
మహతో ప్యేనసో మాసా, త్త్వచే వాహిర్విముచ్యతే.

ఏ ద్విజుఁడు గ్రామము వెలుపల ప్రణవ వ్యాహృతి గాయత్రులను నీమూఁటిని సంధ్యలయందును దక్కినకాలములందును వేయిమాఱులు జపించునో వాఁడు పాము కుబుసమును విడిచినట్లు నెలలోపల మహాపాపములనుండి విముక్తుఁడగును.

యోఽధీతేఽహన్య హన్యే యం,త్రీణి వర్షాణ్య తంద్రితః
సబ్రహ్మ పదమభ్యేతి, వాయుభూతః ఖమూర్తిమాన్.

ఎవఁడు ౩ సంవత్సరములు ప్రతిదినము దీని జపించునో వాఁడు పరబ్రహ్మమున కెదురుగాఁ బోవును. అతఁడు వాయువువలెఁ గామచారియై పరబ్రహ్మస్వరూపుఁడగుచున్నాఁడు.

శ్లో॥ ఏకాక్షరంపరం బ్రహ్మ, ప్రాణాయామః పరంతపః
సావిత్ర్యాస్తు పరంనాస్తి, మౌనాత్సత్యం విశిష్యతే.

పరబ్రహ్మమును బొందించునది ప్రణవమే-గనుకఁ బ్రణవమే, పరబ్రహ్మము ప్రాణాయామముకంటె గొప్ప తపస్సు లేదు. సప్రణవ సవ్యాహృతి సశిరస్క గాయత్రి మూఁడు మార్లు చేయుట చాంద్రాయణాదులకంటె గొప్ప తపస్సు- మౌనవ్రతముకంటె సత్య వ్రతము మేలు.

శ్లో॥ విధి యజ్ఞా జ్జపయజ్ఞో, విశిష్టో దశభిర్గుణైః
ఉపాంశు స్స్యాచ్ఛతగుణః, సాహస్రో మానస స్స్మృతః

జ్యోతిష్టోమాది యాగము లొనర్చుటకంటె ఓంకార వ్యాహృతులతోడ గాయత్రి జపించుట పదింతలు మేలు. ఆ జపమే పరులకు వినఁబడకుండఁ జేయుట నూఱంతలు శ్రేష్ఠము. నాలుక పెదవి కదలింపక మనస్సులోనే చేయు జపము వేయియంతలు శ్రేష్ఠము.

శ్లో॥ యేపాక యజ్ఞ శ్చత్వారో, విధి యజ్ఞ సమన్వితాః
సర్వేతే జపయజ్ఞస్య, కలాంనార్హంతి షోడశీమ్॥

పాక యజ్ఞములు నాలుగు విధి యజ్ఞములును చేయువారు వీరందఱు జపయజ్ఞము చేయువారిలోఁ బదునాఱవ భాగమునకు సరిగారు.

శ్లో॥ జప్యేనైవతు సంసిద్ధ్యే, ద్బ్రాహ్మణో నాత్రసంశయః
కుర్యాదన్యం నవాకుర్యా, న్మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే॥

మంత్రజపముచేతనే బ్రాహ్మణుఁడు సిద్ధిపొందఁగలఁడు. వాఁడితరములగు వైదికకర్మములు యాగాదులు చేయనీ చేయకపోనీ గాయత్రీజపముచేసెనేని వాఁడు బ్రాహ్మణుఁడని చెప్పఁబడును.(అది విడిచి తక్కినవేవిచేసినను వ్యర్థమే)

శ్లో॥ సావిత్రీ మాత్రసారోపి, వరం విప్రస్సుయంత్రితః
నాయంత్రిత స్త్రివేదోపి, సర్వాశీ సర్వవిక్రయీ.

సదాచారముగల బ్రాహ్మణుఁడు గాయత్రిమాత్రము జపించువాఁడయినను వాఁడే శ్రేష్ఠుఁడు కాని మూఁడు వేదము లధ్యయనముచేసినను శాస్త్రనియమము నకులోపడక యేదైనఁ దినుచు నేదైననమ్ముచునుండు బ్రాహ్మణుఁడు శ్రేష్ఠుఁడు కాఁడు.

శ్లో॥ దశజప్తాతు సాదేవీ, దినపాపప్రణాశినీ
శతజప్తా తథాసాతు, అబ్దపాపప్రణాశినీ
సహస్ర జప్తాతుజనాన్, పాతకేభ్యస్సముద్ధరేత్
దశసాహస్ర జప్తాతు, సర్వకల్మషనాశినీ
స్వర్ణస్తే యీ కృతఘ్నశ్చ, బ్రహ్మహా గురుతల్పగః
సురాపశ్చ విశుధ్యేత, లక్షజాపాన్నసంశయః
హస్తత్రాణపరాదేవీ, పతితాం నరకార్ణవే
తస్మాత్తా మభ్యసే న్నిత్యం, బ్రాహ్మణో నియతశ్శుచిః

గాయత్రీ జప్య నిరతం, హవ్యకవ్యేషు భోజయేత్
తస్మిన్న శ్లిష్యతే పాప, మబ్బిందు రివపుష్కరే
సావిత్రీ జాప్యనిరతః స్వర్గమాప్నోతి మానవః
గాయత్రీ జపనిరతో, మోక్షోపాయంచ విందతి.

గాయత్రి పదిమార్లుజపించిన నాదినపాపము నశించును. నూఱుమార్లు జపించిన సంవత్సరపాపము పోవును. వేయిమార్లుజపించినఁ బాతకములనుండి యుద్ధరించును. పదివేలమార్లు జపించిన సర్వపాపములు నాశముచేయును. బంగారుదొంగిలించినవాఁడు కృతఘ్నుఁడు బ్రహ్మహత్యఁ జేసినవాఁడు గురు భార్యను బొందినవాఁడు, కల్లుసారాయము త్రాగువాఁడు లక్షజపముచేఁ బరి శుద్ధుఁడగును.

నరకమునఁ బడినవారిని గాయత్రి చేయూఁతయిచ్చి వెలుపలికి లాగును. కావున బ్రాహ్మణుఁడనుట యుపలక్షకము. బ్రహ్మ క్షత్రియ వైశ్యులని భావము. ప్రతిదినము గాయత్రి నభ్యసింపవలెను.

గాయత్రీజపమందుఁ బ్రీతిగలవాఁడు హవ్యకవ్యములందు భోజనము చేసినను తామరాకు నీళ్ళవలె వానికిఁబాపమంటదు. సావిత్రీజపము చేయువాఁడు స్వర్గగామి యగును. గాయత్రీజపము చేయువాఁడు ముక్తుఁడగును. 'ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణ' యనికదా ప్రమాణము.

'తమేవ భాంతమనుభాతి సర్వం తస్యభాసా సర్వమిదం విభాతి' యన్నట్టు లాయనతేజస్సేకదా సూర్యునితేజస్సు. గాయత్రీమంత్రమందు చెప్పఁబడినది యా తేజస్సేకదా.

తాత్పర్యము

స్తుతులు- వందులు - మాగధులు మనోహరవాక్యములు చెప్పుచున్నను శ్రీరాముఁడు వానిపై మనస్సుపోనీయక నియమించి ప్రాతస్సంధ్యవారిచి సూర్యమండల మధ్యవర్తియగు శ్రీమన్నారాయణుని

చం॥ శిరమును వ్రాల్చి మ్రొక్కి, సిత•చేలముఁ దాలిచి, స్వస్తివాచనా
చరణము దీర్పఁ బంప ద్విజ•సత్తమముఖ్యులఁ, దద్గభీరహృ
ద్యరవము నిండెఁ బట్టను•నం దొగిఁ దూర్యరవానుసారియై;
వరనియతవ్రతంబు నుప•వాసముఁ దీర్చె సతీద్వితీయుఁడై. ౧౫౪

శిరమును వ్రాల్చి మ్రొక్కి = ఉపస్థానాంతమున సాష్టాంగముగ నమస్క రించి, సితచేలముదాలిచి=తెల్లని పట్టువస్త్రము ధరించి, (నూతనవస్త్రము ధరించి యనుటచే శ్రీరాముఁ డపుడు చేసినది గౌణస్నానమని యేర్పడుచున్నది. మధ్యా హ్నమున వారుణస్నానము నియతము) స్వస్తివాచనాచరణము=స్వస్తి వాచ నము సలుపుట, తత్=ఆబ్రాహ్మణుల, గంభీర=గంభీరమై, హృద్య=హృదయ మునకింపైన, రవము=ధ్వని, తూర్యరవానుసారియై=వాద్యధ్వనుల ననుస రించినదై.

ఆపోహిష్ఠాది భిర్మాంత్రం । మృదాలంభస్తుపార్థివమ్
అగ్నేయం భస్మనాస్నానం । వాయవ్యం గోరజస్స్మృతమ్
యత్తుసాతపవర్షేణ । దివ్యంతత్స్నాన ముచ్యతే
వారణం చావగాహస్తు - మానసం హరిచింతనమ్.

ఆపోహిష్ఠాది మంత్రములచేఁ బ్రోక్షించుకొనుట మంత్రస్నానమనఁబడును. కేశవాదినామముల మంత్రములు ధ్యానించుచు నూర్ధ్వపుండ్రములు ధరించుట పార్థివ స్నానమనఁబడును. సంస్కరింపఁబడిన విభూది దేహమునకంతయుఁ బూసికొనుట యాగ్నేయస్నాన మగును. ఇది జడలుధరించిశిరస్స్నానము చేయ లేని కాపాలికాదులు చేయుదురు. సాయంకాలమున నుదయమున నావు లిండ్లకు వచ్చునపుడు పోవునపుడు వానిగిట్టలధూళి గాలికివచ్చి మీఁదఁబడిన వాయవ్య స్నాన మగును. ఎండకాయునపుడు కురియువర్షములోఁ దడిసిన నది దివ్య స్నానము. నీళ్ళలోమునుఁగుట వారుణ స్నానమనఁబడును. ఖస్థితం పుండరీకాక్ష మను మంత్రములతో శ్రీమన్నారాయణుని ధ్యానించుట మానసికస్నానము. పాదములు మొదలు బొడ్డువఱకు నీళ్ళతోఁగడిగి తడివస్త్రముతో దేహము తుడుచు కొనుట కాపిలస్నానము. శిరస్స్నానము చేయలేనివారు ఆకంఠస్నానము చేయ వచ్చును. దానికి శక్తిలేనివారు కాపిలస్నానము చేయవచ్చును తరువాత వారి శక్తికొలఁది యేదైనఁ జేయవచ్చును. ఏదిచేసినను జేయకున్నను వారుణ స్నానము చేసినను మానసస్నానము తప్పక చేయవలయును.

మీఁదఁజెప్పఁబడినవికాక పంచాంగస్నానము రెండుకాళ్ళు రెండుచేతులు ముఖము కడుగుకొనుట బ్రాహ్మస్నానము.

శ్రీమధువైరిన్ శిరమును వ్రాల్చి మ్రొక్కియనుటచే విగ్రహ సన్నిధాన మందు.నీకార్యము జరగెనని యేర్పడుచున్నది. దీనివలన శ్రీరామచంద్ర మూర్తి విగ్రహారాధనపరుఁడని యేర్పడుచున్నది. ఈవిగ్రహము వంశపరం పరగా ఇక్ష్వాకు మొదలుగ వచ్చిన శ్రీరంగనాయకమూర్తియని పురాణాంతర ములు చెప్పుచున్నవి.

గృహంస్మశానం తవబింబవర్జితమ్ । కథావిహీనాశ్చ గిరశ్శివారుతమ్। శ్వపుచ్ఛవద్దాస్య వినాకృతంవపు, ర్వదంతి హిత్వయ్యనివేదితం విషమ్ ॥ శ్రీభాగవతము.

భగవంతుఁడా నీబింబములేనియిల్లు స్మశానము. నీకథలుగాక యుబుసు పోకకై మాటలాడుమాటలు నక్కయూలలు నీదాస్యములేని దేహము కుక్కతోఁక (కుక్కకు తోఁకయుండియు వ్యర్థము. గుదమును మూయుటకుఁగాని యీఁగలు వ్రాలినఁ దోలుటకుఁగాని దేనికిఁ బనికిరాదు) నీకు నివేదింపనియన్నము విషము అని పెద్దలు చెప్పుదురు. అని శ్రీభాగవతమునఁ గలదు.

శ్లో॥ యోమోహా దథ వాలస్యా, ద కృత్వా విష్ణుపూజనమ్
భుంక్తే సయాతి నరకాన్, సూక రేష్వభిజాయతే.

వ్యాసులు : అజ్ఞానముచేఁ గాని సోమరితనముచేఁ గాని విష్ణుపూజ చేయక యెవఁడు భుజించునో వాఁడు నరకములపాలయి పందిగాఁ బుట్టును.

తా త్ప ర్య ము

ధ్యేయస్సదాన విత్రుమండల మధ్యవర్తీనారాయణ-యన్నట్లు సూర్య మండల మధ్యవర్తియగు నారాయణుఁగూర్చి యుపస్థానా నంతరము సాష్టాంగ ముగ నమస్కరించి క్రొత్త తెల్లని పట్టువస్త్రము ధరించి బ్రాహ్మణ ముఖ్యులఁ బిలిపించి స్వస్తివాచనము గావింప నియమించెను. వారల యాగభీరమై యిం పైన ధ్వనియు, పురజనుల తూర్యరవము నొకటై కలిసిపోయెను. ఇట్లుపవాస మును వ్రతమును శ్రీరామచంద్రమూర్తి భార్యతోడఁ దీర్చిన వాఁడని,

కం॥ కౌసల్యతనయుఁ డని సం,తోసంబున నాలకించి ♦ తూర్ణ మయోధ్యా
వాసులు దొరఁకొనిరి పురిం, గై సేయఁగ వేగుఁబోకఁ♦గమనీయముగన్.

తూర్ణము=శీఘ్రముగ, దొరఁకొనిరి=ప్రారంభించిరి.

తా త్ప ర్య ము

అయోధ్యాజనులు విని సంతోషించి శీఘ్రముగ నుదయమందే నగర మలంకరింపఁ బ్రారంభించిరి.

—♦ శ్రీరామపట్టాభిషేకమునకై యయోధ్య యలంకరింపఁబడుట. ♦—

సీ॥ వెలిమబ్బులను బోలి♦వెలయు దేవళములఁ గలితచైత్యముల శృం♦గాటకముల
నట్టాలకంబుల ♦ నఖిలపణ్యసమృద్ధ మైనబేహారుల ♦ యంగడులను
రమణఁ గుటుంబిపూ♦ర్ణంబు లౌసంపత్స, మృద్ధమందిరముల ♦ నెల్లసభల
నాలక్షితోర్వీరు ♦ హంబుల నన్నిట, ధ్వజములఁ జిత్రప ♦ తాకములను

తే॥ నెత్తిరప్పుడు; నటనర్త♦కోత్తములయు,గాయకులయును గానంబు♦కర్ణపర్వ
ముగను వ్యాపించెఁ జిత్తంబు♦సొగయుచుండ.
నీడ నాడన కాపురి♦నెల్లయెడల. ౧౨౬

వెలిమబ్బులను=తెల్లని మేఘములను, చైత్యములన్=విష్ణుగుడులందు, చైత్యద్రుః కేశవాలయు, యని త్రికాండ శేషము- చైత్య మాయతనే బుద్ధ బింబోద్దేశక వృక్షయో, యనియున్నను బుద్ధ ప్రచారమప్పటికిలేదు.బౌద్ధమునకు గౌరవములేదు. కావున నాయర్థము పొసఁగదు. శృంగాటకములన్ = నాలుగు వీధులు కలియు చోటులను, అట్టాలకంబులన్=యుద్ధార్థమై కోటలపైఁగట్టఁబడిన మంటపములందును. దీనినే అట్టళ్ళందురు. అఖిల పణ్యసమృద్ధము=సకలము లైన యమ్ముడు వస్తువులచేత నిండినది,బేహారుల=వర్తకుల.బేహారి శబ్దభవము బేరి- (బేహారము=బేరము) అదిగలవారలు బేహారులు.

కుటుంబి=భార్యలు బిడ్డలుగలవారు, సంపత్=ఐశ్వర్యముచే, సమృద్ధ= వృద్ధిపొందిన, మందిరములన్=ఇండ్లను,సభలన్=జనులు చేరెడుకూటములను.

అలక్షితోర్వీరుహంబులన్ = అన్ని ప్రక్కల నందఱకుఁగానవచ్చు వృక్షములను, కర్ణపర్వము=చెవులపండువు, ఈడన్=ఈయెడన్, ఆయెడన్=అడన్.

తాత్పర్యము

తెల్లనిమబ్బులవలెనుండు దేవాలయములందును, చైత్యములందును, నాలుగు వీథులు కలియుచోటులను అట్టళ్ళయందును, వర్తకుల యంగళ్ళయందును, జనులు చేరుకూటములందును అన్నిప్రక్కల నందఱకుఁ గానవచ్చు చెట్లయందును భార్యలు బిడ్డలు గల కుటుంబుల యిండ్లయందును, పెద్దధ్వజములను పతాకములను నెత్తిరి. నటులు నర్తకులు గాయకులు వీరిపాటలు చెవులపండువై వ్యాపించెను. ఇది రాజవీథులందేకాదు. అన్నిచోటుల సందులందును గొందులను నిట్టియలంకారములే చేయఁబడెను.

ఉ॥ శ్రీరఘురామచంద్రునభి ♦ షేకముఁ జూడఁగఁ జత్వరంబులం
భూరిగృహాంగణంబులను ♦ మూఁగిననారులుఁ బూరుషావళు
ల్ఘోరపువేడ్క మీఱఁ దమ ♦ లోనఁ బరస్పరముం గుతూహల
శ్రీరతి రామచంద్రునభి♦షేకముఁ గూరిచి పెక్కు రీతులన్. ౧౦౪

— చత్వరములు = శృంగాటకములు = నాలుగు వీథులు కలియు చోటులు, భూరి=గొప్పవగు, గృహాంగణములను = ఇండ్లముంగిళ్ళయందు, మూఁగిన = గుంపుగూడిన, ఘోరపువేడ్క=అతిశయించిన సంతోషము.

తాత్పర్యము

శ్రీరామచంద్రు నభిషేకము చూచుటకై నాలుగు వీథులు కలియుచోటులందును పెద్దయిండ్లముంగిళ్ళయందును గుంపులు గూడిన స్త్రీలు పురుషులు నెప్పుడెప్పుడు నభిషిక్తుఁడైన శ్రీరామచంద్రమూర్తినిఁ జూతుమాయని కోరికతో వారిలో వా రనేకవిధములఁ బట్టాభిషేకముగుఱించి ముచ్చటలాడుచుండిరి.

కం॥ ముచ్చటలాడఁగ; బాలురు, ముచ్చట నాడుచును వారి♦ముంగిళ్ళ ముదం
బెచ్చఁగ జిలిబిలిపలుకుల, నచ్చరితమె చెప్పుకొందు♦రనయముఁ దమలోన్,

శ్రీరాముని గుణవిశేషము లెఱింగిన పెద్దవా రాయనను మెచ్చుకొనుట యాయనయందు భక్తిగలవారై యుండుట వింతగాదు. ఆడుకొనుబాలురును వారివారి ముంగిళ్ళయందు నిలిచిసంతోషముతో ముద్దు ముద్దు పలుకులతో వారిలోవారు ఓరి యిప్పొద్దు మన రామునకుఁ బట్టాభిషేకమఁటరా- ముసలిరాజు రాముని యువరాజు చేయునంటరా- ఆయన యూరు మెఱవడి వచ్చునఁట- రామునిఁకై యందఱన్ని పనులు చేయుచున్నారే- మన మేమి చేయుదుమురా- రాముఁడు మంచిరాజురా- మంచిరాజయిన మనకు పప్పులు పెట్టునా అని యిట్లు శ్రీరాముని చరితము పట్టాభిషేకవిషయమే యెప్పుడు చెప్పుకొనుచుండిరి.

సీ॥ పుష్పోపహారముల్ • పుష్కలంబుగ నిచ్చి, ధూపంబు లిడి • గంధధూళి చల్లి
ఘంటాపథంబులు • కడురమ్యములఁ జేసి, యేగుపెండ్లిని రేయి • యేగుదెంచు
నో యనుశంకచే • నున్నతదీపవృక్షంబుల నిరువంక • సర్వమార్గ
ముల నిల్పి కలయుంగ • ముదితచేతస్కులై, గుమిగూడి చత్వర • కూటములను
తే॥ రాముపట్టాభిషేకంబు • రమణఁ గనుదు - మెప్పు డెప్పుడటంచును • నెదురుచూడ
రాముగుణములుగొండాడి • రాజవర్య,
మెచ్చుకొనుచును జనులెల్ల • నిచ్చ మెఱయ. ౧౩౯

ఇఁకఁ బెద్దవారి కృత్యములు చెప్పఁబడుచున్నవి. పుష్పోపహారములు=పూలకానుకలు, పుష్కలంబుగన్=దండిగ, గంధధూళి=గంధపుఁ బొడి, ఘంటాపథంబులు = రాజమార్గములు, ఏగుపెండ్లిని=ఊరేగింపు సమయమందు, దీపవృక్షంబులు=దీపములుంచుటకై చెట్లవలె నేర్పఱుపఁబడినది, ఇరువంక=రెండు పార్శ్వములు, ముదితచేతస్కులై=సంతోషించిన మనస్సుగలవారై, కొండాడి=పొగడి.

తాత్పర్యము.

గృహములందలి దేవాలయము లందలి దేవతలను బూజలచేఁ బూజించి ధూపములిచ్చి (ఆలయములందేకాక యిండ్లయందటను) అగరుచందనము మొదలైన చెక్కల పొగలు గలుగఁజేసి గంధపుఁ జెక్కలపొడి చల్లి (గంధపొడి) పెద్ద రాచ బాటల మిక్కిలి మనోహరముగఁజేసి పట్టాభిషేకము ముగిసి శ్రీరాముఁడు నగరమున నూరేగింపు వచ్చుసమయమున జీఁకటి పడునోయని వెలుతురు నిమిత్తమై యలంకారార్థమై దీపములుంచుటకుగాను వెదుళ్ళతో వృక్షములవలెనన్ని బాటల రెండుప్రక్కలఁగట్టి నిలిపి యాపనులన్నియు ముగియఁగానే య్యందఱు నాలుగు వీథులు కలియుచోట్లను ఇండ్లయందును గుంపులై రామపట్టాభిషేక మెప్పుడు జరుగునా యెపుడు కనులారఁ జూతుమా మనసార నానందింతుమా యని యెదురుచూచుచు రాముని గుణములు పొగడుచు మన దశరథుఁడెంత యుచితజ్ఞుఁడు, కైక తనప్రియురాలైనను ఆమెకొడుకునకు రాజ్యమీయక పెద్దభార్యపట్టపురాణియగు కౌసల్యకొడుకునకే పెద్దకొడుకను ధర్మమనుసరించి యౌవరాజ్యమిచ్చుచున్నాఁడుగదాయని శ్లాఘించుచు సంతోషముతో నుప్పొంగుచుండిరి. దశరథుఁడు తన ప్రియురాలికొడుకునకే రాజ్యమిచ్చునేమో శ్రీరామచంద్రున కీయఁడేమోయను సందేహము ప్రజలను గూడ బాధించుచునే యుండినది. అటుగాక తమకిష్టుఁడైన శ్రీరామునకే దశరథుఁడు రాజ్యమిచ్చెదనన్న వార్త వారి సందేహములనుమాపి సంతోషవంతులఁ జేసెను.

—• పట్టాభిషేకవిషయ జనసంభాషణము •—

సీ॥ అహహ యెంతమహాత్ముఁ • డౌర రాజన్యుండు,
తనకేండ్లుచెల్లుట • దలఁచి తనయు
రామచంద్రుని యువ • రాజుఁ సేయఁగ నెంచి, పట్టాభిషేకంబు • పరఁగఁ జేయు;

రామచంద్రుఁడు మన•రాజు గావుటఁ జేసి,ధన్యులమైతి మం•దఱము మనము;
దృష్టలోకపరావ•రేశుఁ డనుద్ధత, చిత్తుండు ధర్మాత్మ•శేఖరుండు
ఆ॥ భ్రాతృవత్సలుండు•భ్రాతలఁ దానెట్టి,కరుణఁజూచు నట్టి•కరుణ మనలఁ
గాచు నాతఁ డింత•కాలంబునకు జన,రక్షకత్వ మూనె•రాజు కరుణ. ౧౭౦

ప్రజలమాట లీకఁ జెప్పఁబడుచున్నవి.

మహాత్ముఁడు=గొప్పమనస్సుగలవాఁడు, రాజన్యుఁడు=దశరథుఁడు మహారాజు, ఏండ్లు చెల్లుట=వృద్ధుడౌట, దృష్టలోక పరావరేశుఁడు = చూడఁబడిన లోకులందు గొప్పకొలఁదుల నెఱుఁగువాఁడు, అనుద్ధతచిత్తుండు=గర్వములేని మనస్సుగలవాఁడు, ధర్మాత్మశేఖరుండు=ధర్మాత్ములలో శ్రేష్ఠుఁడు, భ్రాతృవత్సలుండు=తమ్ములను బిడ్డలవలెఁ జూచువాఁడు.

తాత్పర్యము

ఆహా దశరథమహారాజెంత గొప్పమనస్సుగలవాఁడు. తాను ముసలివాఁడగుట తానెవరికిఁ బట్టాభిషేకము చేయక మరణించినచోఁ గొడుకులు వారిలో వారు కలహింతురోయని యాలోచించి పెద్దభార్యకొడుకు పెద్దకొడుకునగు శ్రీరామచంద్రుని యువరాజుచేయ నాలోచించి యాయనకే పట్టాభిషేకము చేయుచున్నాఁడు. ఎవఁడు రాజైన మనకేమి యందమా అట్లుగాదు. శ్రీరాముఁడు మనరాజగుటచే మనమందఱము ధన్యులమే. ఎవఁడో రాజైనయెడ వానివారు మాత్రమే బాగుపడుదురు.రాముఁడు రాజైనచో వీరువారనక గొప్పవారు కొలఁదివారనక యందఱు బాగుపడుదురు. అంతఃపురములోనుండు రాజునకు నెవరు గొప్పవారో యెవరల్పులో యెవరు గుణవంతులో యెవరు దుష్టులో యెట్లు తెలియును. దగ్గఱనున్న వాఁరెట్లుచెప్పిన నట్లేకదా.ఆమాత్రమునకు నెవఁడు రాజైన నేమి యనరాదు. ఏలన శ్రీరాముఁడు మనుష్యులముఖము చూడఁగానే వీఁడు గుణవంతుఁడు వీఁడు గుణహీనుఁడని తెలిసికొనఁగలవాఁడు. కావున నాయన కొకరుచెప్పవలసిన పనిలేదు.శ్రీరాముఁడు వీరు కొలఁదివారని గొప్పవారని తెలిసికొనఁగలఁడని యనుకో. దానివలన నేమిలాభము రాజులందు రాజసము పరిపూర్ణము. అట్టివారు మన సుఖదుఃఖములు విందురా యందువేమో. అట్లుగాదు. ఆయన నిగర్వశిరోమణి- గర్వమెట్టిదో యెఱుఁగఁడు. కావున నందఱతోను మాటలాడును. అందఱ సుఖదుఃఖములు విచారించును. ధర్మాత్ములలో శ్రేష్ఠుఁడు కావున ధర్మమును బరిపాలించును. శ్రీరాముఁడు నిర్ధనులైనను ధర్మాత్ములను బరిపాలించును గాని ధనవంతులగు నధర్మాత్ములఁ బాలించువాఁడుగాఁడు. అది నిజమేకాని దాయాదులగు తమ్ములు ముగ్గురున్నారు. వారు తనరాజ్యమాశింతురో యని నేమిబాధించునో,దానివలన వారిలో వారికిఁ గలహములు పుట్టునేమో- అట్లైనచో మాప్రక్కరమ్మని యొకరు మాప్రక్కరమ్మని యొకరు మనలనేకదా బాధింతురు. ఏయొకరిప్రక్కఁబోయినను తక్కిన యందఱకుఁ గోపమే. ఎవరి

ప్రక్కఁ బోకుండుటెట్లు ? కావున మనకష్టము మనకుఁ దప్పినదికాదందువేమో. అట్లు సందేహింపఁ గారణములేదు. ఏలన శ్రీరాముఁడు భ్రాతృవత్సలుఁడు. తమ్ములను బిడ్డలవలె నాదరించువాఁడు. అంతేకాదు తనసొంత తమ్ముల నెట్టు లాదరించునో యట్టి కరుణచే మనలను నాదరించును.ఇట్టివాఁ డింతకాలమునకు రాజుదయచేత మనకు రాజగుచున్నాఁడు.

కం॥ ఎవనిప్రసాదంబున మన, యవనికి శ్రీరామచంద్రుఁ • డగు రాజగ నా
   యవనిపాలుఁడు దశరథుఁ, డవనిన్ సుఖియించుఁగాత•మాయుర్వృద్ధిన్.

ప్రసాదంబునన్=అనుగ్రహముచే, అవనికి=భూమికి, ఆయుర్వృద్ధిన్ = ఆయుస్సు వృద్ధియగుటచే, గాత+ఆయుర్వృద్ధిన్=ఆశీరర్థకంబులైన ఎడు-త- వర్ణంబులకు నచ్చుపరంబగునపుడు ముగాగమంబగు సు.వ్యా.సం.సూ.క్రియ.

తాత్పర్యము 33.

ఇట్టి శ్రీరాముఁ డెవనిదయచే భూమికి రాజుగానున్నాఁడో యట్టి దశరథుఁడు దీర్ఘాయుష్మంతుఁడై జీవించి సుఖించునుగాక.

మ॥ అని పౌరుల్ దమలోన నాడుకొన న•త్యంతప్రమోదంబునన్
   వినుటన్ జానపదాళి మున్దినము త•ద్వృత్తాంతము, న్గుంపులై
   చనుదేర న్నలుప్రక్క నుండి జనిత • స్వానంబు రోదోంతరం
   బున నిండం బరి పర్వకాలజలధిం • బోలెన్ రవోదీర్ణమై. ౧౬.

పౌరుల్=పురజనులు, ఆడుకొనన్=మాటలాడుకొనఁగా, అత్యంత ప్రమోదంబునన్=మిక్కిలి సంతోషముతో, జానపదాళి=జనపదములయందుఁగల జన సమూహము, జనితస్వానంబు = పుట్టినధ్వని, రోదోంతరంబు = ఆకాశమునకు భూమికి నడుమఁగల భాగము, పర్వకాల జలధిన్ = పున్నమనాఁటి సముద్రమును, రవోదీర్ణమై=ధ్వనిచేత నతిశయించినదై, నలుప్రక్క = అచ్ఛద్విగు సమాసము గావున నేకవచనము.

తాత్పర్యము

అని మీఁదఁ జెప్పినప్రకారము పురజనులు సంతోషముతో మాటలాడు కొనుచుండఁగా ముందుదినమందే పల్లెలవారు మిక్కిలి సంతోషముతో నీవార్త విన్నవారై గుంపులు గుంపులుగా నాలుగుప్రక్కలనుండి వచ్చుచుండ నాధ్వని భూమికి నాకాశమునకు నడిమి యంతరాళము నిండెను. ఆజనుల ధ్వని పున్నమనాఁడు సముద్రము ఘోషించునట్లుండెను.

చంద్రుఁడు సముద్రుని కొడుకగుటచే పున్నమనాఁడతని యభ్యుదయము చూచి సంతోషముచే సముద్రము పొంగునని కవిసమయము.

చం॥ అమరపురీనిభం బయిన • యప్పురి మప్పుడు వేడ్కఁ జూచు పెం
   దమకము మీఱ మూఁక లయి • తద్దయుఁ జేరుమనుష్యకోటిరా

వము గలయుంగఁ బర్వుడు న॰వారణవారిచరావళీపరి
భ్రమణమహార్భటీరటద॰పాంపతిచందముగాఁగ భాసిలెన్. ౧౬౩

అపురపురీనిభంబు = దేవతానగరమగు నమరావతితో సమానము. పెంద మకము=పెనుతమకము = అతిశయించుకోరిక, రావము = ధ్వని, అవారణ = అడ్డములేని,వారి చరావళీ=జలమునందు సంచరించు జంతువుల సమూహముల యొక్క, పరిభ్రమణ=విస్తారమగు సంచారముచేఁ గలిగిన, మహార్భటీ=గొప్ప ధ్వనిచేత, రటత్ = ధ్వనించు, అపాంపతి = సముద్రము.

అపాంపతి - షష్ఠి అలుక్సమాసము; అలుక్సమాస విధాయక సూత్రమున బహుళగ్రహణముచే నీరూప మేర్పడిన దని యసురసుధాకారుఁడు వ్రాసి యున్నాఁడు శ్రియఃపతి శబ్దము నిట్టిదే.

తా త్ప ర్య ము

దేవనగరముతో సమానమైన యానగరమప్పుడు వేడుకఁ జూచుటకై మిక్కిలి కోరికతోఁ గుమిగూడిన మనుష్యుల గుంపులధ్వని నాలుగు ప్రక్కల వ్యాపింపఁగా విచ్చలవిడిగా జలచరములు సంచరించుటచే నతిశయించిన ధ్వని గల సముద్రమును బోలియుండెను.

—• ౭-వ సర్గము. మంథర యయోధ్యాలంకారముఁ జూచుట. •—

ఉ॥ ఏకడఁ బుట్టెనో, పితరు॰లెవ్వరో, యేరు నెఱుంగనట్టిదై
కైకకు బంధుదాసి యయి॰కర్జము దీర్చుచుఁ బొట్టకూటికై
కైకను బాయ కుండెడు నొ॰కానొక మంథర దాఁ దటాలునన్
బ్రాకటశీతదీధితిని॰భం బగుహర్మ్యము నెక్కి వేడుకన్. ౧౬౪

శీతదీధితినిభంబు=చంద్రునితో సమానము. అనఁగాఁ దెల్లని, హర్మ్యంబు = మేడ.

ఏప్రయోజనముగోరి లక్ష్మీనారాయణులు సీతారాములుగ భూమిపై నవత రించిరో యాప్రయోజనము దీర్చుటకు సదుపాయ కల్పనము పూర్వాంగ మీ పద్యముతోఁ బ్రారంభమగుచున్నది.అవతార ప్రయోజనములు సాధారణముగ మూఁడు. శిష్టరక్షణము, దుష్టశిక్షణము, ధర్మసంస్థాపనము. శ్రీరాముఁడు రాజై పట్టాభిషేకము చేసికొని యయోధ్యయందుఁ గూర్చుండిన నీప్రయోజనములు పూర్ణముగఁ గొనసాగనేరవు.

రావణవధ మాలోచింతము. పతివ్రతలఁ జెనకిన దోషమునకు ఫలము వంశనాశమను నీతిబోధింప రావణు సర్వసహాయులతో నాశము చేయవలసి యున్నది. ఏమి నెపము పెట్టి యట్లుచేయును? ఋషులప్రార్థనపై లవణాసురుఁ జంపినట్లు చంపియుండవచ్చునుగదా యనిన లవణాసురుఁ డొంటరిగాఁ డగుటచే వాని నొక్కఁడే చంప సాధ్యపడెను.రావణవధ మట్టిదిగాదు.సర్వరాక్షస నాశము తోడ రావణవధ కావలసియున్నది. అది మనుష్య సేనలచే నగునదికాదు.దానికి

సుగ్రీవ సాహాయ్య మావశ్యకము. సమానదశయందుండువారికి సఖ్యము కుదురును గాని ప్రభువునకు భ్రష్టునకు సఖ్యము కుదురదు. విరాధకబంధ- ఖర వాలీత్యాదుల నేదో నెపమునఁ జంపఁ గలిగినను, తన దర్శనమునఁ గృతార్థులు గాఁగోరిన శరభంగ సుతీక్ష్ణాది ఋషీశ్వరుల కేదో నెపమున దర్శన మిచ్చినను, జటాయు శబరుల ముక్తులఁ జేయుటకుఁగాని హనుమద్విభీషణాదుల నేలుటకుఁ గాని శరణాగతి ధర్మస్థాపనమునకుఁగాని భృగు శాపానుభవమునకుఁగాని కారణము పొసఁగియుండదు. బుద్ధుఁడు సన్న్యాసియై యతఁడు చేయఁగలిగిన కార్యముచేయ సమర్థుడయ్యెనుగాని రాజైయుండిన నాకార్యము చేసియుండఁ జాలఁడు. అట్టులే శ్రీరాముఁడును రాజై యుండినయెడల వనముల నాయన చేసిన కార్యములను సకారణముగఁ జేసియుండఁజాలఁడు. ఆయనయు సీతా లక్ష్మణ భరతులయు మహత్త్వ మాహాత్మ్యములు లోకమెఱింగియుండదు. వారి చర్యలవలన లోకము నేర్చుకొనవలసినదియు నేదియుండదు. ధర్మముల నాచరణముచేఁ జూపఁదలఁచిన యాయనయుద్దేశము నెఱవేఱియుండదు. కావునఁ బట్టాభిషేక విఘ్నము లోక హితార్థ మవశ్యము జరుగవలసినకార్యమే. మహాత్ములు స్వసుఖానుభవముసకై జనించెడి వారుగారు. వారు శ్రమించి లోకులకు మార్గదర్శకులై హితరీతి వర్తించి జగము నుద్ధరింపఁ దలంపుగలవారు.

తాత్పర్యము

ఏదేశమందుఁబుట్టెనో తల్లిదండ్రులెవ్వరో యెవ్వరు నెఱుంగక కైకకుఁ బుట్టినింట బంధువులయొద్ద దాసిగా నుండి కడుపుకూటి నిమిత్తమై కైక సేవ చేయు మంథరయను యొకానొకదాసి యదాటునఁ జంద్రమండలముతో సమానమైన మేడయెక్కెను.

మంథరయను కుబ్జ=ఇది కైకేయి పుట్టినింట నామె బంధువులయొద్ద నుండి కైకేయి యయోధ్యకు వచ్చినపు డామెతోడవచ్చెను.దీని పూర్వవృత్తాంత మెవ్వరెఱుంగరు. రావణవధము కోరినదేవతలు శ్రీరాముని పట్టాభిషేకము విఘ్నపఱుచుటకై దీనియందావేశించిరని కొందఱందురు. కొందఱు దేవతలోక దేవతాస్త్రీనే యీకార్యమునకై పుట్టించి యీవిధముగఁ గైకయొద్దఁ జేర్చిరనియు నా రహస్యము బయలుపెట్టరాకుండుటచే కవి ఏకడఁ బుట్టెనో తల్లిదండ్రు లెవ్వరో యెఱుఁగరానిదని రహస్యవాక్కులఁ జెప్పెననియు నందురు. ఏకడఁ బుట్టెనో యనుటచే నిది యయోధ్యయందుఁ బుట్టినది కాదనియు నయోధ్యయం దిట్టి దుష్టస్త్రీలు పుట్టరనియుఁ గవి హృదయము. యుద్ధకాండము ౧౨౩-౧-వ పద్యము చూడుఁడు. దానివలన నిది దేవతలు పన్నిన పన్నాగమని తెలియుచున్నది.

భార. అర. పర్వమున "బ్రహ్మదుందుభియను గంధర్విని బిలిచి నీవు కుబ్జవై పుట్టి దేవకార్యము నిర్వహింపుమని చెప్పినట్లున్నది.ఆధ్యాత్మరామాయణమందు దేవతల ప్రార్థనచే సరస్వతి మంథరాకైకల నోరనుండి పలికెనని యున్నది.

ఒక+ఒక = ఒకానొక, దీనికి వ్యాకరణమునఁ బ్రత్యేక సూత్రములేదు. సిద్ధము గ్రాహ్యము. ఒకానొక శబ్దమునకు నొకానొక శబ్దము పరంబగునపుడొరా నొక రూపంబగు ననుటయే సూత్రము.

చం॥ జిమజిమ లాడువీథులును, • జిత్రముగా వెదచల్లఁబడ్డపు
ష్పములు, దలంటుకొన్న జన • సంఘముఁ, గల్వడముల్, ధ్వజాళి, హ
స్తములను మాల్యమోదవిక • తానముఁదాల్చి చరించులోకపూ
గములును, శుభ్రదేవగృహ • కాండములున్, హితవాద్య ఘోషముల్. ౧౬౩

జిమ జిమ లాడు=నీటితోఁ దడుపుటచే బురదగానుండు, కల్వడములు= దండలు, మాల్యమోదకవితానము=పూలసరములయు లడ్డువములు మొదలగు పిండివంటలయు సమూహము, లోకపూగము=జనసమూహము, శుభ్ర = తెల్లనైన, దేవగృహకాండములు = దేవాలయ సమూహములు, హితవాద్య ఘోషముల్ = మంగళవాద్య ధ్వనులు.

## తాత్పర్యము

మంథర కైకమేడ యెక్కిచూచునపుడు అయోధ్యయున్నస్థితి కవి వర్ణించుచున్నాఁడు.

దుమ్మొగురకుండ నీళ్లదండిగఁ జల్లఁబడుటచే వీథులు జిమజిమ లాడుచుండెను. వినోదముగ నానావర్ణముల పూవులు, వెదచల్లఁబడియుండెను. అందఱు నభ్యంగన స్నానము చేసియుండిరి. తోరణములకుఁ బూలదండలు వ్రేలాడ వేయఁబడియుండెను. ఇంటింటిమీఁద ధ్వజపటము లెగురుచుండెను. శ్రీరామచంద్రునకుఁ గానుకలిచ్చుటకై జనులు పూలసరములు లడ్డువాలు మొదలగు పిండివంటలు చేతులందు ధరించి తీసికొనిపోవుచుండిరి. దేవాలయములన్నియు సున్నపుఁ బూఁతలచేఁ దెల్లనై ప్రకాశించుచుండెను. ఎందుఁ జూచినను మంగళవాద్యములు ఘోషించుచుండెను.

ఱేపు పట్టాభిషేకమనఁగా నీదినము సాయంకాలమున మంథర యిది యంతయుఁ జూచెను. శ్రీరామపట్టాభిషేకవార్త నగరమంతయుఁ దెలిసినను దశరథుఁడు కైకకు దానుస్వయముగఁ జెప్పఁదలఁచినవాఁడై యామెకు నెవరు చెప్పకుండఁ జేసెను. పరులెవ్వరైనఁ జెప్పిన నామెమునస్సున నేమి వికారము చెంది యేవిఘ్నము కల్పించునో యని సందేహము.

చం॥ కెరలఁ బ్రహృష్టసర్వజన • కీర్ణము, బ్రహ్మరవాభినాదితం,
బురుతరహృష్టహస్తితుర • గోత్కర, ముక్తనినాదపూర్ణమై,
కరము పరిష్కృతం బగుచుఁ • గాలునయోధ్యను గాంచి లోన న
బ్బురపడి క్షామవాసినిఁ బ్ర • ఫుల్లవిలోచన దాది నొక్కతన్. ౧౬౪

అయోధ్యానగరమున విశేషము లింకను చెప్పఁబడుచున్నవి.

ప్రహృష్టజనకీర్ణము=సంతోషముతోఁగూడిన సమస్త జనులచే వ్యాపించినది, బ్రహ్మరవాభినాదితంబు=బ్రాహ్మణుల యాశీర్వాదధ్వనులు గలది, ఉరుతరహృష్టహస్తి తురగోత్కరము=మిక్కిలి గొప్పగాసంతోషించిన యేనుఁగులు గుఱ్ఱములు వీని సమూహము గలది, ఉక్షనినాదపూర్ణము=ఎద్దుల అంకెలచే నిండినది- దీనిచే శ్రీరామ పట్టాభిషేకమునకుఁ దిర్యగ్జంతువులుగూడ సంతోషించె నని భావము, భరము=మిక్కిలి, పరిష్కృతము=అలంకరింపఁబడినది, క్షౌమవాసినిన్ = తెల్లనిపట్టువస్త్రము ధరించినదానిని, ప్రఫుల్లవిలోచన=వికాసము నొందిన కన్నులుగలది.

మిక్కిలి సంతోషముతోఁగూడిన సమస్తజనులచే వ్యాపించినదియు బ్రాహ్మణాశీర్వాదములతో నిండినదియు సంతోషముచేధ్వనించు నేనుఁగులు గుఱ్ఱములు అంకెలువేయు నెద్దులుగలదియు మిక్కిలి యలంకరింపఁబడినదియునైన యయోధ్యా నగరముఁజూచి యాశ్చర్యపడి శ్రీరాముని పట్టాభిషేకము తన కొడుకుపెండ్లివలె భావించి తెల్లని పట్టువస్త్రముచే నలంకరించుకొని సంతోషముచే వికాసమునొందిన కన్నులుగల యొకదాదిని.

ఉ॥ చేరువఁ గాంచి యిట్లనియెఁ • జెప్పుమ యర్థపరాత్మ యయ్యుఁ బెం
పారుముదంబునన్ జనుల • కర్థము లిచ్చెడు రాముమాత, యే
లా? రమణీ! పురంబు బహు•శ ప్రమదాకులలోక మయ్యె! భూ
మీరమణుం డొనర్చెడినొ • మేలిశుభం బెదియేని ధాత్రికా!     ౧౬౪

చేరువన్=సమీపమందు, అర్థపరాత్మ=ధనమునం దాసక్తిగల మనస్సు గలది- అనఁగాఁ జాలినంతధనము లేనిది- కైకకుభయపడిదశరథుఁడు కౌసల్యకు ధనమేమియు నిచ్చుటలేదు. ఆమె పుట్టినింటి వారిచ్చిన గ్రామములమీఁద నాధారపడియున్నది. 2) లోభి- ఇది ద్వేషబాహుళ్యముచేఁ జెప్పుమాట, ప్రమదాకులలోకము=అతిశయించిన సంతోషముచే నుప్పొంగు జనులకోలాహలముగలది, రాముమాత=కౌసల్యయనుటకుఁగూడ దాని మనస్సొప్పినది కాదు, ధాత్రిక=దాది

తాత్పర్యము

సమీపమందుఁజూచి యోసిదాదీ నిజము చెప్పుము రామునితల్లి తనకే చాలినంత ధనములేనిస్థితిలో నుండియు ఆకారణముచే పిసినియయ్యు సంతోషముతో లోకులకు ధనమిచ్చుచున్నది. ఏమికారణము? నగరమంతయు మిక్కిలి సంతోషముచే నుప్పొంగుజనులచే నల్లకల్లోలముగ నున్నది. రాజేమైన గొప్ప శుభకార్యము చేయుచున్నాఁడా ?

తే॥ పొంగిపొరలుముదాన నుప్పొంగుమేన,
ధాత్రి యిట్లనెఁ గుబ్జకు • ధరణినాథుఁ
డెల్లి పుష్యమునందు జి • తేంద్రియాఢ్యుఁ,
డైనరాముని యువరాజుఁగా నొనర్చు.     ౧౬౫

జితేంద్రియాగ్ర్యుఁడు = ఇంద్రియ జయముగలవారిలో శ్రేష్ఠుఁడు, ఇంద్రియజయమను సంపదగలవాఁడు. ఇట్లనుటచే యౌవరాజ్యమును శ్రీరాముఁడు తానై కోరినదికాదనియు దశరథుఁడే బలవంతముగా నియ్యఁబూనెననియు భావము. జితేంద్రియుఁడని చెప్పుటచే శ్రీరామునకు రాజ్యభరణయోగ్యత కలదని భావము.

తాత్పర్యము

ఇట్లు మంథరయడుగఁగాఁ గల్లకపటముగాని మంథరకుఁగల విషమబుద్ధిగాని యెఱుఁగని యాదాది సంతోషముపొంగి లోపల నిముడక వెలుపలికి పొరలివచ్చుచుండఁగా దేహ ముప్పొంగుచుండఁగా నాకుబ్జతో ఱేపుదయము పుష్యనక్షత్రమున దశరథుఁడు జితేంద్రియుఁడగు శ్రీరామునకు యౌవరాజ్యపట్టాభిషేకము చేయునని చెప్పెను. కుబ్జ కుంటిది గాన నెక్కడకుఁబోవునదికాదు. దాది సమబుద్ధి కావున కౌసల్యయింటికి రాకపోకలుఁగలది కావున నిది యెఱింగెను.

కం॥ ఆపల్కులు చెవిఁ బడఁ గడుఁ, గోపంబున మండిపడుచుఁ • గుబ్జయుఁ గైలా
సోపమసౌధము డిగి చని, పాపపుమతి ననియె హాయి • వండినకైకన్. ౧౬౯

కైలాసోపమసౌధము=కైలాసమునకు సమానమైనమేడ. మేడ తెల్లనిదై మిగుల నెత్తైనదగుటచే వెండికొండవంటిదని చెప్పఁబడెను. కైలాసము దిగెనని చెప్పుటచే దానికి పుణ్యలోకమునుండి నధఃపతనము సూచితము. దానికిఁ గారణము పాపపుమతి. ఉద్దేశార్థమున ద్వితీయ.

తాత్పర్యము

శ్రీరామునకుఁ బట్టాభిషేకమని చెవినిబడెనో లేదో రామునికా రామునికా పట్టాభిషేకమని కోపమున మండిపడుచు కైలాసమువలె నెత్తై తెల్లనైయున్న మేడదిగి బిఱబిఱపోయి సుఖముగఁ బండుకొనియుండిన కైకతో నిట్లనియె.

—• మంథర కైకేయికి శ్రీరామపట్టాభిషేకవార్తఁ దెలిపి దుఃఖించుట •—

సీ॥ లేలెమ్ము మూఢాత్మ • రాలఃకొంప మునింగెఁ, దెలియవు విపదబ్ధిఁ • దీర మునిఁగి
భర్తయొల్లనిదాన! • పరమదుర్భగ! వృథా, సౌభాగ్యవతి నని • చాటుకొనెదు
మండువేసవి నేట • నుండుజలం బన, నీదుసౌభాగ్యంబు • నేలఁ గలయు
క్ష్మాకాంతుఁ డెప్పుడు • నాకుఁ గైవస మని, విఱ్ఱవీఁగెద విసీ • వెఱ్ఱి వగుచు
తే॥ ననుచుఁ దనుఁ గోపపరుషోక్తు • లాడుపాప,
దర్శనినిగాంచికడువిషా • దమునఁ గుంది
కైక యిట్లను నేడ్చెడు • కరటి దీన, వదన వై తేల యిపుడేమి • వచ్చెఁ జేటు?

విపదబ్ధిన్=ఆపదయను సముద్రమందు, తీరన్=పూర్ణముగ, పరమ దుర్భగ =మిక్కిలి నిర్భాగ్యురాలా! సౌభాగ్యవతి=సుందరి-అదృష్టవతి, క్ష్మాకాంతుఁడు= రాజు, కైవసము = స్వాధీనము.

తాత్పర్యము

ఓసీ బుద్ధిలేనిదానా? లేవేలేవే మునింగెనేకొంప- ఆపత్సముద్రములోఁ బూర్ణముగ మునింగికూడ హాయిగాఁ బండుకొన్నదానవేమే. భర్త కిష్టము లేనిదానా? నిర్భాగ్యురాలా! నేను సౌభాగ్యవతిని నేనుసౌభాగ్యవతి నని వ్యర్థముగా దండోరా నీకు నీవేకొట్టుకొనెదవే. అఁ! యీనాఁడు నీసౌభాగ్యమంతయు మండెడు నెండలవేళ నేటి నీటివలె నేలఁగల సెనులే. రాజు నాస్వాధీనమందున్నాఁడు. నేనెట్టాడించిన నట్టాడును అని విఱ్ఱవీఁగెదవే. ఎంతవెఱ్ఱిదానవే. అని యీప్రకారము తన్నుఁ గోపముతోఁ గఠినవాక్యము లాడుచున్న పాపపుటాలోచనగల మంథరను జూచి మిక్కిలి వ్యసనపడి "యేమిటికే యిట్టులేడ్చెడుదానివలె మొగము వ్రేలవేసితివి. ఏమిచేటుకాలము వచ్చెనేనీకు.

చం॥ అని మధురోక్తిఁ గైక యన • నానుడికారపుఁ బ్రౌఢ రక్తలో
చన యయి కేకయాత్మజకు • శర్మము రాఘవు వేలుపాటునుం
దనమదిఁ గోరి యశ్రువులఁ • దద్దయుఁ గార్చుచు నామె కిట్లనున్
వనిత! భవద్వినాశ మిదె • వర్తిలుచున్నది తప్ప దేమిటన్. ౧౭౧

మధురోక్తిన్=తియ్యనిమాటలచే, నుడికారపుఁబ్రౌఢ=చమత్కారపుమాటలయందు సమర్థురాలు, రక్తలోచన=కోపముచే నెఱ్ఱనికన్నులుగలది, కోపకారణము రామపట్టాభిషేకము శర్మము=మేలు, అశ్రువులన్=కన్నీళ్ళను.

తాత్పర్యము

అని తియ్యనిమాటలచేఁ గైక యడుగఁగా సమయమునకుఁ దగినట్లు చమత్కారముగ మాటలాడుటయందు నారితేఱిన యామంథర కోపముచేఁ గన్నులెఱ్ఱచేసి కైకకు (నప్పటికి) శుభము, శ్రీరామునకు వేలుపాటు గలుగఁగోరి, కన్నీళ్ళు కార్చుచుఁ గైకతో నిట్లనియె. రాణీ! నీవెలుఁగపుకాని నీవు చెడిపోవు కాలము జరగుచున్నది. ఇది తప్పునదికాదు. గంటలకొలఁదికాలములోనే- దినములకొలఁది కూడఁగాదు- నీకుఁ గీడు మూఁడఁగలదు.

ఉ॥ రాముని నీమగండె యువ•రాజు నొనర్చెడి నంట యెల్లి, యో
చామరో! దీని వింట భృశ•సాధ్వసశోకపరీతచిత్తనై
హా మెయి నిప్పులం బొరలి నట్లయినన్ సయిరింప లేక నీ
సేమము గోరుదాన నయి • చెచ్చెర వచ్చితి నీకుఁ దెల్పఁగన్. ౧౭౨

ఎల్లి=రేపు, భృశ=అధికమైన, సాధ్వస=భయము, శోక=దుఃఖము, వీనిచేత- పరీత=చుట్టఁబడిన, చిత్తనై=మనస్సుగలదాననై, మెయి = దేహము, చామ=శ్యామా శబ్దభవము- 'శ్యామా యౌవనమధ్యస్థా' యని-నడిమి యౌవనమందుండునది.

తాత్పర్యము

ఓసీ! వయస్సుపొగరున నీమేలు గీళ్ళు నీవేయెఱుఁగనిదానా! నామగఁడు నామగఁడని యెవ్వనిఁజూచి పొంగుచుందువో యట్టినీమగఁడే-మఱియెవ్వఁడో కాఁడు జెపే- ఎన్నాళ్ళకోకాదు-నీసవతికొడుకును రాముఁడే-మఱియెవ్వనినోకాదు-యువరాజు చేయునఁట- ఈవార్త వినఁగానే నాకుఁ, బట్టరానిభయముచే శోకముచేఁగలవరపడిన మనస్సుగలదాననై నిప్పులలోఁబడి పొరలిన ట్లయి,దేహము తపింపఁగా నీక్షేమము గోరుదాననగుటచే నీకీవార్తతెల్పఁ ద్వరగా వచ్చితిని.

ఆ॥ నీకు దుఃఖ మొదవ • నా కతిదుఃఖ మౌ, నీకు వృద్ధి గలుగ • నాకు వృద్ధి
సందియంబు లేదు • యిందీవరాక్షిరో, యీయెడాటమందు • నెఱుఁగ వినుము.

ఎడాటము = విషయము.

తాత్పర్యము

శ్రీరామునకుఁ బట్టాభిషేకమై యది యొకవేళ నాకుఁ గీడుకలిగించునది యయ్యెనేని దాసివగు నీకు వచ్చినచేటేమి? నీవేల యేడ్చెదవందువా నీకు దుఃఖము గలిగెనా నాకు మిక్కిలి దుఃఖమగును. నీవు బాగుంటివా నేను మిగుల బాగుందును. నా యోగుబాగులు నీయోగుబాగులఁబట్టి యున్నవి. ఇందు సందేహములేదు. కాఁబట్టి నాక్షేమము నిమిత్తమై నీక్షేమము నేను గోరవలసి యున్నది. ఈవిషయమున సందేహము లేదు.

ఉ॥ పుట్టితి వీవు పేరుగల • భూపతివంశమునందు జేనికిం
బట్టపుదేవి వైతి విట • భామిని! నీ విటు లయ్యు నిస్సి యీ
మట్టు నెఱుంగ లేవ, యిఁక • మాటల నేమగు? రాజధర్మమున్
గుట్టు నెంత క్రూర మెదఁ • గోమలిరో! తలపోయ లేవుగా. ౧౬౪

నీవు పేరుపెంపుగల రాజవంశమందుఁ బుట్టితివి. ఇచ్చటనా రాజునకుఁ బట్టపుదేవివైతివి. (పట్టము గట్టుకొనకపోయినను బట్టపుదేవికి జరగవలసిన గౌరవములు నీకేజరగుచున్నవి. కావున వాస్తవపుఁ బట్టపుదేవివినీవే. కౌసల్యనామకార్థము) ఇట్లు పుట్టినచోటఁ జొచ్చినచోట నెంతో పూజ్యస్థితియందుండియు నీ యింతమాత్రమెఱుంగలేకయున్నావు. ఇఁక నీకేమి చెప్పి యేమి ప్రయోజనము నీవు నామాట వినఁబోవునదిలేదు. నీవు బాగుపడఁబోవునదిలేదు.రాజవంశమునఁ బుట్టియు రాజధర్మము రాజుల రహస్యము లెంత క్రూరములో యాలోచింపలేక యున్నావుగదా. దాసి రాణినింతచులకనగా మాటలాడవచ్చునా? యని సందేహము; ఇది యధమ జనులందు లోకసిద్ధము. ఎదుటివారికిఁ దెలయునిదానిని దాము దెలిసి గొప్పసాహాయ్యముచేయుచున్నా మనునహంకారము దీనికిఁ గారణము.

చం॥ పలుకులు ధర్మయుక్తములె, • భావము నా కతిదారుణంబు, యు
గళ్మి! పువుఁదేనెలం జిలుకు • మాటలు కంఠముమీఁదనుండియే.

తెలియక మోసపోయితివి ♦ దేవి! విభున్ ఋజుమార్గవర్తిఁగాఁ
దలఁచి; తదీయదుష్ఫలము ♦ తార్కొనెనిన్నివు డింతఘోరమై. ౧౮౫

ఋజుమార్గవర్తి = చక్కని నడవడిగలవాఁడు.

తాత్పర్యము

రాజధర్మ మంతక్రూరమా యందువేమో! చెప్పెద విను. రాజనీతి వేశ్యానీతి సమానములు రాజుల మాటలుమాత్రము ధర్మశాస్త్రమనుసరించియే యుండును. మనస్సో మిక్కిలిభయంకరమై క్రూరకార్యములు చేయుటయందు యాసక్తమైయుండును. పువ్వుఁదేనియలవంటి మిగులఁ దియ్యనైన మాటలు కంఠము పైభాగమునుండి వచ్చునేకాని హృదయమునుండి రావు. కావున హృదయవిధము నొకటి మాటలతీరు వేఱొకటి. ఇది తెలియక దశరథుఁడు మనస్సు వాక్కు నేకవిధముగాఁగల చక్కటి నడవడిగలవాఁడని నమ్మి మోసపోయితివి. ఆ నమ్మినదోషమే యిప్పుడు నిన్ను నింతభయంకరమై ముంచుచున్నది.

కం॥ అచ్చికబుచ్చికగా నీ,మెచ్చులకై వగలువడుచు ♦ మేదకు నటులై
యిచ్చట ననర్థకంబుగ, నచ్చటఁ గౌసల్య కిడెడి ♦ నైశ్వర్యంబుల్. ౧౮౬

మేదకు నటులై =ఏమితెలియనివానివలె నణఁగినవాఁడై.

తాత్పర్యము

రాజునకు హృదయము వాక్కు నొక్కరీతిగ లేదని నీకెట్లు తెలియునందువేమో. ఇక్కడ నీవు మెచ్చుకొనుటకై నంగినంగి యల్లిబిల్లివగలమారిమాటలేమియు దోషమెఱుంగని యంతేవవలె, నీయందే ప్రాణములన్నియు నిలిపిన ప్రియునివలె, మాటలాడుచు నీకుఁ కీడుకలుగునట్లు ఐశ్వర్యమును నీసవతికిఁ గౌసల్యకిచ్చుచున్నాఁడు. నీ విషయమున మాటలలోఁ జూపిన ప్రీతి హృదయముననుండిన నీమగఁడు నీకుఁ గీడుకలుగునటు లిటులుచేయునా? మాటలతో నీవు సంతోషింపుము. సిరితో కౌసల్య సంతోషించును.

కం॥ చుట్టంబులఁ జూడఁగ నను, నొ ట్టొక్కటిపెట్టి నీదు ♦ సుతు దూరముగా
నెట్టి తనపెద్దపెం డ్లము,పట్టిని నృపుఁ జేయు జేవ ♦ పతి దుష్టమతిన్. ౧౮౭

నొట్టు = నెపము, నెట్టి = వెడలఁగొట్టి.

తాత్పర్యము

పెద్ద కొడుకునకుఁ బట్టాభిషేకముచేయుట న్యాయ్యమైన కార్యమేగదా. అందు దుష్టబుద్ధియేమున్నదందువేమో. ఎంతదురాలోచనము దూరాలోచనము చేసి నీమగఁడీపని చేయ సాహసించెనో నీవూహింపలేవు.నీకొడుకు భరతుఁడిచ్చటనుండిన వానికి రాజ్యము కావలెనని నీవడుగుదువేమో ఎదురుగానున్నప్పుడియ్యననిన నీవు నిష్ఠురపడెదవేమో యని యాలోచించి నిన్ను మోసగించుటకై చుట్టలను జూచుటయను నొక నెపముపెట్టి నీకొడుకును దూరముగా నెట్టివేసి వాఁడు

లేనిసమయముచూచి తన నిక్కపు ప్రియురాలగు పెద్దపెండ్లము ముద్దుకొడుకునకుఁ బట్టము జేపేగట్టు దురాలోచనము చేసెను.

మా యన్న వచ్చి పిలిచినఁగదా నాకొడుకును బంపెను. అందు రాజుదోషమేమున్నది యందువా- దురాలోచనము దూరాలోచనము లేదేని యిన్నిసంవత్సరము లందేల యుంచవలె నీకొడుకునందుఁ బ్రీతిగల వాఁడైనచో సంవత్సరమో యాఱునెలలో యుంచక యించుమించు పండ్రెండుసంవత్సరము లుంచునా? శ్రీరాముని నిన్నాళ్ళెడఁబాసి యుండఁగలఁడా? భరతునందుఁ బ్రీతిలేదు గనుకనేపోయినవాఁ డట్టులే పోనీలే యని యూరకున్నాఁడు. ఆయన యుపాయము తెలిసికొనలేక నీవూరకయున్నావు దురాలోచనలేదేని యందఱ కొడుకుల దగ్గఱనుంచుకొని యీపని యేలచేయరాదు. బంధువుల నందఱ నేలపిలిపింపరాదు. ఈ ప్రొద్దనుకొని జేపే చేయునంతతొందర యేమివచ్చినది. పండ్రెండేండ్లయిన భరతుఁడు మరలివచ్చును. రామునకుఁ బట్టాభిషేకముచేయ సాధ్యపడదనియేకదా పుట్టిమునిఁగినట్లింత తొందర. ఇదియంతయు నాలోచించిన రాజు దుష్టమతిగాఁడా.

కం॥ పతి యనునెపమున నరి యని,మతి నెఱుఁగక మూఢురాల॰మాతవలె సదా
హితవగుచు మరగి తహి న,మ్మతిఁ దొడ లాలించుకుమతి॰మాఢ్కిమహీశున్.

అరి = శత్రువు, అహి = పాపము. ౧౬౧

తాత్పర్యము

మగఁడనుపేరుగల పగవాఁడని యెఱుఁగక బుద్ధిలేనిదానా! తొడమీఁదఁ బామునుంచుకొని పాలుపోసి పెంచు దుర్బుద్ధివలె నీవు తల్లివలె హితబుద్ధిగల దానవై-రాజునందుఁ బ్రేమగలదానవైతివి.

కం॥ అలంబు సేయ శత్రు,వ్యాలంబు ల వెట్లుసేయు॰నప్పరుసున నో
బేలా! దశరథుఁ డిప్పుడు, వాలాయము నిన్ను సాత్మ॰భవ నటు సేసెన్.

ఆలంబు=ఉపేక్ష, 'అలంబాలంబు చేసి' యని తిక్కన వ్యాలంబు=పాము, అప్పరుసునన్=అవిధముగ, సాత్మభవన్=కుమారునితోఁగూడిన దానిని.

తాత్పర్యము

ఉపేక్షించిన పక్షమున శత్రువులు పాము లెట్లు సేయునో యావిధమున నోమూఢురాలా దశరథుఁడిప్పుడు నిన్ను నీకొడుకుతోడ తప్పకచేసెను.

కం॥ బాలా! పరిచితచిరసుఖ,జాలా! పాపియును నన్ృత॰సాంత్వుం డగుభూ
పాలుఁడు రాముని రాజుగ, నేలకుఁ జేయంగఁ జెడరె॰నీవును జుట్టల్.౧౬౨

బాలా = ఏండ్లుగలదానవయ్యు బుద్ధియందుఁ బిల్లదానా! పరిచిత చిరసుఖజాలా=దీర్ఘకాలముగ నభ్యసింపఁబడిన సుఖసమూహముగలదానా, అన్నృతసాంత్వుఁడు=అబద్ధపు టుపచారములు గలవాఁడు, చుట్టల్=చుట్టములు.

తాత్పర్యము

చిన్నదానా! కావుననే తెలివిలేనిదానా! నీవు చిరకాలముగ సుఖము లనుభవించినదానవే పాపాత్ముఁడు మోసపు టుపచారముగల రాజు రామునకు బట్టాభిషేకముచేసెనా నీవు నీబంధువులుకూడఁ జెడిపోరా! ఇన్నాళ్ళుభోగముల నోలలాడినదాన వింకమీఁద నెట్లు దుఃఖముల మునిఁగి యుండఁగలవు.

చం॥ చతురవు విన్ము విస్మయవి•శాలవిలోచన! నాదుపల్కు నీ
సుతు నిను నన్నుఁ గావ నొక • చొప్పు తలంపుము, నీకు మే లెదో
హితగతి దానిఁ జేయఁగ ని•దే సమయంబు సుమా, ప్రమాదవు
న్మతిఁ జెడిపోకు పోకు మని•మంథర యీగతిఁ దీవరింపఁగన్. ౧౯

చతురవు=కార్యము నెఱవేర్చు బుద్ధిచాతుర్యము గలదానవు. ఆయాకాలమునకుఁ దగిన యాలోచన చేయునేర్పుగలదానవు, విస్మయ విశాల విలోచన = ఆశ్చర్యకరములై విశాలములైన కన్నులు గలదానా, ప్రమాదవున్మతిన్=ఇచట స్థిరవర్ణము పరమైనను నుగాగమము_ ఉ గరువ వున్మరువు. బాల_వ్యా॥

తాత్పర్యము

ఇంతసేపు నిందించి కార్యసాధన మాలోచించి యిపుడు మంథర కైకను పొగడుచున్నది. దేవీ! నీవేదో ప్రమాదవశమున నాలోచింపని దానవైతివేకాని స్వభావమున నాయీ కాలమునకుఁ దగిన యాలోచనచేయ నేర్పుగలదానవు. చేసిన యాలోచన కొనసాగించు సామర్థ్యము గలదానవు. ఈ కార్యములందు నీబుద్ధిబలముతోడను సామర్థ్యముతోడను బనిలేదు. ఎట్టివారినైన నాశ్చర్యపడఁజేయు నీనేత్ర సౌందర్యమే యెట్టిపనియైనఁ జేయఁగలదు. కావున నామాట వినుము ముఖ్యముగా నీకుమారుని నిన్ను నన్ను రక్షించుటకొక యుపాయము వెదకుము. నీకు మేలైనకార్యము చేయుటకుఁదగిన సమయమిదే. ఇదితప్పఁగొట్టితివా_ నీకు మేలులేదు. పొరపాటుపడవలదు సుమా యని మంథర కైకను దీవరించెను.

—• పట్టాభిషేకవార్తఁ జెప్పినమంథరకుఁ గైక పారితోషిక మిచ్చుట. •—

కం॥ ఆలలితవదన మంథర,యాలాపము లాలకించి•యతిహర్షమునన్
వే లేచెను శారదనిశ, లీలం బొడతెంచుచంద్ర•లేఖయ పోలెన్. ౨౦

లలితవదన = అందమైన ముఖముగలది, శారదనిశన్=శరత్కాలరాత్రియందు, పొడతెంచు=ఉదయించు, లేఖా రేఖా శబ్దములు రెండునుగలవు.

తాత్పర్యము

సహజసుందరమై యిపుడు సంతోషముచే మఱింత వికాసము నొందిన ముఖముగల కైక మంథర చెప్పిన మాటలువిని మిగుల సంతోషించి శరత్కాలరాత్రియం దుదయించు చంద్రకలవలెఁ బండుకొన్నది లేచి కూర్చుండెను.

శా॥ ఆనందంబున మేను పొంగఁ బరమం•బౌవిస్మయం బారఁగా
మేనం దాల్చినమేలిభూషణముఁ గొ•మ్మీ యంచు నొం డిచ్చి యే
డీనేత్రామణి కుబ్జ కిట్టు లనియెన్•ని న్మెచ్చితిన్ మంథరా!
దీనిన్ నా పరమప్రియంబుఁ దొలుతం•దెల్పంగ నీ వూనుటన్. ౧౮౩

తాత్పర్యము

కైక గొప్పరాజవంశమునఁ బుట్టినదైనను సాత్త్వికురాలుగాదు. ఈమెను గూర్చి భరతుఁడు భరద్వాజునితో "ఉ॥ ఏపె మహాపరాధము మునీశ్వర ప్రాణము మీఁదఁ దెచ్చెని। ష్పాపుల కన్నదమ్ములకుఁ బార్థివు స్వర్గతుఁజేసె నట్టిదొ। పాపిని మూఢచిత్త ఖల భామిని నిష్ఠురశీల శాఠ్య సంప్రాపిత భోగదుష్ట భగమానిని కైకయి యిద్దియేసుమీ" అయోధ్య ౭౧౧౮- గీ॥ ఆర్యరూపిణియైన యదయ పాపనిశ్చయ అని చెప్పెను. అయో. ౭౧౧౯. ఇవి కోపముచేఁ జెప్పినమాటలని యందమా యనిన భరతుఁడే తన్నుఁ బిలువవచ్చిన దూతలతో 'ఆత్మకామ సదా చండి యతులకోప శీలయును ప్రాజ్ఞ మానిని చెనఁటి నాదుతల్లికే వ్యాధిలేదు కదా? యని ప్రశ్నించెను, అయో ౧౭౨౮. ఈ కారణముచేఁ గైక సహజముగ సాధుమతియని పూర్వవ్యాఖ్యాతలు చెప్పినట్లుచెప్ప వలనుపడలేదు. అట్లుండినను శ్రీరామచంద్రుఁడు తన గుణములచే దశరథుకరుణకుఁ బాత్రుఁడైనట్టు కైకేయి సదభిప్రాయమునకుఁ బాత్రుఁడయ్యెను. ఇది శ్రీరాముని సౌజన్యాతిశయ బలమును దెలుపుచున్నదిగాని కైకేయి సాధుత్వమును దెలుపదు. కావున మంథర చెప్పిన వాక్యములు వినఁగానే కైక సంతోషముచే దేహముప్పొంగఁగా నత్యద్భుతమై తనకిష్టమైనవార్త తటాలున వినుటచే మిక్కిలి యాశ్చర్యపడి తాను దేహమున ధరించిన యాభరణములలో శ్రేష్ఠమైన దాని నొకటిదీసి సంతోషవార్త చెప్పినవారికి బహుమతి యిచ్చుటమర్యాద గావునఁ దీసికొమ్మని మంథరకిచ్చి నాకు మిక్కిలి ప్రియమైన వార్త మొట్టమొదట నీవు చెప్పుటచే నిన్ను మెచ్చుకొంటిని.

కం॥ ఇంతటికడుప్రియ మగువృ,త్తాంతము నెఱిఁగించునీకుఁ•దగురీతిగ నే
నింతకు నేమి యొనర్తునొ, చింతన మొనరించి నాకుఁ•జెప్పుము కుబ్జా.

ఇంతటి కడుప్రియము=ఇంతటి మిక్కిలి ప్రియము. ఇది సమాసము కావున పరుషము సరళముగాలేదు."ఆంధ్రంషడ్వర్ణ పర్యంతం సంస్కృతేన సమస్యతే"

తాత్పర్యము

నాకు మిక్కిలి ప్రియమైనవార్త తెలిపిన నీకుఁదగిన రీతిగ నేనేమిప్రత్యుపకారము చేయవలయునో నీవేయాలోచించి నాకుఁ దెలుపుము.ఇప్పుడిచ్చినది చాలదనియు నింతకు నెక్కువ బహుమానమునకుఁ దగుదువనియు నెఱుంగుదును.

కం॥ రామునకు భరతునకును, నేమాత్రము భేదమెఱఁగ • నేనటుగానన్
భూమీశుఁడు పట్టంబును, రామునకుం గట్ట మనసు•రంజిల కున్నే. ౧౮౫

తాత్పర్యము

సవతికొడుకు పట్టాభిషేకము నీకెట్లు ప్రియమయ్యెనందువేమో- నా కుప చారము చేయు విషయమున భరతునకుఁ రామునకు నేను భేదమెఱుఁగను. రామునకుఁ బట్టాభిషేకమగుట నాకొడుకున కయినట్లని సంతోషింతును.

కం॥ తరమా నీకిల నింతకుఁ, బరమాహ్లాదం బొసంగు•పలుకుం బలుకన్?
బర మయి దీనిని మించిన,వర మెయ్యది గోరుకొనెదు•పచియింపుమనన్.

ఇంతకంటె నాకెక్కువ సంతోషము గలిగించువార్త చెప్ప నీకు శక్యము గాదు. కాఁబట్టి యిప్పుడిచ్చినదానికంటె శ్రేష్ఠమైనదానిని గోరుకొనుము.

—• ౮-వ సర్గము. మంథర కైకను దూషించుట. •—

కం॥ కోపము దుఃఖము మదికిని, దాపం బిడ నీసుకలిమిఁ•దటుకున సొమ్మున్
వేపాఱవైచి మంథర, భూపాలకసతిని జూచి,•పొక్కుచుఁ బలికెన్. ౧౮౭

తాత్పర్యము

అని కైకచెప్పినమాటలు వినఁగానే కైక తనమాట పాటింపదయ్యెనని కోపము, రాఁబోవు కష్టదశ దలంచి దుఃఖము, తనమనస్సునకుఁ బరితాపము కలిగింపఁగా కైక యిచ్చినసొమ్ము నావల విసరిపాఱవైచి దుఃఖపడుచు నామెతో నిట్టు లనెను.

ఉ॥ బాలిశురాల! సంతసము•పాటున కా యిది వేళ? శోకకీ
లాలధిమధ్యసీమను మె•లంగుచు నిన్ దెలియంగ లేవ, యా
భీలమహావిపత్తు కడు•బెట్టిదమై యిటు దాపరించిన
న్మేలని సంతసించు నిను•నే నెటు సవ్వక కాళఁ జాలెదన్? ౧౮౮

బాలిశురాలా=మూర్ఖురాలా, సంతసము పాటునకా=సంతోషముపడుటకా- సంతసంపాటు; దూ, సంతసపాటు-సంతసముఃపాటు - పద్వాదులు పరంబగు నపుడు మువర్ణకమునకు లోపపూర్ణబిందువులు విభాషనగు- సు. వ్యా. సంధి. సూ.౬౯. శోకకీలాలధి=శోకసముద్రము-కీలాలము (1) నెత్తురు. (2)జలము. మధ్యసీమను=నడిమిప్రదేశమున-ఆభీల=భయంకరమైన.

తాత్పర్యము

చెప్పినను దెలిసికొననేరని మూర్ఖురాలా! ఇది సంతోషసమయమా? శోక మను సముద్రము నడుమ మునుఁగుటకు సిద్ధముగానుండియు నీదశ నీవు తెలిసికోలేక యున్నదానవు-భయంకరమై గొప్పయాపద యీవిధముగా దాప రించినను దానిని మేలని యెంచు నిన్నుఁజూచి నీవు రాణివి నేను దాసిని. నిన్నుఁజూచి నవ్వరాదని యెంత యణఁచుకొన్నను నిలుపలేక యున్నదానను.

ఉ॥ నీ తెలివింతలేమికిని•నేవగతున్, సహజారి యౌసవ
త్నీతనుజాతువృద్ధి, పయిఁ•బ్రెక్కొనిన మృత్యువుమాడ్కి నిట్లు సం

జాతముదంబునం గెరలఁ•జాలునె ప్రాజ్ఞయు? దీని నేమిగాఁ
జేతమునం దలంచితివి•చెప్పుము నీకు వివేక ముండినన్? ౧౮

సహజారి=పుట్టువు చేతనే శత్రువు-సపత్ని=సవతియొక్క, తనూజాతు=కొడుకుయొక్క, ప్రాజ్ఞ=ప్రజ్ఞగలది-చేతము-చేతస్సు-రూపాంతరము.

స్మృతి ర్వ్యతీతవిషయా, మతిరాగామి గోచరా, బుద్ధిస్తాత్కాలి కీజ్ఞేయా, ప్రజ్ఞాత్రైకాలికీమతా: గడచిన విషయము మనస్సునకు గోచరించుట స్మృతి యనియు; రాఁబోవు విషయము గోచరించిన మతియనియు. తత్కాల విషయము తెలిసికొనునది బుద్ధి యనియు మూఁడు కాలములందలివి యెఱుఁగునది ప్రజ్ఞయనియుఁ జెప్పఁబడును.

తాత్పర్యము

కైక: నీసవతికొడుకు రాజుగానున్నాఁడని నాకంత వగపులేదు. నీకొడుకునకు రాజ్యము లేదాయెఁగదా భ్రష్టుఁడగును అని నాకు వగపులేదుగాని రాచకూఁతురవగు నీకి మాత్రమైనఁ దెలివిలేదయ్యెఁగదాయని మిక్కిలి వగచుచున్నాను. పుట్టువుచేతనే పగవాఁడగు సవతికొడుకువృద్ధి మృత్యుదేవతవలె వచ్చి కుత్తుక బిగించి పట్టుకొన్నవేళ వివేకముగలది యెవ్వతె సంతోషించును? నీకుఁ దెలివి తేటలుండిన రామపట్టాభిషేకమును గుఱించి నీవేమి యెంచితివో చెప్పుము. నాకుఁ దెలియదనెదవా నేను జెప్పెద వినుము.

తే॥ రాజ్య ముమ్మడిసొమ్మౌట•రామునకును,
ప్రాణభయసంశయంబుండు•భరతువలన
భయముపడువానివలననే•భయము గలుగు,
నింత దలపోసిసవిషాద•హృద•హృదయనైతి. ౧౯

ఉమ్మడిసొమ్ము=పొత్తులసొమ్ము-స్వమ్ము శబ్దభవము సొమ్ము.

తాత్పర్యము

రాజ్యము పొత్తులసొమ్ము-రామునకు మన భరతునకు నిరువురకు నిందు భాగము గలదు. ఒకసొత్తిరువురదైనపు డొకరిని జంపి మరియొకరు పూర్ణముగ ననుభవింప వలయునను కోరికయుండుట లోకమున సహజము. అకారణముచే రామునకు భరతునివలనఁ బ్రాణభయము గలదు. రాముఁడు చచ్చిన రాజ్యమంతయు భరతునిదే. కావున భరతుఁడు తనకపాయము చేయునను సందేహముతో శ్రీరాముఁడు భరతునకుఁ గీడుచేయును. కావున భయపడువాని వలననే భయపెట్టువానికి భయము గలదు. ఇది యాలోచించుకొలఁది రాముఁడు రాజయ్యేనేని భరతుని నెపుడు చంపునో యని భరతునివిషయమున విషాదము కలుగుచున్నది. మనుష్యులు పాములను దేళ్ళను బాధింతురు గావున నవి మనుష్యులను బాధించును.

కం॥ రామునిఁ ద్రికరణశుద్ధిగ, సౌమిత్రి భజించు చుండు•సంతత మతివా!
రాముని లక్ష్మణురీతిని, సామంబునఁ గొలుచు భరతు•శత్రుఘ్నుండున్.

తాత్పర్యము

లక్ష్మణ శత్రుఘ్నులు గలరుకదా, వారును దాయాదులే యందువేమో వారి యిరువురందు మనోవాక్కాయముల నిష్కల్మషముగ లక్ష్మణుఁడు రాముని సేవించునట్లు శత్రుఘ్నుఁడు భరతుని సేవించుచున్నాఁడు.

కం॥ జననక్రమమాలోచిం,చిన భరతుఁడె దాపువాఁడు•చెలి! సౌమిత్రుల్
వెనుకటివా రగుదురు గా,వున రాజ్యక్రమము వారు•పొందెద రవలన్. ౧౯౨

తాత్పర్యము

వీరంద అన్నదమ్ములు పుట్టిన వరుస నాలోచించినచో రాముఁడు మొదటి వాఁడు రెండవవాఁడు భరతుఁడు. ఆవలఁ బుట్టినవారు లక్ష్మణ శత్రుఘ్నులు- కావున రాముని యనంతరము రాజ్యము భరతునిదే కాని లక్ష్మణునిది కాదు. కావున లక్ష్మణునివలన రామునకు భయములేదు. పాపపు మంథర శ్రీరాముఁ డనదు.

చం॥ కరము వివేకశాలియును•క్షాత్రకళాకుశలుండు, నిండునే
ర్పరి,సమయోచితార్థముల•బాగుగఁ దీర్చెడిక్షిప్రకారియున్,
ధరణిసుతామనోహరుఁడు•తా,నటుగావున నీదుపుత్రకు
న్భరతుఁ దలంచినం గడు వ•ణంకెడి మే నిదె చూడు మానినీ! ౧౯౩

తాత్పర్యము

క్షాత్రకలాకుశలుండు = క్షత్రియధర్మమందు నేర్పరి- క్షిప్రకారి=వెంట వెంటనే పనిచేయువాఁడు-మానినీ=మానముగలదానా! ఇంతవఱకు నీవుమానము గలదానవని నాయభిప్రాయము. అగునోకాదో యిపుడు తెలియవలసియున్నది (అవమానవేళ స్త్రీలకు వచ్చుకోపమునకు మానమనిపేరు.

తాత్పర్యము

రాముఁడు సామాన్యుఁడని నీవు తలఁచితివేమో. ఆయన కార్యాకార్యము లందు పట్టువిడుపులు తాఁకుతప్పులు చక్కఁగాఁదెలిసినవాఁడు. అట్టులని "వీరు బ్రాహ్మణులే యెకిడైన సైరింపఁగన్' అన్నట్టు లెల్లవేళ క్షమయే తాల్చియుండు వాడుఁ రాజనీతియందు ససమర్థుఁడు.ఏకార్యమునైనను బూనెనామరలఁగొఱత లేక నిశ్శేషముగఁజేయు నేరుపుకలవాఁడు సమయమునకుఁ దగిన పనిని సోమరి తనములేక యప్పుడే చేయువాఁడు ఇటువంటివాఁడు కావున నీముద్దుకుమారుని భరతుని దలఁచినపుడెల్ల నేవేళకేమి మూఁడునోయని దేహము వణఁకుచున్నది. ఇప్పుడు నాదేహముచూడు మెట్లు వణఁకుచున్నదో.

కం॥ మానంబె తొడవు సతులకు।మానమె ప్రాణాధికంబు మానమఖిల సమ్మాన
ములకు మూలంబగు।మానరహితమయిన బ్రదుకు మానినికేలా"పారిజాత.

అని యుండుటచే నీవు మానవతివో మానహీనవో తెలియవలసియున్నది. మానహీనయగుటకంటెఁ బ్రాణహీనయగుట స్త్రీకి గౌరవము.

ఆ॥ ఎంతపుణ్యవతియొ•యింతిరో కౌసల్య, తేపు పుష్యమందు•తేఁను తనదు
పుత్రు యౌవరాజ్య•మున నభిషిక్తుఁ జే,యింప ద్విజులచేత•నెలమిఁగ నెడి.

తాత్పర్యము

అహా! కౌసల్య యెంతపుణ్యాత్మురా లెంతపుణ్యాత్మురాలు!! ఉదయము కాఁగానే పుష్యనక్షత్రమున రాజు తనకుమారుని బ్రాహ్మణులచే యౌవరాజ్యమందు నభిషిక్తుఁజేయింపఁగా నెంతో సంతోషింపనుగదా, ఏమి యామె యదృష్టము. ఏమి యామె కడుపుచలువ. తల్లియనినఁ గౌసల్య తల్లిగాని యందఱు తల్లులా!

చం॥ సిరియును బ్రీతి కీర్తియును•జెన్నలరన్ సవతాండ్రు గుంపఁగాఁ
గెరలెడికోసలాత్మజకుఁ•గ్రిందయి చేతులు మోడ్చి దీనవై
వరవుడ మోపి చేయుచును•వర్తిలు చుందువు మమ్ముఁ గూడి, నీ
భరతుఁడు ప్రేష్యభావమున•బాధపడున్ రఘురాముఁ గొల్చుచున్. ౧౯౨

సవతాండ్రు=సవతులగు స్త్రీలు-అండ్రుశబ్దము-స్త్రీలను నర్థముగలది. జవరాలు, బాలెంతరాలు, వలె. సవతి+ఆలు.సవతాలికిఁ బతివలచిన నని భారత ప్రయోగము. ఏమ్యాదులలోఁ జేరుటచే నిత్యసంధి. కర్మధారయంబులందును దంతములమీఁద రుగాగమము బహుళముగావున సవతు+ఆలు=సవతాలయిన దనియైనఁ జెప్పవచ్చును. వరవుడము=దాస్యము-"వరవుడ మోపి చేయుదునో వారికి నీవెయెఱుంగఁ జెప్పుమా" ఉద్యోగ. ప్రేష్యభావము=బంటుతనము.

తాత్పర్యము

కౌసల్యాదేవి తనకొడుకు రాజ్యమేలఁగా ముదుసలిరాజును దనచేతి క్రింద వైచుకొని సంపదసంతోషము సత్కీర్తి యతిశయింపఁగా సవతులెల్లఁ దన మహోన్నత పదవిఁజూచి దుఃఖమునఁ గ్రుళ్ళుచుండఁగా విజృంభించిన కౌసల్యకు నీవు లొంగి లొంగి చేతులుమోడ్చి దీనవై మాతోపాటు నీవు నొకతవై యామె కనుసన్నలు మెలఁగుచు దాస్యము చేయుచుందువు ఇఁక నీకొడుకో చేతులుకట్టుకొని దాసుఁడై రాముని సేవచేయుచుఁ గష్టపడుచుండును. నీవీ సమయము తప్పఁగొట్టితివా నీగతి యిట్టులగును.

కం॥ సంతసమున రామస్త్రీ, సంతతి ద్రుళ్ళంగ, భరతు•క్షయమున మదిలో
సంతాపింతురు నీస్నుష, లెంతో చింతింపు దీని•కెయ్యది తెరువో. ౧౯౩

రామస్త్రీ సంతతి=రాముని భార్యయు నామెయంతఃపుర పరిచారికలు, ఆమెకుఁగావలసినవారు. త్రుళ్ళంగన్=సంతోషములోఁ ద్రుళ్ళిపడుచుండఁగా, భరతు క్షయమునన్=భరతుని హీనదశవలన, నీస్నుషలు=నీకోడండ్రు,మాండవీ శ్రుతకీర్తులు, అనఁగా నీకోడలు నీకోడలి పరిచారికలు ఆమెకుఁగావలసినవారు. మహారాజు బిడ్డలు-పిల్లలు-సుఖము గోరువారు నీనిమిత్తమున దాసిక లగుదురు

శ్రీరామచంద్రమూర్తి యేకపత్నీకుఁడను విషయము పూర్వపీఠిక యందుఁ జర్చితము.

—• మంథరకుఁ గైక శ్రీరాముని గుణములు వర్ణించి చెప్పుట. •—

కం॥ ఈమాడ్కిఁ బ్రీతి లేకను, నామంథరవాక్యవితతి•నాలించి రఘు
గ్రామణిరాముని గుణముల, భామిని యద్దాసితోడఁ•బలుకం దొడఁగెన్. ౧౬౩

ఈ మాడ్కిన్=ఈవిధముగా, లేకను=లేక+అను=లేక వచించునట్టి ఆల కించి=విని, రఘుగ్రామణి=రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడగు.

తాత్పర్యము

ఈవిధముగా శ్రీరామునందుఁ బ్రీతిలేక పలుకుచున్న యామంథర వాక్యములను విని రఘువంశమునఁ బుట్టిన రాజులయందఱిలో శ్రేష్ఠుఁ డగుశ్రీరామచంద్రుని గుణములిది గ్రహింపలేక పోయెఁగదా ఇది యెంతటి పెడకట్టియని తలఁచి కైక శ్రీరాముని గుణములను మంథరకు బోధింప సాగెను.

పూర్వము శ్రీరాముని గుణములకు దశరథుఁడు ప్రీతుఁడైన విధము చెప్పఁబడెను. ఇప్పుడాయన గుణములకు సవతితల్లి కైకయుఁ బ్రీతురాలయిన విషయము చెప్పఁబడుచున్నది. దీనివలన నిర్మలమనస్సు నిష్కల్మషసాధుచరిత్రవలన విరోధబుద్ధిగలవారైనను వశపడుదురని యేర్పడుచున్నది.

కం॥ మఱవఁడు మేల్, శుచినిజ మేమఱఁడున్, దాంతుండు, గురుల•మతిశిక్షితుఁడున్
మఱి రాజు జ్యేష్ఠపుత్త్రుఁడు, నెఱి గాదే యౌవరాజ్య•నిష్ఠితుఁ డగుటన్? ౧౬౪

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి తనకొరులు చేసిన మేలు మఱచువాఁడు కాఁడు. స్త్రీల విషయమున ధనము విషయమునఁ బరిశుద్ధమైన మనస్సుగలవాఁడు. సత్యము నేమఱఁడు. ఇంద్రియ నిగ్రహముగలవాఁడు. పెద్దలయు నాచార్యులయుఁ దల్లిదండ్రులయు మనస్సు ప్రకారము నడచువాఁడు. ఇవికలవారందఱు రాజ్యార్హులాయందువేమో రాజుయొక్క పెద్దకొడుకు కావున జన్మము చేత కర్మముచేత గుణముచేత యోగ్యుఁడగు వాఁడు రాజ్యమున కర్హుఁడు గాఁడా?

కం॥ రాముఁడు దమ్ముల భృత్యులఁ,
క్షేమంబునఁ దండ్రివోలెఁ•బెంపఁగ నేర్చున్;
రామాభిషేకమును విని, యా మాడ్కిని దుఃఖపడియె•దేటికె కుబ్జా? ౧౬౫

తాత్పర్యము

ఆ గుణములు రామునందు లేవని యయోగ్యుఁడని రాజ్యార్హుఁడు కాఁడని నేను చెప్పలేదు. రాముఁడు రాజ్యమేలునేని నీ కొడుకుగతి యేమియని నేనంటి నందువా, యోసి శ్రీరామచంద్రుఁడు తమ్ములను భృత్యులను తండ్రివలె నెంతో ప్రేమతోఁ బెంపఁగలఁడని నీవెఱుఁగవా. ఇప్పుడట్లు లాదరించుచున్నాఁడు గదా ఇటువంటి గొప్పగుణములు గల శ్రీరామచంద్రుని యభిషేకవార్త వినియును నీవేటికే యేడ్చెదవు కుబ్జా నీదేహమెంత వక్రమో నీ బుద్ధియు నంత వక్రమాయేమి?

కం॥ వత్సరములు నూఱైనను, మత్పుతునకు రాముచెనుక • మహి యబ్బెడి సం
పత్సంతతితో,దీనికిఁ,గుత్సించెదు పై తృకరము • కొమరుఁడు కనఁడే? ౨౦

వత్సరములు=ఏడులు,సంపత్సంతతితో=సమసైశ్వర్యములతో, కుత్సిం
చెదు=నిందించెదవు, పై తృకరము=తండ్రిసంపద.

తా త్ప ర్య ము

శ్రీరాముఁడు నూఱేండ్లు రాజ్యమేలినను ఆయన వెనుక నాకొడుకునకు
సమసైశ్వర్యములతో రాజ్యము లభించును. ఈమాత్రమున కేల నిందించెదు.
తండ్రి సంపద కొడుకునకురాదా.

కైక చెప్పిన యీ వాక్య మామె ప్రాజ్ఞమానిని యని భరతుఁడు చెప్పిన
దానిని స్థిరపఱుచుచున్నది.

జ్ఞానము లేకున్నను జ్ఞానముగల దానివలె వర్తించునది ప్రాజ్ఞమానిని.

కం॥ ప్రాప్తించె శుభము,మీఁదటఁ, బ్రాప్తింపఁగఁ గలదు కులప • రంపరగా సం
తప్తహృదయ వే లయ్యెదు, తృప్తిం గన వలదె న్యాయ • రీతియుఁగనరే

తండ్రి సంపద యిప్పుడు శ్రీరామునకు వచ్చెను. ఆవలఁ బరంపరగా
నాకొడుకునకు వచ్చును. ఈ మాత్రమున కేల యేడ్చెదవే. న్యాయము నీకుఁ
జేఁడా యేమి.

కం॥ భరతుం డెటు మాన్యుఁడొ త,
త్పడిరని రాముండు మాన్య • తరుఁడగు నిచ్చల్
పరిచర్య సలుపు నాకన, వరముగఁ దనతల్లికంటె • వఱలెడిభక్తిన్. ౨౨

అనవరము=మిక్కిలి దక్కువగానిది, పరిచర్య=శుశ్రూష.

తా త్ప ర్య ము

నాచే భరతుఁడెట్లు మన్నింపఁదగినవాఁడో యంతకంటె నెక్కువగనేశ్రీరా
ముఁడు మన్నింపఁదగినవాఁడు. ఏలందువా. తనతల్లి కెట్టి సేవచేయునో
యంతకుఁ దక్కువ లేకుండ భక్తితో నాకును శుశ్రూష చేయుచున్నాఁడు.

కం॥ జనకసుతాపతి రాజై,నను భరతుఁడె రా జటంచు • నందింతుఁ జుమీ!
తనయట్ల చూచుఁ దమ్ముల,వినవే రామునకు లేవు • వేఱెబిబుద్ధుల్. ౨౩

తా త్ప ర్య ము

శ్రీరాముఁడు రాజయ్యెనా భరతుఁడు రాజయినట్లే సంతోషింతును. తన
సుఖమెట్లు చూచుకొనునో తమ్ముల సుఖమునట్టులే చూచును. ఓసి వినుశ్రీరా
మునందు భేదబుద్ధి లేదు.

కం॥ ఇట్టులు కైక వచించిన, నిట్టూర్పుల వేఁడిగాలి • నిగిడించుచు రా
పట్టికి మంథర యనుఁ దన,దిట్టంబగు వనట మదిని • దీటుకొనంగన్. ౨౪

నిట్టూర్పు-నిడు—ఊర్పు=కడు నడు నిడు కుఱుశబ్దంబుల కచ్చపరం
బగునపుడు ద్విరుక్తటకారంబగు. దీర్ఘశ్వాసము, వనట=దుఃఖము.

తా త్ప ర్య ము

అని యీప్రకారము కైక చెప్పఁగా వేడిగాలి నిట్టూర్పు విడుచుచు రాచ కూఁతురగు కైకకు మంథర తన దృఢమైన దుఃఖము మదిలో నతిశయింపఁగా నిట్టులనెను మంథర కైక చెప్పిన తెలివి తక్కువమాట నాధారము చేసికొని యీమె మనస్సును జీకాకు చేయుచున్నది.

—• మంథర కైకకు దుర్బోధము సేయుట. •—

ఉ॥ ఎంతటి మూర్ఖురాలవొ కదే, కన లేవే యనర్థదర్శినీ!
యెంతయుఁ దీర మున్గియు న•హీనతర వ్యసనాబ్ధి, జానకీ
కాంతుఁడు రాజుగాఁ బిదపఁ•గామిని! యాతనిపుత్త్రుఁ డౌను భూ
కాంతుఁడు, నీతనూజునకుఁ•గల్గు నటే ప్రభుతాదిభోగముల్? ౨౦

అనర్థదర్శినీ=కీడుకలుగ నాలోచించుదానా, అహీనతర=మిక్కిలి గొప్ప దగు-వ్యసనాబ్ధిన్=దుఃఖసముద్రమునందు-ప్రభుతాది=ప్రభుత్వము మొదలైన

తా త్ప ర్య ము

కీడుకలుగ నాలోచన చేయుదానా! చెప్పినను దెలిసికొనలేవు నీవెంతటి మూర్ఖురాలవే. వ్యసనసముద్రమందు దీరమునిఁగియు నీకు రాఁగల యాపద తెలిసి కొనలేక యున్నదానవు. రాముఁడు రాజైన పిమ్మట నతని యనంతర మతని కొడుకు రాజగునుగాని నీకొడుకునకు రాజ్యమేరీతి వచ్చునే.

కం॥ ఎందఱు సుతులుండిన జేం,డ్లందఱ రాజ్యమున నునుచు•టనయము గాదే?
నందను నగ్రజు రాజ్యం, బం దుంతురు గడుగుణాఢ్యు•లైనను బిన్నల్.

అనయము=దుర్నీతి, అగ్రజున్=పెద్దవానిని.

తా త్ప ర్య ము

ఒకరాజున కెందఱు సుతులుండిన నందఱను రాజ్యపదవియందుంచుట దుర్నీతి కదా. కావునఁ బెద్దవాఁడు నీతిమంతుఁడైనను గాకున్నను వానికంటెఁ జిన్నవారు నీతిమంతులైనను పెద్దవానినే రాజ్యపరిపాలనమందు రాజులు నియమింతురు.

ఉ॥ కావున బన్నముల్ వడుచు•గాదిలిపుత్త్రుఁ డనాథునట్టిఁ డై
భూవిభుతన్ సుఖంబులను•బోకడబెట్టి శ్రమంపడంగ నే
నేవిధిఁ జూడలేమి నిను•నిట్టులు తొందర పెట్టెదన్, సప
త్నీవిభవాభివృద్ధికయి•నీ విసి కానుక నా కొసంగె దే? ౨౧

బన్నము=భగ్నశబ్దభవము-అవమానము. గాదిలి=ప్రియుఁడైన,అనాథునట్టిఁడు=దిక్కులేని వానివంటివాఁడు, అట్టివాఁడు=అట్టిఁడు,ఎట్టివాఁడు=ఎట్టిఁడు అట్టి-ఇట్టి-ఎట్టి శబ్దంబులకు వాఁడు వారు పరంబులగుచో, వా, కు లోపంబు వైకల్పికంబుగ నగు. సు. వ్యా అచ్ఛిక. సూ. ౪౬ భూవిభుతన్ = భూప్రభుత్వమును-బోకడపెట్టి=పోఁగొట్టుకొని.

తా త్ప ర్య ము

ఈ కారణముచే నీప్రియపుత్రుఁడు దిక్కు లేనివానివలె నవమానపడుచు రాజ్యమును సుఖమును పోఁగొట్టుకొని కష్టపడుచుండ నేను చూడలేక యయ్యో పాపమని నిన్ను నీరీతి తొందరపెట్టుచున్నాను. కైకా సవతికొడుకునకు సంపద యభివృద్ధి యగుచున్నదనియా నాకు నీవు బహుమాన మిచ్చెదవు?

చం॥ కల తెఱఁగు న్వచించెద, న•కంటక రాజ్యము రాముఁ డొంది యా
వల భవదీయపుత్రు వన•వాసిగనో పరలోకవాసినో
చలుపఁ గలండు నమ్ము మిది,•బాల్మతఁ బంపితి బాలుఁ బుత్రకున్
వలనఱి మాతులుం గనునె•పంబున, నింతకు మోస ముండునే? -౨౦-

కలతెఱఁగు=ఉన్నవిధము=వాస్తవము, అకంటక రాజ్యము=శత్రువులు లేని రాజ్యమును-పరలోకవాసిగనో=చచ్చినవానిగనో-బాల్మత = బుద్ధిలేక-వలనఱి=ఉపాయముచెడి-మాతులున్=మేనమామను,మృషాభవము మోస,మోసము

తా త్ప ర్య ము

కైకా! వాస్తవము చెప్పెద వినుము. శత్రురహితరాజ్యమును శ్రీరాముఁడు పొందినవాఁడై నీకొడుకును నడవులపాలై నఁ జేయును. లేదా చంపనైనఁ జంపును. ఇది సత్యమని నమ్ముము. నీవు మతిలేని దానవై యుపాయము నాలోచింపక నీయొంటి కొడుకును, బాలుని, వెనుకముందు తెలియనివానిని, మేనమామను జూచు నెపమున దూరము పంపితివి. ఇంతకంటె మతిమోస ముండునా.

చం॥ చెలఁగును స్థావరంబులను•స్నేహము దాపున నున్నమాత్రనే,
చెలువరో! రాజవర్యునకుఁ•జెప్పెడి దేమిఁకఁ బుత్రులందు, నీ
వల్లనన బోయె నద్దియును, వారక నీసుతుఁ గూర్చుతమ్ముఁడేన్
మెలఁగిన నిందు నొక్కగతి•మే లగు, నయ్యది యైన లేదుగా. -౨౧-

స్థావరములు=వృక్షాదులు.

తా త్ప ర్య ము

కొడుకు కొడుకేకదా భరతుఁడు సమీపమున నున్న నొక్కటి, దూరమున నున్న నొక్కటియా, యెందుండిన నేమి? యందువేమో అట్లనరాదు. వృక్షములుకూడ నొకదానికొకటి సమీపమున నుండెనేని వానికిని స్నేహభావముపుట్టుచున్నది. అట్లుండఁగా రాజునకుఁ గొడుకులందు స్నేహభావము పుట్టుట చెప్ప నేల. నీకొడుకిందుండెనేని రామునందుఁగల ప్రీతి రాజునకు నీకొడుకునందును నుండును అప్పుడు రాజు రాజ్యము వీనికి త్తమా వానికి త్తమా యను నాలోచనయైన గలవాఁడగును. నీవలన నదియునులేక పోయెను. భరతుఁడు లేకుండినఁ బోనీ శత్రుఘ్నుఁడైన నిందుండిన భరతుపక్షము వహించి మాటలాడి యుండుటో వెంటనే భరతునకుఁ దెలుపుటో యేదైనఁ జేసియుండునుగదా.

అట్టులు గాకుండఁ జేసితివి అన్నివిధముల నీకొడుకునోట విషము నీవే పోసితివి. ఇట్టిదానవు నీవు తల్లివా?

కం॥ వినమా కాననసీమల, వనజీవులచేత నఱకి•వైవంబడఁ జా
 లిన తరువులు ముళుపొదరులు,
  పెనఁగొని నికటమున నుంట•వెఱగొనకుంటల్. ౨౧౦

చెలఁగును స్థావరంబులను స్నేహము దాపుననున్న మాత్రమే యను దానిని వివరించి చెప్పుచున్నది.

తాత్పర్యము

జనులచే నఱకఁ బడఁదగిన మ్రాఁకులు దట్టమైన కంపపొదలు చుట్టుకొని యున్న కారణముచే నఱకఁబడకయుండుట నీవు వినలేదా, ఫలవృక్షములచుట్టు కంపలు బలిసియుండెనేని రాలఁ గొట్టినను ఫలములు కంపలలోఁబడును గొట్టి యేమి లాభమని జనులు జాలనైన ఱువ్వరు.

శా॥ రామున్ లక్ష్మణుఁ డెప్పుడేమఱఁడు, శ్రీ•రాముండు సౌమిత్రి గా
 రా మారన్ దయఁ బోచు, నశ్వియుగ సౌ•భ్రాత్రంబు నట్లింతయున్
 శ్యామా! వారల భ్రాతృవత్సలత వి•ఖ్యాతంబు, సౌమిత్రికి
 న్రాముం డెప్పుడుఁ గీడు సేయఁ, డది మా•నం బోదు నీపట్టికిన్. ౨౧౧

అశ్వియుగము=ఇద్దఱు అశ్వినీదేవతలు-సౌభ్రాత్రంబు=మంచి సోదర భావము. అది=కీడు.

తాత్పర్యము

శత్రుఘ్నుఁడుండిన మేలంటివే-వానియన్న లక్ష్మణుఁ డిందేయున్నాఁడుగా యందువేమో. లక్ష్మణుఁడు శ్రీరాముని నొకగడియైన నేమఱియుండు వాఁడుకాఁడు. అట్టులే శ్రీరాముఁడు లక్ష్మణునినెంతో దయతోఁ గాపాడును. అశ్వినీదేవతల సోదరభావ మెట్టిదో రామలక్ష్మణుల సోదరభావ మట్టిది. ఇది లోకప్రసిద్ధము. లక్ష్మణునకు రాముఁడెప్పుడును గీడుచేయఁడు. నీకొడుకునకుఁ జేయక మానఁడు.

ఉ॥ కావున నీదుపుత్రునకుఁ•గార్యము మాతులునింటనుండియే
 తా వనసీమ కేగుటయు,•తద్దయు నీకిది మేలు, రాజుగా
 నీవిభుఁడే భవత్సుతుని•నెమ్మి నొనర్చిన ధర్మరీతి బే
 లా! విను నీదుచుట్టలు చె•లం గెడివారు ప్రహృష్టచిత్తులై. ౨౧౨

ఈకారణముచే నిపుడు నీకొడుకు మేనమామయింటనుండి యట్టులే యిక్కడికి రాక యడవులపాలయిపోవుట క్షేమంకరకార్యము. వచ్చినా చచ్చుట నిజము కావున నట్లుసేయుట నీకును మేలే. రాజ్యము లేకున్నఁ గొడుకైన దక్కును. అటుగాక నీకొడుకే రాజాయెనా ధర్మరీతి నీచుట్టాలెల్లరు నెంతో సంతో తురు.

కం॥ బాలుఁడు నిత్యసుఖోచిత,శీలుఁడు సహజాఽహితుండు•సితేశవ కే
శీల న్విభవచ్యుతుఁ డై, బాలా! రామునకు లొంగి•భరతుఁడు బ్రదుకున్.

నిత్యసుఖోచిత శీలుఁడు=సర్వదాసుఖానుభవ స్వభావముగలవాఁడు-సహజాహితుఁడు=పుట్టువుతోడనే శత్రువైనవాఁడు-విభవచ్యుతుఁడై=సంపద లేని వాఁడై, లొంగి=లోపడి.

తాత్పర్యము

ఏమే! నాకొడుకు వనమునకుఁ బోవునంత దుస్థితి యేమివచ్చెనేయందు వేమో. వచ్చెనోయమ్మా! వచ్చెను. భరతుఁడు చిన్నవయస్సువాఁడు-కావున నెదుటివారి మాయలు మర్మములు తెలియనివాఁడు. ఎప్పుడు సుఖమునకుఁదగిన స్వభావముగలవాఁడు. కాని కష్టజీవిగాఁడు. ఆయనబుద్ధియెఱిఁగి రామునకుఁ జేసిన దోషమేదియు లేదు గాని నీకడుపునఁ బుట్టిన కారణముచే రామునిచే నాగర్భశత్రువుగాఁ దలంపఁబడువాఁడు. ఇట్టివాఁడు సంపదలేనివాఁడై దరిద్రుఁడై రామునకు లోపడి యాయన కూడిగములు చేయుచు నెట్లుబ్రదుకును?

కం॥ అడవిని సింహముబారిం, బడినగజమునట్లు రాము•బారిం బడు నీ
కొడుకు న్మనుమున్న వెసం, గడుకొని కావంగ నర్హ•కార్యము నీకున్.

తాత్పర్యము -౨౯

ఇచ్చటికి వచ్చి రామునకు లొంగి లొంగి వంగి వంగి దండములుపెట్టుచు చెప్పినట్టులెల్ల సేవలుచేయుచున్నను నేనుఁగునకు సింహమునకువలె సహజవిరోధముపోదు. కావున నిచ్చటికి వచ్చెనా సింహముబారికి నేనుఁగువచ్చినట్లే కాఁబట్టి యట్టి యాపదరాకుండ ముందుముందే భరతుని రక్షించుట యతని తల్లి వగు నీకుఁ దగిన కార్యము. భరతునకు రాజ్యము వచ్చునట్లు చేసియైన రక్షింపు. అది నీకిష్టములేదాయెనా యడవులపాలు నగచాట్లపాలు చేసియైన రక్షింపు. ఉసురుండిన నుప్పమ్మి బ్రదుకవచ్చునని యందే యేకాయగసురులు తినియో బ్రదుకును. ఇక్కడికి రానేల తేరకు చావనేల? ప్రాణమంత చేఁదా?

తే॥ నీవు సౌభాగ్యగరిమను•నిక్కివడుచు, గర్వమున ధిక్కరింపవే•పూర్వమందు
సవతి రామునితల్లి, నా•జాణయేల,యక్క సెల్లను నీవయిఁ•గ్రక్కకుండు.

తాత్పర్యము -౩౦

భరతు గతియట్లుండ నీ-ఇఁక నీగతి యాలోచింపు ఇంతకు ముందు దశరథుఁడు నావాఁడని సౌభాగ్యాతిశయముచేఁ బొగరెక్కినిక్కి నీల్గి పెద్దపెండ్లము గదా యే వేళ కెట్లుండునో యని యాలోచింపక. రాముఁడు రాజాయెనా యామె చేయి మీఁద నాచేయి క్రిందగునని యైనయోజింపక, మిడిసిపడి యిప్పుడు రాజుగానున్న రామునితల్లిని నీ సవతిని నవమానించితివిగదా అది యంతయుఁ గౌసల్య మఱచి యిఁక చెల్లెలాయని నిన్నుఁ గట్టుకొని కౌఁగిలించుకొని ముద్దుపెట్టుకొను ననుకొంటివా. ఆమె యాఁడుపామువలెఁ గౌసల్యవిష

మంతయు నీమీఁదఁ గ్రక్కక యుండునా? నవ్వుచుఁ జేసినది యేడ్చుచు నను భవింపవలదా? మాతల్లిని నిది యింత కష్టపెట్టఁగదా యని రాముఁడు తలం పఁడను కొంటివా?

ఉ॥ అర్ణవమేఖలావలయ•మంతయు సాచలపత్తనంబుగాఁ
  దూర్ణము కైవసం బగుడుఁ•దోయజలోచన! నీకుఁ బట్టికిన్
  దుర్ణయవృత్తి రాఘవుఁడు•తోరపుఁగీడు ఘటించు నమ్ముమీ;
  నిర్ణయమిద్ది, దైన్యమును•నీకుఁ బరాభవ మేల తప్పెడిన్? ౨౧౬

అర్ణవమేఖలావలయము=సముద్రమొడ్డాణముగాఁ గల భూచక్రమంత యును-సాచలపత్తనంబుగన్=పర్వతములతో పట్టనములతోఁ గూడినదిగ-తూర్ణ ము=శీఘ్రము-కైవసము=స్వాధీనము-దుర్ణయ వృత్తిన్=చెడ్డ రాజనీతి నను సరించి-తోరపుఁగీడు=గొప్పయపాయము-దైన్యము = దారిద్ర్యము, పరాభ వము=అవమానము.

## తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు చాల మిగుల మంచివాఁడు. నాయందు భక్తిగల వాఁడు.భరతునకంటెఁమిక్కిలి ప్రియుఁడు అని యొత్తియొత్తి చెప్పితివి.నిజమే ఇదంతయు నెంతవఱకు? రాజ్యము తన స్వాధీనమగువఱకు. ఆ నిమిత్తమై వేసిన వేషమిది. అంతియెకాని నిజమైన ప్రీతిగాదు. కావున సముద్ర పర్యంత మైన భూచక్రము కొండలతో నగరములతోఁ దనస్వాధీనము కాఁగానే శ్రీరామ చంద్రుఁడు నీకు, నీ కడుపున బుట్టిన దోషమున నోరెఱుఁగని, భరతునకు గొప్ప ముప్పు కలిగించును. ఇది నిజము. నామాటనమ్ము. పశ్చాత్తాప పడకుము. వెనుకఁ జింతించుట వెఱ్ఱితనము. నీకు దారిద్ర్యము అవమానము తప్పవు.

కం॥ నీసవతికొడుకు రాజ్య,శ్రీసహితుం డైన భరతు•చేటు నిజం బౌ;
  నీసుతుఁడు రాజ్యమేలఁ బ్ర,వాసిగరాముండుగా ను•పాయముఁగనుమీ.

ప్రవాసి=దేశాంతరవాసి.

## తాత్పర్యము

కాఁబట్టి రాముఁడు రాజై యైశ్వర్యవంతుఁడాయెనా నీకొడుకునకు ముప్పు తప్పదు. కాఁబట్టి నీసుతుఁడు రాజ్యమేలునట్లు రాముఁడీ రాజ్యము విడిచి దేశాంతరము బోవునట్లు లాలోచింపుము. అట్లైన మీరిరువురు బాగుపడుదురు.

## ౯-వ సర్గము. కైక మంథరను శ్రీరామపట్టాభిషేకము విఘ్నము సేయ నుపాయ మడుగుట.

చం॥ అనవుఁడుఁ గోపరక్తనయ•నాంబుజ యై, నిడువేఁడి యూరుపుల్
  కొన లిడఁ, గేక యాత్మభవ•కుబ్జఁ గనుంగొని పల్కు, నిప్పుడే

వనములపాలు సేసి రఘు•వర్యుని రాముని, యౌవరాజ్యమం
దనువుగ నిల్పఁ జేసెదను•దొయ్యలి చెప్పెర నాతనూభవున్. ౨౧౮

కోపరక్తనయ నాంబుజ=కోపముచే నెఱ్ఱనైన కమలములవంటి కన్నులుగలది.

కైక స్వభావము చేతనే సాధుహృదయము కలదిగాదు. అయినను శ్రీరామచంద్రుని కల్యాణగుణము లామెగుణములను మఱుఁగు పఱిచి నిప్పును బూడిదతోఁ గప్పినట్లు చేసెను. ఇప్పుడు మంథర చేసిన దుర్బోధనలు పెద్ద గాలికి బూడిద యెగిరిపోవునట్లు చేయఁగా మరలనగ్ని ప్రకాశించునట్టామె సహజ దుర్బుద్ధి ప్రకాశింపసాగెను.

ఆమె యిట్లు లాలోచించెను.రామునకుఁ బట్టాభిషేక మాయెనా రాజమాత యగు కౌసల్య లోకుల చేతను రాజుచేతను సవతులచేతను, పరిచారికల చేతను విశేషించి గౌరవింపఁబడుట నిజము అప్పుడు నన్ను గౌరవించు వారుండరు. కావున జీవింపఁ గోరితినా దాసికలలో నేనొక దాసిని గావలసినదేకదా. ఇన్ని దినములు నాచేఁ బరిభవింపఁబడుచుండినది నాసవతి తన కధికారము వచ్చిన నన్ను గౌరవించునా? తప్పక యవమానించును. ఆ యవమానము నేనెట్లు సహింపఁగలను? సమయజ్ఞుఁడైన శ్రీరామచంద్రుని వినయము శుశ్రూషలోనైనవి కార్యసాధకోపాయములు గావని సత్యములని రాజైనపుడిటులే వర్తించునని యేమి నమ్మకము? ఇదంతయు బూటకముగాదనుట కేమి ప్రమాణము? అని యిట్లు లాలోచించుటచే మనస్సు విఱిగెను. భోజరాజునకైన బోదనలు చెడ్డపని సామెత కలదుగదా? తాత్పర్యము

అని చెప్పఁగాఁ గైక తన సవతికిఁ దన్ను దాసిగాఁజేయ రాజాలోచించెఁ గదాయను కోపముచేఁ కన్నులెఱ్ఱగాఁజేసి దీర్ఘములై వేఁడియైన యూర్పులతిశయించుచుండఁ గుబ్జముఖముఁజూచి యిట్లు చెప్పెను. ఓసి మంథరా యిదిగోఁ జూడుమిపుడే శ్రీరామచంద్రుని నడవులపాలుచేసి యీ నిమిషమందే నాకొడుకునకుఁ బట్టాభిషేకము చేయించెదను.

ఉ॥ ఏవిధినైన రాజ్యపద•హీనునిఁ జేయఁగ రామచంద్రు, గో
త్రావిభుతాతిరేకమున•రాజిలఁ జేయఁగ నాతనూజు, నా
కేవెర వొప్పఁ జెప్పఁ గద•వే సదుపాయ మొకండు మంథరా!
నావుడుఁ బాపకార్యరచ•నాచణ మంథర కైక కిట్లనున్. ౨౧౯

గోత్రావిభుతాతిరేకమునన్=భూమి ప్రభుత్వముయొక్క యతిశయముచే. ఏ వెరవు=ఏయుపాయము - పాపకార్యరచనాచణ = పాపపుఁ బనులు చేయుటయందు చమత్కారము గలది చణశబ్ద భవము జాణ.

తాత్పర్యము

మంథరా! న్యాయ్య మార్గమో యన్యాయమార్గమో యెట్టులో యొకట్లు శ్రీరామచంద్రుఁడు రాజ్యపదవిలేని వానిఁగను నాకొడుకు రాజ్యప్రభుత్వముచే

నతిశయించినవానింగను జేయవలయును. దీనికై మంచి యాలోచనచెప్పుము అని చెప్పఁగా నెగ్గులజాణ యగు కుబ్జ కైకతో నిట్లనియెను.

కైకేయీ మంథరల నడవడి వలనఁ బాపసహవాసమువలన నుభయలోకముల హానిగలదని యేర్పడుచున్నది. సజ్జన సజ్జన సహవాసము చందనమునఁ బచ్చకర్పూరము గలిపినట్లు, దుర్జన దుర్జన సహవాసము బంగాకుతో సున్నము కలిపినట్లు. సహవాసము చెడ్డదిగాదు. అది మంచినీళ్ళవంటిది. మంచినీళ్ళు మామిడిచెట్టునకుఁ బోసిన మంచిఫలములు ఫలించును. ముష్టి చెట్టునకుఁ బోసిన ముష్టిపండ్లే కాయును. అట్టులే సజ్జన సహవాసము క్షేమంకరము దుర్జన సహవాసముపద్రవకరము. ఒకఁడటు లొకఁడిటులుండిన నా మైత్రి నిలువదు. సాధువుగాక దుష్టుఁడుగాక మధ్యస్థుఁడుగనుండువాఁడు సజ్జన సాంగత్యముచే బాగుపడును. దుర్జన సాంగత్యముచేఁ జెడును. తిలలు నీళ్ళు వస్త్రంబు లేవాసన గలవిగాకున్నను మంచి వాసనగల పూలులోనగు వానితోఁ జేరిన నవి మంచి వాసన గలవేయగును. దుర్వాసనగల పదార్థములతోఁ జేరిన దుర్వాసన గలవే యగును. దుర్జన సహవాసమువలన సాధువునకును గీడుగలుగును. మడుఁగులో పాముచేరిన చేపలఁ కుపద్రవమగును. కావున సహవాసము చేయుటయందు మనుజులు హెచ్చరిక గలిగి యుండవలెను. నైమిత్తిక స్నేహము స్నేహముకాదు. అది యమృతమునకై దేవతలు రాక్షసులు స్నేహపడినటువంటిది. ఈగ్రంథకర్త యీ యుభయ విధస్నేహఫలము లనుభవించినవాఁడే.

చం॥ బళిర బళీరె యొందుసదు•పాయము నీసుతుఁ డొంద రాజ్యమున్
దెలియఁగ లేవుగా యిదియుఁ•దెల్పెద విన్ము భవద్ధితార్థమున్,
దెలిసియు విస్మృతిం గనితొ?•తెల్పక దాఁచెదొ నీ వెఱింగియున్?
జెలువరొ నీవె పూర్వమునఁ•జెప్ప వొకో పలుమాఱు నర్మిలిన్. ౨-౩

భవద్ధితార్థమున్=భవత్=నీయొక్క, హిత=మేలైన, అర్థము=ప్రయోజనము, విస్మృతి=మఱపు, అర్మిలిన్=ప్రేమతో, బళి బళిరే=ఇవి సంతోషమును సూచించును-మన యుద్దేశము నెఱవేఱునుగదా. రామాభిషేకము విఘ్నపడును గదా యని సంతోషము.

తాత్పర్యము

బలేబలే. కైకా ఇపుడు నీవు నిజమైన యాఁడుదానవు. తెలివిగలదానవు. తనమేలు తానాలోచింపని దది యేమియాఁడుది. నీకొడుకునకు రాజ్యము వచ్చునుపాయము నీకుఁదెలియలేదుగా. నీకు మేలైన ప్రయోజన మదియు నేనే తెలిపెద వినుము. కాదుకాదులే. నీకుఁ దెలియకయున్నదా. తెలిసి మఱచిపోయితివో నాతెలివితేటలు తెలిసికొన దాఁచి నన్నుఁ బరీక్షించెదవో నీవే పూర్వము నాకెన్నిమాఱులో యొకవిషయము చెప్పితివే. అది నీకుఁ దెలియదని నేనెట్లుతలంపఁగలను.

కం॥ నామాట వినఁగ నభిరుచి, భామిని! నీకున్న దేని • పలికెద నుపమన్
ధీమతి వై విను సర్వం, బామీఁద విమర్శ సేయు • మా యెద ననుచున్
అభిరుచి=ప్రీతి, ఉపమ=ఉపాయము. ౨-౨౧

తా త్ప ర్య ము

నామాట నీకు రుచించునా? నీమాటయేనీదికాని-నానోటిమాట దీసికొని నన్నగడు చేయుటకా. అటుగాదు వాస్తవముగానే యడుగుచున్నదాన నంటివా యుపాయము చెప్పెదను. నేనుజెప్పినానని నీవంగీకరింపవలసినపనిలేదు.నాకుఁ దోఁచినది నేనుజెప్పెదను. నీవు చక్కఁగ నాలోచించి సరియైనదని నీకుఁదోఁచెనా చేయుము. లేదా వదలిపెట్టుము. నాయిష్టప్రకారమే చేయుమని నేను నిన్ను బలవంతపెట్టరాలేదు. నీయుప్పుదిన్న కారణముచే నీకు మేలుచెప్పుట నావంతు గాని రాణివగు నిన్ను బలవంతపెట్ట నేనెవ్వతను? నేను జెప్పినది నీకు రుచించి నను మంచియుపాయము మంచియుపాయమని యుత్సాహపడి కేకలు వేసినను బ్రయోజనములేదు. ఆయుపాయము కార్యరూపముగఁ బరిణమింపఁజేయు టెట్లో యదియు నాలోచింపుము.

ఉం॥ పలికెడికుబ్జఁ గాంచి తన • పానుపునుండి యొకింత లేచి తొ
య్యలిమిహి దాని కిట్టులను • హర్షవికాసముఖారవింద యై
పలుకవె మంథరా! యొకయు • పాయము నాసుతుఁడే ప్రభుత్వ మీ
యిలకు వహింపఁగా జనక • జేశుఁడు కూడనెకూడ దెట్టులున్. ౨-౨౨

తొయ్యలిమిహి=స్త్రీలయందు శ్రేష్ఠురాలు-నాసుతుఁడే=నాకొడుకే మరి యెవ్వఁడు గాఁడు-పొత్తునుగాదు. పానుపునుండి లేచుట సావధానత్వమును దెలుపును.

తా త్ప ర్య ము

తనుక మంథరకిచ్చి మరల పండుకొనినకైక మంథరమాటలు వినివిషయ మందలి-యాదరముచేఁ గొంచెముగా లేచి సంతోషముచే వికసించిన కమలము వంటి ముఖముగలదై మంథరా నాకొడుకునకే రాజ్యమురావలెను. రామునకుఁ బట్టాభిషేకము గాఁగూడదు. నేను నిజముగా నడుగుచున్నాను. ఉపాయము చెప్పుము. తప్పక చేసెదను. నామేలుగోరి నీవు చెప్పినపుడు నిన్నేల యగడు చేసెదనే. ఏలకు భయపడెదవు? కార్యముఁదెలిపినదానవు. దాని సాధించు నుపాయము నీవే తెలుపుము?

కం॥ అనఁగ గైక పాపదర్శిని, విని మంథర రామచంద్రు • విభవాతిశయం
బును జెఱుపఁగోరి యిటు లను,దనదేవికి హర్ష మాత్మఁ • దళు కొత్తంగన్.
పాపదర్శిని=పాపపుటాలోచనగలది. ౨-౨౩

శ్రీరామచంద్రు విభవాతిశయముఁ జెఱుపఁగోరి యనుటచే మంథరకు, గావలసిన ముఖ్యప్రయోజనము రామాభిషేక విఘ్నమేయనియు, భరతాభి షేకనము ముఖ్యము గాదనియు నెఱుంగవలయును. రామాభిషేక విఘ్నము మాత్రము కైకకోరిన దశరథుఁడు రామునకును రాజ్యమీయను

నీకొడుకునకు రాజ్యమీయ ననినను, భరతుఁడు రాజ్యమక్కఱలేదనినను, కైక యేమిచేయఁగలదు ఇది సందిగ్ధవిషయము. మొదటిది నిశ్చయము. దేవతలకు మంథరకుఁ గావలసిన దదియే.

తా త్ప ర్య ము

అని కైక యీప్రకారము చెప్పఁగా విని పాపసంకల్పముగల మంథర శ్రీరామచంద్రుని వైభవముఁ జెఱుపఁగోరి తనరాణికి సంతోషమతిశయించునటు లిట్లు చెప్పెను.

—• { మంథర కైకకు శ్రీరామపట్టాభిషేకము విఘ్నముసేయు నుపాయంబుఁ జెప్పుట. } •—

ఉ॥ రాజును నీవు పోరె సుర•రాజు సహాయతఁ గోర, దేవతా
రాజియు రాక్షసాళి సమ•రం బొనరింపఁగ, శక్రు శంబరుం
డాజి జయింపనుండ శమ•నాశను దండకఁ బట్టిశాత్రవో
ద్వేజకవృత్తి డాయఁ బర•వీరుపురంబగు వైజయంతమున్. ౨౪

సహాయత=సాహాయ్యము, ఆజి=దశరథుఁడు-శమనాశను-దక్షిణదిక్కు, శాత్రవోద్వేజకవృత్తి=విరోధులకు భయంకరమైన వ్యాపారము-డాయన్=సమీపింపఁగా.

తా త్ప ర్య ము

దేవతలు రాక్షసులతో యుద్ధముచేయు సమయంబున నింద్రుఁడు నీ మగనిని దమకుఁ దోడుగారమ్మని కోరెనాలేదా? అప్పుడు దక్షిణదిక్కున దండకారణ్యమందుండు పగవాఁడైన శంబరుని పట్టణమగు వైజయంతము మీఁదికి శత్రువులు భయపడునట్లు నీమగఁడు యుద్ధమునకుఁబోవ నీవాయనతోఁడ బోయితివాలేదా?

మ॥ శతమాయుండు తిమిధ్వజాసురుఁడు, త•త్సంగ్రామరంగంబునన్
క్షతులన్ విక్షతులైనవారలను ర•క్షస్సంఘ ముద్వృత్తిని
ద్రితులన్ రాత్రుల బట్టి చంపు నెడలన్•దేవీ! భవద్వల్లభుం
డతిరౌద్రంబుగఁ దాఁకిన స్దనుజు ల•త్యంతంబు నొప్పించినన్. ౨౫

శతమాయుఁడు=నూఱుమాయలు నేర్చినవాఁడు, ఇచట నూఱనఁగా ననేకములని యర్థము. పరులనువంచించు విద్యవలనఁగలుగు శక్తిమాయ. ఈ విద్యలు పెక్కులుగావున నూఱనియేయని చెప్పఁబడును. తిమిధ్వజాసురుఁడు=తిమిధ్వజుఁడను రాక్షసుఁడు వీఁడేశంబరుఁడు. పద్యుమ్నుని హరించుకొని పోయిన శంబరుఁడు వీఁడుగాఁడు. వీనిపేరుగల మఱియొక రాక్షసుఁడు. దశరథుఁడు తిమిధ్వజునితో యుద్ధముచేయఁగా శ్రీరాముఁడు శంబరుని కొడుకుతో యుద్ధముచేసి జయించెను. అయోధ్య, ౧౧౮-౯వ స. నందలి సుమిత్రాదేవి వాక్యములవలనఁ దెలియనయ్యెడిని. తిమిధ్వజుని మఱియొక పేరు శంబరుఁడు.శంబరులన్నవారు పెక్కురున్నట్లు తెలియవచ్చెడినిఁ శంబరుఁ డనువాఁడు ప్రహ్లాదునిపై మాయలు ప్రయోగించినట్లు విష్ణుపురాణమునఁ

చ్ఛంబర స్యాశుగామినా. బాలస్య రక్షితా దేహ, మేకై కంచనిషూదితమ్. వి.పు. ౧౯-౨౦. క్షతులన్=బాణశూలాదులచే గాయపడినవారు. విక్షతులన్=ఖడ్గపరశు పట్టనములచే బాగుగఁ గొట్టఁబడివారు-రక్షస్సంఘము = రాక్షససమూహము-ఉద్వృత్తిన్=దుష్టవ్యాపారముచే-నిద్రితులన్= పగలుయుద్ధమున దెబ్బలుతిని రాత్రివేళ నిద్రించువారిని, గాయపడి బాగుగఁ గొట్టఁబడి నిద్రచెంది యుద్ధము చేయని వారినిఁ జంపఁబూనుట దుష్టవ్యాపారముగదా.

చం॥ వెఱచిన వానిదైన్యమున వేఁడుకుచెందినవాని నిద్రమై।మఱచినవాని,సౌఖ్య
మున మద్యము ద్రావినవాని, భగ్నుఁడై ।పఱచినవాని,సాధుజడ భావము వా
నిని,గావుమంచువా।చఱచినవానిఁ గామినులఁజంపుట ధర్మముగాదు ఫల్గునా

తాత్పర్యము

నూఱుమాయలవాఁడు శంబరుఁడు (వీనిపేరే తిమిధ్వజుఁడు) ఆయుద్ధ భూమియందు రాత్రివేళ గాయములు దగిలినవారిని-దెబ్బలుదిని పడిపోయిన వారిని నిద్రించుచున్నవారిని వానిసేనాభటులగు రాక్షసులు ధర్మముతప్పి వధించుచుండఁగా దశరథుఁడు మిక్కిలి భయంకరమైనరీతిని వారనెదిరించి పోరుసమయంబున రాక్షసులచే ఘాతపడి దశరథుఁడు రథముమీఁదనే మూర్ఛ పోయెను.

ఉ॥ వ్రాలుడు, గాయముల్పడిన•ప్రాణవిభుం గని తచ్ఛతాంగముం
దోలుచు దవ్వుగాఁగ రణ•దోహలుఁ గావవె నీవు? తత్స్థలిన్
దూలక రాక్షసుల్గడఁగ•దూరముగాఁ గొనిపోయి కావన
వ్వేళ వరద్వయంబు వృథి•వీపతి నీకు నొసంగఁ డే సఖీ! ౨౬

తత్శతాంగము=ఆ తేరిని, రణదోహలున్=యుద్ధమునందు మిగులనాసక్తి గలవానిని, తత్స్థలిన్=దూరముగా నిలిచిన స్థలమందు,వరద్వయంబున్=రెండు వరములను.

తాత్పర్యము

ఇట్లు పోరి గాయములుపడిన భర్తను హతసారథిగల యారథమునఁజూచి యుద్ధాసక్తుఁడైన యాయన నాపదనుండి తొలఁగింపఁగోరి యాతేరిని యుద్ధ భూమినుండి దూరముగాఁ దోలికొనిపోలేదా. అచ్చటికిని దఱుముకొనివచ్చిన రాక్షసుల బారిని బడకుండ నతని దప్పించి వేఱొక రహస్యప్రదేశమునకుఁ దోలుకొనిపోలేదా. ప్రాణాపాయమునుండి రెండుమార్లు దప్పించుటచే నీకు రెండువరంబు లిచ్చెదను.

చం॥ జలజదళాక్షి! యిష్ట మెది•సంతసమారఁగఁ జెప్పు మన్న నే
వలసినవేళఁ గోరుకొన•వచ్చునె నా నటు గాక యంచు నీ
చెలువుఁడు పల్కె నంచు మును•చెప్ప వొకో మఱ పెట్లు వచ్చెనే?
కలికిరో! నీహితైషిణిని•గావుట నిల్పితి నాత్మ నీకథన్. ౨౭

జలజదళాక్షి=కమలములవంటి కన్నులుగలదానా! హితైషిణిని = మేలు కోరినదానను, చెలువుఁడు=ప్రియుఁడు. అటుగాక=అట్లుకానిమ్ము.

తాత్పర్యము

నీవు కోరునవి యేవో సంతోషముగఁ గోరుకొమ్మన నిప్పుడు నాకుఁ గోరఁ దగిన దేదియు లేదు. నాకక్కఱపడి యిష్టమువచ్చినవేళఁ గోరుకొనవచ్చునా యని నీవన నట్లులే కోరుకొమ్మని రాజు చెప్పలేదా. ఈవృత్తాంతము నీవే నాకుఁ జెప్పలేదా. నీవిదియెట్లు మఱచితివే? నీవు మఱచినను నీమేలుకోరినదాననగుటచే నేను జ్ఞప్తియందుంచుకొనియే యున్నదానను.

—• మంథర కైకకు రాజుపైఁ గోపము వచ్చినట్లు నటింప బోధించుట•—

శా॥ అంభోజాయతనేత్ర! నీ న్విభుఁడు దాయ న్వచ్చిన న్రెండువి
శ్రంభం బారఁగఁ గోరుమా వరములన్•రామాభిషేక క్రియా
సంభారంబులు మాన్పి, నీభరతు రా•జ్య ప్రాప్తిఁ, బ్రవ్రాజనా
రంభం బొప్పఁ జతుర్దశాబ్దములు శ్రీ•రాముండు గానం జనన్. ౧౦

అంభోజాయతనేత్ర=కమలములవలె దీర్ఘములైన కన్నులుగలదానా! విస్రంభము=నమ్మకము-ప్రవ్రాజ నారంభము = దేశాటనకార్యము-చతుర్దశాబ్దములు=పదునాలుగు సంవత్సరములు, కానన్=అడవులకై-అంభోజాయతనేత్ర యనుటచే వికాసము నొందిన కన్నులుకలదనియు ఆ వికాసమునకు సంతోషము కారణమనియు ఆ సంతోషమునకు వరములు జ్ఞప్తికి వచ్చుటయనియు నెఱుంగ నగు.

తాత్పర్యము

కమలాక్షి! నీమగండు నీకు రెండువరములు ఋణపడియున్నాఁడుగదా. వానిని విని యోగించు విధానము చెప్పెద వినుము. పట్టాభిషేకమునకై చేయు కార్యములన్నియు రామునకై గాక నిలిపి భరతునకుఁజేసి రాజ్యమాయన కిచ్చుట యొకటి. రెండవది పదునాలుగు సంవత్సరము లడవులయందు రాముఁడు సంచరింపఁ బోవుట. ఈరెండువరములు కోరుకొనుము. పరిణయ కాలమందిచ్చిన వరమును బ్రస్తావింపక యుద్ధవేళనిచ్చిన దానిని బ్రస్తావింప నేల? వారి జాక్షలందు వైవాహికములందు....బొంకవచ్చు'. 'ప్రాణాతురుఁడై నచోఁ బరిణయంబులపట్లను బల్కు బొంకు సత్యాతిశయంబయండ్రు' భార. అని న్యాయముండుటచే వివాహకాల వరమును గోరిన దశరథుఁడది పాటింపక పోవునేమో యని దానిని బ్రస్తావింపలేదు అదియునుగాక దానివలన భరత రాజ్య ప్రాప్తి ఘటిల్లునేమోకాని శ్రీరాము నరణ్యవాసము ప్రాప్తింపదు. రెండవది లేక మొదటిది వ్యర్థము. అనర్థకరము.

కం॥ పదునాలుగువర్షంబులు, వదలక రాముండు వనుల•వసటం బడఁగా
మది స్నేహము స్థిరపడియెడి, ముదితా! నీసుతునెడాల•పునలోకులకున్.

వర్షంబులు=ఏఁడులు, ఎడాటమున=విషయమున, నృసింహపురాణమునఁ బంద్రెండు సంవత్సరములనియే యున్నది.

### తాత్పర్యము

భరతునకు రాజ్యమిచ్చినఁ జాలదా. శ్రీరాముని నేల నిష్కారణముగ నడవులపాలు చేయవలయునందువేమో. ఇప్పుడు ప్రజలకందఱకు శ్రీరాముని యందు విశేషప్రీతి. భరతుఁ డెచ్చటనుండిరియో యిపుడు వచ్చి నేనురాజు ననఁగానే వానియందు లోకులకు నెట్లు ప్రీతికలుగును; కావున శ్రీరాముఁ డీదేశమందుండెనా ప్రజలందఱు రామునకు వశులై భరతుని పదభ్రష్టునిఁ జేయుదురు. కాఁబట్టి శ్రీరాముఁ డరణ్యములకుఁ బోయి యందేయుండిన రాజ్యము నిష్కంటకముగ భరతునకు వశపడును. పదునాలుగు సంవత్సరము లట్లు జరగెనా భరతునందుఁ బ్రజలకుఁ బ్రీతి కలుగును. లోకులు ప్రకృతివర్గము భరతునకు వశులగుదురు. కావున రాముఁడు అంతదాఁక బ్రదికి మరలివచ్చినను భయములేదు.

పంద్రెండేండ్ల గడువు మీఱిపోవును. రాజ్యమునాది యనుటకు వలనుపడదు. కావున నీరెండువరములు నీవు కోరవలయును.

ఉ॥ కింక వహించి న ట్లిపుడ • కేకయరాజతనూజ! పోయి ప
ర్యంకము లేక, కోపభవ • నాంతర మం దొక మైల గట్టి, లో
జంకక, నేలఁ బండి, పతి • సన్నిధిఁ జేరిన నేడ్చు చుండుమీ
బొంకుగ, వానివంకఁ గనఁ • బోకుమి, పిల్చినఁ బల్క కుండుమీ. ౨౩౦

కింక=కోపము, పర్యంకము=పానుపు, కోపభవనాంతరము = కోపము వచ్చునప్పు డుండు నింటిలో, మైల=మాసినచీర, బొంకుగ=అసత్యముగ, కేకయరాజతనూజ=కేకయరాజు నీతల్లి నేగతిఁ బట్టించెనో నీవు నాగతి పట్టకుండ హెచ్చరికగ నుండుము.

### తాత్పర్యము

కేకయరాజు కూఁతురా! నీవు దొరసానివలె నీవిధముగఁ బానుపుమీఁదఁ గాలిమీఁద గాలు వేసికొని కూర్చుండి రాజు రాఁగానే నీవు యుద్ధవేళ నిచ్చిన వరము లిపుడిమ్ము. రామునరణ్యమునకుఁ బంపుము. రాజ్యము భరతునికిమ్ము. అంటివా నీతల్లికి నామెభర్తచే నేగతి గలిగెనో యాగతియే నీకుఁగలుగును కాఁబట్టి నీవు చేయవలసిన కార్యము అడుగవలసిన విధముఁ జెప్పెద వినుము. కోపము వచ్చినదానివలెనే కోపగృహమునకుఁ బోయి పానుపుమీఁదఁ బరుండక నేలఁమీఁద బ్రాఁతమాసిన చింపిగుడ్డ కట్టుకొని పండుకొనియుండుము. నీమగఁడు నీదగ్గరకు వచ్చెడి నడి తెలిసి కాలిచప్పుడు వినఁగానే వగలేడ్పులేడ్చుచుండుము. చీఁకటియిల్లు గావున నీకంట నీరు వచ్చెనో లేదో వగలేడుపో నిజ

మైన యేడుపో యతఁడు తెలిసికొన లేఁడులే వాఁడు పిలిచినను వానివంక ముఖము ద్రిప్పకుము. ముఖము ద్రిప్పితివా నీముఖముఁజూచి పగ లేదుప్పలని తెలిసికొనును పిలిచినను బలుకకుము. కంఠస్వరముఁబట్టి తెలిసికొనును. కావున జాగ్రత్త. మర్మము తెలియనీయకుము. ముసుఁగు బిగించికొని పండుకొనుము.

శా॥ నీ కెంతే మదిఁ గూర్చు వల్లభుఁడు సం•దేహంబు లే దింతకున్,
నీకై నిప్పుల దూఁకు మన్న దుముకున్•నిర్నిద్ర రాగంబునన్,
నీకోపంబును జూడ లేఁడు తరుణీ•ని నల్లఁగాఁ జేయునే?
నీకై ప్రాణము లైన బోవ విడుచు•న్నిక్కంబుగా సుందరీ. ౩౧

ఎతేన్=మిక్కిలి, కూర్చున్=ప్రేమగలవాఁడగును, నిర్నిద్రరాగంబునన్=నిద్రలేని ప్రేమచే, అనఁగా ప్రేమయం దేలోపములేదు,తరుణీ=ప్రాయపుదానా

తా త్ప ర్య ము

సుందరీ! నేనిట్టువగలమారివేషము వేసి కోపించితినేని రాజు నామీఁదఁ గోపించి యీ పెంకెతో నాకేమి ఇది గాకున్న నాకింకఁ బెండ్లాలు లేరా యని వెడలి పోవునేమో. క్రొత్తనీళ్లు వచ్చి ప్రాఁత నీళ్ళుకూడఁ బోయినట్టు లిప్పటి ప్రేమయుఁ దొలఁగునేమోయని సందేహింపకుము. నీప్రియుఁడు నీయందెంత యో ప్రేమము కలవాఁడు. సందేహము లేదు. నీయందుండు ననురాగ విశేషముచే నిప్పులలో దూఁకుమన్నను దూఁకును. అది తనకుఁ బ్రాణహానికరమని కూడఁదలఁపలేఁడు. నీసంతోషమునకై యంతటి దుష్కరకార్యము చేయువాఁడు నీకుఁ గోపమువచ్చు కార్యముచేయునా? నిజముగా నీకై ప్రాణము లిమ్మనిన నిచ్చును. ఇఁక నీవరము లేమాత్రము. ఇంత గట్టి నమ్మకము. నీకెట్లు గలిగెనందువేమో. నీవు సుందరివి మంచిప్రాయమందున్నదానవు. మగవారు స్త్రీల దేహసౌందర్యముచూచి వశపడుదురేకాని మనస్సులు చూచికాదు. అతనికిఁ గావ వచ్చునది నీదేహ సౌందర్యమేకాని నీమనస్సులోపలి విషయముగాదు. అకాముకుఁడు నీ సౌందర్యదాసుఁడుగాని గుణదాసుఁడుగాఁడు. కావున నిట్టి రూపవతిని వయోవతిని విడిచి ముసలి భార్యలయొద్ద కేమని పోవును? త్యజేదంత్యకులో ద్భూతాం వృద్ధస్త్రీం కన్యకాం త్యజేత్.

చం॥ తలఁకకు నీదుమాట జవ•దాఁటఁడు నీదుమగండు, చెల్వపుం
బల మది నీకు నుండుటయు•బాలిశరాల యెఱుంగలేవుగా?
వెలగలము త్తెముల్ పసిఁడి•విశ్రుతరత్నము లిన్ని యిచ్చినన్
బొలఁతిరొ! వానిపై మనసు•పోవఁగ నీకు, తలంపు కార్యమున్. ౩౨

తలఁకకు=చలింపకుము, చెల్వపుంబలము = సౌందర్యబలము, బాలిశరాల=మూఢురాలా.

తాత్పర్యము

సందేహముచేత మనస్సు చలింపనీకుము. నీమగఁడు నీమాట మీఱఁడు. దానికిఁ గారణము నీసౌందర్యబలమే. మాధురాలా! నీకట్టిబలముండుటయు నీవాలోచింపలేకున్నదానవు. నీవీవరములు గోరినపుడు వానిని దప్పింప రాజు నీకు వెలగల మంచిముత్తెములు బంగారుప్రసిద్ధములైన రత్నములు నెన్నియో యిచ్చెదనను. వానికై యాశపడి యనుకొన్న కార్యము చెఱుప కుము. పూనిన పనినే మనస్సున దృఢముగ నుంచుకొనుము. మఱచితివా నీకు ముప్పుతప్పదు. జాగ్రత్త.

కం॥ దేవాసురరణమున ధా,త్రీవల్లభుఁ డొసఁగినట్టి•రెండువరంబుల్
నీవతనిం దలఁపించిన నీవలచిన కార్యమెల్ల•నెఱవేఱుఁ జుమీ. ౨౩౩

తలఁపించినన్=తలఁపునకు వచ్చునట్లు చేసితివేని.

తాత్పర్యము

దేవతలకు రాక్షసులకు జరిగిన యుద్ధమందు నీకతఁడిచ్చిన రెండువర ములు ముందు జ్ఞప్తికిఁ దెచ్చితివా నీవు తలపెట్టిన కార్యము తప్పకయగును వీలన నాహా యిది నాప్రాణము గాపాడినదికదా. ప్రాణదానము చేసినదానికి నదికోరిన వరములీయక యెట్లు కృతఘ్నుఁడనగుదును. ఎట్లసత్యవాది నగుదు నని యాలోచించి నీకోరికలు నెఱవేర్చును.

ఉ॥ లాలన చేసి నిన్ను సువి•లాసిని తీర్చెదఁ గోర్కు లన్న భూ
పాలుని సత్యపాశచయు•బద్ధునిఁ దొల్త యొనర్చి వేఁడు మీ
లీల నరేంద్రః రాముఁ దర•లింపుము వే పదునాలు గేం డ్లర
ణ్యాళిఁ జరింపఁగా, భరతు•నాదట• బట్టము గట్టు ధాత్రికిన్. ౨౩౪

ల్లాలనచేసి=బుజ్జగించి. ఇదిచరిత్రాదులలోఁ జేరినది-లాలనమున బహు దోషములని పోతనామాత్య ప్రయోగము. ౧౦ స్కం. లాలనక్రొత్త బెబ్బులి కలాసము అని శ్రీనాథుఁడు సత్యపాశచయ బద్ధునిన్ = ప్రమాణము లను త్రాళ్ళచేఁ గట్టఁబడినవానిఁగా, తొల్తన్=మొదట తరలింపుము = బయలుదేఱి పోవునట్లు చేయుము ఆదటన్=ప్రేమతో.

తాత్పర్యము

సువిలాసినీ! నిన్ను రాజు కృతజ్ఞుఁడై బుజ్జగించి నీకేమి వరములు కావ లయునని యడిగినఁ దటాలున నాకిరెండు వరములు కావలెనని చెప్పకుము. తొలుత యుద్ధవేళ నిచ్చినవరము లిప్పుడిచ్చెదనని ప్రమాణబద్ధునిఁ జేయుము. అట్టి ప్రమాణము చేయించుకొని యావల శ్రీరాముఁ డరణ్యమునఁ జరింపఁ బోవునట్లు ప్రీతితో భరతునికిఁ బట్టము గట్టునట్లు కోరుము.

భరతునికి రాజ్యము వచ్చినఁజాలునని రామప్రవాస ముపేక్షించునేమో యని తనకుఁగావలసిన దానిని ముందుగఁ జెప్పెను.

ఉ॥ రాము నరణ్యవాసమునె•రాజముఖీ: చలపట్టి కోరుమీ,
రాముఁడు కాన కేగ సుక•రం బగు సర్వము, నీతనూజుఁ ద
న్వీ: మఱి గొల్చు మూలబల•మెల్ల ధ్రువం బగుభక్తిభీతులన్,
రాముఁడు కానలోనన వి•రామత నొందు నిజంబు చూడుమీ. ౩౫

చలపట్టి=చలముపట్టి-విరామత=మరణము.

తాత్పర్యము

మీఁదఁ జెప్పిన శ్రీరామారణ్యవాసమునే మఱింతనొక్కి చెప్పుచున్నది. చంద్రముఖీ! నీవు చలపట్టి హఠముచేసి ముఖ్యముగఁ గోరవలసినది రాము నరణ్యవాసమేసుమా! శ్రీరాముఁడడవులకుబోయెనా సర్వము సులభమగును. అతఁడు పోకపోయెనా భరతునకు రాజ్యము వచ్చినను ననర్థకరమే శ్రీరామ చంద్రుఁడులేని యెడల మూలబలమంతయు నెవఁడు రాజైన మనకేమిమనము చేయవలసినది సేవయేకదా. అది రాజుగానుండువానికే చేయుదము అని రాజ భక్తితోను సేవచేయకుండిన దండించునేమో ఉద్యోగమునుండి తొలఁగించునేమో యను భయముచేతను భరతునకు వశపడియుండును. రాముఁడో యరణ్యము లోనే చచ్చును. ఇది నిజము. అట్లైనచోఁ బదునాలుగేండ్లని మితియేల? శ్రీరామ చంద్రుఁడు శాశ్వతముగా నరణ్యములయందే యుండగోరరాదా యందు వేమో యదిసరిగాదు. కాలపరిమితి యుండినయెడల గడువు తీరఁగానే రావచ్చునని శ్రీరాముఁడును. మరలి వచ్చునని ప్రజలును సమ్మతింతురు. శాశ్వతముగఁ గోరితివా శ్రీరామునందు నాశమాని ప్రజలెల్లరిపుడే తిరుగఁబడు దురు. శ్రీరాముఁడు నంగీకరింపఁడు. భరతుఁడా యిచ్చట లేఁడు. రాజా ముసలివాఁడు. ప్రజలు తిరుగఁబడిన నేమిచేయఁగలఁడు. కావున నట్టి విపరీతపుఁ గోరిక కోరరాదు. మన కార్యసాధనమునకుఁ గావెంత మాత్రము వలయునో యంతేకాని రామునెడ దీర్ఘక్రోధద్వేషములు మనకున్నట్టు వెలికిఁ దెలియరాదు.

శా॥ కాదే రాముఁడు వచ్చెఁబో మరలఁ గై•కా! యింతలో లోకులన్
మోదస్ఫీతులఁ జేయు నీసుతుఁడు, సం•పూజించుఁ బూజ్యాళి, సం
పాదించున్ నవమిత్రకోటి, దృఢ మై•పోఁ తొందు రాజ్యంబు, దే
వీ: దూరంబుగ భీత నెట్టి వరము•ల్వేఁడంగఁ గాలం బిడీ. ౩౬

తాత్పర్యము

పదునాలుగేడుఁ లడవులలోఁ గూడు నీళ్ళులేక యాకు లలములు దిని నవసి నవసి మొండిప్రాణమై బ్రదికి మరల వచ్చినాఁడనుకో రానీ, ఇంతలో మన భరతుఁడు లోకులను దానమానములచేఁ బూజింపయోగ్యులైన వారిని బూజించును. క్రొత్త క్రొత్త మిత్రులను సంపాదించును రాజ్యము పాఁతుగాని దృఢపడియుండును. కావున శ్రీరామచంద్రుఁడు మరలి వచ్చినను భయములేదు.

కాఁబట్టి భయము వదలి కోర్కులు కోరవలసిన కాలమిదే. ఇప్పుడు జంకితివా సర్వము చెడును. అఁడుదాని సాహసము నేర్పు చూప దగిన సమయమిదే సుమా.

కం॥ కావున రాముని రాజుఁగఁ, గావింపఁగ నీకు మన్నఁ•గైకయు భృశహ
  ర్షావిష్టచిత్త యగుచుం, దావిష మగునర్థ మెంచెఁ•దనహిత మనుచున్.

కావింపఁగ నీకు ము+అన్నన్=శ్రీరామచంద్రుఁడు రాజగునట్లు చేయ నీకుము- అనియు, రాముని రాజుగఁ గావింపఁగ నీకు+మన్న=మన్నే- శ్రీరామచంద్రుఁడు రాజాయెనా నీకు నేల మన్నేయనియు గ్రహింపనగు, భృశ=అధికమైన, హర్ష=సంతోషముచే,అవిష్ట=ఆవేశింపఁబడిన, చిత్త=మనస్సు గలది, విషమగు=హానికరమగు.

తాత్పర్యము

మీఁదఁ జెప్పిన కారణములచే శ్రీరామచంద్రుఁడు రాజగునట్లు చేయకుము చేసితివా చెడెదవు అని చెప్పఁగా రాజ్యమంతయుఁ దనకొడుకు దాయెను గదా సవతులందఱు తనదాసీ జనులయిరిగదా యని మిక్కిలి సంతోషించి కైకతనకు విషమువంటి దానిని దనకు రసాయనముగ నెంచెను.

కం॥ కారాని తెరువులన్ జనఁ, గోరిన గోడిగవిధానఁ•గాని విస్మయమున్
  జారువిలోచన తమి పెం,పారఁగ నిట్లనియెఁ గుబ్జ•కతిమోదమునన్. ౨౩౮

కారాని తెరువులం=చెడుత్రోవల, గోడిగ=ఆఁడు గుఱ్ఱము-విస్మయమున్ ఆశ్చర్యముతమి=సంతోషము కోరిక, ఘోటికాశబ్ద భవము గోడిగ.

తాత్పర్యము

తనకాళ్ళు విఱుగునని తలంపక గుంతలు మిట్టలు రాలు ఱప్పలు గలిగి పోవరాని త్రోవలఁ బోవఁబూనిన యాఁడుగుఱ్ఱమువలెఁ గుబ్జతెలివికి నాశ్చర్య పడి మోహాతిశయమున నిండారు సంతోషముతో కైక మంథర కిట్లనియె.

—• కైక మంథరను మెచ్చుకొనుట •—

ఉ॥ కుబ్జ! యెఱుంగ నింతవఱ•కున్ నిను నింతటిప్రోడ వంచు నేఁ,
  గుబ్జలులేరె ధారిణి? నా•కొర్తుక యేనియు నీకు సాటియే?
  యబ్జహితాన్వవాయవరు•నాశయ మింత కెఱుంగ నైతి, న
  న్యుబ్జమదీయశోభనము•నొక్కత వీ వెద నిల్పి నావుగా! ౨౩౯

అబ్జ హితాన్వవాయవరు=సూర్యవంశపు రాజులందు శ్రేష్ఠుఁడైన దశరథునియొక్క, ఆశయము=అభిప్రాయము, అన్యుబ్జ=దీర్ఘమైన, మదీయశోభనము=నాశుభము, ఎదన్=హృదయమందు, హృదయశబ్దభవము. ఎద.ఎడఁద ఎద్ద.

తాత్పర్యము

కుబ్జా! యీగడియవఱకు నీవింతటి సమర్థురాలవని నేనెఱుఁగనుగదా. లోకమున మఱుగుజ్జుస్త్రీలులేరా! ఏమిప్రయోజనము. పొట్టివారికిఁ బుట్టెఁడు బుద్ధులన్నట్లు కుబ్జలు సాధారణముగా బుద్ధిమతులేకాని వారిలో నొక్కతయైన నీకు సాటియగునా దశరథునభిప్రాయమింతవఱకు నాకుఁ దెలియదుగా!! ఇందఱు కుబ్జలలో నీ వొక్కతెవే కదా నా మేలు గోరినదానవు

ఉ॥ వంకరటింక రై నయటి•వల్ మఱుగుజ్జులు లేరె, యిస్సి యా
వంకఁ గనుంగొనంగ మది•వచ్చునె, ఘోరవికారదేహలన్,
గొంకిఁబింకిరి న్మెయిని•గూడియు గాలికి వంగి యున్న మే
ల్పంకజమున్ హసించెదు వి•లాసమునం బ్రియదర్శనాస్థితిన్. ౪౩

ఆవంకన్=వారిప్రక్క, మెయి=దేహము, ప్రియదర్శనా=అందెగత్తెల, స్థితిన్=ఉనికిని.

తాత్పర్యము

వంకరటింకరగా నుండు మఱుగుజ్జులులేరా. ఛీ, వారిప్రక్కయైనఁ జూచుటకు మనస్సువచ్చునా. చూచుటకే భయంకరమై వికారమైన దేహముల గలవారిని నేమనిచూడ మనస్సువచ్చును. నీవో వాతరోగముచే కొంకిరి బింకిరి దేహము గలిగి నడ్డినడుము. గూనివీఁపు. కొంకికాళ్లు కుఱుచచేతులు గలిగియు గాలికివంగు కమలమువలె, సౌందర్యమున నందగత్తెలనెల్ల నవ్వుచున్నావే.

చక్కఁదనము వస్తువునందు లేదు. చూచువారి కన్నులయందున్నది. ఇంత వఱకు వికారపు ముండగానున్న కుబ్జ కైకకు మనస్సు మాఱుటచే దేవలోక రంభగాఁ గానవచ్చెను.

కం॥ యావత్స్కంధసమున్నత,మై వఱలునురంబుఁ గాంచి•యణఁకువ బహులజ్జావిష్కృతినొ సునాభం,బై వెలపెడియుదరమాది•యటు సన్నగిలెన్. ౪౪

కుబ్జా సౌందర్య మింకను గైక వర్ణించుచున్నది.

యావత్స్కంధసమున్నతమై = గూనిది గావున భుజములవఱకు నెత్తై; వఱలు=ప్రకాశించు, ఉరంబున్=రొమ్మును, బహులజ్జా విష్కృతినో=మిక్కిలి లజ్జాతిశయమువనో, అణఁకువన్=అణఁగినదై, సునాభము మంచి బొడ్డుగలదై ఉదరము=కడుపు, ఆది=మొదలుగా, సన్నగిలెన్=సన్నముగానాయెను.గూనిది కావున వీఁపు రొమ్ము బలిసియుండుట స్వభావము. వాతరోగము కారణము. రొమ్ము బలిసినపుడు కడుపు నడుము సన్నగిల్లుటయు స్వభావమే. ఇట్టిదానికి బలిసిన రొమ్మును జూచి తానట్లుగాక పోయితిని గదా యని సిగ్గుపడి కడుపు మొదలు చిక్కినదనుటచే హేతూత్ప్రేక్షాలంకారము. ఓకారము ఉత్ప్రేక్షావ్యంజకము. కారణము కానిదానికి కారణము కల్పించుట హేతూత్ప్రేక్షయగు.

చం॥ నలువుగఁ బూర్ణమైన జఘ•నంబును నుబ్బినగబ్బిగుబ్బలు
నెలసదనూననిర్మలవి•నీలసరోజహితాభవక్త్రముస్
గలరశనాగుణాకలిత•క్రమనినాదము సక్తజంఘలుం,
బలుచనిదీర్ఘపాదములు,•మంథర! యెంతటి యందగత్తెవే! ౪౨

నలువుగన్=అందముగ, పూర్ణమైన=నిండిన, బలిసిన, జఘనము=మొలయున్, విలసత్=ప్రకాశించునదియు, అనూన = కొఱఁతలేనిదియు, నిర్మల=శుద్ధమైనదియునగు, వినీల=నల్లని, సరోజహిత=చంద్రునితో, ఆభ=సమానమైన వక్త్రము=ముఖము, కల=అవ్యక్త మధురమైన, రశనాగుణ=మొలనూలుచే, ఆకలిత=కలిగిన, క్రమనినాదము=మనోహరమైన ధ్వనియు, సక్తజంఘలున్=ఒకదానికొకటి రాచుకొను పిక్కలు=పలుచని దీర్ఘపాదములు=సన్ననై- పొడుగైన కొంగకాళ్లు.

తాత్పర్యము

అందముగ నిండుగ బలిసిన మొలయును, ఉబ్బి పైకిపొడుచుకొని వచ్చిన స్తనములు, పండువెన్నెల కాయుచు స్వచ్ఛమైన నిండు చందురునిఁ బోలు ముఖము మొలనూలి యందలి మువ్వలరవళియు నొకదానితో నొకటి యొరయుచున్న పిక్కలు సన్నగిల్లి నిడుపైన కాళ్లు వహ్వా వహ్వా మంథరా యెంతటియందగత్తెవే.

ఉ॥ తెల్లని చీరగట్టి, కడు•దీర్ఘము లైన తొడల్ బెళంకఁగ.
న్మెల్లగ నాదుముందటను•నీవు చన, న్మదరాజహంసినాఁ
జెల్లుదు, వల్ల శంబరుఁడు•చేడె! సహస్రము నేర్చె మాయలన్,
గొల్లలు వేనవేలు గదె•కోమలి నీయెడఁ దక్కుమాయముల్. ౪౩

తనపాలిటి పిడుగని తెలియక కైక యింకను మంథరను బొగడుచున్నది మద=మదించిన, రాజహంసి=ఆఁడురాజహంస, నాన్=అనునట్లుగా, మాయముల్=మాయాశబ్ద తత్సమము మాయము, అల్ల=అప్రసిద్ధుఁడైన.

తాత్పర్యము

తెల్లనిచీరగట్టి కొంగకాళ్ళవలె) మిక్కిలి నిడుపైన తొడ లిట్రక్కకాప్రక్కకుఁ గదలుచుండ మెల్లఁగ దిన్నని నడకలనాముందట నీవు పోవుచుండఁగా మదించిన రాజహంసివోయన నొప్పదువుగదా. ఓసీ శంబరాసురుఁడు వేయి మాయలే నేర్చును. నీయందో వేనవేలు కొల్లకొల్లగాఁ గదా. వాఁడు నేరువని మాయలు గూడనున్నవి.

కం॥ గురురథఘోణాయతమై, పరఁగెడి నీదీర్ఘమైన•వక్షమునందున్
ధరణిపనీతులుఁ గుత్రలుఁ, దిరముగ నెలకొనుట నేఁడ•తెలిసితిఁగుబ్జా!

గురురథ ఘోణాయతమై = గొప్పరథముయొక్క యిరుసువలెనిడుపై తిరముగ=స్థిరముగ, నెలకొనుట=నెలవుకొనుట, స్థానముగా నేర్పఱచుకొనుట.

## తాత్పర్యము

పెద్దరథము నిరుసువలెఁ బొడుగైన నీతొమ్మునందు రాజనీతులు కుత్రియుక్తులు స్థిరముగ నాటుకొని యున్నవని యిప్పుడే నేను దెలిసికొంటిని. లోపల నిన్ని యిముడుటకై యెడము కావలసియే నీతొమ్మంత పొడవుగా నెత్తుగా నున్నది.

చం॥ భరతుఁడు యౌవరాజ్యపద•పట్టముఁ గట్టుకొనంగ, రాముఁడున్
సరగునఁ గాన కేగినను,•జాన! భవత్స్థగుసీమఁ జుట్టెదన్
వరమణి దామపంక్తి, వద•నంబున దిద్దెద జిత్రకంబు, నా
భరణము లెంతు మేన, శుభ•వస్త్రము లిచ్చెద నీకుఁ గట్టఁగన్. —౨౪౩

సరగున=త్వరగా, భవత్=నీయొక్క స్థగుసీమన్=తొమ్ము ప్రదేశమందు, వరమణి=శ్రేష్ఠములైన రత్నములతోఁ జేయఁబడిన దామపంక్తి=హారముల వరుస, చిత్రకంబు=తిలకము.

## తాత్పర్యము

భరతుఁడు యౌవరాజ్యపట్టముఁ గట్టుకొనినను వెంటనే శ్రీరాముఁడడవులకై పోయినను ప్రియురాలా నీ తొమ్మునందు వరుసలు వరుసలుగా హారములు చుట్టెదను. నీముఖమున నేను దిలకము దిద్దెదను. దేహమునిండ నాభరణము లలంకరింతును. నీవు కట్టుకొనఁ దెల్లని చలువచీర లిచ్చెదను.

తే॥ అబ్జబింబంబు నెకసక్కె•మాడుచున్న, నిస్తులానన మమరంగ•నిర్జరసతిఁ
బోలి కానిజనంబులఁ•బోలఁ జూచి, గర్వమున ధిక్కరింపఁగ•గలవు నీవు. —౨౪౪

అబ్జబింబంబు=చంద్రమండలము, ఎకసక్కెమాడు=ఎగతాళిచేయు-గేలిచేయు, నిస్తులాననము=అసమానమైన ముఖము నిర్జరసతి=అప్సరస దేవతాస్త్రీ కానిజనంబులన్=మనల ద్వేషించు మనుష్యులను - నాసవతులను వారి పరిచారికలను.

## తాత్పర్యము

చంద్రబింబముతో సమమై యసమానమైన ముఖము ప్రకాశింపఁగా దేవతాస్త్రీవలెనుండు నీవు మనకు సరిపడని వారిని గర్వపుఁ జూపులఁజూచి తిరస్కరింపఁ గలదాన వగుదువు.

కం॥ ఏవేళ నన్నుఁ గొలిచెడి, యావడువునఁ గుబ్జ లెల్ల•ననవరతంబున్
నీవశవర్తినులై నీ, సేవం జేయంగ మిగులఁ•జెలఁగెదు కుబ్జా. —౨౪౫

వశవర్తినులు=స్వాధీనలై వర్తించువారు, వడువు=విధము.

తాత్పర్యము

కుబ్జా! అన్నివేళల నన్నెట్లు నీవు సేవింతువో యట్లే యెల్లప్పుడు నీయాజ్ఞకు లోబడి కుబ్జలందఱు వర్తించి నిన్నుఁ గొలుచుచుండఁగా మిక్కిలి ప్రకాశింపఁగలవు. నీవు నాసేవచేయఁగా నీసేవ కుబ్జలు చేయుదురు.

ఆ॥ వేది జాతవేదు◆విధమునఁ దెల్లని, తలిమ మందుఁ బండి◆తన్నుఁబొగడు
కైకఁ జూచి కుబ్జ◆గతజలసేతుబంధమ్ముగాదె మిగులఁ◆దడవుసేయ. ౨౪౮

వేది=యజ్ఞశాలయందలి దిన్నె, జాతవేదువిధమునన్ = అగ్నిహోత్రునివలె, తలిమము=పాన్పు, గతజలసేతుబంధము=నీళ్లుపోయిన తరువాత నసకట్టకట్టుట, దొంగలు చొరఁబడి దోఁచుకొని పోయినతరువాత తలుపులు మూసినట్లు కార్యము మించిన తరువాత హెచ్చరిక పడుట, తడవు=జాగు, పట్టాభిషేకమయిన తరువాత నీవు వరముకోరిన నేమిప్రయోజన మని భావము. "గతోదకే సేతుబంధో, యాదృక్ తాదృఙ్ మతిస్తవ! సందీప్తే భవనే యద్వత్। కూపస్య ఖననంయథా॥" భార. ౮౪౮-౫౩. నీళ్లుపోయిన తరువాత నసకట్టకట్టుటయు, కొంప రాలుచుండఁగా బావిత్రవ్వుటయు నెట్టిదో నీబుద్ధియట్టిది.

తాత్పర్యము

వేదియం దగ్నిహోత్రమువలెఁ దెల్లని పానుపునందుఁ బండుకొనితన్నుఁ శ్లాఘించుచుండు కైకనుజూచి కుబ్జ నీవీముచ్చటలతోఁ గాలము గడుపుచుండినఁ గార్యము మించును. అవల నీవు చేయు ప్రయత్నము నీరుపోయిన తరువాత నసకట్ట కట్టినట్లు వ్యర్థమగును. కావునఁ గార్యము నారంభింపుము.

—◆ కైక కోపగృహముఁ జొచ్చుట. ◆—

కం॥ లే లెమ్ము నృపతివచ్చెడి, వేళకు సరి యెదురుచూడు◆విధుముఖి యననా
లోలాక్షి లేచి మంథర,తో లీలం గోపగృహము◆దురుసుగఁజొచ్చెన్. ౨౪౯

లేలెమ్ము=లెమ్ములెమ్ము=లేలెమ్ము ఇట్టివే రారమ్ము, పోపొమ్ము. విధుముఖి=చంద్రునివంటి ముఖము గలదానా, లోలాక్షి=చలించు కన్నులుగలది.

తాత్పర్యము

చంద్రముఖీ! నీవు పండుకొనినఁ గార్యము పండుకొనును. కావున నీవు పండుకొను సమయమిదిగాదు. రాజు వచ్చెడి సమయమునకు నుండవలసిన విధముగా నుండుము. అని కార్యమం దాసక్తిగల మంథర తీవరింపఁగాఁ గైక విలాసముగ లేచి మంథరతోడ విసవిస కోపగృహము ప్రవేశించెను.

ఉ॥ కామిని స్వాభిరూప్య భవ◆గర్వవికారవిలోలితాత్మయై
భూమిఁ బడింత చేయఁ బని◆పూనెఁ గదా యని క్రుద్ధచిత్తయై
భామహితంబులై నమణి◆భర్మవిభూషణసల్లలంతికా
స్తోమము తారహారములు◆త్రోపుడు వెట్టి వచించెఁ గుబ్జకున్. ౨౫౦

కామిని=కామముగలది, అర్థకామకై క-స్వ=తన, అభిరూప్య=సౌందర్యము వలన, భవ=పుట్టిన, గర్వ=మదముయొక్క వికారముచేత, విలోలిత=చలించు చున్న, ఆత్మయై=మనస్సుగలదై, ఇంత=ఇటువంటి ద్రోహము, పనిపూనెన్= యత్నించెను, క్రుద్ధచిత్తయై=కోపించిన మనస్సుగలదై, భామహితంబులు= కాంతిచే పొగడఁదగినవి మఱి భర్మవిభూషణ = రత్నములు బంగారు నగలు, సల్లలంతికా=మంచిహారములు వీనియొక్క స్తోమము=సమూహము, తారహార ములు=ముత్యాల సరులు, త్రోపుడువెట్టి = తీసివైచి, భామ + హితంబులైన యనియు పదచ్ఛేదము చేయనగు.

తాత్పర్యము

ఐశ్వర్యకామయైన యాకైక నేను సుందరి నను మదవికారముచేఁ జలించుచున్న మనస్సుగలదై యారా రాజు నావిషయమున నెంతద్రోహము చేయఁబూనె నని కోపించినదై పెదవులు కఱచి దేహమున ధరించి కాంతులచే శ్లాఘింపఁదగిన బంగారు-రత్నములు వీనిచేఁ జేయఁబడిన యాభరణములు దండలు మంచి ముత్యాల సరములు దీసివైచి కుబ్జతో నిట్లనెను.

ఉ॥ మన్నియమంబు కుబ్జ! వినుమా, రఘురాముఁ డరణ్యసీమకున్
జన్న మదీయపుత్రుఁడు వెసన్ ధరణీశ్వరుఁ డైనఁ గావలెన్,
నన్ను నుపేక్ష సేయుజన•నాథునకున్ మది సంతసిల్లఁగ
స్వర్గిన్నన నాదుచావు నయిఁ•నం బలుక న్వలె నీవు మంథరా!          ౨౫౧

చన్నన్=పోఁగా, క్రన్నన=శీఘ్రముగా.

తాత్పర్యము

ఓసి మంథరా! నానియమము నిశ్చయము చెప్పెద వినుము. శ్రీరాముఁ డరణ్యసీమకుఁ బోగా నాకొడుకు రాజైనఁ గావలె అటుగాకపోయెనా నన్నుపేక్ష చేసిన రాజునకుఁ ద్వరగా నీవుపోయి కైక చచ్చినదని చెప్పనైనఁ జెప్పవలె. రెంటిలో నొకటి నిశ్చయము.

కం॥ రామునకే యభిషేకము, భూమీశుఁడు చేసె నేని•భువి నింత యంచు
మీ్మ మజ్జీవిత, మేటి కి,సీ మణులును భూషణములుఁ•జేలలుఁ బైఁడుల్.

రాజు రామునకే పట్టాభిషేకము చేసెనా భూమిమీఁద నాబ్రదుకినాఁటితో సరి. అట్టుండ ఛీఛీ యీరత్నములు, ఈసొమ్ములు, ఈచీరలు, ఈబంగారు, ఇవన్ని నాకేటికే.

చం॥ అనవుడుఁ గ్రూరవాక్యనిపు•ణాత్మిక యానృపుదేవిఁ గాంచి యి
ట్లను రఘురామచంద్రునకు•నత్యహితంబుగఁ గుబ్జ భామినీ!
వినుము ధరాత్మజాధవుఁడె•విశ్వవిభుం డయినన్ ధ్రువంబుగాఁ
గనెదరు నీవు నీసుతుఁడు•కష్టములన్, మఱవంగఁ బోకుమీ.          ౨౫౩

అనవుడున్=అనిచెప్పఁగా, క్రూరవాక్యనిపుణాత్మక=క్రూరములైనమాటలు చెప్పుటయందు నేర్పుగల స్వభావముగలది అత్యహితంబు=మిక్కిలి యప్రియము, ధరాత్మజాధవుఁడు=శ్రీరాముఁడు, విశ్వవిభుండు=భూమికధిపతి,రాజు, భామినీ=కోపస్వభావముగలదానా, ఇట్లనుటచే కైక యప్పుడే కోపచిహ్నములు సూచించుచున్నదని యెఱుంగవలయును. కోపనా స్యైవ భామిని నిఘంటువు.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా కఠినవాక్యములు పలుకుటయందు స్వభావముననే సామర్థ్యము గలయామంథర శ్రీరామచంద్రునకు మిక్కిలి యప్రియమైన రీతిగ నిట్లనియె కోపనా నీకోపమునకుఁ దగిన సమయమిదే. దానిని వదలెదవుసుమీ! ఏలన: రాముఁడే రాజాయెనా నీవు నీకొడుకు జీవించియుండువఱకు శాశ్వత కష్టము లనుభవింపవలసియుండును దానిని మఱవకుము.

ఉ॥ కావున నీసుతుం డరుణ•కంజముఖీ! విభుతం దలిర్పఁగా
భావనసేయు మంచు బహు•భంగుల బోధన సేయ వాక్యబా
ణావళితాడితాత్మ యయి•హ స్తములన్ హృదిఁ జేర్చి, కోపవే
గావిలచిత్తయై, విభుఁడు•హా యిటు సేయునె యంచు నెంచుచున్. ౩౬

అరుణకంజముఖీ=ఎఱ్ఱని కమలములవంటి ముఖముగలదానా,దీనివలనఁ గోపముచేఁ గైకముఖము రక్తవర్ణము వహించెనని యెఱుఁగవలయును. విభుతన్=ప్రభుత్వముచే, వాక్యబాణావళి తాడితాత్మ=వాక్యములను బాణములచేఁ గొట్టఁబడిన మనస్సుగలది, హృదిక్=రొమ్మునందు, కోపవేగ=కోపముయొక్క యుద్రేకముచే, ఆవిల=వ్యాకులపడిన, చిత్తయై=మనస్సుగలదై, రొమ్ము మీఁదఁ జేతులుంచుకొని కోపాతిశయమున మనస్సు వ్యాకులపడఁగా మగఁడే యింతపని చేయునా యనితలంచుచు.

కం॥ పొగడను మంథర మఱిమఱి, తెగడను నిజభర్త నవుర•తెగి వెంత కయో
మగఁ డని ప్రియుఁ డని నమ్మిన,
వగ పిడియెనె యనుచుగుబ్జ•వంకంగనుచున్. ౩౭

తెగడున్=దూషించును. తా త్ప ర్య ము

మంథరనుగాసేపు పొగడను. కొంతసేపు తనమగని దూషించును. మగఁడని ప్రియుఁడని నమ్మినవాఁడే యింత దుఃఖపెట్టఁబూనెఁగదాయని మంథర ప్రక్కఁజూచి యిట్లనెను.

ఉ॥ ఇక్కడనుండి కుబ్జ! విను•మేగెద సంయమనీపురంబునం
ద్రొక్కఁగ నొందె, నొందె భర•తుండు ధరాతల రాజ్యసంపదన్
నెక్కొనిన, రామచంద్రుఁడు వ•నీస్థలిఁ గ్రుమ్మర దీర్ఘకాలమున్
గ్రక్కున నాకనుల్ చలువ•గా నడుగం గనుఁగొందు మంథరా! ౩౮

సంయమినీపురంబున్=ఇదియమునినగరము పేరు- ఒండెన్=లేదా అటు కాదేని

తాత్పర్యము

మంథరా! యిక్కడనుండి యమపురికైనను బోయెదను. కాదేని భరతుఁడు యువరాజై రామచంద్రుఁ డడవులలో దీర్ఘకాలము తిరుగఁబోఁగా నా కన్నులు చల్లగాఁ జూడఁనైనఁ జూతును. రెంటిలో నొకటి నిశ్చయము.

శా॥ నేనా వండను బొన్పునందుఁ జెలియా, నేమాల్యముల్ దాల్పనే,
నానేత్రంబుల దిద్దఁ గాటుకను, బానం బేని నన్నంబునేన్
జే నంటన్, మఱి చందనంబు నలఁదన్ జీవింతు నం చెంతువా?
నే నారాముఁడు కాననాళిఁ దిరుగ న్నేపే ప్రయాణింపడేన్. ౨౪

నేనా=ఇందలి ఆకారము శౌర్యార్థకము, మాల్యముల్=పూలదండలు.

తాత్పర్యము

మంథరా! నన్నేమనుకొంటివో-రేపటియుదయమున శ్రీరాముఁడడవులకుఁ బోకపోయెనా పానుపుమీఁద నేనుబండుకొననే బండుకొనను. హారములు ధరింపను. కన్నులయందు గాటుకయుంచుకొనను. అన్నముగాని నీళ్లుగాని వ్రేలు వేసి తాఁకను. గంధము పూసికొనను. ఇవన్నియు నేమిలెక్క ప్రాణముతోనుందు నని తలంచెదవా-అదికల్లసుమా-మరణించుటే నిజము.

చం॥ అని బెడిదంబులం బలుకు చాయలివేణి నిరస్తభూషయై,
జనితరుషాతిరేకఘన సంతమసావృత వక్త్రియై, గృహా
వని నునుసెజ్జ లేక మెయి వ్రాల్చి ధరం బడి కిన్నరింబలెన్
దనరెను దారకల్ మలుగ దట్టపుఁజీఁకటి పర్వు మిన్నునన్. ౨౫

బెడిదంబులు=భయముకలిగించు వాక్యములు-అలివేణి=తుమ్మెదలచాలువలె నల్లనైన జడగలది, కైక, నిరస్తభూషయై = తీసివేయఁబడిన యాభరణములు గలదై, జనిత=పుట్టిన, రుషాతిరేక = కోపాతిశయముచే, ఘన=గొప్పదగు, సంతమస=చీఁకటిచే, ఆవృత=కప్పఁబడిన, వక్త్రి=ముఖచంద్రునిగలదై నునుసెజ్జ=మెత్తనిపానుపు, శయ్యాశబ్దభవము సెజ్జ, మెయి=దేహము, మలుగన్=అస్తమింపఁగా, మిన్ను=ఆకాశము.

తాత్పర్యము

అని భయంకరవాక్యములు పలుకుచుఁ దుమ్మెదచాలువలె నున్నజడను విప్పి తల విరియఁబోసికొని కోపాతిశయమనెడి మేఘావృత గాఢాంధకారముచే గప్పఁబడిన చంద్రుఁడను ముఖముగలదై కోపగృహమందు మెత్తని పానుపు లేక కటికి నేలమీఁద దేహమును బడివైచి కిన్నరివలె నక్షత్రములు కూడ లేక మేఘావృతమునై ప్రకాశింపని యాకాశమువలె నుండెను. ఆభరణములు ధరించుటచే నక్షత్రములతోడఁ బ్రకాశించు నాకాశమువంటి కైక వానిని దీసి వేయుటచే నక్షత్రములు ప్రకాశింపని యాకాశమువలె నుండెనని భావము.

## ౧౦-వ సర్గము.

శా॥ ప్రేరింపం దనుఁ బాప మంథర ధరిత్రిన్ దిగ్ధబాణావళి
ధారావిద్ధమనోజ్ఞ కిన్నరివలెం దాఁ ద్రెళ్ళి కార్యంబు తీ
రారన్ నెమ్మది నిశ్చయించుకొని కుబ్జాస్యంబుఁ గన్గొంచు మేల్
గూరం జేసితి లెస్స చేసి తనుచుం గొండాడి, రోషంబునన్. -౧౩౮

దిగ్ధ=విషము పూయఁబడిన, బాణావళీ=బాణసమూహముయొక్క,ధారా=పదునైన యంచులచేత, ఆవిద్ధ=బెజ్జములు వేయఁబడిన, మనోజ్ఞ=అందమైన, కిన్నరివలెన్=కిన్నరస్త్రీవలె, త్రెళ్ళి=పడి, ఆస్యంబు=ముఖము, కొండాడి=పొగడి, కూరన్=కలుగున్.

### తాత్పర్యము

పాపాత్మురాలగు మంథర తన్నుఁ బ్రేరింపఁగా విషముపూసిన బాణములచేఁ గ్రుచ్చఁబడినేలఁబడిన కిన్నరజాతి స్త్రీవలెఁ గైకయు మంథరా విషవాక్కులచే మనస్సు భేదిల్లఁగా నేలపైఁబడి యెట్లెట్లు చేయవలయునో కార్యము తీరంతయు నిశ్చయించుకొని కుబ్జముఖముఁజూచి నాకు మంచికలుగఁజేసితివి లెస్సజేసితి వని పొగడి.

ఆ॥ పాఁపపాప వోలెఁ బడఁతి నిట్టూర్పుల
సెగలువాఱఁ దనదు చింతితంబు
సొంత మగునొ కాదొ యని సందియము గొని
యాత్మహితముఁ దలఁపు నందుఁ జేర్చె -౧౩౯

పాఁపపాప=ఆఁడుపాము, బొపవిభక్తికాంతము కావున సమాసంబునపాఁపయని యయ్యె. సెగలువాఱ=వేఁడిమి వ్యాపింపఁగా, సొంతము=అంతముతోఁగూడినది.

### తాత్పర్యము

ఆఁడుసర్పము బుసలుకొట్టునట్లు కైక రోషముచే నిట్టూర్పుల వేఁడిగాలి వ్యాపింపఁ జేయుచు తనకోర్కె కొనసాగునో లేదో యని సందేహించియుఁదనమే లాలోచించి నిశ్చయించుకొనెను.

ఆ॥ అర్థకామ కుబ్జ యానెలంతుక నిశ్చితంపుమది నెఱింగి తనకుఁ గార్య
సిద్ధి యైనయట్లు చెలఁగుచు నెమ్మది నధికహర్ష పులకితాంగి యయ్యె.

అర్థకామ=ధనమునందాసక్తిగలది, తానుద్దేశించిన రామాభిషేకవిఘ్నమును గోరునది, నెలంతుక=స్త్రీ, కైక, పులకితాంగి=పులకరించిన దేహముగలది.

### తాత్పర్యము

ధనమునందు రామాభిషేకవిఘ్నమందుఁ గోరికగల మంథర కైకనిశ్చయించుకొనిన విధము తెలిసి యింకభయములేదు. ఇది పట్టినపట్టు వదలునది

కాదు. కావున నాయుద్దేశము తప్పక నెఱవేఱును. అని సంతోషముచేఁ బులక రించిన దేహము గలదయ్యెను.

ఆ॥ కలికి నిశ్చయించి•కార్యవిధం బెల్ల, మహితకోపఘూర్ణ•మాన యగుచు
బొమలు ముడివడంగ•భూమిపైఁ ద్రెళ్ళుచు,
నుస్సు రనుచులోన•నుదిలకొనుచు. ౧౬౩.

కలికి=కాంత, కైక, 'కలికియొప్పిదంబు కాంతయయ్యె' నని నిఘంటువు, మహిత=మిక్కిలి, కోప=కోపముచే, ఘూర్ణమాన = కలఁతచెందినదై, బొమలు=కనుబొమ్మలు, ఉదిలకొనుచున్=తపించుచు, త్రెళ్లుచున్=పడుచు, ఇదివఱకే నేలపై బడినట్లు చెప్పినను మరలఁ జెప్పుటచే మనస్సు నిలుకడకుదురక యున్న కారణముచేఁ గొంతసేపు పరుండి కొంతసేపు లేచి యీప్రకార మార్రాట పడుచున్నదని యెఱుంగవలయును.

తాత్పర్యము

అందగత్తెయగు కైక మన మిట్లు వండుకోవలె రాజువచ్చి యిట్లడుగును. మన మిట్లు ప్రత్యుత్తరము చెప్పవలెనని యుత్తర ప్రత్యుత్తరములు తాను నటింపవలసిన విధము, ఇవన్నియు నాలోచించి నిశ్చయించి రాజు చేయఁదలఁచిన ద్రోహము దానివలనఁ దనకుఁ రాబోవు కష్టము సవతులకు రాఁబోవు మేలు ఇవన్నియుఁ దలఁచి తలఁచి మిగుల కోపముచే మనస్సు కలగుండుపడఁగాఁ గనుబొమ్మలు ముడిపెట్టి భూమిపై దటాలునఁబడి యుస్సురని శ్వాసముఖు విడుచుచుఁ బరితపించుచు.

కం॥ ఎగఁజల్లె నెల్లయెడ నా, మగువ మహాభరణములును•మాల్యచయంబున్
దిగువఁబడ నవియు ధారుణి, జగి మీఱె సతారనభము•చెన్నుఁ రహింపన్.

తాత్పర్యము ౨౬౩

ఇంతవఱకు దేహమునుండి తీసియుంచిన యాభరణము లామాల్యము లా యింటినిండ నలువంకల పడునట్టు లెగఁజల్లెను. అవియు నాలుగుప్రక్కలఁ బడి మిన మిన మెఱయుచు నక్షత్రములతోఁగూడిన యాకాశమువలెఁ గనఁబడెను.

కం॥ ఒకటిగఁ బెనసినజడతో, వికటభ్రూవల్లి తోడ•వికృతాకృతితో
వికలాలంకృతితోఁగా,ముక మాసినచీరతోడఁ•బుడమిం బండెన్. ౨౬౪

వికట=(వింటివంపు చెడి) హెచ్చుతగ్గులైన, భ్రూవల్లి=తీఁగవంటి కనుబొమ్మలు, వికృతాకృతితోన్=మాఱిన యాకారముతో, వికలాలం కృతితోన్=చెదరిన యలంకారముతో, కాముక=కామాతిశయముగల కైక.

తాత్పర్యము

జడవిప్పి మూఁడుకాళ్ళ నొకటిగాఁ బెనవేసి కనుబొమ్మలు ముడివడ రూపము మాఱిపోవ నలంకార హీనయై మాసినచీరగట్టి కామదాసియగు కైక మరల నేలపైఁ బండుకొనెను.

—• దశరథుఁడు పట్టాభిషేకవార్తఁ దెలుపఁ గైకగృహంబునకుఁ బోవుట. •—

తే॥ అంత దశరథవసుమతీ•కాంతుఁడపుడు, రామపట్టాభిషేచన•క్రమము దీర్ప
నాజ్ఞగావించి గురువుల•యాజ్ఞ పొంది, తననివేశమును జొచ్చె•మనముపొంగ

కైక వృత్తమింతతో నిలిపియిఁక దశరథు వృత్తాంతము చెప్పఁబడుచున్నది;

వసుమతీకాంతుఁడు=భూమిభర్త, రాజు, నివేశనము=ఇల్లు, చొచ్చెన్=ప్రవేశించెను.

ఈప్రవేశము ౧౪౯-వ పద్యంబునఁ జెప్పఁబడెను. అతఁడట్టి లింట నుంట వెలుపల జరిగిన వృత్తాంతమంతయు నడుమఁ దెలుపఁబడెను. మరల పూర్వకథ యందు కొనఁబడుచున్నది. పూర్వోత్తర కథా సందర్భము తెలుపుటకై యీ పద్యము చెప్పఁబడెను.

తాత్పర్యము

చెప్పవలసిన విషములన్నియుఁ జెప్పవలసినవారికిఁ జెప్పి చేయవలసిన యేర్పాటులన్నియుఁ జేసినపిమ్మట శ్రీరామపట్టాభిషేకమునకై కావలసిన కార్యము లన్నియుఁ దీర్పనాజ్ఞగావించి గురువుల యానతిపొంది సంతోషముతోఁ దనయింటికిఁ బోయెను.

కం॥ రామాభిషేకవార్తయు, భూమి నిపుడ ప్రకట మయ్యెఁ•బో, కైకేయీ
కామినికిఁ జెప్పవలదే,
యే మున్నుగఁ బోయి యనుచు•నెంచుచు నృపుఁడున్. ౨౬౬

తాత్పర్యము

శ్రీరాముని పట్టాభిషేకవార్త యిపుడేకదా లోకమునఁ బ్రకటింపఁబడెను. ఈలోపలఁ గైకేయికి నెట్లు తెలిసియుండును. ఇతరులుపోయి చెప్పుటకుముందే నేనేపోయి చెప్పవలయును. అని యాలోచించుచు రాజు (క్రియ క్రిందిపద్యమునఁ జొచ్చెను అనునది) కర్మము అగు నంతఃపురవరము ౨౬౭-వపద్యము

చం॥ ప్రియముఁ బ్రియార్హకుం దెలుపఁ•బ్రేమను జొచ్చె సితాభ్ర భాసిరా
హుయుతనభంబుఁ బోచ్చు నల•యుత్పలమిత్రునిభంగిఁ గీరికా
చయకలకంఠ కేకిరవ•సాంద్రము వామనికాయుతంబు న
వ్యయసుమహారశోభితల•తాంచిత సుందరమందిరంబునై. ౨౬౭

ప్రియము = ఇష్టమైనది. కావున ప్రియార్హమైన సంతోషవార్త విననర్హురాలు. సితాభ్ర భాసి=తెల్లని మబ్బులచేఁ బ్రకాశించునదియు, రాహుయుత= రాహువుతోఁ గూడినదియు నగు, నభంబు=ఆకాశము, ఉత్పల మిత్రుని భంగిన్= కలువలకుఁ బ్రియుఁడగు చంద్రునివలె- ననిచెప్పుటచేఁ దెల్లని మబ్బులచాటునకుఁ బోయిన చంద్రుఁడే కాంతి హీనుఁడగును. అందు రాహువుతోఁగూడిన యాకాశమునఁ జొచ్చుట రూపము కూడఁ జెడుటకే. అట్లే దశరథుఁడు కైకయింటిలోఁ బ్రవేశించుటచేతనే తేజోహీనుఁడయ్యెను. అందుఁ గైకయను రాహువు బారిఁ బడుట మృత్యువు వాతఁబడినట్లాయెను. కైకయిల్లు తెలుపు గావున తెల్లని మబ్బుతోఁ బోల్పఁబడెను. కీరికాచయ=ఆఁడు చిలుకల సమూహము యొక్కయు, కలకంఠ=కోకిలలయు, కేకి=నెమిళ్ళయు, రవ=ధ్వనులచే, సాంద్రము = దట్టమైనది, వామనికాయుతంబు=కుబ్జలతోఁ గూడినది, అవ్యయ=క్షీణింపని, సుమ భార=పుష్పముల బరువుచేత, శోభిత=ప్రకాశించు, లతా=తీఁగలచేత, అంచిత= ఒప్పుచు, సుందర మందిరంబునై = అందమైన యిల్లై, రాహుయుతమైన యాకాశము- చంద్రునివంటి రాజనుటచే నిది సూర్యాస్తమయానంతరచర్యయని గ్రహింపనగు.

తాత్పర్యము

ఇష్టమైన వార్త యిష్టురాలై యిష్టములను వినయోగ్యయగు కైకకుఁదెలుపుటకై ప్రియముతో తెల్లని మేఘముఁగ్రమ్మి రాహువుతోఁగూడిన యాకాశమును జొచ్చుచంద్రునివలె నాఁడు చిలుకలయొక్కయు కోకిలల నెమిళ్ళయొక్కయు ధ్వనులచే నిండినదియు మఱుగుజ్జులగు స్త్రీలతోఁగూడినదియు నెడఁదెగక యుండుపూలబరువునఁ బ్రకాశించు తీఁగలచే నొప్పి సుందరమైన యింటియందుఁ బ్రవేశించెను.

కం॥ రాజితదాంతకనకవే,దీజుష్టము నిత్యపుష్ప•దీపిత ఫలస
 ద్భూజాన్వితము సురూపస,తీజాలసుశోభితంబు•త్రిదివనిభంబున్. ౧౨

రాజిత=రజత సంబంధము, రాజితము=వెండిరేకులుగలవియు, దాంత= ఏనుఁగుదంతముచేఁ బనిచేయఁ బడినవియు, కనక=బంగారు రేకులుపఱిచినవియు నగు, వేదీ=తిన్నెలచే, జుష్టము=కూడినది, నిత్య=దోహదబలమున నెడఁదెగని, పుష్ప=పూలచే, దీపిత=ప్రకాశింపఁజేయఁబడినదియు, ఫల=ఎడఁదెగని ఫలములు గలదియునగు, సద్భూజాన్వితము=మంచి వృక్షములతోఁగూడినది, సురూప= మంచియందముగల, సతీజాల=స్త్రీసమూహముచే, సుశోభితంబు=మిక్కిలి ప్రకాశించునది. అంతఃపురమందు నందలు వికారపుఁ గుబ్జలేకాక రూపవతులు పరిచారికాదులుందురు, త్రిదివనిభంబున్=స్వర్గముతో సమానమయినదియు, దోహముల వలన నకాలమందును చెట్లుపూయును! ఆలింగనాత్కురవక, శ్చంపకోముఖ దర్శనాత్। చూతోయోషిత్కరస్పర్శాత్। తిలకోదృ। క్పసారజాత్ అకర్ణనాత్కర్ణికారస్త్వశోకః పాదతాడనాత్? దాడిమీ దోహసందోహాత్ ప్రియాభర్గాన దర్శనః ॥

చం॥ కనఁ బడమూనఁ బోడఁ బలుక న్మొగ మెత్తుకొనన్మథింపఁ జేయనలమఁ
జల్లనూర్పునగ నంటను జాలవుగాక కాఁకచే? ఘనకుచ పువ్వుఁదీపెతిలకంబు
నశోకము ప్రెంకణమ్ముగోఁగునుగనకంబు కేసరముఁ గ్రోవియు వావిలి పొన్న
మావియున్, వసు.

తాత్పర్యము

వెండిరేకులు, ఏనుఁగుదంతములు, బంగారు రేకులు వీనిని జెక్కిసుందర
ముగాఁ బనిచేసిన యరుఁగులు నెల్లకాలము పూయుకాయుచెట్టు లందగత్తెలగు
స్త్రీల సమూహము కలిగి స్వర్గముతో సమానమై.

ఉ॥ క్రౌంచనినాదసంయుతము•రాజతదాంతసువర్ణ పీఠికా
సంచయరాజితంబు నవ•చంపకశోభితచిత్రవల్లికా
భ్యంచిత మన్నపానశుభ•భక్ష్యసముల్లసితంబు ప్రోదిరా
యంచల నాదు పెంపును ద•తాదికవాద్యనినాదహృద్యమున్. ౧౬౯

క్రౌంచ నినాదసంయుతము=క్రౌంచపక్షుల ధ్వనులతోఁగూడినది, రాజత
=వెండితోఁజేయఁబడిన, దాంత=ఏనుఁగుదంతములతోఁ జేయఁబడిన, సువర్ణ=
బంగారుతోఁ జేయఁబడిన, పీఠికా=పీఁటలయొక్క, సంచయ=సమూహ ములచే,
రాజితంబు=ప్రకాశించునది, నవ=క్రొత్తగాఁబూచిన, చంపక=సంపెఁగలచేత,
శోభిత=ప్రకాశముగలదిగాఁ జేయఁబడినదియు, అన్నపాన శుభభక్ష్య సముల్లసి
తంబు=అన్నము. పానము మంచిపిండివంటలు వీనిచేఁ బ్రకాశించునదియు,
ప్రోది=పెంపుడు, రాయంచల=రాజహంసల, నాదు=ధ్వనుల, పెంపు=అతి
శయముగలదై, తతాదికవాద్య=తతము-ఆనద్ధము-ఘనము-సుషిరము అను
వాద్యములయొక్క, నినాద=ధ్వనులచే, హృద్యము=మనోహరము- తంతెలు
గల వీణాదులకు తతమనియు, చర్మముగల మర్దలము మొదలయినవానికి
ఆనద్ధమనియు, కంచుతాలములవానికి ఘనమనియు, వెదుళ్ళతోఁ జేసిన పిల్లం
గ్రోవి మొదలగువానికి సుషిరమనియుఁ బేర్లు. ఈనాలుగు వాద్యములకు వాది
త్రము ఆతోద్యమనియుఁ బేర్లు. "తతంవీణాదికం వాద్య,మానద్ధం మురజాదికం,
వంశాదికంతు సుషిరం, కాంస్యం తాళాదికం ఘనం; చతుర్విధ మిదం వాద్యం,
వాదిత్రా తోద్య నామక" మని యమరుఁడు.

ఈమూఁడు పద్యములయందలి గృహవర్ణనము కామోద్దీపకమని తెలు
పుటకే. ఈయుద్దీపనములవలన దశరథునకుఁ గామోద్రేకము గలుగునని నా
కామవికారముచేతఁ గైకేయి మాటల తీరు దాని యుద్దేశ్యము తెలియఁజాలఁ
డయ్యెననియు ప్రవహించునది. కామాంధునకు వివేకమునకుఁ జోటెక్కడా.

తాత్పర్యము

క్రౌంచపక్షుల ధ్వనులతోఁ గూడినదియు, వెండి-దంతము బంగారుతోఁ
జేయఁబడిన పీఁటలుగలదియు, క్రొత్తగాఁబూచిన సంపెంగలచేతను తమ

లయిన తీఁగలచేతను నొప్పినదియు, అన్నము పానము మంచి పిండివంటలు వీనిచేఁ బ్రకాశించునదియు పెంపుడు రాజహంసల ధ్వని యతిశయము వీణలయు తాళములయు పిల్లఁగ్రోవులయు మద్దెలలయు ధ్వనులచే మనోహరమైనదియు, క్రౌంచనాదము=కైక కంఠధ్వనిని- వెండి బంగారు పీఁటలు కైకతోఁ దాను గూర్చుండుటయు- సంపెంగలు కైకనాసికను, తీఁగలు కనుబొమ్మలను, అన్నపానాదులు కైకతోడ భుజించుటను, రాజహంసల ధ్వని రతివేళ కైక కంఠధ్వనిని స్మృతికిఁ దెచ్చుటచేఁ గామోద్దీపకము లయ్యెనని తెలియనగు. ఇందు స్మృత్యలంకారము- చెప్పనగు. కడచినది మనస్సునకు వచ్చుట స్మృతి.

కం॥ అగునంతః పురవర మా,నగధీరుఁడు చొచ్చి కామ•నారాచములన్
బెగ డొంది శయనతలమున,మృగలోచన నెమకి కాన•కెంతయుఁ జింతన్.

నగధీరుఁడు=పర్వతమువలెఁ జలింపని ధైర్యముకలవాఁడు, ఇంతవఱకని భావము. కామనారాచములన్=మన్మథుని బాణములచే- మన్మథుని బాణములు పూవులు, వీనిచే పిడుగులు పడినను జలింపని కొండవలె నెట్టికష్టములందును జలింపనివాఁడు చలించెనని భావము. బెగడొంది=భయపడి- మనోవికారముగలవాఁడై, నెమకి=వెదకి, మృగలోచన=జింకకన్నులవంటి కన్నులు గలది.

తాత్పర్యము

మీఁద వివరించిన విశేషములుగల యంతఃపురమును పర్వతమువలె ధీరుఁడగు దశరథుఁడు ప్రవేశించి పుష్పబాణుని బాణముల వ్రేటునకుఁ జలించి రత్యర్థమై పడుకటింటియందుఁ గైకను వెదకెనుగాని యామె కాన రామిని విచారగ్రస్తుఁడయ్యెను.

కం॥ సతి యెన్నం డాసమయము, నతివర్తించుటయు లేమి•నృథిపుఁ డెపు డా
గతి శూన్యగృహముఁ జొచ్చిన,వితమింతకు మున్ను లేమి•వికలాత్ముండై.

విచారమునకుఁ గారణమేమన:- అతివర్తించుట=మీఱుట, శూన్యగృహము=పాడిల్లు- కైకలేనియిల్లు, వితము=విధము, వికలాత్ముఁడు = స్వస్థత దప్పిన మనస్సు గలవాఁడు.

తాత్పర్యము

ఈ దినము వఱకు ముందెన్నఁడు రాజువచ్చుసమయమును మీఱి కైక శయనగృహంబున నుండకుండినది లేదు. ఆ విధముగ నాయన కైకలేనియిల్లు ప్రవేశించినదిలేదు. కావున రామవిషయక సంతోషముతో కామోద్రేకముతో మనసార సంభోగింపఁదలఁచి వచ్చిన కామికి నాశాభంగము కలుగుటచే మనస్సు చెదరెను.

సీ॥ ఎన్నఁడే నీవేళ•నెక్కడ కేగదు, పూర్వ మీ చిగురాకుఁ•బోణి నేఁడ
యెచ్చట కేగెనో•యొక్కటి యని స్వార్థ,పరయుమూఢయు నయి•వసరు చుంట
యెఱుఁగ కావంతయుఁ•బృథ్వీశుఁడును బ్రతి,హారిని గైక యెం•దరిగె ననిన
నదియు భయంబున•హస్తముల్ జోడించి,వినయంబు నైఁ బల్కె•వినవినగను

తే॥దేవ: దేవేరి క్రోధసం•దీప్త యగుచుఁ,గోపభవనంబుఁ జేరెనాఁ•గుతిలపడుచు
వ్యాకులేంద్రియుఁడగుచు దు•ర్వారశోక,
భారమునఁ గుంది కాంచెనా•పజ్జకరిగి. ౨౩

చికురాకుఁబోఁడి=చిగురాకువలె మృదువైన పోఁడిమిగలది- పేర్వాదులటు గాగమము విభాషనగు ననుటచే చిగురాకు చిగురుటాకు నని రెండురూపంబులు. సు-వ్యా-సంధి-సూ. ౫౨ చూడుము. స్వార్థపర = తన యైశ్వర్యలాభమందే యాసక్తిగలది. కావుననే మూఢ=బుద్ధి మాలినది-అవంతయు,అవ+అంతయు= అవగింజంతయైన=కొంచెమైనను, ఎక్కటి=ఒంటరిగ- కైకను గోప గృహమున విడిచి మంథరయు నీవలనే యున్నది, ప్రతీహారిని=కావలి యుండుస్త్రీని, విసవిస గను = ఇది శీఘ్రగమనమును దెలుపును- దేవేరి = రాణి రూ, దేవెరి- క్రోధ సందీప్త=కోపముచే మండునది, కుతిలపడుచు=సంకటపడుచు, వ్యాకులేంద్రి యుఁడు=మిక్కిలి కలతఁ చెందిన యింద్రియములుగలవాఁడు. దుర్వార శోక భారము=వారింపరాని శోకాతిశయము, పజ్జ=సమీపము.

తా త్ప ర్య ము

చిగురాకువలె మృదువైన దేహముగల నాప్రియురాలు పూర్వమందెవ్వ డైనను నీ సమయమున కెక్కడ కరుగునదికాదు. ఈదినమే యందు నొంటరిగఁ జెలికత్తెయు నెవ్వతె తోడులేక యెచ్చటికిఁ బోయెనోకదా యని యామె తన లాభమేకోరి దానివలన వచ్చుకీడెఱుంగక మూఢురాలై దుఃఖించుచుండుట కొంచెమైనఁ దెలియక యందలి కావలికత్తెను రాణి యెచ్చటికిఁ బోయెనని యడి గెను. అదియును భయపడుచు చేతులు జోడించి వినయమున దేవా! రాణిగారు కోపముచే మండిపడుచు విసవిసలుగ కోపగృహము చేరెననిచెప్పఁ గైక కాన రాలేదనియే తపించువాఁడు కోపగృహముచేరె ననువార్త గోరిచుట్టుమీఁద రోఁకటిపోటువంటిదగుటచే మఱింత పరితపించి యీదినమే కోపము రావల యునా యని సంకటపడి యింద్రియములు వికలతనొంద పట్టరాని శోకమున నాకోపగృహమునకుఁ బోయెను.

కామాంధుఁడగుటచే నీకోపమునకు శ్రీరామపట్టాభిషేకము కారణమైయుం డునా యను సందేహమైనఁ దోఁచినదికాదు.

సీ॥ కడునను చితగతి • గడుసు నేలఁబరుండి యధిక దుఃఖావిల•యైన దానిఁ
ద్రెంచివైచిన నునుఁ•దీగ నాధరనొలినట్టి నిర్జరివోలె • నమరుదాని
ద్రెళ్ళినకిన్నరి • దిక్కులే కిలఁగూలి వగచు నచ్చరయన • వనరుదాని
వలత్రాడులను జిక్కి•వలనెఱుంగక స్రుక్కియున్న జింకనుబోలె•నొప్పుదాని
తే॥ మహిఁబరిభ్రష్టయైయుండు • మాయవోలె
నున్నకమలాక్షి నరపతి • యూథవిభుఁడు
వ్యాధదిగ్ధశరావిద్ధ • యైనకరిణి
నంటుగతి వెఱలో నంట • నల్ల నంటె. ౨౪

కడున్=మిక్కిలి, అనుచితగతిన్=రాజుప్రియురాలికి నయోగ్యమైన విధముగ, గడునునేల=కఠినభూమిని, ఆవిల=వ్యాకులపడినది, నిర్జరి=దేవతాస్త్రీ, వ్యాధదిగ్ధశరావిద్ధ=వేఁటకాని విషముపూసిన బాణముచేఁ గ్రుచ్చఁబడినది. కరిణిన్=ఆఁడేనుఁగును, అల్ల=మెల్లగా.

తాత్పర్యము

రాజు నభిమానముగల ప్రియురాలికిఁ గొంచెమైనను యోగ్యముగాని విధముగ కఠినేలమీఁదఁ బండుకొని మిక్కిలి దుఃఖపడుచుఁ ద్రెంచిపడవేసిన నునుపైన తీఁగయో పుణ్యక్షయమున భూమిమీఁదఁబడిన దేవతాస్త్రీయో లేక క్రిందఁబడిన కిన్నరియో నేలఁగూలి యేడ్చు నప్సరసయో వలత్రాడులకుఁ జిక్కి తప్పించుకొనిపోవు నుపాయ మెఱుంగక స్రుక్కియున్న యాఁడుజింకయో పరుల మోహింపఁజేయఁ జేసిన మాయభ్రష్టమైనదో యన్నట్టులున్న కైకను బోయవాని విషబాణముచే దెబ్బదినిన తప్పించు నాఁడేనుఁగును నంటునట్లు మెల్లగాఁ దటాలున గట్టిగఁ దాఁకిన మఱింత కోపించునేమోయని భయపడుచుఁ దాఁకెను.- లేఁతతీఁగ యనుటచే మెత్తని దేహముఁగలదై నేలవిడిచి లేవలేక యంటుకొని వాడి పడియున్నదనియు స్వర్గమునుండి పడిన నిర్జరి యనుటచే చూచువారికిని ఆశ్చర్యకరముగఁ బరితాపకారణముగ నున్నదనియు త్రెళ్ళిన కిన్నరి యనుటచే దయనీయ యనియు అప్సరయన సందగత్తెయనియు మాయవోలె ననుటచే వన్నెమాలిన దనియు జింకవలె ననుటచేఁ గదలక మెదలక యున్నదనియు గాయపడిన యేనుఁగనుటచే మిగుల సంతాపముగొని యున్నదనియు సూచితము. కమలాక్షియనుటచే నట్టిదుస్థితియందున్నను ఆమె కన్నులు గామోద్రేకము కలిగించుచున్నవని భావము. ఆచూపు లాదశరథునకు మన్మథుఁడు తన్నుఁగొట్ట వింటసంధించిన జోడుబాణములా యనితోఁచెను.

కం॥ ఆముదుకం డాజవ్వనిఁ, బ్రేమన్ స్వప్రాణములకుఁ బ్రియఁ బుణ్యప్ర
జ్ఞామహితుఁడు పాపాత్మను, గామి మహాభీతి నల్లఁ గాముకఁ బలుకున్. ౭౩౪

శ్రీరాముని పట్టాభిషేక మాయన సవతితల్లియగు కైకకిష్టము లేదనియు నదియే యాకోపమునకుఁ గారణమనియు దశరథుఁడు తెలిసికొనలేమికిఁ గారణము కవి చెప్పుచున్నాఁడు.

ముదుకఁడు=ముసలివాఁడు, జవ్వని=యౌవనమందుండునది, పుణ్యప్రజ్ఞామహితుఁడు=ధర్మబుద్ధిచే గొప్పవాఁడు, ప్రాణములకున్=ప్రాణములకంటె.

తాత్పర్యము

ఆముసలివాఁడు (కావుననే భార్యను ధిక్కరింపలేనివాఁడు) ఆవయస్సుదానిని ప్రేమయందుఁ దనప్రాణములకంటెఁ బ్రియమైనదానిని "ధర్మబుద్ధిగలవాఁడు కావుననే పాపాత్మురాలి కపటమెఱుంగనివాఁడై కామవశుఁడగుటచే నదిధిక్కరించినఁ దనగతియేమో యను భయముచేతను ఇట్లు పడియుండుటకుఁ

గారణము ధనాశయా కోపమా రోగమా భూతమా యను భయముచేతను నా కాముకతో నిట్లనియె.

—• దశరథుఁడు కైక దుఃఖించుటకుఁ గారణ మడుగుట. •—

చం॥ ఎఱుఁగనె సుందరీ! కినుక • కేమికతం బొకొ నీకు? నిట్లు క
న్నఱవడ నేమికారణము? నా కెఱిఁగింపు, మెవండు నీకు నీ
మఱుకునఁ గూర్చె? నెవ్వఁ డవ•మానము చేసెఁ? దలోదరీమదీ
చుఱచుఱ చూడఁదీ మనము•సొంపటి నీ విటు ధూళిఁ బండినన్. ౧౪౫

సుందరీ అని సంబోధించుటచేతనే తన సౌందర్యమునకు దశరథుఁడు దాసుఁడై నాఁడని కైక గ్రహించెను. కినుకకు=కోపమునకు, కతము=కారణము,కన్నఱ=దుఃఖము, మఱుకువ=సంతాపము, చుఱచుఱ=కాలుటయుం దనుకరణము.

తాత్పర్యము

సుందరీ! నీకోపమున కేమికారణమో నాకేమియుఁ దెలియలేదు. ఇట్లు దుఃఖింపఁ గారణ మేమి? ఎవఁడు నీకిసంతాపము గలిగించెను. స్త్రీరత్నమా! నీవీ విధముగా సొంపుచెడి దుమ్ములోఁ బడియుండిన నామనస్సు సంతోషముచెడి సంతాపాగ్నిచే దావాగ్నికి గడ్డిపోఁచవలెఁ జుఱచుఱ కాలిపోదా.

ఉ॥ ఏటికిఁ బండితే కువల•యేక్షణ! భూతము సోఁకినట్లు ? ప్ర
స్ఫోటిత మౌఁ గదే మనము•చూడఁగ ని న్నిటువంటిదుర్దశన్,
మేటులు లేరె వెజ్జు లని•మేషవిలోచన! నిత్యపోషితుల్
పాటిలు మైతెగుల్ నుడువు•బా గొనరింతు రొకింతమాత్రలోన్. ౧౪౬

ప్రస్ఫోటితము=బ్రద్దలుపాఱునది, వెజ్జులు=వైద్యులు, అనిమేషవిలోచన=మచ్చెకంటి- చేఁపవంటి కన్నులుగలదానా, నిత్యపోషితుల్=సదా కాపాడఁబడువారు, మై=దేహముయొక్క, తెగుల్=రోగము, నుడువు=చెప్పుము.

తాత్పర్యము

కలువకంటీ యేలయిట్లు దయ్యముపట్టినదానివలెఁ దలవిరియఁబోసికొని నేలమీఁద చూడ భయమగునట్లు పండుకొన్నదానవు. ఇటువంటి దుర్దశలో నిన్నుఁజూడఁగా మనస్సు ప్రీలి చీలిపోవుచున్నదిగదా. ఎల్లప్పుడు మాన్యములు దిని పోషింపఁబడు రాజవైద్యులు లేకున్నారా నీకేదైన రోగమా చెప్పుము. చిటికవేయుమాత్రమున వారు బాగుచేయుదురు.

ఉ॥ ఆడుము నీకుఁ గామిని! ప్రియం బగు నెవ్వని కేమి చేసినన్,
జేడియ యేదురాత్మునకుఁ•జే టొనరింతునొ నిన్ను నేచుటన్,
గో డెవఁడో కొనుం, బ్రియము•కూడు నదెవ్వని కాన తిమ్మయో
యేడుపకీ తలోదరి! యిఁ•టేటికె దేహము స్రుక్కఁజేయఁగన్? ౧౪౭

తాత్పర్యము

కామినీ నీ కపరాధము చేసినవాని కెవ్వని కేమిచేసిన నీ కిష్టమో చెప్పుము నిన్ను బాధించుటచే నేనేదురాత్మునకు నేమికీడు కలిగింపవలయునో నుడువుము. ఎవనికిఁ గీడుచేయవలె నెవనికి మేలుచేయవలె, ఆజ్ఞయిమ్ము- ప్రియురాలా యేడువకే- ఏటికే దేహమిట్లు వాడఁజేసెదవు.

ఆ॥ చంపఁ దగనివానిఁ•జంపింతు నీకుఁగాఁ, జంపఁ దగినవానిఁ•జాన విడుతు
ధనికుఁ బేదఁగాఁగ • ద్రవ్యాఢ్యుఁగా నిఱుపేద నే నొనర్తుఁ•బ్రేమ చెపుమ. ౨౪౦

తాత్పర్యము

నీనిమిత్తముగాఁ జంపఁదగనివానిఁ జంపుదును. చంపఁదగినవాని విడుతును. ధనికుని నిఱుపేద చేయుదును.నిఱుపేదను గుబేరుఁ జేయుదును.చెప్పుము

కం॥ నావారును నేనును నీ,సేవకులము గామె యేల•చింతిలఁ దరుణీ
నీ వెదఁ దలఁచినకార్యం, బెవిధిని విఘాత మంద•నేఁ జేయుదునే. ౨౪౯

తాత్పర్యము

నేను నాకయినవా రందఱు నీకు సేవకులమేకదా. ఏల నీకిచింత- నీవు కావలయునని తలపెట్టినపని నేనా విఘ్నపఱుతును.

కం॥ నాప్రాణము గొన నీకు న,భిప్రాయం బేని చెప్పు•వే ఘటియింతున్
నాప్రేయసి! నాపై నీ,కప్రత్యయ మేల యెఱుఁగ•వా నావలపున్? ౨౫౦
అప్రత్యయము=నమ్మకములేకపోవుట, వలపు=ప్రేమ

తాత్పర్యము

నేను నీకేదైన నపరాధముచేసియుండ దానికి శిక్షగా నీప్రాణము లిమ్మని యడిగెదవా చెప్పుము. అట్టులే చేయుదును. నీకు కోపము వచ్చినతరువాత నేను జీవించి యేమి ప్రయోజనము? చచ్చుటయే మేలు. ఓ ప్రియురాలా నామీఁద నీ కేల యింత యపనమ్మకము నీపై నాకెంత మోహముండునది నీకుఁ దెలియదా.

ఉ॥ తూరుపునాఁట సింధువునఁ•దొయ్యలి యంగసముద్రమత్స్యలసౌ
వీరతలంబుల న్మగధ•పృథ్విని దక్షిణ దేశమందునున్
వారక కాశిఁ గోసలను•వంగమునందు జనించు నెవ్వియేన్
గోరుము నీ కొసంగెదను•గోమలి నాసుకృతంబు సాక్షిగన్. ౨౫౧

తాత్పర్యము

తూర్పుదేశమందు సింధుదేశమందు నంగమత్స్య సౌవీర మగధ దక్షిణకాశి- కోసల- వంగదేశములందుఁ బుట్టునవి యేవియైనఁ గోరుము-లేదనక తప్పక నీ కిచ్చెదను.నే నిన్నాళ్ళుగాఁ జేసిన పుణ్యముసాక్షిగాఁ బ్రమాణముచేసి చెప్పెదను

కం॥ లే లెమ్మాయాసం బిది, యేలా యోభీరు! పల్కు • మేగతి భీతిన్
వ్యాలోలత్వము గలిగెను, బ్రాలేయముఁ దరణివోలె•భంజింతు వెఱన్.

భీరు = పిఱికిదానా, వ్యాలోలత్వము = కలఁత.

తా త్ప ర్య ము

పిఱికి నే నడిగినది యిచ్చునో యియ్యఁడో యని యేల భయపడెదవే. చెప్పుము. నీకేభయముచే నిట్టి కలవరము గలిగెను. దానిని సూర్యుఁడు మంచును జెఱిచినట్లు చెఱిచెదను.

కం॥ అని యూఱడఁ బల్కినఁ దన,
మనమునఁ గలవాంఛితంబు•మనుజేంద్రునకున్
వినిపింపక మును నాతని,వనటన్ మఱి మఱియుఁ ద్రోయ•భామిని దలఁచెన్

వాంఛితము=కోరిక, వనటన్=దుఃఖమందు. ౨౧౩

తా త్ప ర్య ము

అని యీప్రకారము తనకూఱటగా దశరథుఁడు పలుకఁగా మంథర చెప్పిన ప్రకారము తనకోరిక తటాలున నిప్పుడే చెప్పరాదని తలఁచి యతని మఱిమఱి యెక్కువగా దుఃఖపడఁ జేయఁ గైక యోజించెను.

—• { ౧౧-వ సర్గము. కైకకోర్కి నెఱవేర్చెద నని దశరథుఁడు ప్రమాణము సేయుట. } •—

కం॥ అలరువిలుకాని సెలక,ట్టలతీవ్రపుఁబోటులం గ•డింది వెతల నా
కులపడు వల్లభుఁ గని యా,చెలువ కుటిలవచనరచనఁ•చెప్పెం గఱకుల్.

అలరువిలుకాని=పూవులు బాణములుగాఁగల మన్మథునియొక్క, సెలకట్టల =బాణముల, కడింది=విశేషము, వెత=వ్యథా శబ్దభవము- పరితాపము, కఱకుల్ =పరుషములైన మాటలు.

తా త్ప ర్య ము

మన్మథబాణముల దెబ్బలచే మిక్కిలి బాధపడి తపించి భర్తనుజూచి కుటిలపు మాటలచేఁ గఠిన వాక్కులిట్లు కైక చెప్పెను.

ఆ॥ తెగులుగొంటు గాను•దేవః నా కవమతి, సేయ రెవరు; నీవ•చేయ వలయు
సఫల మొందుకోర్కి • సలుప నిష్టము యేని,
బాస చేసి తేని•పలుకుదాన. ౨౧౪

తెగులుగొంటు=రోగిని, అవమతి=అవమానము, బాస=ప్రమాణము.

తా త్ప ర్య ము

దేవా నాకు వ్యాధియేదియులేదు. నా కెవ్వరవమానముచేయలేదు. చేసిన నీవే చేయవలయును. నాకోర్కి నీవు సఫలము చేయవలయును.నీకట్లుచేయుట యిష్టమేని చేసెదనని ప్రమాణము చేసెదవేని చెప్పెదను.

చం॥ అనఁ బిఱునవ్వు నవ్వి మద • నానలదగ్ధమనస్కుఁ డై నయా
జనపతి తత్సతీశిరముఁ • బయ్యన నంకముఁ జేర్చి వేనలిన్
దనకరపల్లవంబున మ • దంబున నంటుచుఁ బల్కెఁ గామినీ!
కనుఁగొన లేవుగా నిజము • గర్వితురాల! మదీయచిత్తమున్. ౨౮౯

మదనానల దగ్ధమనస్కుఁడు=మదనుఁడను నగ్నిచేఁగాలిని మనస్సుగల వాఁడు. కావున మంచి చెడ్డ ముందు వెనుక నాలోచించు శక్తి లేనివాఁడు. అంకము = తొడ, వేనలిన్=జడ - వెఁడీశబ్దభవము, కరపల్లవము=చిగురుటాకు వంటి హస్తము.

## తాత్పర్యము

ఇన్నాళ్ళు నాతోడ నింతయైకమత్యముగాఁ గలిసియుండియుఁ దనయందు నాకెట్టి భావమున్నదో తెలిసికొనలేక పోయెఁగదా యనియు నావలనఁ గావల సిన పనికా యిది యింత శ్రమపడుట యనియు నేది కోరిన వెంటనే యిచ్చుటకు సిద్ధుఁడను బద్ధుఁడనై యుండఁ బ్రమాణము కావలయునా యనియుఁ బిఱునవ్వు నవ్వి మన్మథాగ్నిచేత దగ్ధమైన మనస్సుగలవాఁడగుటచే రాఁగల మేలు గీడు నాలోచింప శక్తి లేనివాఁడై ఆమె ముఖము తనవంకఁ ద్రిప్పుకొన నాకైక శిర స్సును దన దొడపై నుంచుకొని పెనసిన జడ మెల్లగాఁ దనచేత నంటుచు కామినీ! సౌందర్యముచే మదించినదానా, యిన్నిదినములు నన్నుఁగూడియుం డియు నీవిషయమైనామనస్సెట్టిదో తెలియులేక యున్నదానవుగదా. నీగర్వములో నామనస్స్థితి నీకెట్లు తెలియఁగలదు.

కం॥ వనితా! జగముల నీకంటెను బ్రియతమ యొండు గలదె • నెమకినయేనిన్
మనుజతతిఁ బురుషసింహుని, మనరామునికంటెఁ బ్రియుఁడు • మఱినాకున్నే.

ప్రియతమ=మిక్కిలి ప్రియురాలు, నెమకిన=వెదకిన, ఉన్నే- ఉండునే= లేఁడని భావము.

## తాత్పర్యము

నన్నుఁ బ్రమాణము చేయఁగోరితివి. నాకత్యంత ప్రియమైన దానిపైఁ గదా ప్రమాణము చేయవలె. నాకు మిక్కిలి ప్రియమైనవి రెండు. వెదకినను స్త్రీలలో నీకంటెఁ బ్రియురాలు లేదు. పురుషులలో నరసింహుఁడగు మన శ్రీరామునికంటెఁ బ్రియుఁడు నాకుఁగలఁడా.

ఈకడపటి మాటయే కైక సందేహమును మఱింత బలపఱిచెను. శ్రీరాము నందున్న ప్రీతి తనకొడుకు భరతునందు లేమి స్పష్టపడియెను.

కం॥ అపరాజితుఁడును ముఖ్యుఁ డ,కృపణుండును జీవనార్హుఁ • డింతీ! రఘువం
శపతి యగురామునీఁదను,
శపథము చేసెదను జెపుమ • సలుపుదుఁ గోర్కెన్. ౨౯౦

అపరాజితుఁడును=పరాజయములేనివాఁడు, అపరాజిత శబ్దము విష్ణువునందు నన్వయించును. అకృపణుఁడు=గొప్పవాఁడు, జీవనార్హుఁడు=నాప్రాణముకంటెను బూజ్యుఁడు. (2) నాకుఁ బ్రాణాధారమైనవాఁడు.

తా త్ప ర్య ము

శత్రువులచేఁ బరాజయములేనివాఁడును,రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడును, హేయగుణములు లేనివాఁడును నాకుఁ బ్రాణాధారమై నాప్రాణములకంటెఁ బ్రియుఁడైన వాఁడును నగు శ్రీరాముపై నొట్టు పెట్టుకొనెదను. నీవు గోరినదాని నెఱవేర్చెదను.

కం॥ తపియించి యెవని మూర్తము,చపలాక్షి? కనక యున్న•సత్యము బ్రతుకన్
విపులను, నారామునిపై, శపథము చేసెద నొనర్తు•సతి! నీ పలుకున్. ౭౮

మూర్తము=ముహూర్తము-అల్పకాలము, విపులను=భూమిమీఁద.

తా త్ప ర్య ము

ఎవ్వని నల్పకాలము చూడకయుంటినేని పరితాపముచే భూమిపై సత్యముగా బ్రదుకలేనో యట్టి శ్రీరామునిపైఁ బ్రమాణము చేసెదను. నీమాట నెఱవేర్చెదను.

కం॥ వపువు దొఱంగెద విడిచెదఁ, గృపలే కన్యాత్మజులను•శ్రీరామునికై
నృపవరుఁ డగురామునిపై, శపథము చేసెద నొనర్తు•సతి ! నీపలుకున్.

వపువు=దేహము, దొఱంగెదన్=విడిచెదను, అన్యాత్మజులన్ = భరత లక్ష్మణ శత్రుఘ్నులనైనను.

తా త్ప ర్య ము

ఏ శ్రీరాముని నిమిత్తమై దేహమైనను వదలెదనో భరత లక్ష్మణశత్రుఘ్నులనైనను గొడుకులను దయలేక విడిచెదనో యట్టి శ్రీరామునిపైఁ బ్రమాణము చేసెదను. నీమాట నెఱవేర్చెదను.

చం॥ సరసిజనేత్ర! నామనము•చందము నింత యెఱింగి బాగుగా
నరసి మదీయవాఙ్మనస•మైక్యము నొందుట నీదుకోరికల్
పరగునఁ జెప్పుమీ, బ్రదుకఁ•జాలఁ జుమీ, నను నుద్ధరింపుమీ,
హిరిగ నెఱింగి యాత్మబల•ముం దగునే యిటు సంశయింపఁగన్? ౮౧

అరసి=విచారించి, వాఙ్మనసము = వాక్కుమనస్సు. వాక్+మనసము= అను నాసికములు పరమగుచోఁ బదాంతములైన యర్ప్రత్యాహారవర్ణంబుల కావర్గమందలి యను నాసికములు వికల్పముగ నాదేశమగును. అను నాసికములు రానిచో జశ్శులగు. అహిభుక్+నివహము. అహిభుఙ్నివహము. అహిభుగ్నివహము. సు.వ్యా.సంధి. సంస్కృత శబ్దసంధి ప్రకరణము ౧౯-వ సూత్రము.

తాత్పర్యము

కమలాక్షీ నామనస్సు విధము నిట్టిదని విచారించి నామనస్సు వాక్కు నేక రీతిగనుండుట యాలోచించి నీకోరిక యేదో త్వరగఁ జెప్పుము. నీవాలస్యము చేసిన నేను మదనతాపమున బ్రదుకలేను సుమా.కావున నన్నుద్ధరింపుము.నీబల మెట్టిదో నీవెఱిఁగి యెఱిఁగి నన్ను సందేహించుట నీకుఁదగిన కార్యముగాదు.

కం॥ నాసుకృతము సాక్షిగ నే, బాస యొనర్చెదను నీదు•వాంఛిత మొనరన్
జేసెద ననఁ గైక సము, ల్లాసభరవికాసమాన•లపనాంబుజ యై. ౨౯-౧

సుకృతము=పుణ్యము, బాస=ప్రమాణము, సముల్లాస=మిక్కిలి సంతోషముయొక్క, భర=అతిశయముచే, వికాసమాన=వికసించుచున్న,లపనాంబుజ = ముఖకమలముగలది.

తాత్పర్యము

నాపుణ్యముమీఁదఁ బ్రమాణముచేసెదను నీమాట నెఱవేర్పనేని నాపుణ్యమంతయు నాశమగునుగాక నీకోరిక నెఱవేర్తు నని దశరథుఁడు చెప్పఁగా గైక సంతోషముచే వికాసమునొందిన ముఖకమలముగలదై (పలికె ౨౯౩-వ ప.)

తే॥ ఆత్మసంకల్ప మనుకూల•మయిన యట్లు
రాజుభావం బెఱింగి హ•ర్షమున మధ్య
వర్తు లెవ్వరు లేమి న•భ్యాగతాంత
కోపమోక్తుల నాక్రూర•యువతి పలికె. ౨౯౩

ఆత్మసంకల్పము=తనకోరిక, అభ్యాగత=తటాలునవచ్చిన, అంతక= మృత్యుదేవతతో, ఉపమ=సమానమైన, ఉక్తులన్=మాటలను.

తాత్పర్యము

రాజుభావమునుబట్టి భరతుని పట్టాభిషేకము శ్రీరాము నరణ్యవాసము కాఁగోరిన తనకోర్కె నెఱవేఱినట్లెయెంచి యిట్టికోరిక సరిగాదు ధర్మముగాదని చెప్పు మధ్యవర్తు లెవ్వరు లేకుండుటచే నెంతైన నితనిఁ బీడింపవచ్చును,ఏదైన నడుగవచ్చును. కాదనువా రెవ్వరని యాకస్మికముగ వచ్చిన మృత్యువుతో సరిపోలు మాటలను కఠినురాలయిన జగజంత యిట్లు పలికెను.

చం॥ జనవర! బాస మున్నుగ నొ•సంగెద నంటివి కోర్కె, నీనుడుల్
వినియెడువారుగాక పృథి•వీరవిచంద్రనభ స్తమస్వినీ
దినశుచిపూర్వకాదితిస•తీసుతభూతదిశాభవన్ని కే
తనవరదేవతల్ మఱియుఁ•దక్కటి సత్త్వములున్ నిశాటముల్. ౨౯౪

పృథివీ......దేవతల్=భూమి- సూర్యుఁడు చంద్రుఁడు నభము- రాత్రి పగలు- అగ్నిహోత్రుఁడు మొదలుగాఁగల దేవతలు- భూతములు దిక్కులు నీయిలువేల్పులు, సత్త్వములు=జంతువులు, నిశాటముల్=రాత్రిసంచరించునవి.

తాత్పర్యము

రాజా! నీవు ప్రమాణపూర్వకముగ నాకోర్కె నెఱవేర్చెద నంటివి. నీ మాటలను భూమి- సూర్యచంద్రాకాశములు రేయి పగలు అగ్నిహోత్రుఁడు మొదలైనదేవతలు భూతములు దిక్కులు- నీయిలువేలుపులందఱు విందురు గాక. నీమాటకు వీరందఱు సాక్షులుసుమీ తప్పరాదు.

కం॥ నయయుఁడు ధర్మజ్ఞుఁడు స,త్యనిరతుఁడున్ స్వస్థచిత్తుఁ•డగునాథుఁ డొసం
గెను వరముల దయతోడ,న్వినుఁడీ దేవతలు! ధారి•డీవరుపలుకుల్. -౨౯౩

నయయుఁడు=నీతిమంతుఁడు, ధర్మజ్ఞుఁడు=ధర్మమెఱింగినవాఁడు, సత్య నిరతుఁడు=సత్యమునందు మిగులఁ బ్రీతిగలవాఁడు, స్వస్థచిత్తుఁడు=రాగాదులచే మతి విభ్రమము లేనివాఁడు- దుర్నీతిపరుఁడై నను- ధర్మ మెఱుఁగనివాఁడై నను-అసత్యవంతుఁడై నను అస్వస్థచిత్తుఁడై నను వానిమాటలు పాటికిరావు గావున నట్టిదోషము లతనియందులేవు.కావునఁ జెప్పినమాట తప్పవలనుపడదని భావము

తాత్పర్యము

నీతిమంతుఁడు ధర్మమెఱిఁగినవాఁడు సత్యప్రియుఁడు చిత్తవిభ్రమములేనివాఁడునైన రాజు నాకిచ్చిన వరములను దేవతలారా మీరు దయతో వినుఁడు. దేవతలు మధ్యమపురుషప్రయోగంబునం దారగాగమంబు లోపంబు వైకల్పికంబు

—• కైక తనపూర్వవరములవృత్తాంతము దశరథునకుఁ జెప్పుట. •—

చం॥ అని పతి బిగ్గఁజెప్పి వసు•ధాధిపుఁ గామవిమూఢు సత్యపా
శనికరబద్ధుఁ జేసియను•క్ష్మాధవ సంస్మృతి కింత తెచ్చెదీ,
ము నమరామరారులస•మూహము పోరెడివేళ వైరిబా
ణనిహతి నీవు సోలఁ గద•నంబునఁ గావనె యప్రమత్తతన్? -౨౯౪

బిగ్గ=పెద్దగొంతుతో గట్టిగ, కామవిమూఢున్=కామముచే మతిలేనివానిని, సత్య=సత్యమను, పాశ=త్రాళ్ళ,నికర=సమూహముచే,బద్ధున్=కట్టఁబడినవానిని, క్ష్మాధవ=రాజా, సంస్మృతికిన్=జ్ఞప్తికి, అమర+అమరారుల=దేవతల రాక్షసుల, సోలన్=మూర్ఛపోఁగా, అప్రమత్తతన్=హెచ్చరికతో.

తాత్పర్యము

అని యెలుఁగెత్తిచెప్పి కామముచే మతిపోయిన రాజును ప్రమాణపాశములచేఁ గట్టివైచి యిట్లనియె.రాజా నేను జెప్పఁబోవు విషయముకొంచెము జ్ఞప్తికిఁ దెచ్చుకొనెదవా? పూర్వము దేవతలు రాక్షసులు యుద్ధముచేయు సమయంబున రాత్రి యుద్ధమందు శత్రువులబాణముల తాఁకుడుచే నీవు మూర్ఛపోఁగా యుద్ధమందు నేను హెచ్చరికతో నిన్నుఁ గాపాడితినిగదా.

కం॥ నీవే వరముల రెంటిని, నీవే యానాఁడు, వాని•నిపు డీమ్మీ, ధా
త్రీవర! సరసత నీయక, యీ వనమతి సేయఁ జత్తు•నిప్పుడ వింటే. -౨౯౫

తాత్పర్యము.

నీవే యాకాలమందు నాకు రెండువరము లిచ్చితివికదా. వాని నిపు డిమ్ము మంచితనమున నీయనంటివా నేనిప్పుడే యిచ్చటనే ప్రాణములను వదలెదను.

కం॥ వరయుగ మనునిక్షేపము, ధరణీశ్వర నీదుకడన • దాఁచితి, దానిన్
మరలం గైకొనఁగోరుచు, నరసెద నీయం దొసంగు • మా నా కనుచున్.
వరయుగము=రెండువరములు. ౨౯౮

తాత్పర్యము

రాజా! రెండువరము లను నిక్షేపధనము నీయొద్దన దాఁచి యుంచిన దానను దాని నిపుడు మరల గ్రహింపఁగోరెదను. నావరములు నాకిమ్ము.

కం॥ పలికినమాత్రంబుననే, వలలోనికి మృగముకులేడి • వడువున నవలా
వలలం బడి నతి కనియెం, దలఁచితి నిచ్చితిని మరలఁ • దరుణీ యనుచున్.

తాత్పర్యము

అని యాప్రకారము కైక చెప్పెనోలేదో యామెమాట యామెనోరనుండఁగానే యాత్రగానికి బుద్ధిమట్టన్నట్లు నన్నింత నిర్బంధించి ప్రమాణముచేయించి యడుగుచున్నదే యేమిప్రాణముమీఁదికిఁ దెచ్చిపెట్టునో యనియైన యోజింపక వేఁటకాఁడు ధ్వనిచేయఁగానే వలలోనికిఁ బరువెత్తు లేడివలె స్త్రీవలలోఁబడి జ్ఞప్తికిఁ దెచ్చుకొంటిని మరల నిచ్చితి నని తటాలునఁ జెప్పెను.

కం॥ నీ వానాఁట నొసంగిన, యావరముల రెంటి నిప్పు • డడిగెద శేఁడా
నే వివరించెద వానిని, నీ వాలింపుము ఋతంబు • నిలుపుము బుద్ధిన్. ౩౦౦

తాత్పర్యము

నీవానాఁ డొసఁగిన వరములనే యానాఁడడిగెదను. అవియేవంటివా చెప్పెద వినుము. సత్యమును నీపుచేసిన ప్రమాణమును మనస్సున నిలుపుము. తప్పకుము.

—• కైక భరతుపట్టాభిషేకము శ్రీరామప్రవాసము వరంబులుగఁ గోరుట •—

కం॥ శ్రీరాముని యభిషేక స,మారంభము నాఁపి తత్ప • దార్థంబులతో
నారఁగ నాసుతునభిషే,కారంభము జరుగవలయు • నది యొండు సుమీ.
సమారంభము=ప్రయత్నము, ఆఁపి=నిలిపి. ౩౦౧

తాత్పర్యము

శ్రీరామునకు నీవు చేసిన పట్టాభిషేక ప్రయత్నము నిలిపి యా పదార్థములతోనే నాకొడుకునకుఁ బట్టాభిషేకముచేయుము. ఇది యొకవరము.

కం॥ నిండుమతి దైత్యనిర్జర, చండాహవమందు నీ వొ • సంగినవర మా
రెండవది కోర నిపు డో, చండాంశుకులావతంస • సమయము వచ్చెన్.

దైత్య=రాక్షసులయు, నిర్జర=దేవతలయు, చండాహవమందు=భయంకరమైనయుద్ధమందు, చండాంశుకులావతంస=సూర్యవంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

దేవాసురుల యుద్ధమందు నిండుమనస్సుతో నీవిచ్చిన రెండవ వరమును సూర్యవంశపు రాజులలో మేటీ! కోర సమయము వచ్చెను.కావునఁగోరుచున్నాను, ఎట్టి యాపద దశయందు నిన్ను నేను రక్షించితినో యప్పుడెట్టి ప్రీతితో నీవు నాకు వరమిచ్చితివో యెట్టిగొప్పవంశమునఁ బుట్టితివో యెట్టిపేరు తెచ్చుకొంటివో యవి యన్నియు స్మరించియిపుడు నే నడుగు రెండవ వరమిమ్ము.

ఉ॥ నారలు గట్టి, జింక యజి • నంబు ధరించి, జడల్ వహించి, సం
చారము చేయఁగా వలయు • సంయమియై పదునాలు గేఁడ్లు సీ
తారమణుండు దండకను • దప్ప కకంటక యౌవరాజ్యమున్
గూరెడునిచ్చ నాసుతున • కుం, బరమార్థము లివ్వి నామదిన్. ౩౦౩

నారలు=నారవస్త్రములు, అజినంబు=చర్మము, సంయమియై=మునియై, అకంటకము=శత్రువులవలన బాధలేనిది. పరమార్థము=పరమప్రయోజనము.

సీతారమణుఁడనుమాట కడపటఁ జెప్పిన చమత్కారముకనుఁడు.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు నారచీరలు గట్టుకొని కృష్ణాజినము ధరించి జడలు దాల్చి పదునాలుగేండ్లు మునీశ్వరుఁడై దండకలోఁ దిరుగుచుండవలయును. ఈవిధముగఁ బగవారిచే బాధలేని యౌవరాజ్యము నాకొడుకునకు నిపుడే లభింపవలయును. నా మనస్సునఁగల గొప్పకోరికలివి.

కం॥ మున్నీవొసఁగినయవియే, నిన్నిప్పుడు గోరుటయ్యె • నెటి శ్రీరాముం
బన్నుగ నిప్పుడ నే నీ, కన్నులఁ జూడంగ వలయుఁ • గానకుఁ బోవన్. ౩౦౪

మున్ను = పూర్వము (యుద్ధకాలమున)

తాత్పర్యము

రాజా! నిన్ను నేను క్రొత్తవరములుగాని నీ విచ్చిన వానికంటె హెచ్చుగఁగాని నేను గోరలేదు. నీవిచ్చిన రెండు వరములే యిప్పుడు నిన్నుఁగోరితిని. శ్రీరాముఁడిపుడే యడవులకుఁబోఁగా నే నీకన్నులతోఁజూచి సంతోషింపవలయును.

చం॥ ధరణిని రాజరా జనఁ బ్ర • ఖ్యాలసితుండవు, గాన సత్యసం
గరుఁడవు గమ్ము, నీకుల మ • కల్మషశీలము నీదుజన్మమున్
వరమతిఁ గాచుకొమ్ము, వినఁ • వా యిహమును బరమున్ ఘటింపఁగా
నరులకు సత్య మే శర ణ • నన్ మునివర్యులు సత్యభాషణా! ౩౦౫

రాజరాజు=రాజులకెల్లరాజు-సార్వభౌముఁడవనుట, ప్రథాలసితుండవు=కీర్తిచేఁ బ్రకాశించువాఁడవు, సత్యసంగరుఁడవు=సత్యనియమముగలవాఁడవు, అకల్మషశీలము=కల్మషములేని సదాచారముగలది,సత్యభాషణా=యథార్థవాదీ?

తాత్పర్యము

యథార్థవాదీ! నీవు సామాన్యుఁడవుకావు. రాజులకెల్ల నీవు రాజవు. బల పరాక్రమములచేతను దానధర్మ కార్యములచేతను గీర్తియశస్సులఁగన్న వాఁడవు. కావున నిప్పుడును సత్యనియమముగల వాఁడవగుము ఇంతవఱకు నీ వంశమునందలి రాజులు సత్యవాదులని ధర్మాత్ములని పేరుపొందినవారేకాని యసత్యవాదులని యపకీర్తి పొందినవారుగారు. వారలందఱు సదాచార సంపన్నులు. నీవలన వారి కపకీర్తి రానీయకుము. నీ జన్మము సామాన్యముకాదు. దేవతాస్త్రీకి జనించిన వాఁడవు కావున దేవాంశ సంభూతుఁడవు. అదియును స్మరింపుము, రాజా మునీంద్రులు సత్యము వలననే యిహలోక పరలోక సౌఖ్యములు కలుగునని చెప్పఁగా విన్నవాఁడవేకదా. నీవును సత్యసంధుఁడను బిరుదము వహించినవాఁడవేకదా.

స్మితేన రాగేణచ లజ్జయాభియా, పరాఙ్ముఖై రర్ధ కటాక్ష వీక్షణైః వచోభి రీర్ష్యా కలహేన లీలయా, సమస్త భావైః, ఖలు బంధనం స్త్రియః॥

నవ్వుచే, ననురాగముచే, భయముచే, పెడమొగము పెట్టుటచే,ప్రేమఁగంటి చూపులచే, మాటలచే, నీర్ష్యచేఁ, గలహముచే, విలాసముచే నేవిధముగనైనను స్త్రీలు బంధములే ఇన్ని విధముల మగవారిని స్త్రీలు బంధించి వశపఱచుకొని తమయిష్టము చొప్పునఁ గ్రోఁతులవలె వారి నాడింతురు.

నాసాం స్నేహో నరః కార్య। స్తథై వేర్ష్యాజనేశ్వర, ఖేద మాస్థాయభుంజీత। ధర్మమాస్థాయచైవహ॥ భార-అను.

పురుషులు స్త్రీలతోడ స్నేహముచేయరాదు. విరోధింపనురాదు. స్త్రీలకు సంతోషము వచ్చినను ఖేదము కలిగినను బురుషులనే భక్షింతురు.

గీ॥ తథ్య[illegible] వచింతుఁ బక్షపాతంబుగాదు
నిఖి[illegible]జగముల యందిది నిక్కువంబు
తొయ[illegible]లుల కన్నరమ్యవస్తువులు లేవు
వార[illegible] కష్టములకెల్లఁ గారణములు, భర్తృహరి.

వ[illegible]వారు తమకెంత వఱకు ననుకూలురుగ నుందురో యంతవఱకు స్త్రీలు ననురా[illegible]గలవారివలెనే నటింతురు. తమ యిష్టమున కెప్పుడు వారు విరోధింతురో [illegible]డే వారికిఁ గీడుచేయ నాలోచించుచుందురు. కావున స్త్రీల స్నేహ[illegible]భావికముగాదు.స్వారసికముగాదు. సమయోచితము.విప్రియము లందు[illegible]ఙఁగి యుండుట భీతిచేతనే కాని ప్రీతిచేతఁగాదు. దీని కప వా[illegible]దు.

— ౧౨వ సర్గము. కైక గోరినవరంబుల విని దశరథుఁడు పరితపించుట. —

తే॥ అన మహారాజు కైకేయి యధికదారుణోక్తు లాలించి తహతహ నొందిమిగులఁ
జింతచేఁ గుంది మూర్తంబు సేపు తనను,
దాన యిట్లనుకొనుఁ గడుఁ దత్తఱమున. ౩౦౬

అధిక దారుణోక్తులు=మిక్కిలి తీక్ష్ణములైన మాటలు, ఆలించి=విని.

తాత్పర్యము

మిక్కిలి తీక్ష్ణములై విన భయంకరములైన కైకేయి పలికిన ములుకుల వంటి పలుకులను విని దశరథుఁడు మిగుల సంతాపించి కొంచెము సేపు విచారముచేఁగుందినవాఁడై మిగుల దత్తఱపడుచుఁ దనలోఁ దానిట్లను కొనెను.

కన్నులఁ గప్పిన కామాంధకారము కైకేయి వాక్కులను తీక్ష్ణసూర్యకిరణములచేఁ దొలఁగి పోవ వాస్తవపుఁ జూపుగలవాఁడై తన దుర్దశ నాలోచించు కొనుచున్నాఁడు.

ఉ॥ హా యిది యేమి నాకుఁ గల యా? మతిమోహమ? పూర్వజన్మమం
దీ యనుభూత మైనకృతి యీగతిఁ దోఁచెడినా? మనోరుజా
వ్యాయతియా? యటంచు వసుధాధిపచంద్రుఁడు లోఁ దలంచు చ
త్యాయతచింతఁ గుంది యతిదారుణదుఃఖము దన్నుఁ ద్రెక్కొనన్. ౩౦౭

అనుభూతమైనకృతి=అనుభవింపఁబడిన కార్యము కం॥ ఏ వాసరమున నెద్దె సః నేవయసున నెట్టికర్మ మెవఁడొనరించున్। ఆవాసరమున నద్దెస నావయసున నట్టికర్మ మతఁడు భుజించున్॥ పంచ॥ అన్నట్టు లెవఁడు పూర్వజన్మమున నేమిచేసెనో యది యీ జన్మమునఁ జేసిన పుణ్యపాపములు మరణకాలమున నట్లట్లే తోఁచవచ్చును. మనోరుజా = మానసికరోగముయొక్క, వ్యాయతియా = విస్తారమా, ఆయత=దీర్ఘమైన, త్రెక్కొనన్=ముంపఁగా.

తాత్పర్యము

హా! యేమి యీచర్య? నామోహ మేమి? నేనుజేసిన వాగ్దాన మేమి? కైకేయి యడిగిన వరములేమి? ప్రేమమున కిదియా ప్రతిఫలము ఇట్టివాస్తవముకూడ నుండునా? నా ప్రియురాలు. ప్రాణతుల్య; కైక, యిట్టు లడుగునా? అడుగదు. కావున నిది కలయేమో, కలగాదు, మేలుకొనియున్నానుగదా, మేలుకొన్న వేళ కల యెట్లువచ్చును. కావున నిది నామోహము. కావున నొకదానిని మఱియొకటిగాఁ దలఁచుచున్నాను. అదియునుగాదు. ఉన్నదున్నట్లు బోధపడుచున్నదిగదా. మతి మోస మెందుండి వచ్చెను. కావున నిదివాస్తవమే. ఇటువంటివాస్తవము సంభవింపఁ గారణ మేమి? ఈజన్మమున నిట్టి దారుణవాక్కులువినునంత పాపము నేనేమియుఁ జేయలేదు. కావునఁ బూర్వజన్మమందుఁ జేసినది యిపు డనుభవమునకు వచ్చుచున్నది. అదియును నమ్మఁదగినదికాదు. నామెదడు చెడిపోవు గొప్ప

వ్యాధి లభించి యుండవలెను అని రాజు తనలోఁ దాను మిగుల నాలోచించుచు సహింపరాని మృత్యువువలె భయంకరమైన దుఃఖము తన్ను ముంపఁగా.

ఉ॥ దేవెరిపల్కుములుక్కులహ•తిం బడి సోలియు లబ్ధసంజ్ఞుఁడై
యావిభుఁ డెట్టకేని నొక • యాఁడుపులిం గనుఁగొన్న లేడి య
ట్లావికలుండు దుఃఖితుఁడు • నౌచు నసంవృతధాత్రిమందిమం
త్రావళియంత్రరుద్ధభుజ•గాకృతి దీర్ఘపుటూర్పు లూర్చుచున్. ౩౦౮

దేవెరి=కైక, దేవీశబ్దభవము=రాణి, ములుక్కులు = బాణముల, హతిన్= దెబ్బలచే, సోలి=మూర్ఛపోయి, లబ్ధసంజ్ఞుఁడై =మరలస్మృతి గలవాఁడై, అసంవృతధాత్రి=ఉత్తనేల, మంత్రావళి...ఆకృతిన్=మంత్రముచేఁ గట్టుపడిన పాముపలె, ఎట్టకేని=ఎట్టెట్టో- అతికష్టము మీఁద.

తాత్పర్యము

తనరాణికైక పలుకులను బాణపుఁ బోటుల దెబ్బలచే గాటుపడి మూర్ఛ పోయి మరల నతికష్టముపై దెలివి తెచ్చుకొని కటికనేల గూర్చుండి గుండెలు చెదరి దుఃఖించుచు నాఁడుపులినిఁ జూచు జింకవలెఁ గైకవంకఁ జూచుచు మంత్ర బలముచేఁ గట్టుపడిన పాముపలె నేమియుఁ జేయఁజాలక నిట్టూర్పు పుచ్చుచు.

కం॥ కోపంబున హా ఛీ యని, భూపాలుం డాడి శోక•మున మూర్ఛితుఁడై
ప్రాపించి తెల్విఁ గినుకం, జూపులఁ జూఁడెడివిధాన•సుందరిఁ గనియెన్.

చూఁడెడి విధానన్=కాలుచురీతిని, సుందరి=దీనిసౌందర్యముగదా నన్నీ గతికిఁ దెచ్చినదని తలంపుగలవాఁడై.

తాత్పర్యము.

కోపంబున హా ఛీ యని పలికి శోకబలంబున మూర్ఛనొంది నేలఁబడి లేచి కోపపుదృష్టులచేతనే కైకను గాల్చునట్టు లాసుందరికి నిట్లనెను.

—• దశరథుఁడు కైకను దూషించుట. •—

ఉ॥ ఓసి దురాత్మురాల! యయ•యో యదియెంతటిగట్టి వాయి వే,
యీసుజనస్తుతాన్వయము • నింకఁగఁ జేయఁగ రాతిగుండెదా
నా! సనుదెంచితే యిటకు • నా యెడ నేనియు రామునందు నే
వీసముఁ బాప మున్న నన•వే కత మేమిటు ద్రోహమెంచఁగన్. ౩౧౦

దురాత్మురాల=చెడుమనస్సుగలదానా, గట్టివాయివి=గయ్యాళివి, సుజన స్తుత=సజ్జనులచే స్తోత్రము చేయఁబడిన, అన్వయము=వంశము, ఇంకఁగన్= సమయునట్లు, రాతిగుండెదానా=కఠిన హృదయముగలదానా- దయలేనిదానా, వీసము=అల్పమైనను- (వీసము ఒకటిలోఁ బదునాఱవభాగము) సనుదెంచు, రూ, చనుదెంచు. లేకకాకు సంబోధనాహ్వయ కర్మధారయంబుల నచేతనముల నబ్జనాభ యన్నట్లు సంబోధనము మీఁది 'చ'కారము 'స'కారమైనదనియైనఁ జెప్పవచ్చును.

నాల్గవపాదంబునఁ గాకు స్వరయతి, కతము=కారణము.

తాత్పర్యము

ఓసి దురాత్మురాలా! నీ వెంతటి గయ్యాళివే. నిర్దయురాలా సజ్జనుల స్తోత్రమునకుఁ బాత్రమైన మా వంశమును నాశము చేయుటకే మా యింటికి వచ్చితివా? ఇటువంటి ద్రోహబుద్ధి పుట్టుటకు లవమైన నాయందుఁగానీ రాము నందుఁగాని దోషమున్నఁ జెప్పుము. నీకునేను ద్రోహమును జేయలేదు. నిన్నుపే క్షింపనులేదుగదా. ఇఁక శ్రీరాముఁడో.

ఉ॥ తల్లినిబోలెఁ జూచును గం౹దా నిను రాఘవుఁ డెల్ల వేళలం,
దుల్లములోన నీచెనఁటి౹యుద్యమ మేటి కొనర్పఁ బూనితే!
పెల్లువిషంపుఁ బాము నిటు౹వీఁడి నై నృపకన్య యన్భ్రిమం
బొల్లువడంగ నాదుగృహ౹ ముం జొర నిచ్చితిఁ జేటు దెచ్చితిన్. ౩౧౧

ఉల్లములోన=హృదయమునందు, చెనఁటి యుద్యమము = చెడ్డప్రయత్నము, వీఁడినై=బుద్ధిమాలినవాఁడనై రూ. వేఁడి. బొల్లు వడంగన్=చెడిపోవుటకు- (బొల్లు పడు-పొట్టువలెనగు.

౪-వ పాదంబున ముప్తికయతిగాని బిందుయతిగాని చెప్పవచ్చును.

తాత్పర్యము

తన కన్నతల్లినే గౌరవదృష్టితోఁజూచి యామెకెట్లు సేవచేయుచున్నాఁడో యట్టిగౌరవదృష్టితో నిన్నుఁజూచి నిన్నుఁ బరిచరించుచున్నాఁడుగదా. నీవు సవతి తల్లివని యాయన చూచుటలేదుగదా. ఏటికే యిటువంటి చెడ్డప్రయత్నము చేయ మనస్సు పెట్టితివి. ద్రోహమెంచని వాని విషయమున ద్రోహమెంచుట యాసురకృత్యముగదా. నిన్నిపుడేమియని యేమి ప్రయోజనము. ఇది నా స్వయంకృతాపరాధము. రాజకన్యవని భ్రమచేతఁ బామును నింటిలోనికిఁ దెచ్చి సాఁకినట్లు నిన్ను నింటిలోఁ బ్రవేశపెట్టితిని. కొంపకే యగ్గి పెట్టితిని.

కం॥ ఎల్లప్పుడు జీవలోకము, సల్లలితగుణాఢ్యు రామ౹చంద్రునిఁ బొగడన్
బెల్లుగ, నేమినెపం బిడి, కల్లరినై ప్రియతనూజుఁ౹గానకుఁ బనుతున్. ౩౧౨

సల్లలిత గుణాఢ్యున్=మంచి మనోహరమైన గుణసంపత్తిగలవానిని, కల్లరి=(కల్ల+అరి) అసత్యమాడువాఁడు మోసగాఁడు, యువరాజుగాజేసెదనని చెప్పి చేయనివాఁడు, కానకున్=అరణ్యమునకు, పనుతున్=పంపుదును- పొమ్మని యాజ్ఞాపింతును.

తాత్పర్యము

సర్వకాల సర్వావస్థలయందుఁ బ్రాణికోటి యంతయు మంచి మనోహర గుణములు కలవాఁడని శ్రీరామచంద్రుని బొగడుచుండఁగా నేనేమి నెపముపెట్టి

యసత్యవాదిని, మోసగాఁడనై నాకు మిక్కిలి ప్రియుఁడై గారాబు కొడుకగు శ్రీరామచంద్రు నడవులపాలు కమ్మని యాజ్ఞాపింతును.

కం॥ విడిచెదఁ గౌసల్యను సిరి, విడిచెదను సుమిత్ర విడుతు•విడిచెద నసు జేన్
విడువను బితృవత్సలు నో,పడఁతీ! మదినమ్ము రామ•భద్రు సుశీలున్.౩౧౩

సిరి=సంపద, ఉసుజేన్=ప్రాణమైనను, పితృవత్సలున్=తండ్రియందుఁ బ్రేమగలవానిని, పడఁతి=ఆఁడుది, సుశీలున్=మంచి స్వభావము నడవడిగల వానిని.

శ్లో॥ ఆత్మాహిదారా సర్వేషాందార సంగ్రహవర్తినామ్॥రామా॥భర్తకు భార్యయే
యాత్మ. యో భర్తా సాస్మృతాంగనా. మను. భర్తయే భార్య.

యోభర్తాసైవ భార్యాస్మృతా. వాజసనేయ బ్రాహ్మణము. భర్తయెవఁడో వాని భార్య వాఁడే.

అర్ధోవా ఏష ఆత్మనో యత్పత్నీ, పత్నియనునామె తనలో సగము గదా
శాస్త్ర ప్రయోగా ద్వివి ధాచ్చవేదా,దాత్మాహ్యనన్యః పురుషస్యదారాః॥
కిష్కింధ. ౨౪

శాస్త్రప్రయోగముల వలన పలువిధములగు వేదములవలన బురుషునకు భార్య తనకంటె నన్యయముగాదు.

శ్లో॥ ద్విధాకృత్వాత్మనో దేహమర్ధేన పురుషోభవత్, అర్ధేననారీ తస్యాంస, విరాజ
మసృజత్ప్రభుః॥ మను. తన దేహమును సగము పురుషుఁడుగాను సగము
స్త్రీగాను రెండుభాగములుచేసి స్త్రీభాగమందుఁ బురుషభాగముచేఁ బ్రపంచ
మును బ్రహ్మ సృజించెను.

"ఆత్మానంద్వేధా పాత యత్తతః పతిశ్చ పత్నీచా భవతాం తస్మాదిదమర్ధ బృగల ఇవ. బృహ ౪ బ్రా. ౩ మం. తానే రెండుగా పతియని పత్నియని యయ్యెను. కావున నీ రెండు విత్తనమందలి చిప్పలవంటివి".

ఈ కారణముచే భార్యకెగ్గు దలంచువాఁడు తన కెగ్గు దలంచువాఁడే. జ్యేష్ఠ భార్య కౌసల్యను వదలరాని యామెను వదలెదను. అట్టులే 'నాతిచరామి' యని ప్రమాణముచేసి వివాహముచేసికొన్న సుమిత్రను సర్వజనులందు మైత్రియేగల సుశీలను వదలెదను. అంతయేల ఆపద్ధర్మములందు సర్వము వదలియైన రక్షించుకొన వలసిన ప్రాణముల నయినను వదలెదను.

తాత్పర్యము

కౌసల్యను విడువుమని కోరెదవా విడిచెదను. అట్టులే సుమిత్రను వదలెదను. వీరికంటెఁ బ్రియమైన యందఱను విడిచియైన రక్షించుకొనవలసిన ప్రాణములను విడువుమనెదవా నీకుఁబ్రీతిగ విడిచెదనుగాని యోసీ యింతకంటెఁ బ్రియమై సత్స్వభావముగల శ్రీరామచంద్రుని వదలను సుమా నమ్ముము.

కం॥ శ్రీరాము జ్యేష్ఠసుతుఁ గ,న్నారం గనఁ గనఁగఁ బ్రీతి•యాగుబ్బతిలున్
నారాము-విడిచి బ్రతుక, న్నేరుతు నే చెనఁటి!యొక్క నిమిషంబైనన్! ౩౧౪

జ్యేష్ఠసుతున్=పెద్దకొడుకును, ఆగుబ్బతిలున్=అతిశయించును. "ప్రేమ యాగుబ్బతిలంగఁ జూచె నలకూబర సన్నిభునద్ధరామరున్." అని మనుచరిత్ర ప్రయోగము. చెనఁటి రూ. చెన్నఁటి=చెడునడవడిగలదానా- ఇందు భక్తులకుఁ గల భగవదనుభవలక్షణము చెప్పఁబడెను.

తాత్పర్యము

శాస్త్రబలమునను బ్రేమకలిమిని విడువరాని ప్రియపదార్థములను వదలెదను. శ్రీరాముని వదలనంటివే యేమి శ్రీరామునియందు విశేషముండువా ఆయన శ్రీరాముఁడు కావున నాయనను వదలితినా నేను జ్యేష్ఠాదేవి దృష్టికిఁ పాత్రుఁడ నయిన వాఁడనే, అదియునుగాక జ్యేష్ఠసుతుఁడు ఆత్మావై పుత్రనామాసిత్. తానే కొడుకు అగును.

జ్యేష్ఠేనైవతు పుత్రేణ, పుత్రీభవతి మానవః
పితౄణా మనృణశ్చైవ, సతస్మాత్సర్వ మర్హతి. మను.

మనుష్యుఁడు పెద్దకొడుకుచేతనే పుత్రవంతుఁడై పితరుల ఋణమునుండి విడువఁబడుచున్నాఁడు, కావున నతఁడు సర్వమున కర్హుఁడు.

ఎవనివలనఁ బితరుల ఋణము తీర్చుచున్నాఁడో యెవనివలన స్వర్గము కలుగునో వాఁడే ధర్మమునఁ గలిగిన పుత్రుఁడు. తక్కినవారు కామజులు జ్యేష్ఠ పుత్రుని ముఖము చూడఁగానే పితౄణము తీరును. ఈవిధముగ శ్రీరామచంద్రుఁడు నాకిహపరములకుఁ దారకమైనవాఁడు మఱియును గన్నుల కఱవు తీరఁ జూచుకొలఁది భగవదనుభవమువలె నంతకు ముందుచూచినవాఁడే కదా యని తోఁపక క్రొత్త క్రొత్తయై నాకు సంతోషము పొంగి పొంగి యతిశయించుచుండును. అట్టివానిని విడిచిన మరల నాకు సంతోషమనునది యెక్కడిది?నాకు మనస్సున సంతోషములేదాయెనా నీవు మాత్రము నాకేల! కాఁబట్టి యిటువంటి శ్రీరాముని విడిచి దుర్మార్గురాలా యొక నిమిషమైన బ్రతుకఁగలనా ?

కం॥ సూరుండు లేక లోకము, నీరమ్ములు లేక పైరు•నిలుచుక్షణంబేన్,
నారాముఁ బాయ జీవం, బేరీతిని నిలువ నేర్చు•నే నాయొడలన్. ౩౧౫

సూరుండు=సూర్యుండు, సూర సూర్యార్యమాదిత్య యని యమరుఁడు. ఒడలన్=దేహమునందు.

తాత్పర్యము

సూర్యుఁడులేక లోకము కొంతకాలము నిలువఁగలదు. అట్లే నీళ్ళులేక పైరులు నిలువఁగలవు కాని నారాముని వదలితినా యేవిధముగ నాప్రాణములు నాదేహమున నుండఁగలవు. నాప్రాణములన్నియు శ్రీరామునందే యున్నవి.

శ్రీరాముఁడే నా ప్రాణము శ్రీరాముని విడుచుట ప్రాణము విడుచుటయేకదా. లేక యాధేయముండఁగలదా.

తే॥ ఏటికే యింత ఘోర మై•గాట మైన, పాపకార్యంబునందు నన్•బట్టుపఱుప?
మానవే దీని నోసి దు•ర్మార్గురాల! కాళ్ళ నైనను బడియెదఁగావు నన్ను. ౩౧౬

ఘోరము=భయంకరము, గాటము=గాఢము, పట్టుపఱుపన్=బలవంత పెట్టఁగా, ఇంతచెప్పినను గైకముఖము ప్రసన్నము గాకుండుటచూచి చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

ఓసి పాపాత్మురాలా! మరణకారణమగుటచే మృత్యుదేవతతో సమానమై యాకారణముచే భయంకరమైగాఢమైన పాపపుఁబనియందు నన్నేల బలవంత పెట్టెదవే. ఓసి. నీవు భార్యవు నీకు నేను మ్రొక్కరాదు. అటులున్నను నీకాళ్ళ మీఁదఁబడి సాష్టాంగనమస్కారముఁ గావించెదను. నన్ను బ్రదుకనిమ్ము. నిష్కారణముగ నేల చంపెదవు?

సీ॥ వడఁతిరో భరతుని•పై నాకు నెయ్యంబు, గలదో లేదో యని•కనుఁగొనంగ
వలసి కోరితి గాక•భరతాభిషేకంబు, పేర్మి రాముండు నా•పెద్దకొడుకు
శ్రీమంతుఁడును మఱి•జ్యేష్ఠుండు ధర్మంబు, నం దనియిచ్చకా•లాడి తీవు
మున్నది యుపచార•మున కటు గాకున్న, శ్రీరాముఁడొనరించు•సేవకొఱకొ

తే॥ యతనిపట్టాభిషేకవృ•త్తాంత మిప్పు, డాలకించి వ్యధాభరి•తాత్మవగుచుఁ
గరము నను గోడుగుడిపెదు•కఠినురాల!
పరులమాటలువినిచొచ్చి•పాడుగృహము. ౩౧౭

రో=ఇది స్త్రీలనంబోధించు ప్రత్యయము, ఓసియాఁడుదానా- నెయ్యము =స్నేహము (ప్ర), ఇచ్చకాలు=ముఖప్రీతివాక్యములు, ఉపచారము = గౌరవార్థము, ఆలకించి=విని, వ్యధాభరితాత్మవు=శోకబాధచే నిండిన మనస్సుగల దానవు, గోడు=కీడు, కుడిపెదు=అనుభవింపఁజేసెదవు, పాడుగృహము=పాడు పెట్టఁబడిన యింటివలె నుండునిల్లు.

తాత్పర్యము

ఓసీ ప్రియురాలా! నా విషయమున రాముని విషయమున నీవింతటికఠినోక్తులు మనసారఁ బలికియుందువని నేను నమ్మను. అట్లైన నిట్లాడుట కేమి కారణముందువా? నాకు భరతునిమీఁదఁ బ్రేమయున్నదోలేదో యని తెలిసికొనుటకై భరతునిపట్టాభిషేకముఁ గోరితివి. అది నీ వెట్టు లూహించితి వందువా? ఇది వఱకు నీవు గౌరవమునందు శ్రీరాముఁడు నాపెద్దకొడుకు భరతుఁడు చిన్నకొడుకు. రాముఁడు శ్రీమంతుఁడు. ధర్మబుద్ధియందు భరతునకంటెనాయనయే శ్రేష్ఠుఁడు నని నీవుచెప్పలేదా అని యిట్లు నయములాడినను మెత్తఁబడని కైకను జూచి యోహో యివియన్నియు నన్ను గౌరవించుటకును శ్రీరామునందు

నాకెక్కువప్రీతి గావున నాయనయందు నీకును బ్రీతిగలట్టు నటించిన నీయందు నేను బ్రీతిగలవాఁడనై యుందునను తలంపుతో ముఖప్రీతిమాటలు మాటలాడితివికాఁబోలు. అటుగాకపోయెనా శ్రీరాముఁడు నీసేవచేయుచుండవలయు నను తలంపుతోనో యయియుండవలెను. అటుగాకున్న శ్రీరాముని పట్టాభిషేకవార్త విని గోలుగోలున నీవేడ్చుటయేకాక నన్నుఁగూడ కస్తిపెట్టుచున్నదానవు. నీవెంతయోాదయలేనిదానవు కాకుండిన నితరులు చెప్పిన మాటలు విని యిటువంటి పాడింటిలోవచ్చి పండుకొని నీవేడ్చుచు నన్నేడ్పించెదవా. ఇది నీకై పుట్టినబుద్ధి గాదు. ఎవరో పరులు దుర్బోధములు సేయఁగా నిటుచేయుచున్నదానవు. ఇది యంతయు నన్నుఁ బరీక్షింప ననుకొందునా? ఇటువంటి విపరీత పరీక్ష యెందుఁ గలదు? పరీక్షార్థము గొంతుపిసుకుటయుఁ గలదా?

తే॥ నీతిమతి వగునీకు దు•ర్నీతితోడ, మతివికారము గలిగిన•కతనఁ జేసి
వనిత! యిక్ష్వాకుసన్నుత•వంశమునకుఁ,
జేటుఁగాలంబు వచ్చెను•జెడియె నీతి. ౩౧౮

నీతిమతి=నీతిగలదానవు, మతి=మతుప్ ప్రత్యయము స్త్రీలింగము- మతివికారము=మనస్సునకుబుపాటు, కతనఁజేసి = కారణముచేత, చేసి ఇదిచేయు ధాతువు క్త్వార్థకరూపముగాదు చేతనను నర్థమున వచ్చుప్రత్యయము.

తాత్పర్యము

వనితా! నీవు స్వభావముచే నీతిగలదానవే. అట్టినీకు నీళ్ళలో నిప్పుపుట్టినట్టు నీతివిరుద్ధమైన వర్తనముతోడ మనశ్చాంచల్యముగలిగి మాఱుపడుటచే సజ్జనస్తోత్రమైన యిక్ష్వాకువంశమునకుఁ జెడ్డకాలము ప్రాప్తించెను. కావుననే నీతియుఁ జెడెను. అటుగాకున్న నీకివిపరీతబుద్ధి పుట్టియుండదు.

తే॥ ఇంతకును పూర్వమెన్నఁడే•నింతయైన,నప్రియంబైన ననుచిత•మైనఁబలుప
విప్పదీ విటుసేయుదే•యేటిమాట, నేను నమ్మంగఁ జాలనే•నీరజాక్షి! ౩౧౯

తాత్పర్యము

ఇంతకు ముందొకనాఁడైనఁ గొంచెమైన నప్రియముగాని యుచితముగాని మాటగాని యెన్నఁడు పలికినదానవుగావు. నేఁడుమాత్ర మిట్లుసేయుదువా? నీవు నిజముగా నిట్లు చేయుచున్న దానవని నే నెట్లునమ్ముదును? ఇంతలో స్వభావము మాఱునా ?

తే॥ భరతునట్టిఁడ శ్రీరామ•భద్రుఁడనుచు
నెన్ని మాఱులో నాతోడ•నీవ యనవె?
యట్టిధర్మాత్ముఁ డేగతి • నడవులందు
నవయఁగా నేర్చునే పదు•నాలుగేండ్లు? ౩౨౦

అట్టిఁడ=అట్టివాఁడే, నవయఁగాన్=కృశింపఁగా.

తా త్ప ర్య ము

నా విషయమున భరతుఁడెట్టివాఁడో శ్రీరామభద్రుఁ డట్టివాఁడే. ఇరువుర యందు భేదమేమాత్రములేదు అని నీవే యెన్నిసారులో నాతోడనే యనలేదా. అట్లు నీవును మెచ్చుకొనిన శ్రీరాముఁడు పదునాలుగేండ్లడవులలో నెట్లుకృశించునే

—• దశరథుఁడు శ్రీరాముని గుణముల వర్ణించుట •—

కం॥ రాముఁడు సుకుమారుఁడు నయ,
ధాముఁడు జనహితరతుఁడు•ధర్మాత్ముం డో
భామ! భవదీయశుశ్రూ,షామహమహితుం డదేల•చనఁ గానలకున్? ౩౨౧

సుకుమారుఁడు=కోమలదేహముగలవాఁడు, నయధాముఁడు=నీతికిస్థానమైనవాఁడు, జనహితరతుండు=జనులకు మేలుచేయుటయందుఁ బ్రీతిగలవాఁడు, భవదీయ=నీయొక్క, శుశ్రూషామహ=పరిచర్యయను నుత్సవమందు, మహితుఁడు=గొప్పవాఁడు.కానలకున్=అడవులకు, ధర్మాత్ముఁడు=అధర్మబుద్ధియే లేదు, కావున నడవులకుఁ బంపఁ గారణము లేనివాఁడు.

ఇందుఁ జెప్పిన కారణములన్నియు శ్రీరామచంద్రమూర్తి యడవులకు బోఁదగినవాఁడు కాఁడని తెలుపుచున్నవి.

తా త్ప ర్య ము

అధర్మమైనను భరతుఁడు నీకొడుకు గావున ధనకాముకవై పుత్రవాత్సల్యంబున వానికి రాజ్యము గోరితివనుకొందునుగాక. శ్రీరాముఁడో మిక్కిలి కోమలదేహుఁడు నీతికి స్థానమైనవాఁడు. జనుల మేలునందుఁ బ్రీతిగలవాఁడు ధర్మస్వరూప స్వభావుఁడు. ఇవన్నియు నెట్లులైన నగుఁగాక నీకు శుశ్రూష చేయుటయన నెంతో గొప్పయుత్సవముగాఁ దలంచు గొప్ప మనస్సుగలవాఁడు. అటువంటివాని నేటికే యడవులకుఁ బోవఁగోరితివి. ఆయన యడవులకుఁ బోవ నెట్టు లర్హుఁడు.

చం॥ భరతునికంటె రాముఁడ భ•వత్పరిచర్యల మేలుచేయి, నే
నరసియుఁ గాన నీ వయిన•నాడుము విందుము రాముకంటె నీ
భరతునియందు నిన్గొలుచు•పట్ల విశేషము లేమి కంటివో,
వరమతి రాముఁడున్ విపిన•వాటి విడం దగినట్టిపుత్రుఁ డే? ౩౨౨

భవత్పరిచర్యలన్=నీకు సేవలుచేయుటయందు, మేలుచేయి =గొప్పవాఁడు, వరమతి=గొప్పమనస్సుగలవాఁడు.

తా త్ప ర్య ము

నీతాత్పర్యమందేగాక నాయభిప్రాయమందుఁగూడ నీకు సేవచేయుటయందు భరతునికంటె శ్రీరాముఁడే గొప్పవాఁడు. అది నీయభిప్రాయమేమో నాయభిప్రాయము కాదందువా నీసేవలయందు శ్రీరామునికంటె నీభరతుఁ డేవిషయముల నెక్కుడో నీవైన నాలోచించిచెప్పుము. నే నెంతవిచారించినను భరతుని

శ్రేష్ఠత్వము నాకు గోచరింపలేదు. ఇది సవతితల్లియని యిది కన్నతల్లియని భేదబుద్ధిలేక సమముగా నందఱ గౌరవించు గొప్పమనస్సుగల శ్రీరాముఁడా యరణ్యముల విడువఁదగినకొడుకు?

కం॥ సారమతిఁ బూజసేఁత న,పారగురుత్వప్రమాణ•వచనక్రియలన్
శ్రీరామునికంటెను ని, న్నే రే భజియించువారు•హెచ్చుగఁ దరుణీ? ౩-౨౩

సారమతిన్=నిండునిర్మలమనస్సుతో, పూజసేఁత=గౌరవించుట, అపార=అంతములేని, గురుత్వ=గౌరవము.

తాత్పర్యము

ఓసీ! శ్రీరాముని విడనాడితివనుకో మనసార నిన్ను గౌరవించుటయందును, నీయందమితమైన మాతృభక్తియుంచి నీవు చెప్పిన కార్యములన్నియుఁ తల్లి చెప్పెనుగదా యను తలంపుతో నిన్ను సేవించుటయందును నింతకంటె నితరు లెవరున్నారే? వానిని వదలితివా నీకు సరిగా శుశ్రూషచేయువారే లభింపరు.

ఉ॥ వేలకొలందు లైనయలి•వేణులనే నుపజీవులందునేన్
వేలు మడంచి చెప్పఁ గల•వే యొక చేడియ యైన నెన్నఁడేన్
వాలుగగంటి! యొండుపరి•వాదమునే నపవాద మేనియు
న్లీలకునైన రాముపయి•నీకు వచించియ యున్నఁ గామినీ? ౩-౨౪

అలివేణులన్=స్త్రీలయందు, ఉపజీవులందు=జీతముతీసికొని కొలుచువారియందు, ఏన్=ఐనను, ఎన్నఁడేన్=ఏదినమందైనను, వాలుగ గంటి=వాలుగ చేఁపవలె నిడివియైనకన్నులుగలదానా? పరివాదము=వాస్తవముగ దోషముచేయుటచేఁ గలుగునింద, అపవాదము=నిష్కారణమైన దూఱు, లీలకున్=వేడుకకు.

తాత్పర్యము

నీవిషయమున నపరాధము చేయకుండుటేకాదు. మన యంతఃపురములందు వేనవేలుస్త్రీలు జీతములేక గౌరవార్థముగ నుండువారును గలరు. జీతములు తీసికొని సేవించువారును గలరుగదా. ఇందఱస్త్రీలలో నొక్కతెయైన శ్రీరాముఁడు పుట్టినదాదిగా నేఁటివఱ కొకనాఁడైన శ్రీరామునందు వాస్తవదోషముగాని కల్పితదోషముగాని వినోదమునకైన నీతోడనైనఁ జెప్పియుండిన వ్రేలుమడఁచి యొకటి యని లెక్కించి చెప్పుము. చూతము.

కం॥ అకలుషమతిచే రాముఁడు, సకలం బగుభూతతతికి•సాంత్వోక్తులచేఁ
బ్రకటాభీష్టదుఁడై త్యా,గకలన లోకులను జేయుఁ•గైవసపడఁగన్. ౩-౨౫

అకలుషమతిచే=నిర్మలమైన మనస్సుచేత, సాంత్వోక్తులచే=సమాధానవాక్యములచే, అభీష్టదుఁడై=కోరినకోరికలనిచ్చువాఁడై, త్యాగకలనన్=త్యాగగుణముచే, కైవసపడఁగన్=స్వాధీనపడునట్లు.

## తాత్పర్యము

ఒకరైన రామునియందు వేడుకకైన నిందచెప్పని కారణ మేమందువా, ఆయన తన బలముచేఁ బరులను లోపఱచుకొనువాఁడుకాఁడు. నిర్మలమైన కలుషములేని మనస్సుచేఁ గొలఁదులు గొప్పలను విచారములేక తాను నష్టపడి కష్టపడియైనను మంచిమాటలచేతనే వారు వారు కోరిన కోరికల నెఱవేర్చుచుఁ దనత్యాగగుణముచే లోకుల నెల్లఁదన వశపఱచుకొనును.

కం॥ వరసత్యంబున లోకో త్కరము, దరిద్రులను నీవిఁ•దగుశుశ్రూషన్
గురుజనముల, సంగరమునఁ బరులం దనవింట, వీర•వర్యుఁడు గెలుచున్.

ఎవరెవరినెట్లెట్లు శ్రీరాముఁడు వశపఱచుకొనునది యీ పద్యంబునఁ జెప్పఁబడెను.

వరసత్యంబునన్=నెపములేని సత్యముచే, లోకోత్కరమున్=భూలోకమును ఊర్ధ్వలోక సమూహమును, ఈవిన్=దానముచే, దరిద్రులను=పేదలను, శుశ్రూషన్=సేవచే, సంగరమునన్=యుద్ధమందు, మోసమునఁగాదు, పరులను=శత్రువులను, వింటన్=వింటిబలముచే, వింట ననుటచే, వింటిని జూపుటచేతనే యా సంరంభముఁజూచి శత్రువులు భయపడుదురనియు యుద్ధమున బాణ ప్రయోగము చేయవలసిన పనియులేదని భావము. వీర వర్యుఁడు అన్ని విశేషణముల కన్వయము,సత్యవీరుఁడు దానవీరుఁడు రణవీరుఁడు నని గ్రాహ్యము.

ఈ పద్యవిషయమున నొక యైహ్యము గలదు.

పూర్వమొక చోళదేశపురాజు తన యాస్థానమందుండు మధ్యమ వీథి భట్టారకునిఁజూచి 'ఆత్మానం మానుషం మన్యే' యని చెప్పుకొన్న శ్రీరామ చంద్రుఁడు జటాయువునకు మోక్షమిచ్చె గదా. దానివలన నాయన పరత్వము ప్రకటితముకాలేదా యని యడిగెనఁట. ఆ పండితుఁడు 'సత్యేనలోకాన్ జయతి' 'సత్యమున లోకోత్కరము గెలుచు'నను వాక్యము మఱచితివా యనెనఁట. దానికి రాజు సంతోషించి యాయనను గౌరవించెనఁట.

## తాత్పర్యము

సత్యముచేఁ బదునాలుగులోకములను దాన బలముచేఁ బేదలను,శుశ్రూషచే మెప్పించి తల్లిదండ్రి నాచార్యులను వింటిని జూపుటచే యుద్ధమందు శత్రువులను రామభద్రుఁడు గెలిచి తనకు వశపడఁ జేసికొనును.

కం॥ వరసత్యము దానంబును, గురుతపమున్ శుచిత మైత్రి గుణ•మార్జవమున్
గురుసేవ విద్య త్యాగము, స్థిరముగ నారామునందె•చెలఁగుచు నుండున్.

శ్రీరామునందుఁగల గుణము లీనాలుగుమాత్రమే కావనియుఁ దక్కినవారి యందుఁ గలవుగాక యవిస్థిరముగా రామునందే యున్నవనియుఁ జెప్పుచున్నాఁ

సత్యము = భూతహితముగాఁబలుకుట, దానము = భూలోక స్వర్గలోక ఫలము లాశించి పాత్రులకు ధనాదులిచ్చుట, తపమున్=శాస్త్రపద్ధతిని నుపవాసాదులుచేయుట, శుచిత=స్నానాదులచే దేహమును, కామాది షట్క రాహిత్యముచే మనస్సును నిర్మల పఱుచుట, మైత్రి=తన్నాశ్రయించిన వారిని రక్షించుట,ఆర్జవము=త్రికరణశుద్ధిగాఁ గపటములేక వర్తించుట, సేవ=కాళ్ళు పిసుకుట మొదలైనవి, విద్య=జ్ఞానము- దానిని గలిగించు చదువులు, త్యాగము=ప్రతిఫలాపేక్షలేని దానము.

## తాత్పర్యము

శ్రీరామునందీనాలుగు గుణములేకదా యున్నవందువేమో. అట్లుగాదు, నిర్వ్యాజ సత్యము, దానము, గొప్పతపస్సు, శుచిత్వము, మైత్రి, ఆర్జవము, గురుశుశ్రూష, జ్ఞానము త్యాగము నను గుణములు సర్వకాలములందు స్థిరముగ శ్రీరామునందే నెలకొని కాఁపురములు చేయుచున్నవి, కాని తక్కినవారి యందు వలె నొకవేళయుండి యొకవేళ లేకపోవు

కం॥ ఆర్జవసంపన్నుండును, నిర్జరతుల్యుఁడు మహర్షి•నిభతేజుండ
తూర్జితయశుఁ డగురాముఁడు, వర్జింపఁగ దగినయట్టి•వాఁడే దేవీ? ౨౨

ఆర్జవ సంపన్నుఁడు=ఋజుత్వమే సంపదగాఁగలవాఁడు, నిర్జరతుల్యుఁడు=దేవతతో సమానుఁడు, మహర్షి నిభతేజుఁడు=మహర్షుల తేజస్సువంటి తేజస్సుగలవాఁడు, అతూర్జిత యశుఁడు=మిక్కిలి వృద్ధిపొందుకీర్తిగలవాఁడు,వర్జింపఁగన్=వదలి పెట్టఁగ.

## తాత్పర్యము

దేవీ! వివేకములేనిదానా ఋజుగుణమే సంపదగాఁ గలవాఁడును దేవతతో సమానుఁడును, మహర్షుల తేజస్సువంటి తేజస్సుగలవాఁడును నగుటచే నిగ్రహానుగ్రహశక్తిగలవాఁడును,ఈవయస్సునందే యింతను ప్రభుత్వము మొదలైనవి లేకయే విస్తారమైన కీర్తిని సంపాదించిన వాఁడునగు శ్రీరామచంద్రుఁడు విడువఁదగిన పుత్రుఁడా ?

కం॥ అప్రియవాక్యంబును జగత్ప్రియుఁ డగురామునకై మ•దిం దలఁపఁగ లే,
నాప్రియపు తునదెట్టులు, నీప్రేరణ నప్రియంబు•నేవచియింతున్? ౨౩

లోకమునకంతయుఁ బ్రియుఁడగు శ్రీరామునకు నప్రియమైనమాట యతని మనస్సే నొచ్చునో లోకము మనస్సే నొచ్చునో యని నేను మనస్సునందైనఁ దలఁపలేను. ఇట్లుండ నా ప్రియ పుత్రుఁడగు శ్రీరాముని నీప్రేరణమునకు లోబడి యెోరీ యడవులకుఁ బోరాయని యెట్లు చెప్పఁగలను. అది సాధ్యముకాని కార్యము.

—• దశరథుఁడు కైకను వేఁడుకొనుట. •—

తే॥ క్షమయు దమమును ద్యాగంబు•సత్యరతియు
ధర్మముఁ గృతజ్ఞతయును భూ•తంబులందు
నెల్ల దయయును గలుగుసీ•తేశుఁ బాపి
తేని యయ్యయొ నాగతి•యేమి చెపుమ? ౩౩౦

క్షమ=సహనము-ఓర్పు, దమము=ఇంద్రియ నిగ్రహము, త్యాగము=దానమునందుఁ దెంపు, సత్యరతియు=సత్యమునందుఁ బ్రేమ, కృతజ్ఞత=చేసిన మేలు మఱువకుండుట, దయ=పరులదుఃఖమును సహింప లేకుండుట.

తాత్పర్యము

నేనొకవేళ దురుసుగ మనస్సు నొవ్వమాటలాడినను బదులుచెప్పక సహించుకొను వాఁడును, నావలెఁ గామక్రోధదాసుఁడుగాక నాధన మాశింపక, నే నియ్యలేదని రోషింపక, యింద్రియములజయించియుండు వాఁడును, తనసొత్తొకరికిచ్చునేకాని యొకరిసొత్తు తనకు రావలయునని కోరనివాఁడును, పరులిచ్చినసను బుచ్చుకొననివాఁడును, తాను గష్టపడియైనను దన సత్యమునే గాక యితరుల సత్యమును రక్షించుటయందుఁ బ్రేమగలవాఁడును, సామాన్య విశేష ధర్మముల నా యా సందర్భముల వదలనివాఁడును, ఒకరెంత యల్పమైన యుపకారము చేసినను మఱవక సమయము పడెనేని ప్రత్యుపకారము చేయువాఁడును, సర్వభూతములందు దయగలిగి వానిదుఃఖమును దనదుఃఖముగాఁ జూచుకొని దాని బరిహరింపఁ జేయువాఁడును, నగు శ్రీరాముని నన్నెడఁబాసి పోవఁజేసితివేని యయ్యయ్యో నాగతియేమే నే నెట్లు జీవింపఁగలనే నన్నెవ్వరేయావల నాదరింతురు.

కం॥ పొమ్మనియెడి వీడిటు రాఁ•రమ్మనియెడిఁ గాడు నన్నుఁ•రమణీ! ముదకన్
జుమ్మీ తపస్విని దీనుం,డ మ్మఱిమఱి వేఁడువాఁడ•ననుఁ గావఁగదే. ౩౩౧

వీడు=ఇల్లు, కాడు=స్మశానము, ముదుకన్=ముసలివాఁడను, తపస్విని=చూచిన నలువురు భయపడునట్లు కృశించిన వాఁడను, దుర్బలుఁడను.

వాఁడన్ + మఱి. వాఁడమ్మఱి. ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశంబగు. కమ్మనిలతాంతములకు మ్మొనసి యని భారతము. ఆది ౫ అ.

తాత్పర్యము

ఇన్ని నాళ్ళు నిన్ను శ్రీరాముఁడే రక్షించెనా నీవు నిన్ను రక్షించుకొనలేదా, ఇప్పుడు మాత్రము శ్రీరామచంద్రుఁడు లేకుండిన నీకు రాఁగల హాని యేమి నేనులేనా యందువా.

ఇల్లిక నాలోనుండవలదు పొమ్మనుచున్నది; స్మశానము నాలోనికి రమ్మనుచున్నది.అట్టి సంశయస్థితిలో నున్నవాఁడను. అట్టి తలంపు నీకేల కలిగెనందువా

ముసలివాఁడను. ఆసన్న మరణుఁడ నగుటచే దుర్బలుఁడను గృశించిన వాఁడను ధైర్యములేనివాఁడను. కావున నీ కారణములచే మునుపటివలె నన్ను నేను రక్షించుకొనఁజాలను. కావున శ్రీరాముని సాహాయ్యము దొలఁగఁ దీయవలదని నిన్నుఁ బలుమాఱు వేఁడుచున్నాను. నన్ను రక్షింపుము.

కం॥ జలనిధి పర్యంతము గల,యిల లభ్యం బయిన గవ్వ•యేనియుఁ గొన కే
గలదన మంతయు నిచ్చెద,నలుగకుమీ తరుణీ! నను దయ•యామతిఁ గనుమీ. ౩౬

జలనిధి పర్యంతము=సముద్రము వఱకు, ఇల=భూమి.

తాత్పర్యము

సముద్రము పొలిమేరగాఁగల భూమియందు నాకు లభించిన దానిలో నాకై యొక గవ్వయైన నెత్తియుంచుకొనక సర్వము నీకే సమర్పించెదను. తరుణీ: నామీఁదఁ గోపింపకుము. నీవు వయస్సు దానవు. కావున ముసలివాఁడ నైన నాకష్టము నీ వెఱుంగవు. నాయందు దయయుంచుము. కోపింపకుము.

ఉ॥ అంజలి చేసి మ్రొక్కెదుదు•నంఘ్రుల నైన స్పృశింతు, రాముమీఁ
దం జలపట్టఁబోకు ముది•తా! శరణం బవు గమ్ము వానికిన్,
నెంజిలి మాన్పు, మిట్లయిన•నేర దధర్మము నన్ను సోఁక నం
చుం జనవర్యుఁ డత్యధిక•శోకరసాంబుధిమగ్న చిత్తుఁడై. ౩౭

అంఘ్రులు=పాదములు, స్పృశింతున్=తాఁకెదను, చలపట్టి=చలము పట్టి- హఠము వహించి, శరణము=రక్షణము, నెంజిలి=మనస్సున విచారము, అత్యధిక=మిక్కిలి విస్తారమైన, శోకరసాంబుధి=శోకరసమను సముద్రమందు, మగ్న=మునిఁగిన, చిత్తుఁడై=మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

ముదితా నీవు సంతోషపడుచున్నదానవు. నాకేమో ప్రాణములు పోవుచున్నవి. పిల్లికిఁజెర్లాటము- ఎలుకకుఁ బ్రాణసంకటముగదా.కావున నీకు రెండు చేతులు జోడించి మ్రొక్కెదను. అదిచాలదేని నీ రెండుకాళ్ళంటి సాష్టాంగనమస్కారము చేసెదను.ఇంతయేలయందువా శ్రీరామునిమీఁది చలము మానుము. వానికి నీవే దిక్కుగమ్ము. అట్లుచేసిన నా విషాదము మానును. ఇప్పుడు నీకేల విషాదమందువా జ్యేష్ఠునివిడిచి పిన్నకు రాజ్యమిచ్చుటచేతను సభలో రామునికి యౌవరాజ్యమిచ్చెద నన్నమాట తప్పిపోవుటను నధర్మము నన్ను బాధించును. నీకుఁ బ్రమాణముచేసి తప్పితి నన్న దోషముపోవును, నీవు క్షమించిన నన్నే యధర్మము నంటదు. నీవు క్షమింపకపోయిన రెంటిలో నేదోయొకటి నన్ను బాధించును అని యీప్రకారము వదరుచు శ్రీరామునికి రాఁగలకష్టమును రామ వియోగమునఁ దనకు కాఁగల శోకము నను సముద్రములో దశరథుఁడు మునిఁగిన మనస్సుగలవాఁడయ్యెను.

కం॥ సోలున్ ధరపయి మూర్ఛల, వ్రాలున్ మఱి లేచు శోక•వారిధికూలం
బేరీల నైనఁ జేర్పవె, బాలా! యను నిట్లు వగచు•పార్థివుఁ గనుచున్. ౩౩౪
సోలున్ = పడును.

తాత్పర్యము

నేలమీఁద సోలిపడును. తెలివితప్పి కొంతసేపు మూర్ఛపోవును మరల లేచును. బాలా! నీ వేవిధమునైన నన్నీశోకసాగరము తీరముఁ జేర్పుమని యేడ్చును. ఇట్టి రాజునుజూచి,

—• కైక దశరథుని దూషించుట. •—

ఉ॥ చేడియ రోషభీషణవి•శేషభయప్రదవాక్యయుక్తయై
యాడె, నొసంగువాఁడనని • యాడి వరంబులు నేను గోరని
ట్లీడుచు చున్నవాఁడ వగు•నే? యిఁక మీఁదట నీకు నెట్లునో
రాడును ధార్మికుండ నని • యందఱిలోఁ దగవు ల్వచింపఁగన్? ౩౩౫
రోషభీషణ......యుక్తయై=కోపముచే భయంకరయై మిక్కిలి భయమును గలిగించు మాటలతోఁ గూడినదై, ఆడెన్=ఇట్లనెను, తగవుల్=ధర్మములు.

తాత్పర్యము

కైక కోపాతిశయముచే భయంకరమూర్తియై మిక్కిలి భయమును గలిగించు వాక్కులచే రాజునుజూచి యిట్లనెను. ఏమోయీ రాజా! నీవు వరములు కోరుము నేనిచ్చెదనని ప్రమాణముచేసి నన్ను నమ్మించి నామగఁడు ప్రియుఁడు సత్యవాది ధర్మజ్ఞుఁడు కృతజ్ఞుఁడు నని నేను బేలనై నమ్మి యేవో రెండువరములు కోరఁగా నవి యిచ్చుటకిట్లు గోలుగోలున ముఖమున గుడ్డవైచికొని యేడ్చుచున్నవాఁడవు. ఇది నీకుఁదగునా? ఇట్టి వగలేడ్పులచే నన్ను మోసగించెదవేని రేపు నలుగురిలో నేను ధర్మాత్ముఁడనని గద్దెపొంకములు చెప్పుటకు న్యాయములు దిద్దుటకునీకు నోరెట్లాడును. నీయంతఃకరణము నిన్నుఁ జంపదా? నలుగురు నవ్వరా? ఈరాజు ధర్మము లొకరికిఁ జెప్పువాఁడేకాని తా ననుష్ఠించువాఁడు కాఁడు అనరా.

ఉ॥ ఏయెడనన్ని ధాత్రిఁ గల • యెల్ల నృపర్షులు నీవుఁగూడుచో
నీయవనీశచంద్రుఁడు మ•హిష్ఠసుధర్మరతుండ టన్న నే
చాయ వచింతొ? యేసతిప్ర•సాదమున న్మనినాఁడ నట్టిదై
కేయి యెడాటమందు నుడి • గీడ్పడె నందువె ధార్మికోత్తమా? ౩౩౬
మహిష్ఠ=మిక్కిలిగొప్పదియగు, సుధర్మ = మేలైనధర్మాచరణమందు, రతుండు=ప్రేమగలవాఁడు, చాయ=విధము, ప్రసాదమునన్=అనుగ్రహముచే, మనినాఁడన్=బ్రతికితినో, ఎడాటమందున్=విషయమందు, నుడి=మాట, కీడ్పడెన్=చెడిపోయెను, ధార్మికోత్తమా ఇది యెత్తిపొడుపుమాట.

తాత్పర్యము

ఓధర్మాత్ములందు శ్రేష్ఠుఁడా యేప్రదేశమందైన రాజులు ఋషులు (రాజర్షులు) నీవు కలిసినపుడు వారు నిన్నీరాజు గొప్పధర్మాత్ముఁడు సత్యవాది యని పొగడిరేని యప్పుడు నీవేమి చెప్పెదవు. మీరు చెప్పినది సత్యమేకాని యేకైక నాప్రాణములు రక్షించుటచే నింకను జీవించి యున్నాఁడనో యట్టిప్రాణదాత్రి విషయమందుమాత్రము బొంకితి నని యందువా?

ఉ॥ ఎల్లనృపాలచంద్రులకు • నేర్పడ దోషము నీకతంబునన్
జెల్లునె? యిప్పు డాడినద • చేయఁగ నొల్లక నీదువాక్యమే
పొల్లపడంగఁ జూచెదవు • పూర్వము శైబ్యుఁడు పావురంబునున్
మల్లడిపెట్టుడేగకు స్వ•మాంసముఁ గోసి యొసంగఁడే నృపా. ౩౩౭

పొల్లుపడంగన్=వ్యర్థమైపోవునట్లు, శైబ్యుఁడు=శిబిచక్రవర్తి, మల్లడిపెట్టు=బాధించు.

తాత్పర్యము

ఇది యాఁడుది ఇది నన్నేమిచేయఁగల దని నాతో నసత్యమాడితివేని నీవలన రాజులకందఱకు నపకీర్తివచ్చును. వారియందుఁ బ్రజలకు నమ్మకము చెడును. రాజులమాట యెవ్వరు నమ్మరు. ఇక్ష్వాకువంశమునఁ బుట్టి గొప్పధర్మాత్ముఁడు సత్యసంధుఁడని జగములనెల్లఁ బ్రసిద్ధిగాంచిన దశరథునంతవాఁడే ఘోరప్రమాణములు చేసియు నల్పవిషయమున బొంకెనే యిఁక నేరాజుల నెట్లు నమ్మవచ్చునని లోకప్రవాదము శాశ్వతముగ వ్యాపించును. ఇప్పుడు నిమిషమునకు ముందుచేసిన ప్రమాణమునే వ్యర్థపఱుపఁ జూచెదవే యిఁక నేనాఁడోచేసిన బాసల్కా. నీవు జ్ఞప్తియందుంచుకొని సార్థకపఱిచెదవు? సత్యస్థాపనమునకై పూర్వపురాజు లెట్లెట్లు వర్తించిరోయెఱుఁగవా? పూర్వము శిబిచక్రవర్తి యొక వనములోఁ గూర్చుండియుండ నొకడేగ యొకపావురమును దఱుముకొనివచ్చెను. శరణు శరణని యాపావురము పరువునవచ్చి శిబియొడి లోఁబడెను. వెంటనే యా డేగవచ్చి రాజా యిది నాకు వేదసమ్మతమైన యాహారము. నేనాఁకట మలమల మాడుచున్నాను. నాయాహారము నీవీయ నిరాకరించితివా నేనాఁకలిచేఁ జత్తును ఆ హింసాదోషము నీదిసుమా కావున నాయాహారము నాకిమ్మనెను. ఇది ప్రాణభయముచే నాశరణు చొచ్చినది. శరణాగతుల రక్షించుట నావ్రతము. ఆ మాట నేను దప్పను-నీకు నాహారము కావలసియుండెనేని వేఱుమాంసము నిత్తు ననన దినీ దేహమాంసమే యిమ్మని కోర శిబి తనచేతికత్తిచేఁ దన దేహమునందలి కండలు కోసి యిచ్చెను. ఒక యడవపక్షినిమిత్తమై యసత్యమాడరాదని యంత కార్యముచేసిన ధర్మాత్ములుండ నీయల్పవిషయమునఁ గృతఘ్నుఁడవై యెట్లసత్యమాడ సాహసించెదవు. ఆయన నీవంటిరాజుగాఁడా?

కం॥ లోచనములు నీ విమ్మని, యాచించినఁ దన్ను నొక్క•యవనీవిబుధుం
డాచరితతదీయేష్టం,డై చనఁడె యలర్కనృపతి•యతులితగతికిన్. ౩౩౮

లోచనములు=కన్నులు, ఆచరిత=నెఱవేర్పఁబడిన, తదీయేష్టుఁడై =వాని కోరికగలవాఁడై, అతులితగతికిన్=అసమానమైన, యుత్తమగతికిన్-చనఁడె = పోయినవాఁడు కాఁడా;

అలర్కుఁడు పురూరవుని కుమారుఁడగు నాయువుసంతతిలోఁ జేరిన క్షత్రవృద్ధుని వంశమువాఁడు-లోపాముద్రానుగ్రహముచే ౬౬౦౦౦ఏండ్లు జీవించెను.

తాత్పర్యము వి.పు. ౪-౮

ప్రమాణముచేసి యుపకారమునకుఁ బ్రత్యుపకారముగ నిచ్చెదనని యిచ్చుటకు నిట్టులేడ్చెదవే యొక బ్రాహ్మణుఁడు తనకు నేత్రము లిమ్మని యాచింపఁగా నలర్కుఁడనురాజు వేడినదిచ్చెద నన్నమాట తప్పక తనకన్నులిచ్చి యతని కోర్కిదీర్చి యుత్తమలోకములు పొందలేదా? నీవిది వినలేదా?

తే॥ కడలి యేటికిఁ జెలియలి•కట్ట దాఁటి, రాదు సమయంబు చేతన•కాదె, వీనిఁ
జక్కయోజించినీవా క్క•సత్యదూషి,తంబు గానీక నిలుపు య•శంబు జగతి.

కడలి=సముద్రము, సమయము = నియమము, అసత్యదూషితము = అబద్ధముచేఁ జెడినది.

తాత్పర్యము

రాజా! చెలియలికట్టదాఁటిరానని దేవతలకుఁ దానుజేసిన నియమమునకు లోపడిగదా సముద్రము పొంగి భూమిని మ్రింగకున్నది. దానికిశక్తిలేకయా. వారువారు వారివారి నియమములందు నిలువరేని లోకముచెడదా. నీవు సత్యమునకుఁ గట్టుపడక పోయితివేని రాజానుమతము ధర్మము రాజసత్యమాడినపుడు మనమేల యాడరాదని లోకులందఱు నసత్యమాడరా? కావున నివియెల్లఁ జక్కఁగా నాలోచించి నీసత్యనియమ మసత్యముచేఁ జెడకుండ రక్షించుకొనుము. ఎట్టి ప్రాణగొడ్డములందును దశరథుఁ డసత్యమాడఁ డనుకీర్తి దక్కించుకొనుము.

ఉ॥ ధర్మము రోసి సత్యము నె•దం దలపోయక రాము రాజుగాఁ
గూర్మిని జేసి నిత్యమల•కోసలకన్యకతో రమించెదే?
ధర్మమెః లేకధర్మమొ బు•తంబొ యసత్యమొ యౌను గాక, యో
దుర్మతి! యేల నేను విడు•తున్ భవదాశ్రుత మీక తక్కినన్? ౩౪౦

రోసి=అసహ్యించుకొని, విడిచి; ఎదన్=హృదయమందు, తలపోయక = ఆలోచింపక. కోసలకన్యక=కౌసల్య, భవదాశ్రుతము=నీవుచేసినప్రమాణమును.

### తాత్పర్యము

ఓరీ! దుష్టబుద్ధీ; నీవగలు నీనటనములు నీబూటకములు నేను దెలిసికొనలేనని తలంచితివా! ధర్మము నీకుఁజేఁదై వదలి సత్యము నాలోచింపక శ్రీరాముని రాజుగాఁజేసి కామదాసుఁడవై యెల్లప్పు డాకౌసల్యతోఁ గ్రీడింపఁదలంచెదవా కానీ నాచర్య ధర్మమో అధర్మమో అసత్యమో సత్యమో ఆవిచారముతో నాకుఁ బనిలేదు.నాకు నీవుచేసిన ప్రమాణము ప్రకారము నడచుకొనకపోతివా నిన్నూరక విడిచెదనని తలఁచితివా? అది భ్రమమాత్రమే. నీవు తప్పించుకొని పోఁజాలవు. నాసవతి నీకంతతీఁపై నేనంతచేఁదై తినిగదా. నయభయముల నన్ను మోసగింపఁ జూచెదవా? కానీ.

కం॥ రాముని రాజుగఁజేసెద,వా మహితవిషంబుఁ గ్రోలి•వసుధేశ! యిదే
నీముందట నీవు గనన్, నే మరణము నొందుదాన•నిక్కము సుమ్మీ. ౩౪౧

### తాత్పర్యము

శ్రీరామునే నేను రాజు చేసెదను. నీవు నన్నేమి చేయగలవు అనెదవా? నేను నిన్నేమిచేయఁగలను గాని నీయట్టి మోసగానికి నసత్యవాదికి- బ్రేమలేని వానికి భార్యగానుండి యవమాన పడుటకంటె మరణించుటే సుఖము కావున నీవు చూచుచుండఁగనే నీకన్నులయెదుటనే యీక్షణమందే తీవ్ర విషముద్రాగి మరణించెదను. నామృతికి నీవు కారణమై యనృతదోషము స్త్రీహత్యాదోషము విశ్వాస ద్రోహమువలనఁ గలుగు పాప మనుభవించుచు నీపెద్ద పెండ్లాముతోనే సుఖసాగరమున నోలలాడుము. ఇది నిజము. నేను నీవలె నసత్యమాడుదానను గాను. నమ్ముము.

కం॥ కరములు మోడిచి యందఱు, నురువుగ రామాంబ కెరఁగ•నొకదినమేనిన్
ధర బ్రదికి చూచుకంటెను, మరణంబే నాకు మేలు•మనుజవరేణ్యా. ౩౪౨

నీకు వచ్చునాదాయమంతయు నాకిచ్చెద నంటివి. నేను లంచగొండినిగాను. నీధనముతో నాకుఁ బనిలేదు; ధనమునిమిత్తమైనేను భరతుని రాజ్యాభిషేకము కోరలేదు. సవతి సౌభాగ్యము నేనుజూడలేను. దానిచే నే నవమానపడలేను.

చూచుటకంటెన్, చూచుకంటెన్- కొఱకుకంటె పొంటెలు పరంబులగు నపుడు వార్థక టవర్ణంబునకు లోపంబు విభాషనగు. త్రి. క్రి. ౧౪ సూ.

పరిచారికలు పరిచారకులు లోకులందఱు చేతులు జోడించుకొని గౌరవముతో శ్రీరాముని తల్లికి నమస్కరించుచుండఁగా నొకదినమైన భూమిపైబ్రదికి చూచుచు బాధపడుచుండుటకంటె మరణబాధయైన నాకు మేలే.

ఇచ్చట నొక పూర్వవ్యాఖ్యాత మగఁడు చచ్చినను జావనీ కొడుకునకు రాజ్యము కావలయునని కోరుటచే స్త్రీలకు మగనియందుండు ప్రేమకంటెఁ బుత్రులయందుఁ బ్రేమమెండని సూచితమని వ్రాసెను. ఇది సామాన్యధర్మమే కాదనరాదు. భార. ఆది. నహి భార్యేతి విశ్వాసః, కార్యః పుంసాకథంచన నహి

మనుధ్యాతి, నారీ పుత్రవతీసతీ॥ యని కలదు. అదియునుగాక తనకొడుకునకు విరోధముగ వర్తించెనని కాశీరాజుభార్య యొక పళ్లెరములోనివే బొరుగులు తాను దినుచువానిలో విషము కలిపియుంచిన బొరుగులను భర్తకుఁబెట్టి చంపెను జాతాపత్యాపతింద్వేష్టి=బిడ్డలుగలది మగనితో విరోధించును. అయినను కైక విషయమున సవతి మచ్చరమెక్కువయా పుత్రస్నేహ మెక్కువయా యని యాలోచించినపు డీ ౩౪౦-౩౪౨ పద్యములందు నామెవాస్తవాభిప్రాయము వ్యక్తమగుచున్నది. సవతి మచ్చరము ముఖ్యము. పుత్రస్నేహము గౌణము మంథర నొక్కి చెప్పినదియు నీవిషయమే. సవర్ని మాత్సర్యము లేదేని శ్రీరామపట్టాభిషేకమునకుఁ గైక యాక్షేపించియుండదు. కౌసల్యచేఁ దన కవ మానము గలుగు నను భీతియే కైకకుఁ గోపకారణము. అటని యైశ్వర్యకాంక్ష లేదనరాదు.

పాండురాజు ప్రేరణముచేఁ గుంతీదేవి మాద్రికిఁ బుత్రదమైన మంత్రము పదేశించెను. దానిచే నామె నకుల సహదేవుల నముదలఁగాంచెను. సవతియగు కుంతికి ముగ్గురు కొడుకులున్నారే నాకిరువురే. మరల నామంత్రము తనకుఁ గుంతి చెప్పునట్లు చేయుమని మాద్రి భర్తను బ్రార్థించెను. పాండురాజుకుంతికి బోధించెనుగాని కుంతీదేవి “ఈమె యొకసారికే యిరువురు దేవతలఁగోరి యిరు వురు కుమారులఁగనెను. నేను మోసపోయితిని. మఱియొకసారి చెప్పిన మరల గనును. అప్పుడు నాకంటె హెచ్చగును. కావున నేను జెప్పననెను. అరుంధతి వంటి స్త్రీ వసిష్ఠునివంటివానిని సందేహించినట్లు భారతంబున నాదిపర్వంబునఁ గలదు. గాంధారి బిడ్డలఁగనెనని విని మాద్రి బొమ్మలు గుద్దుకొనెను. కుంతికి ధర్మరాజు పుట్టెనని విని గాంధారి గర్భస్రావము చేసికొనెను. కావున స్త్రీల యందుఁ బుత్రప్రేమకంటె సవతి మాత్సర్యము మెండని యేర్పడుచున్నది.

—• కైక నిష్ఠురోక్తులకు దశరథుఁడు విహ్వలుఁ డగుట. •—

కం॥ నృప! నాపై భరతునిపై. శపథం బొనరించుదానఁ • జక్కఁగ వినుమీ
కృప లేక రాము నడవుల, కిపు డనుపుట తక్కనొంట • నేఁ దృప్తిపడన్.
శపథము=ప్రమాణము-ఒట్టు. ౩౪౩

తాత్పర్యము

ఓయిరాజా! నీవు నీమీఁదను నీప్రియపుత్రుఁడగు శ్రీరామునిమీఁదను బ్రమాణము చేసితివిగదా నామాటలు చక్కఁగావినుము. నామీఁదను నాకొంటి కొడుకగు భరతునిమీఁదను బ్రమాణము చేసెదను. నిష్కారణముగ శ్రీరాము నెట్లు కష్టపెట్టుదు నను దయవదలి శ్రీరాముని నడవులకుఁ బంపుటదక్కఁ, దక్కి నవి నీ వెన్ని చెప్పినను, నెన్ని యుపాయములు చేసినను, నేను తృప్తి పడుదానఁగాను. ఇది సత్యము.

చం॥ మెలఁత వచించియిట్లు విర • మించి కడు న్వగఁ గందుజేనితోఁ
బలుకక యుండె, నాతఁడును • భామిని కోరినచెడ్డకోరికల్
తలఁచి మనంబు విహ్వలతఁ • దత్తఱ మంద ముహూర్తమాత్రదా
నలుకను బల్కు మాని సతి • నట్టి కనుంగొని దుఃఖతప్తుఁడై. ౩౮॥

మెలఁత=స్త్రీ-కైక.

## తాత్పర్యము

ఈ ప్రకారము తన నిశ్చయమును దెలుపు చరమవాక్యము వచించి యిఁక నీయిష్ట మేమిచేసెదవో చేయుమని దుఃఖపడురాజుతోఁ బలుకక యూరకుండెను. దశరథుఁడును కైక కోరిన చెడ్డకోరికలఁ దలఁచితలఁచి మనస్సు విరవిరఁబోవుచుండఁ గొంతసేపు కోపముతో దుఃఖముతోఁ దపించుచు నేమిచేయుటకుఁ దోఁపక యామె ముఖము రెప్పవ్రాల్పక చూచుచుండెను.

చం॥ పిడుగులువోలెఁ దాఁకుచుఁ ద • పింపఁగఁ జేయుమనోఽప్రియోక్తులన్
దొడిఁబడు స్రుక్కు, నాయువిద • దుర్వ్యవసాయము నెంచి యెంతకుం
దొడఁగెనురా దురాత్మిక యఁ • నం, దనచేసినబాస నెంచుచున్
మిడుకును, రాముఁగూరిచి త • మిం దలపోయుచు నూర్పు వెచ్చనన్. ౩౯॥

మనోఽప్రియోక్తులన్=మనస్సునకు నప్రియమైన మాటలను, తొడిఁబడున్=తొట్రుపాటుపడును, దుర్వ్యవసాయము = చెడ్డనిశ్చితపుఁదలఁపును, తొడఁగెను=ప్రయత్నించెను, దురాత్మిక=చెడ్డమనస్సుగలది, బాస=ప్రమాణము

## తాత్పర్యము.

కైకయాడిన యొక్కొక్క యప్రియమైనమాట యొక్కొక్క పిడుగువలెఁ దాఁకి తపింపఁజేయఁగాఁ దొట్రుపాటుపడును. ఆమెదుష్టనిశ్చితాభిప్రాయ మెఱింగి యాహా! దుష్టచిత్త యెంతపాపకార్యమునకుఁ బూనెరా యని యాశ్చర్యపడుచు దీని నని యేమిప్రయోజనము? ఆలోచనలేక యింతఘోర ప్రమాణము ముందు మించిచేసితినే యని తపించును. అయ్యో! రామా! నాయనా! నీవెట్టులురా తండ్రీ! యడవిలోఁ గష్టపడెదవు అని యాలోచించుచు వేఁడి నిట్టూర్పులు విడుచును.

కం॥ రామా రామా యనుచును, భూమీశుఁడు నేల వ్రాలెఁ • బొలుపఱి మూర్ఛన్
వే మూల మంట నఱికిన, భూమి దబా లనుచుఁ బడెడి • భూరుహ మనఁగన్

పొలుపఱి. పొలుపు + అఱి=పొలుపుచెడి, దబాలనుచు=భారమైన వస్తువు పడుట యందగు ధ్వన్యనుకరణము, భూరుహము=చెట్టు, మూలము=వేరు.

## తాత్పర్యము

ఏమిచేయుటకుఁ దోఁపక తన యవివేకమువలన నిష్కారణముగ రాఁగల దుఃఖమాలోచించి సహింపలేక యాయననే ధ్యానించుచు రామా రామా యని

వెఱ్ఱివలె నఱచి వేరుమొదలంటనఱకిన దవాలునఁ బడు చెట్టువలె దశరథుఁడు మూర్ఛిల్లిపడెను.

తే॥ నష్టచిత్తునిరీతి నుఁన్మత్తుజాడ, భూరితరరోగపీడితుఁ బోల్కిఁ దేజు
గూలిపోవంగ మంత్రాళిఁ గుంటుపడిన,
పాముగతి నయి దీనోక్తిఁ బలికెవిభుఁడు. ౩౪౩

నష్టచిత్తునిరీతిన్=నాశనమైన మనస్సుగలవానివాలె ఉన్మత్తుజాడన్=మనస్సుండియు స్వాధీనమందులేని పిచ్చివానివలె, భూరితర రోగపీడితుపోల్కిన్=మనస్సు తన స్వాధీనమందుండియు గొప్పరోగముచే బాధింపఁబడువానివలె, పాముగతిన్=రోగము లేకున్నను, కఱవశక్తియున్నను మంత్రములచేఁ గట్టుపడి కదలలేని పామువలె.

తాత్పర్యము

మనస్సులేనివానివలెఁ, బిచ్చివానివలె, గొప్పరోగముతో బాధపడువానివలె, మంత్రములచేఁ దన తేజస్సుపోఁగాఁ గదలలేక కాఁపుండియుఁ బ్రయోజనము లేని పామువలె నయి రాజు దీనవాక్యముల నిట్లనెను:-

ప్రశ్న:- వివాహసమయమునఁ జేసిన వాగ్దానము లెక్కకురాదను తలంపుతో దాని నాధారముగఁ గొనక యీయుపాయము కైకచేఁ వెదకఁబడెను. అయినను రతివేళ స్త్రీలతో బొంకవచ్చు నను న్యాయము కలదుగదా, ఆ నియమము ననుసరించి రతికై కామాతురుఁడనై చేసినప్రమాణము కావునఁ బాటింపకున్న దోషములేదని యేల దశరథునకు స్ఫురించినది కాదు.

ఉత్తరము:- దశరథుఁ డామాత్ర మాలోచన లేనివాఁడుకాఁడు. రతివేళ స్త్రీలు కోరు క్రొత్తకోరికయైనయెడల నట్టులేచేసెదనని చెప్పి యావలఁ దప్పవచ్చునుగాని ఇది యట్టిదికాదు. ఇది క్రొత్తకోరికయుఁగాదు.

అపత్సమయంబునఁ బ్రత్యుపకారబుద్ధితోఁ జేసినబాస. అప్పుడిచ్చిన వరము లిప్పుడిమ్మనెనేకాని కైక క్రొత్తవికోరినదికాదు. అప్పుడు మాటతప్పిన యుద్ధసమయమునఁ గృతజ్ఞుఁడై యిచ్చినవరములఁ దప్పినఁ గృతఘ్నుఁడు నసత్యవాదియు నగును గాని రతివేళఁ గోరినవరముల నిరాకరించినవాఁడు కాఁజాలఁడు. రతిసమయమగుట కాకతాళీయము. రతిసమయము కాకపోయినను పూర్వప్రమాణములకు దశరథుఁడు బద్ధుఁడే. అయినను వివాహసమయమునఁ గైకకు చేసినబాస, భరతునందుఁ దనకుఁ గల సందేహము, కైక భరతుని తల్లియగుట, శ్రీరామపట్టాభిషేక సమయమందే యామె వరములుగోరుట, యివియన్నియు నాలోచించి యిపుడు ప్రమాణముచేయక యుండవచ్చునేమోగాని కామాతిశయ వేగముచే నట్టి యాలోచన యాయనకుఁ దట్టినదికాదు. 'కామాంధోపి నపశ్యతి' యనికలదుకదా.

కాముకులకుఁగన్నులలేవు. శోణితశుక్ల సంభవో మాతృపితృనిమిత్తకః తస్యప్రదాన పరిత్యాగవిక్రయేషు మాతాపితరౌభవతః" బోధాయనులు. "తల్లిదండ్రులు నిమిత్తముగ రక్తశుక్లసంయోగమువలనఁ గలిగినవాఁడు పుత్రుఁడు వానిని దానమిచ్చుటకు, వదలిపెట్టుటకు, విక్రయించుటకుఁ దల్లిదండ్రులిరువురు నధికారులు" కొడుకు తల్లిదండ్రుల యుమ్మడిసొమ్మగుటచేఁ దండ్రియొకఁడే స్వతంత్రించి దానమిచ్చుటగాని పరిత్యజించుటగాని విక్రయించుటగాని చేయరాదు. తల్లియనుమతి యియ్యవలెను. ఇచ్చట నట్టియనుమతిలేదు కావున దశరథుకృత్యము న్యాయ్యమైనదికాదు.

సగరుఁ డసమంజుని దండ్రియను భావముతో వెడలఁగొట్టలేదు. అసమంజుఁడు దోషి గావున రాజగు సగరుచే దండింపఁబడెను.

రాజును నధికారమునుబట్టి శ్రీరాముని నడవులకుఁ బొమ్మనె నందమా నేరము లేక రాజెట్లు శిక్షింపఁగలఁడు? శ్రీరామచంద్రమూర్తి చేసిన నేరమేమి? రాజకీయ వ్యవహారముగఁగాక గృహకృత్యముగ విచారింతమా తల్లియనుమతి లేదు. అదియునుగాక "నజ్యేష్ఠ పుత్రం దద్యాద్గృహియాద్వాస హిసంతానా యపూర్వేషామ్॥ వసిష్ఠుఁడు. దానము విక్రయపరిత్యాగముల కుపలక్షకము. 'నమాతా నపితానస్త్రీ నపుత్ర స్త్యాగ మర్హతి. మను ౮-౮. తల్లి-తండ్రి-భార్య-కొడుకు వీరిని వదలిపెట్టరాదు. కావున నిష్కారణముగ జ్యేష్ఠపుత్రుని విడువరాదు. ఇట్టి యధర్మకార్యమును శ్రీరామచంద్రమూర్తి యెట్లులామోదించెను? ఇది ముందు విచారింపఁబడును.

—• దశరథుఁడు కైకేయితో న్యాయనిష్ఠురము లాడుట. •—

ఉ॥ ఎవ్వఁడె నీకు నిట్టివిష • మేచ్చను మే లని బోధ చేసెః నీ
వివ్విధి దయ్య మంటినటు • లేటికె నానయు లేక నాకడన్
గ్రొవ్విద మాడఁ జొచ్చితివి • కోమలిః నీయె మ న్నెఱుంగనే
యివ్వికటప్రవర్తనము • నిప్పు డ తోఁచె విపర్యయంబుగన్. ౩౪౭

భరతుపక్షము వా రెవ్వరో బోధించిరని తలఁచి దశరథుఁడనుచున్నాఁడు.

విషమేచ్చను=విపరీతపుఁ గోరికను, హానికరమైన కోరికను, నాన=సిగ్గు-క్రొవ్విదము=దుష్కార్యము చేయుమని గర్వోక్తిని-వికట ప్రవర్తనము=చెడునడవడి, విపర్యయంబుగన్=వ్యత్యస్తముగా, స్వభావవిరుద్ధముగ.

తాత్పర్యము

నీకు మేలని యిట్టిహాని కరమైనదాని నెవఁడు నీకు బోధించెనే. ఎవఁడైనఁ జెప్పెనుగాక నీవేల యివ్విధముగ దయ్యముపట్టినదానివలె సిగ్గువిడిచిమగఁడు-రాజునైన నాయెదుటనే యనరానిమాటలనఁ బూనితివి. ఇట్టిది మనమడుగ వచ్చినా విన్నవారేమందురు అనియైన నీకుఁ దోఁచినదికాదుగదా. కోమలీః నీదేహ మెంత కోమలమో నీమనస్సుకూడ నంతకోమలమని తలఁచి యుంటిని

గాని యిట్టి విపరీతవర్తనము ఇంతటి కఠిన హృదయము ఇంత సాహసము నీయందున్నట్టు మున్నెన్నఁడునేని నేనెఱఁగిన వాఁడఁగాను. ఇప్పుడు క్రొత్తగా నిట్టివార్పుగలుగ నేమికారణము?

ఉ॥ ఏటికె నీకుఁ గల్గె భయ • మేటికె నీ విటువంటికోరికల్
పాటిగఁ గోరఁ గొండికకుఁ • బట్టముఁ గట్టఁగ జ్యేష్ఠు రాము న
గ్రాటవిఁ ద్రోయ, భర్తకుఁ ద్వ • దాత్మజలోకులకుం బ్రియంబు నీ
మాటిః యొనర్ప నెంచినను • మానఁ గదే విపరీతపద్ధతుల్. ౩౪౯

కొండిక=చిన్నవాఁడు, ఉగ్రాటవి=భయంకరమైన యడవి, త్వదాత్మజలోకులకున్=నీ కొడుకునకు లోకులకు, నీమాటి=స్త్రీలయందుత్తమురాలా!

తాత్పర్యము

నీకు భయముగలుగ నేమికారణము? శ్రీరామునకుఁ బట్టాభిషేకము కానీ; నిన్నట్లుచేసెద నిట్లు చేసెదనని యెవరైన బెదిరించిరా. చిన్నవానికిఁ బట్టాభిషేకము చేయుమని పెద్దవానిని శ్రీరాముని భయంకరమైన యడవులపాలు చేయుమని యిటువంటి విపరీతపుఁ గోరిక లేమి న్యాయమని కోరితివే. దీనివలన నెవరెవరికే మేమి కీడు కలుగునది నీవాలోచించిన దానవుగావు. నీమగనికి నీకొడుకునకుఁ బ్రజలకు నిష్టమైన కార్యముచేయను దలంపుండెనా యిటువంటి విపరీతపు మార్గముల నడువకుము. నీవు తలపెట్టిన కార్యము ముగ్గురకుఁ బ్రియమైనదికాదు.

ఉ॥ ఓయదయాత్మురాల! కలు • షోషితధర్మవిచార! క్షుద్ర పా
పాయితశీల! రాఘవుని • పట్లను నాయెడ నేనిఁ జెప్పవే
యేయపరాధముంగనితొ • యేయెడ నీకును దుఃఖకారణం
బాయెనొ? తేర తేర కిటు • లాడుట నీతియొ సాధ్వీరీతియో? ౩౫౦

అదయాత్మురాల=దయలేని మనస్సుగలదానా, నీవిట్టులగుటకుఁ గారణమే మనెదవా? కలుషోషిత ధర్మవిచార=శ్రీరామునివంటి ధర్మాత్ముని నడవులపాలుచేసి దుఃఖపడఁ జేయవలయునను తలంపుచేఁ గలిగిన పాపముచే నష్టమైపోయిన ధర్మవిషయమున నాలోచన గలదానా; శ్రీరాముని విషయమునఁ గీడు తలంచిన పాపమే నీకిది ధర్మ మిది యధర్మమను నాలోచన లేకుండఁ జేసినది అట్టి బుద్ధి నాకేల గలిగెనందువా, క్షుద్ర=నీచురాలా! నీవు నీచపుబుద్ధి గలదానవు కావున; నాకేల యట్టి నీచబుద్ధి పుట్టెనందువా! పాపాయితశీల=పూర్వజన్మములందుండియే పాపిష్ఠమగు స్వభావము గలదానవు, తేరతేరకు=నిష్కారణముగ-(రూ) తేరకుఁదేర, సాధ్వీరీతియో=పతివ్రతకుఁదగిన విధమా

తాత్పర్యము

ఓసి దయలేనిదానా! పాపముచే నశించిన ధర్మాలోచనగలదానా! నీచబుద్ధీ! యాకారము గొన్న పాపమా! శ్రీరాముని యందుఁగాని నాయందుఁగాని యేమి నేరము కనిపెట్టితివి? ఏవిషయమున మావలన నీకు దుఃఖము గలిగెను. చెప్పవే

చూతము. నిష్కారణముగా నిటువంటి మాటలాడుట నీతియుఁగాదు. పతివ్రతలకుఁ దగినవిధముగాదు.

కం॥ రాముండు లేక యుండిన, నీ మహి భరతుండు పూనుఁ నే యెంతైనన్?
రామునికంటెను భరతుఁడె, భామిని! ధర్మంబునందుఁ ప్రాజ్ఞుఁడుసుమ్మీ.

ప్రాజ్ఞుఁడు=విశేషజ్ఞానము గలవాఁడు, శ్రీరామునందు పారతంత్ర్యనిష్ఠ గలవాఁడు.

## తాత్పర్యము

నీవేమో శ్రీరామచంద్రుఁడు నగరము విడిచిపోయిన భరతుఁడు నిష్కంటక రాజ్యమేలునని తలఁచితివి కాని నీకోరిక నెఱవేఱదు. ఏల యందువా శ్రీరామచంద్రుఁడు లేకపోయెనా భరతుఁడు భూభారమొక నాఁడైన భరింపఁడు. అదినీకెట్లు తెలిసెనందువా కోపనా! ధర్మవిచారమందు శ్రీరామునికంటె భరతుఁడే యెక్కువ తెలిసినవాఁడు కావునఁ బెద్దవాఁడుండఁగా చిన్నవాఁడు రాజ్యము భరించుట ధర్మముకాదని యెఱిఁగి రాజ్యమును గొంతయైనఁ బాలింపఁ బూనఁడు. శ్రీరాముఁడుండి కొంతభాగమాయన పాలించినఁ గొంత భరతుఁడు పాలించుట కంగీకరించునేమో. అటు గావున రాజ్యమును రెండు భాగములుగానో నాలుగుభాగములుగానో చేయఁగోరుము. లేదా యూరకనగర మందుండనిమ్ము.

కం॥ వనమున కరుగుము రామా, యని నంతనె రాహుగ్రస్తఁ మగు శశిబింబం
బన నొప్పి వెలవెలం బను, ఘనమతి యగు రాముమోముఁ గననెటులోర్తున్

రాహుగ్రస్తము=రాహువుచే మ్రింగఁబడినది, శశిబింబము =చంద్రబింబము, ఘనమతి=గొప్పమనస్సుగలవాఁడు.

## తాత్పర్యము

భరతుఁడు రాజ్యమేలనీ, యేలకపోనీ, అదెట్లైననగునుగాక. రామా నీవడవులకుఁ బొమ్మనఁగానే రాహువు మ్రింగిన చంద్రబింబమువలెఁ దేజోహీనమై వెలవెలఁబోవు శ్రీరాముని సుందర ముఖారవిందమును నేనెట్లు చూడఁగలను, చూచి యెట్లు సహింతును?

కం॥ హితసహితంబుగ మును ని,శ్చిత మగుమతి కీడు వొందఁ జెలియా! పరసం
హతినిహత మైనవాహిని,గతి నెట్లీ మరలఁ జేసి కలను సుఖింపన్. ౪౭

హిత సహితంబుగన్=హితులతోడ, మును=ఇంతకుముందే, నిశ్చితము=నిశ్చయింపఁబడినది, మతి=మనస్సు, పరసంహతి = శత్రుసమూహములచే, నిహతమైన=కొట్టఁబడిన, వాహిని=సేన.

తాత్పర్యము

మంత్రులు పురోహితులు సామంతులు లోనగు హితులతో నాలోచించి తగిన కార్యమని శ్రీరామపట్టాభిషేకము మనస్సున నిశ్చయించితిని. శత్రువులచేఁ గొట్టఁబడిన సేనను వెనుకకుఁ ద్రిప్పినట్టు లట్టి మనస్సును ద్రిప్పి నే నే విధముగా సుఖింతునే. యుద్ధమున శత్రువులచేఁ బరాజయముగాంచిన సేనను వెనుకకుఁ ద్రిప్పిన రాజున కేరీతి కీర్తిసుఖములు లేవో యట్టులే రామరాజ్యాభిషేకమున కభిముఖమైన మనస్సునుండి మరలించిన నాకును గీర్తిసుఖములు లేవు.

సీ॥ దిక్కుదిక్కులనుండి•మక్కువ మూఁగిన, వసుధేశు లే మను•వారు నన్ను
జడమతి యాజి యే•వడువునఁ బాలించె, నింతకాలము ధాత్రి•నిస్పృయనరె
పెద్దలు సజ్జనుల్•విద్వాంసులును రామ,భద్రుఁ డేఁడన నేమి•పలుకువాఁడఁ
గైకేయి పీడింపఁ•బోకార్చితిని బుత్రు,నందనా? యదియు య•థార్థమయ్యెఁ
తే॥ బదుగురు వినంగ సభలోనఁ•బలికెనట్టి,
పలుకు దీర్పమి సత్యంబు•భంగపడదె
యెన్ని విధములఁ జూచిన•నిహముఁబరము,
నున్న నీమాటఁబట్టిన•సుంద రాంగి: ౪౭

వసుధేశులు=రాజులు, జడమతి = మొద్దు బుద్ధిలేనివాఁడు, అజి=దశరథుఁడు వడువునన్=విధముగ, ఇస్పీ=ఛీ, పోకార్చితిని=పోఁగొట్టు కొంటిని.

తాత్పర్యము

శ్రీరామపట్టాభిషేకమందలి ప్రీతితో నానా దిక్కులనుండి రాజులు మన నగరమున నుదయ వేళకు గుంపులు చేరుదురే. వారందఱీవార్త విని నన్నే మందురు? ఛీ. దశరథుఁడు బుద్ధిలేనివాఁడు. ఇట్టి వాఁడింత రాజ్యమేవిధమునఁ బాలింపఁగలిగెననరా వీరందఱు నాకు లోపడినవారు కావున నాయెదురుగ నేమన లేరనుకో. కులమున గుణమునఁ బెద్దలును సత్పురుషులును బండితులును వచ్చి దశరథా రామభద్రుఁడేఁ డీయన నేమందును

కైకేయి బాధింపఁగాఁ గొడుకును బోఁగొట్టు కొంటినందునాఅంటినిబో అదియథార్థమయ్యెను రాజాపదిమందిలోకులు వినఁగా రేపటియుదయము శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేయుదునంటివే. ఆ పలుకేమాయె. అది యసత్యమా? యనిననేనేమి బదులాడఁగలను. ఈమాత్రమునకు సభయని లోకుల యభిప్రాయము తెలిసి కొనుటయని పట్టాభిషేకమని యీ యాడంబరమేల చేసితివనిన నేనేమందును. ఓసి సుందరీ నీమాట చొప్పున వర్తించితినా నాకిహమునఁ బేరు పెంపులేదు. పరలోక సుఖములేదు.

ఇచ్చట నొకటి విచారింపవలయును. సభలో శ్రీరామచంద్రమూర్తికిఁ బట్టాభిషేకము చేసెదనని దశరథుఁడు చెప్పెను. ఆ వెనుక నతని గైక సత్యపాశబద్ధునిఁ జేసెను. ఇట్లు పరస్పర విరుద్ధధర్మములు ప్రసక్తించి నప్పుడు ముందుచేసిన

సత్యముగదా నెఱవేర్పవలయును. "ధర్మంయోబాధతేధర్మోనసధర్మఃకువర్త్మతత్। అవిరోధాత్తుయోధర్మః సధర్మః సత్య విక్రమ॥ భార. ౩, ౧౩౧-౧౧.

ధర్మమును బాధించు మఱియొకధర్మము ధర్మమనఁబడదు అదికుత్సితమార్గమే. పరస్పర విరుద్ధములేని ధర్మమేదో యదిధర్మము. ప్రమాణమట్లుండ ముందుసభలోఁ జెప్పిన మాటను దృఢీకరించి రెండవదానికేల దశరథుఁడు ప్రాముఖ్యమిచ్చెను? ప్రత్యుత్తరము వరములు నిర్దిష్టములు కాలేదుగాని కైకకే ముందువరము లొసఁగబడెను. అదియునుగాక సభలోఁ జెప్పినది తనయభిప్రాయము మాత్రమే. కాని ప్రమాణము పూర్వకమునఁ జెప్పినదికాదు. కైకకిచ్చినవి ప్రమాణ పూర్వకములు గావునఁ బూర్వము దానికంటె నిది బలిష్ఠమాయెను.

కం॥ అడవులకుఁ బనుపఁ దనసుతు,
నడుగునా యేమనుచుఁ గోస•లాత్మజ నను, నా
కొడు కేఁడియున నే మని, నొడువుదునే విప్రియంబు•నుం జేసి యిటుల్.
లోకు లేమనుకొనిన నాకేమి యని యూరకుందునా? ౫౦

నొడువుదునే=చెప్పుదునే.

తాత్పర్యము

తనకుమారుని నడవులకుఁ బంపిన నన్నుఁ గౌసల్యనాథా! నాకొడుకేఁడీయన గైకేయిని సంతోషపెట్టఁగోరి కానలకుఁ బంపితినని యెట్లు చెప్పుదునే. ఇంతటి ద్రోహముచేసి నాకు నోరెట్లాడునే బదులు చెప్పుటకు.

సీ॥ సమయోచితంబుగ•సఖివలె దాసి నా, భార్యయట్టుల నొంత•భగినిరీతిఁ
దల్లిమాడ్కిఁజరించు•దగసుప్రియంవద,
ప్రియకామప్రియపుత్ర•ప్రేమకెంతో
యర్హులరాలయ్యును•నకట యాకౌసల్య, నీకతంబునఁజేసి•నేను గౌర
వింపనైతిని నవి•వేకినై నావర్పు,పాటు లెంచినఁ గడు•భగ్గుమనియె

తే॥ నేను నీకయి చేసిన•దెల్లఁ దలపఁ, వ్యాధిపీడితుఁ డగునాతఁ•డరయ లేక
చలువు నట్టియపథ్య భో•జనముభంగి,వనటఁ బెమపంగ పొగెనే•వగలమారి.

సమయోచితంబుగన్=ఆయాసమయమునకుఁ దగినట్లు, సఖి=చెలికత్తె, నొంత=ఒకకడుపునఁబుట్టిన, భగిని=చెల్లెలు, సుప్రియంవద=మంచిప్రియము లేపలుకునది, ప్రియకామ=నాప్రియమునే కోరునది, ప్రియపుత్ర=నాకత్యంత ప్రియుఁడైన పుత్రునిఁగలది, నీకతంబునన్=నీకారణముచే, వర్పుపాటులు=బాధించుబాధలు, వనట=దుఃఖము.

తాత్పర్యము

ఉన్నది చెప్పిన నేమి యందువా? కౌసల్య యాయాసమయమునకుఁ దగినట్టు లాటలు మొదలగువానిపట్ల చెలికత్తెవలెను,ఊడిగముచేయుపట్లఁదాసుపట్టుప

రాణి యన్న గర్వము విడిచి దాసివలెను, నేను ధర్మకార్యములు చేయునపుడు తాను సహధర్మచారిణి యని స్మరించి పట్టపుదేవియను నభిమానము వదలి నా ధర్మపత్నివలెను, తన్నుఁగాక, వేఱుభార్యలను నేను గ్రహించునవుడు వారిపై నసూయపడక వారికి నొక తల్లికడుపునఁ బుట్టినదానివలెను, భోజనాదులచే నా దేహమును బోషించుపట్టులఁ దల్లివలెను జరించునట్టిది. ఎప్పుడు మంచిప్రియములు పలుకును గాని నీవలె నప్రియములు పలుకునదికాదు. నాప్రియమునే కోరును గాని నీవలె నప్రియమును గోరదు. నాప్రియమెంచు పుత్రునిగలది గాని నీవంటిదిగాదు. ఇట్టిది కావున నాప్రేమకు మిక్కిలి యోగ్యురాలు. ఇట్టి దుండియు ధర్మాత్మురాలైన కౌసల్యను నీ కారణమున నీయందలి కామముచే నీవు కోపింతువో యని నేనునీకు భయపడి ఆమె యోగ్యతకుఁ దగినట్లు గౌరవించినవాఁడనుగాను. గౌరవింపకుండినఁ బోనీ తెలివిమాలినవాఁడనై యామె నెన్నియో బాధలుపెట్టితిని. అవియన్ని తలఁచుకొలఁది కడుపులో భగ్గుమని మంటలెగయుచున్నవి. ఇఁక నీకుఁజేసిన మేళ్ళు తలఁచితినా రోగముచే బాధపడువాఁడు తనమేలు తాను విచారింపలేక నోటికిఁ దత్కాలమున రుచిగా నున్నదని చేయు నపథ్య భోజనమువలె నోసి వగలమారీ దుఃఖమును హెచ్చుచేయుచున్నదీ.

ఎండ పడఁబడినవానికిఁగాని నీడ సుఖముదోఁపదు. తీపెతినువానికిఁదీపు రుచింపదు. చేఁదు తినవలసివచ్చినపుడు తీపే బాగనితోఁచును. కౌసల్య మేలిమి యిప్పుడు దశరథునకు మనస్సునకు వచ్చెను. మగఁడు తన్నుపేక్షించినను గౌసల్య పతివ్రతగావున మగనిమనస్సు నొప్పించినదికాదు. తానుజేయవలసిన సేవ చేయుచునే యుండెను.

కం॥ రాముని యెడ నిట్టివి కొఱఁగాములు గావించి పనుపఁ • గానకుఁ గని వ
న్నేమాడ్కి నమ్మఁజాలునొ, కో మహిళామణి సుమిత్ర • కూరినభీతిన్. ౩౧

కొఱగాములు=చేయరానిపనులు.

తాత్పర్యము

శ్రీరామునివంటి ప్రియపుత్రుని విషయముననే యిట్టి చేయరాని ఘోర కార్యములు చేయు నన్నుఁజూచి స్త్రీరత్నమైన సుమిత్ర యిఁకఁ దనకొడుకుల గతి తన గతి యేమో యని యెంత భయపడునో కదా ఇఁక నన్నెట్లు నమ్మఁ గలదు.

కం॥ పంచత నేఁ గనుటయు వన, సంచారము సేయ విభుఁడు • చనుటీరెం డా
లించి యెటు సైఁచు నయ్యో, పంచాననమధ్య సీత • పటుదుఃఖంబున్. ౩౨

పంచత=మృతి, బాల్యకౌమార యౌవన వార్ధక మృతులను పంచావస్థలలో నైదవయవస్థ, ఆలించి=విని, పంచాననమధ్య=సింహము నడుమువంటి సన్నని నడుము గలది.

తాత్పర్యము

నామరణము నడవియందుఁ దనవిభుఁడు సంచారముచేయఁబోవుట యీరెండు వార్తలువిని సీతాదేవి తీవ్రదుఃఖము నెట్లు సహింపఁగలదు.

కం॥ కట్టా తనపతి నడవికి, నెట్టిన దుఃఖమున సీత•చెడి మంచుం
గుట్టకడఁ గిన్నరునిఁ బోఁ,గొట్టుకొనినకిన్నరివలెఁ•గూలుం గాదే. ౩౭౯

కట్టా=అయ్యో! సంతాపార్థకము, నెట్టిన=త్రోసిన, చెడి = అందము మంచుంగుట్ట=హిమాలయము.

తాత్పర్యము

అయ్యో తనమగని నడవులకు బలవంతముగాఁ బంపినవార్తవిని దుఃఖముచే హిమవత్పర్వతమునొద్దఁ దనప్రియుఁడగు కిన్నరుని బోఁగొట్టుకొనిన కిన్నరివలె సీత గూలిపోవునుగదా.

కం॥ అడవికిఁ జనుసుతుఁ గంటికిఁ, గడవెఁడుగా నేడ్చుజనక•కన్యం గనుచున్
గడుదుఃఖపడుచు నే నో, పడఁతీ! జీవింపఁ గలనె•బహుకాల మిలన్. ౩౮౦

తాత్పర్యము

అడవికిఁబోవు పుత్రుని, గన్నులనుండి కడవలు కడవలుగాఁ గన్నీరు కార్చు జనకమహారాజు పుత్రికనుజూచి దుఃఖించుచు నేను భూమిమీఁద నింక దీర్ఘకాలము బ్రతుకఁగలనా?

కం॥ సీతాకాంతునిఁ బాసిన, నాతరమా వెండి బ్రదుక•నామృతిఁ గని వే
యూతల విధవా! రాజ్యము, నీతలనే కట్టుకొమ్ము•నీపుత్రునితోన్. ౩౮౧

సీతాకాంతుని=శ్రీరాముని, తరమా=వశమా, వెండి=మఱియును.

తాత్పర్యము

శ్రీరాము నడవులకుఁ బంపుమంటినిగాని నిన్నుఁ జావుమంటినా యందువేమో విషము తినుమంటినిగాని చావుమంటినాయన్నట్లు శ్రీరామునినెడఁబాసి యాపిమ్మట దేహమునఁ బ్రాణములు ధరించియుండ నాకు సాధ్యమా. శ్రీరాముఁడే నాకుఁబ్రాణము. శ్రీరామునిపోక ప్రాణముపోక రెండు నొకసారి జరగునవియే. కావున నేను మరణించుటే సత్యము, నీవు విధవయగుటే నిజము.కావున విధవపై నీవు నీకొడుకుతో రాజ్యమంతయు నెత్తిమీఁదఁ గొట్టుకొమ్ము.

కం॥ తళతళ మనుదుర్విషస,మ్మిళితమదిరఁ గ్రోలి వెండి•మిడుకునరువలెన్
దెలియక సతి వని యసతీ! తలపై నెక్కించుకొంటిఁ•దావముఁ గంటిన్.

దుర్విష=క్రూరమగు విషముతో, సమ్మిళిత=చక్కఁగాగలిసిన, మదిరన్=సారాయమును, క్రోలి=త్రావి, మిడుకు=బాధపడు, అసతీ=దుష్టురాలా.

తాత్పర్యము

తళతళమను కాంతులతో మెఱయుచున్న విషముతోఁగలిసిన సారాయ మును మంచినీటికంటె శ్రేష్ఠమని భ్రమపడి త్రావి ప్రేగులు కోయఁగా దుఃఖించు మనుష్యునివలెనేనీ సౌందర్యముఁజూచి భ్రమపోయి నీలోనుండు విషమబుద్ధి తెలిసికొనలేక యసతీ! తలమీఁద నెక్కించుకొని గౌరవించితిని. ఆపాపఫల మును దావరూపమున ననుభవించుచున్నాను.

తే॥ ఇచ్చకపుఁగల్ల లాడి నీ•యిచ్చకొలఁదిఁ
జేపడిననన్నుఁ జంప నేఁ•ర్చితివె చెనఁటి!
కాన మృగయుఁడు శ్రవ్య మౌ•గానరవము
నెఱపి జింకను వధియింప•నేర్చినట్లు? ౩౬౩

ఇచ్చకొలఁదిన్=ఇష్టప్రకారము, చేపడిన=స్వాధీనపడిన, చెనఁటి=దుష్టు రాలా! కానన్=అడవియందు, మృగయుఁడు = వేఁటకాఁడు, శ్రవ్యమౌ= విననింపైన.

తాత్పర్యము

నాముఖప్రీతికొఱకు శ్రీరాముఁడు నాపెద్దకొడుకు. భరతునికంటె శ్రీరా ముఁడే నాకుఁ బ్రియుఁడు అని యిటువంటి యసత్యము లెన్నియోచెప్పి నమ్మించి వశపడిన నన్ను దుర్మార్గురాలా చంపఁజాలితివికదా. అడవియందు వేఁటకాఁడు విననింపైన స్వరము గానధ్వనిని వ్యాపింపఁజేసి యది వినవచ్చిన జింకను జంపినట్లు కదా నీవు నావిషయమున వర్తించితివి.

కం॥ సతితోడిసుఖముఁ గొనఁగా సుతు నమ్మెడినన్నుఁ జూచి•సూరులు వీథీ
తతులందుఁ గల్లు ద్రావిన, క్షితిసురు నిందించునట్లు•చెడనాడ రొకో. ౩౬౪

సూరులు=పండితులు, క్షితిసురున్=బ్రాహ్మణుని, చెడనాడరొకో=నిందింపరా.

తాత్పర్యము

సతితోడ రతిసుఖముఁగోరి సుతుని విక్రయించు నన్నుఁజూచి వివేకవం తులు నడివీథులందుఁ గల్లుద్రావిన బ్రాహ్మణుని నిందించినట్లు నిందింపరా.

సీ॥ నీమాట వినియును•నిను సైఁచు చున్నాఁడ,
నెంతకష్టం బయ్యె•యెంతదుఃఖ
మిది తొలికాలమున•నే నొనరించిన, దోషంబు గుఱువక•తొలఁగు నెట్లు?
పెద్దకాలముగఁ బా•పిని నిన్ను రక్షించి, తిని గదా యుర్ర్రికోటి•తెరువుదోఁవఁ
జిటుతవాఁ డొంటిమైఁ•జెడుపాము నంటిన, రీతి నిన్ గైకొంటి•మృత్యుభంగి
ఆ॥ నెంతబాలిశుఁ డ•నెంతటికాముకుం, డెంతదుష్టబుద్ధి•యీవిభుండు
ముద్దు ట్టి రాము•ముదితకై యడవికిఁ, బనుచువాఁ డి దేమి•పాపమొక్కొ
౩౬౫

తొలిబాము=పూర్వజన్మము, భవముయొక్క తద్భవము బాము. "ఏబాము లెఱుఁగక యేపాపు మేటికిఁ బసులకాఁపరియింట బాముగలిగె" భాగ. కుడువక= అనుభవింపక, బాలిశుండు=మూఢుఁడు.

### తాత్పర్యము

ఓసీ! నీవిన్ని కాఱుకూఁతలు కూసినను వినుచు నీకుఁ దగినశాస్తిసేయక సహించియున్నాఁడనుగదా. ఇంతకంటెఁ గష్టగాలముండునా? ఎంతదుఃఖ మెంత దుఃఖము. ఈ యనుభవము పూర్వజన్మంబున నేనుజేసిన పాపఫలము, అది యనుభవింపక నశించునా? నాభుక్తం క్షీయతేకర్మ కల్పకోటిశతైరపియని ప్రమాణవాక్యము కలదుగదా. పాపాత్మురాలవగు నిన్నుఁ జాలకాలముగ నాయురిత్రాడును నేను రక్షించినట్లు రక్షించితినిగదా. బాలుఁడు తనకు మృత్యువని తెలియక యొంటరిగా నితరులతో నాలోచింపక క్రూరసర్పమును దాఁకిన రీతి నిన్ను గ్రహించితిని. ఈ రాజెంత మతిలేనివాఁడు. ఎంతటి కామదాసుఁడు. ఎంత చెడుబుద్ధిగలవాఁడు. అయ్యో! యిట్టివాఁడుగాకుండినఁ దనముద్దుల కుమారుని నాఁడుదానిని సంతోషపెట్టుటకొఱకై యడవికిఁబంపునా? ఇట్టిపాపము కూడ లోకమునఁ గలదా?

కం॥ అని నిఖిలజీవలోకం, బనయము నను దూఱకుండు॰నా? వ్రతములచే
తను బ్రహ్మచర్యమునఁ దా,
వనరియు సుఖవేళ సుతుఁడు వనములఁ బడెడిన్. ౩౯౯

అనయము=ఎల్లప్పుడు, ఇప్పుడేకాదు, కలకాలము, దూఱకుండునా= నిందింపకుండునా, వనరి=తపించి, కైక వరములడిగినపుడు తొలుత శ్రీరాము నరణ్యమునకుఁ బంపనని నిరాకరించెను. (౩౧౩-వ పద్యము) అవలఁ బంపుదునా వలదాయని సందేహంబునఁ బంపిన రాఁగల కష్టములను నాలోచించెను. ఇప్పుడు పంప నిశ్చయించుకొని మాటలాడుచున్నాఁడు.

### తాత్పర్యము

అన యీప్రకారము సమస్త ప్రాణికోటు లిపుడేకాక కలకాలము నన్ను నిందింపకుండునా? ఎట్లుండఁగలదు. ఇన్నిదినములు శ్రీరాముఁడు పవాసాది వ్రతములచేతను మధుమాంసవర్జనాది బ్రహ్మచర్య నియమమునను కష్ట పడుటయుండే కాలము పోయెను. ఇక గృహస్థాశ్రమసుఖ మనుభవించు సమయము వఱకు నడవులపాలు కావలసి వచ్చెను.

ఒకఁడు ౨౫ సంవత్సరములవఱకు బ్రహ్మచర్యము, ౨౬ మొదలు ౫౦ వఱకు గార్హస్థ్యము, ౫౧ మొదలు ౭౫ వఱకు వానప్రస్థము,అవల వైరాగ్యము కుదిరెనేని సన్న్యాసము తీసికోవలయునని శాస్త్రనియమము.ఇప్పటికిశ్రీరామున కిరువదియైదు సంవత్సరములే కావున వివాహమైనను నింతవఱకు రతిసంభోగాదులు మాంసాది భక్షణము వదలి యుండెనని యేర్పడుచున్నది. అటుగాదేని

౧౨ సంవత్సరములు వివాహముమొదలు సతీపతులు సంభోగించియుండిన సీతకుఁగానియామె చెల్లెండ్రలో నొకతెకుఁగాని గర్భమురాక యుండునా? ఈ యభిప్రాయమునకుఁ గొన్ని సాధకములు కొన్ని బాధకములు గలవు. ఇంకను విచారింపవలయును.

కం॥ ఆమహనీయుఁడు దురితపు, భూమి యయిననాకు నేల•పుట్టినొ కట్టా
  రాముఁ డయో నాకతమున, వామాక్షి! తండ్రిలేని•వాఁ డయ్యెఁ గదే.

మహనీయుఁడు=పూజ్యుఁడు, దురితపుభూమి = పాపస్థానము-కట్టా=అయ్యో నాకతమునన్=నేను గారణముగా.

తాత్పర్యము

అయ్యో! భూమియగు శ్రీరామచంద్రుఁడు నావంటి పాపభూమికిఁ బుత్రుఁడై యేలపుట్టెనే. ఓసి వక్రదృష్టీ! శ్రీరామచంద్రుఁడు తండ్రిలేని వాఁడగుటకు నేనేకదా కారణమైతిని.

కం॥ వనముల కరుగుము తనయా! యన రెండవమాట చెప్పఁ•డటులే యను, వాఁ
  డనినఁ బ్రతికూలవచనం, బనయుత నాకెంతొ మేలు•యనఁ డటులయ్యో.

ప్రతికూలవచనము=ఎదురుమాట-అనయుత=వినయముతప్పి.

తాత్పర్యము

నాయనా! నీ వడవులకుఁ బొమ్ము అనినేను జెప్పినంతమాత్రమున సరే పోయెద ననునేకాని నేనేల యడవులకుఁ బోవలెను. అటువంటి నేరము నేనేమి చేసితిననియైన నడుగఁడే. అటుగాక పుత్రుఁడు పితృవాక్య పరిపాలనము చేయవలయునను నీతితప్పియైన నేను బోను అని చెప్పినను నాకు సంతోషమే. అయ్యో! అటులనఁడే యేమిచేయుదును.

ఆ॥ నిష్కళంకుఁ డగుట•నెఱిరామచంద్రుండు,
      తెలియఁడకటనాదు•తెఱఁగుమతియు
  వనికి నరుగు మన్న•వల్లె యనుం గాని,
      యడుగఁ బోఁ డదేల•యనుచునన్నె వ.౧౬౯

నిష్కళంకుఁడు=నిర్మలమైన మనస్సుగలవాఁడు, వల్లె=అట్టులే కానిమ్ము.

తాత్పర్యము

శ్రీరాముని మనస్సు నిర్మలమైన దగుటచే నందఱు మనస్సునట్టివేయను కొనునుగాని నా విధముగాని నేనట్లు చెప్పవలసి వచ్చిన కారణముగాని తెలియనేరఁడు. కావున నడవికిఁబోరా నాయనా యనఁగానే తన మేలునకై మంచి బుద్ధితోఁ జెప్పు చున్నానని యంగీకరించునేకాని యేల పొమ్మనెదవనియైన నడుగఁడు. కుటిల బుద్ధితోఁ జెప్పుచున్నానని సందేహింపఁడు.

తే॥ రాము ననిచినయంత న•రణ్యమునకు, సర్వజనముల ధిక్కృతి•సైఁపలేని
  యసమపాతకిఁ దక్షణ•మంద మృత్యు,
      వెట్టులున్ యమగృహమున•కీడ్చునన్ను. ౧౭౦

అనచినయంతన్ = పంపఁగానే, ధిక్కృతి=తిరస్కారము, ఛీ ఛీ యను టను పైఁపలేని, అసమపాతకిన్=అసమానమైన పాపాత్ముని.

తాత్పర్యము

శ్రీరాముని నరణ్యమునకుఁ బంపఁగానే సమస్త జనులు నన్ను ఛీ ఛీ యనుట నిజము. అటువంటి ఘోరపాపిని నన్ను నీఁక భూమిమీఁదనుండిన లోకము చెడునని మృత్యుదేవత యమలోకమునకు నీడ్చుకొనిపోవును.

కం॥ వైవస్వతపురి కేను మ,హావనులకు రామచంద్రుఁ•డరిగినపిదపన్
నావారల నెల్లర నీ, వేవిధమునఁ బణతొ యంచు•హృదయముగలఁగెన్.

వైవస్వతపురికిన్=యమునిపట్టనమునకు, పణచెదో=బాధపెట్టెదవో, కలఁగెన్=కలఁత నొందునది యయ్యెను.

తాత్పర్యము

నేను యమపురికి శ్రీరాముఁడరణ్యములకుఁబోఁగానేమామీఁది కోపముచే నాకుఁ గావలసిన వారినెల్లరను నెంత బాధించెదవో కదాయని హృదయము కలవరపడుచున్నది. వారేదోషము చేయని వారయ్యును నాకుసంబంధించిన వారగు కారణమున నీచేనేమి బాధలు నిష్కారణముగ ననుభవించెదరో.

సీ॥ రాముండు వని కేగ•నామృతి సత్యంబు,మావెంటఁ గౌసల్య•మరణమొందు
సర్వకాలముల ల•క్ష్మణుఁడు పాయఁడు రాము,
నన్నతోఁ జనియెడు•నడవులకును
శత్రుఘ్నుఁడును మున్నె•చనె భరతునివెంటఁ,
బతియును బుత్రులుఁ•బాసిచనిన
సకట సుమిత్ర దుః•ఖార్ణవమగ్నయై, చనుదెంచు నావెంట•శమనపురికి
తే॥ నన్నుఁ గౌసల్యను సుమిత్ర•నయుగుణు లగు
మీఁగురుకొడుకులఁ గడుదుఃఖ•మునను ద్రోచి
యీవ సర్వసుఖంబుల•నెనఁగు చుండు
చెనఁటిః ని న్నెల్లవారు ఛీ•ఛీ యనంగ. ౩౪-అ

దుఃఖార్ణవమగ్న=దుఃఖసముద్రమున మునిఁగినది, శమనపురికిన్=యముని పట్టనమునకు:—నం యమినికి.

తాత్పర్యము

శ్రీరాముఁడరణ్యమునకుఁబోయెనా నామరణము సిద్ధము. అది తప్ప నదికాదు. మావెంటనే కౌసల్యయు మరణించును. లక్ష్మణుఁడు నన్నను బాసి యుండఁడు. కావున శ్రీరాముని వెంట నడవులకుఁ బోవును. శత్రుఘ్నుఁడును భరతుని వెంటనుండే వెడలిపోయెను. మగఁడు బిడ్డలు కొడుకులు విడిచిపోఁగా నయ్యోసుమిత్ర శోకసముద్రములో మునిఁగి నీవాయనువారు లేక నావెంట యమపురికి వచ్చును. పాపాత్మురాలా నన్నుఁ గౌసల్యను సుమిత్రను న్యాయ

వంతులైన రామలక్ష్మణ శత్రుఘ్నులను మిక్కిలి దుఃఖములలోఁ ద్రోచి నీవు మాత్రము లోకులందఱు ఛీకొట్టుచుండ సర్వసుఖము లనుభవింపుము.

ఆ॥ రాముఁడు నేను లేమిని ది•రంబును సత్కృతమున్ గుణోత్కరో
ద్దామము శాంత మైనరఘు•ధాత్రిపువంశము పాడుగాఁగ నీ
వీమహి నేలు, నీసుతున•కిష్టమ యేన్ రఘురాము వీడుటల్
నామృతివెన్క నీసుతుఁ డొ•నర్పఁడుగాక మదుత్తర క్రియల్. ౩౭౩

తిరంబును=స్థిరమును అనఁగా ననాదిగానుండునది, సత్కృతమున్=పుణ్యవంతమైనది, గుణోత్కరోద్దామము = గుణసమూహములచే గొప్పది, శాంతము=ఏకుటుంబచ్ఛిద్రములులేక యేకవిధముగ నిర్మలముగనుండినది. మదుత్తరక్రియల్=నాకుమరణానంతరము చేయవలసిన నౌర్ధ్వదైహికక్రియలు

తాత్పర్యము

ఈమారఘువంశము కీర్తిమంతముగా క్షేమముగా నింకను గొన్నినాళ్లు భూమిపై నుండవలసియుండెనా శ్రీరాముఁడుండుట ముఖ్యము. అయనలేక పోయెనా యింకను గొన్నాళ్ళయిన నేను జీవించియుండవలెను. మేమిరువురము లేకపోయితి మా యనాదికాలమునుండి పరంపరగా నవిచ్ఛిన్నముగా వచ్చుచుఁ బుణ్యకార్యములే చేయుచు లోకగౌరవమునకుఁ బాత్రమై సద్గుణసమూహములచే గొప్పదనిపించుకొని యేకుటుంబకలహములు లేక యేకవిధముగనుండు రఘువంశము పాడుగాఁగ నీవే యీ రాజ్యమంతయు నెత్తిపైఁగొట్టుకొని యేలుచుండుము. భరతుఁడు రఘువంశమువాఁడు కాఁడా? యందువేమో, జ్యేష్ఠాంశన్యాయము తప్పించి అన్యాయముగ రాజ్యమాక్రమించుటచే రఘువంశరాజుల ధర్మము నిర్మూలించినవాఁడగుటచే నుద్యానవనములోని కంపచెట్టువలె మావంశమునఁ బుట్టియుఁ బుట్టనివాఁడేఁ కావున శ్రీరాముని విడనాడియుండుట నీకొడుకున కిష్టమేని యట్టి యధర్మచరిత్రుఁడు విడుచు తిలోదకములు తండ్రిని జెందఁ జాలవు గనుకవాఁడు మరణించిననాకు నూర్ధ్వలోకక్రియలు చేయఁగూడదు.

ఆ॥ ఓసి దుష్టురాల•యోసి నా పగదాన, యేను నీల్గ రాముఁ•డేగ వనికి
విధవ వగుచు నేల•వే సర్వరాజ్యంబు,నీవు సుతునితోడ•నిచ్చకొలఁది. ౩౭౪

తాత్పర్యము

ఓసి దుష్టబుద్ధీ! యోసి శత్రురూపిణీ! నేను మరణింపఁగా శ్రీరాముఁడడవికిఁ బోఁగా నీవు విధవవై నీయిష్టముకొలఁది స్వరాజ్యము నీకొడుకు తోడనీవే యేలుకో.

ఆ॥ తోర మగునకీర్తి•ధ్రువపరిభవమును, బ్రజలచే నవజ్ఞ•పాపశీల
నీదురూపుఁ గాంచి•నిలిచెనే నాయింట,నతులపాపియింటి•యందుఁబోలె.

తోరము=అధికము, స్థూలశబ్దభవము, పరిభవము=అవమానము,అవజ్ఞ=తిరస్కారము.

తాత్పర్యము

పాపాత్ముల యింటియందుండవలసిన యపకీర్తి అవమానము లోకుల తిరస్కారము ననునవి నీరూపమును వహించి పాపశీలా! నాయింట నిలచెను.

ఉ॥ అంగద! వాజివారణశ•తాంగము లెక్కి చరించు నెప్పుడు
క్రిందుగ నట్టినాకొడుకు •నాథువలెన్ సయిదోడు లేక యే
కాంగిగఁ గంటకోత్కరశి•లావృత మౌగహనంబునందు నే
భంగిఁ జరింపఁగాఁ గలఁడు•పాపము! బొబ్బలు వోవఁ బాదముల్? ౩౭౬

అంగద=అయ్యో, ఇది సంతాపార్థకమున సంస్కృతమునందలి బత వలెఁ బ్రయోగింపఁబడును. వాజివారణ శతాంగములు=గుఱ్ఱములు ఏనుఁగులు రథములు, సయిదోడు=సహాయుఁడు, ఏ కాంగిగన్=ఒంటరిగ- కంటకోత్కర= ముండ్లసమూహముచేతను, శిలా=ఱాలచేతను, ఆవృతము=కప్పఁబడినది, గహనము=అడవి, ఏభంగిన్=ఏవిధముగ.

తాత్పర్యము

గుఱ్ఱములపై, ఏనుఁగులపై, రథములపై నెప్పుడు చూడనింపుగాఁ గ్రిందఁగాలు పెట్టక తిరుగుచుండునా కొడుకు తోడులేక యొంటరిగా ముండ్ల చేతను ఱాలచేతను గప్పఁబడి త్రోవలుగూడ సరిగాలేని యడవులందు నయ్యో పాపము కాళ్లు బొబ్బలుపోవఁగా నెట్టు సంచరించునే పాపినీ.

ఉ॥ పొంకము మీఱ నా సుతుఁడు•భోజనవేళలయందుఁ గుండలా
లంకృతు లై నపాచకులు•లాలసమానసవృత్తి నేన ము
న్నొంకిట నేన ము న్ననుచు•నెంతయు వంతులు పల్కికొంచు ని
శ్శంకము శస్తపానమును•జారుతరాన్నము పెట్టఁ గైకొనున్. ౩౭౭

కుండలాలంకృతులు=చక్కఁగా వంటచేయుటయందు •సమర్థులని బిరుదులు పొందిన కుండలములచే నలంకరింపఁబడినవారు, పాచకులు=వంటచేయువారు, లాలసమానసవృత్తి=శ్రీరాముని పరిచర్య తామే చేయవలయునని కోరిక గల మనస్సుగలవారై (మహారాజుల యిండ్లలో వంటకు వేఱువడ్డనకు వేఱు మనుష్యులుందురు, శ్రీరాముని విషయమందుఁ బ్రీత్యతిశయముచే శ్రీరామునకు మేమేవడ్డింపవలెనని వంటవారు వారిపోటీలు వేసికొని వాదులాడుదుర(ట) నిశ్శంకము=సందేహములేనిది. ఇది యవ్యయీ భావసమాసము కావున నపుంసకము, శస్తపానమును=ప్రశస్తమైన పానీయము వట్టివేరు మొదలయినవి వేసి మంచివాసనగల చల్లననీళ్ళు. చారుతరాన్నము=మనోహరమైనయన్నము "రస్యాస్స్నిగ్ధాస్థిరాహృద్యా ఆహారాసాత్త్వికప్రియా" యన్నట్లు సాత్త్వికాహారమును; కైకొనున్=గ్రహించును దీనికి నాసుతుఁడు, కర్తృపదము.

తా త్ప ర్య ము

వంటయందు సమర్థులని కుండలముల బిరుదులుగా పొందిన వంటవారిలో వడ్డనవారిలో వారిలోవారు శ్రీరామునకు నే నీవ్యంజనము చేసెదను. నే నీవ్యంజనము చేసెదనని వేలు వేలు వ్యంజనములు సిద్ధముచేసి నా వ్యంజనము ముందుతినవలె నా వ్యంజనము ముందు తినవలెనని యొకరికంటె ముందు మఱియొకరు వడ్డించి రామా నేను జేసినది భుజింపుము. నేను జేసినది రుచి యైనఁ జూడుమని మనోహరమైన యన్నము పానము వంతులువేసికొని ప్రార్థింపఁగా భుజించుచుండువాఁడు నాకొడుకు.

ఉ॥ అట్టిఁడు నాదుపట్టి గహ•నాంతరమందలిచెట్టు చెట్టు పె
న్గుట్టయు గుట్టయుం దిరిగి•కొంచును గారముఁ జేఁదునుం వగ
ర్పుట్టెడి వచ్చికాయలను•భూమిని ద్రవ్వినకందమూలముల్
తెట్టువఁ బొట్టబోసికొని•దీనపలెన్ నడయాడు టెట్లొకో. ౩౨

అట్టిఁడు=అట్టివాఁడు, నాదుపట్టి=నాకొడుకు, గహనాంతరమందలి=అడవి యందుండు, చెట్టు చెట్టు = వీప్సయందు నా మేఁడ్రితము- అనఁగా నొకచెట్టు వెనుక మఱియొకచెట్టు, నడయాడు=సంచరించు, తెట్టువ=సమూహము.

తా త్ప ర్య ము

అట్టి నా కొడుకు కాఱడవులయందు నేచెట్టునందుఁగాయలున్నవా యే గుట్టయందుఁ గందమూలములున్నవా యని యొక్కొక్క చెట్టు ఒక్కొక్క గుట్ట వెదకికొనుచు కారము, చేఁదు వగరుగల కందమూలములను ద్రవ్వి తిని పొట్ట బోసికొని యనాథువలె నెట్లు సంచరించునో.

కం॥ ఎంతయు వెలగలచేలలు, స్వాంతము రంజిల ధరించి•యతిసుఖపరుఁ డౌ
కాంతుండు కావిగుడ్డల, బొంతలు ధరియించి యెట్లు•భూమి వసించున్. ౩౩

చేలలు=వస్త్రములు- రూ. చేలములు, స్వాంతము=మనస్సు- రెండవ పాదమున నుభయయతి. కాంతుఁడు = మనోహరాకారముగల సుకుమారుఁడు, మోటువాఁడు గాఁడనుట.

తా త్ప ర్య ము

మిక్కిలివెలగల దువ్వలువలు మనస్సుసంతోషింప ధరించి యెంతోసుఖ పడు సుందరుఁడు సుకుమారుఁడు. మార్గమున దొరకిన కావిగుడ్డల చింపులతోఁ గుట్టిన బొంతలు ధరించి యెట్లు భూమిపై వసింపఁ గలఁడు. తినఁగూడు కట్టఁ బట్టయు లేక యెన్నాళ్లు జీవింపఁ గలఁడు.

కం॥ ఇవ్వసుధ భరతుఁ డేలఁగ, నవ్విపినమ్ములకు రాముఁ•డరుగఁగ నయ్యో
యెవ్వఁడు చెప్పెనె కుమతి,యివ్విధము నంచితితంబు•భృశదారుణమున్.

విపినమ్ములకు=అడవులకు, కుమతీ=కుత్సిత బుద్ధిగలదానా, అచింతితము=ఇతరులకుఁ జింతింప సాధ్యముకానిది, భృశదారుణమున్=మిక్కిలి తీక్ష్ణమైనది.

తాత్పర్యము

పిన్నవాఁడైన భరతుఁడీరాజ్యము నేలునట్లు పెద్దవాఁడు రాముఁడడవులకుఁ బోవునట్లు కుత్సితబుద్ధీ నీకెవ్వఁడే యింతటి మిక్కిలి భయంకరమై యితరులకు మనసునకైన రాని యాలోచన చెప్పెను.

ఉ॥ నారులు క్రూరమానస లనారత మాత్మహితార్థసిద్ధియే
యేరహిఁ గోరి గూఢముగ నెంతయుఁ గీ డొనరింతు రిప్పుడీ
నేరముఁ బల్కఁ బోవ నవనిం గని యెల్లపొలంతులందు, నో
మారి! తగుం జుమీ భరత మాతకు మాత్రమ యట్టినిందయున్. ౩౮౧

నారులు=స్త్రీలు, అనారతము=ఎల్లప్పుడు, ఆత్మహితార్థ సిద్ధియే=తమకు మేలైన ప్రయోజనము లభించుట మాత్రమే, ఏరహిన్=ఏవిధముగనైన ఇతరులకు మేలుగాని కీడుగాని న్యాయముగఁగాని యన్యాయముగఁగాని, గూఢముగ=రహస్యముగ, పొలంతులు=స్త్రీలు, మారి=చంపునట్టి రోగదేవత, భరతమాత=కైకయని దాని నామస్మరణము కూడఁ జేయరాదని భావము.

తాత్పర్యము

స్త్రీలు దయాహీనలు న్యాయముగనో యన్యాయముగనో యితరులకుఁ గీడుకలిగించియైనఁ దమకు మేలు కలుగునాలోచనలే సర్వదా చేయుచుఁ దమకుఁ బ్రతికూలురకు రహస్యముగ నెంతకీడైనఁ జేయుదురు. ఛీ ఛీ వారేమి మనుష్యులు క్రూరమృగములుగాక. పొరపాటు. స్త్రీలనుటచే లోకమునఁగల స్త్రీలందఱు నిట్టి దోషములు చేయు వారని నాయభిప్రాయముగాదు. మృత్యుదేవతా! ఇట్టి నింద భరతుని తల్లివగు నీకుమాత్రము చెల్లును గాని కౌసల్య సుమిత్ర మొదలగు నుత్తమ స్త్రీలయందుఁ జెల్లదు.

చం॥ కనరున నన్ను వేఁచుటకుఁ గా మతిపట్టితె క్రూర చిత్త! యో
చెనఁటి! యనర్థ కార్యపర! స్వీయహితాచరణైకశీల! యే
యనయము నెప్పుడేఁ గనితె యక్కట నాయెడ నేని సర్వలో
కనిచయమంగళాచరణ కారణుఁ డౌరఘురామునందునేన్ ? ౩౮౨

కనరున=కోపమున, వేఁచుటకు=కాల్చుటకు, మతిపట్టితె=మనస్సు దృఢపఱచుకొంటివా, అనర్థకార్యపర=చెడుకార్యములందాసక్తిగలదానా, స్వీయహితాచరణైకశీల=తనమేలు తనవారిమేలు మాత్రమే చేయుటయే స్వభావముగఁ గలదానా, అనయము=నీతి తప్పిన కార్యము, సర్వలోక=సమస్త లోకముల యొక్క, నిచయ=సమూహమునకు, మంగళ=శుభమును, ఆచరణ=చేయుటయందు, కారణుఁడు=హేతువైన వాఁడు.

తాత్పర్యము

దయలేనిదానా! కోపముతో నన్ను బాణలిలోఁ గూరల వేఁచినట్లు శోకాగ్నిలో వేఁచుటకే మనస్సును దృఢపఱుచుకొంటివా. ఓసి దుర్మార్గురాలా! హానికరములైన కార్యములు చేయుటయందాసక్తిగలదానా! నీమేలు నీవారి మేలు మాత్రమేకోరి కార్యములుచేయుదానా! నాయందుఁగాని సర్వలోకముల మేలునకుఁ గారణభూతుఁడైన శ్రీరామచంద్రునందుఁగాని యేసమయమందైనను నేదైన దుర్నీతి కార్యముఁ గంటివా.

ఉ॥ నీ విటు నన్ను నేఁచుటయు ♦ నేనును రామునిఁ బాయఁ ద్రోచుటల్
వావిరి చూచి నిక్కముగ ♦ భర్తలఁ దా రనురక్తలయ్యునున్
బోవిడువారు కామినులు, ♦ పోకడ పెట్టెడివారు తండ్రులా
హా విరళానుకంపఁ గదు ♦ పారఁగఁ గాంచినయట్టిపుత్రులన్. ౩౮౩

ఏఁచుట=బాధించుట, అనురక్తలు=ప్రేమగలవారు, పోకడపెట్టెడివారు=తొలఁగఁ ద్రోచుకొనువారు, విరళానుకంపన్=దయసన్నగిల్లఁగా.

తాత్పర్యము

నీవు నన్నుఁ బెట్టెడి బాధచూచి కైకవంటి రాణియే తన భర్తను బాధపెట్టి విడనాడెనే మనమేల యట్టులే చేయరాదని యింతవఱకు భర్తలయందుఁ బ్రేమగల సాధ్వులుకూడ నింకమీఁద భర్తలను వదలి కామాతిశయమునఁ బెఱత్రోవల సంచరింతురు. శ్రీరామచంద్రుని నేను వదలిపెట్టుటచూచి తండ్రులు కుమారులందు దయలేనివారై దశరథునివంటి రాజే తన జ్యేష్ఠకుమారునే వదలి పెట్టెనే మనమేల్ల వదలరాదని తాము కడుపారఁ గన్నకొడుకులనే యెడఁబాయుదురు. 'యథారాజా తథాప్రజా' యని కలదుగదా.

కం॥ వ్యసనాంభోధినిమగ్నుని, వసుధాతనయాహృదబ్జ♦భాస్కరుఁ గనుచున్
వెస సకలజగములును ని, న్గసరునఁ గసకుందువా ని♦కారచరిత్రా. ౩౮౪

నికారచరిత్రా=మోసపు నడవడిగలదానా! వ్యసనాంభోధి నిమగ్నునిన్=వ్యసన సముద్రమున మునిఁగిన వానిని, వసుధాతనయా=సీతయొక్క, హృత్=హృదయమను, అబ్జ=కమలమునకు, భాస్కరున్=సూర్యుఁడగువానిని సూర్యుని జూచిన కమలము వికసించినట్లు శ్రీరామచంద్రునిఁ జూడఁగానే సీతహృదయము సంతోషముచే వికాసము నొందును. కసరున=తిరస్కారబుద్ధితో.

తాత్పర్యము

నీవు నిమిత్తముగ నిష్కారణముగ వ్యసనసముద్రములో మునిఁగినవానిని సీతా సంతోషకారణమైన వానిని లోకులందఱుఁజూచి నీవుకదా వారి యిరువుర దుఃఖమునకుఁ గారణభూతురాలవని మోసకత్తియా! నిన్ను ఛీఛీ యని తిరస్కరింపకుందురా? నీవు రాణివని గౌరవబుద్ధిగల వారగుదురని తలఁచితివా.